

శనివారం ఆలయం వెలుపల భక్తులతో సిఎం చంద్రబాబు కరచాలనం

# భక్తులతో మమేకమైన సిఎం చంద్రబాబు

**తిరుమల,మార్చి 21ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం ఇష్టదైవం వెంకన్న ఆశీస్సులు అందుకుని ఆలయం వెలుపలకు వచ్చారు. అక్కడ వేచిఉన్న భక్తులను పలకరించి తాను సామాన్య భక్తుడిలా మారిపోయారు. స్వయంగా మనవడు దేవాన్ష్‌తో కలిసి భక్తుల వద్దకు మందుకునడిచారు. మాడవీధుల్లో వేచిఉన్న భక్తులతో మాట్లాడి వారితో కరచాలనం చేశారు. భద్రతను, కాన్వాయ్‌ను పక్కన పెట్టారు. భక్తులతో ఫోటో దిగారు. ఇదే సందర్భంలో భక్తులుకూడా నారా దేవాన్ష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. లేపాక్షి వద్ద చిన్నపిల్లలను ఎత్తుకుని ఆప్యా యంగా పలకరించారు. భక్తులతో ముఖాముఖి మాట్లాడారు. భక్తుల కష్టసుఖాలను, టిటిడి అం దిస్తున్న సేవలను స్వయంగా అడిగి తెలు సుకున్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం విశిష్ఠ తను కాపాడటమే తమ ప్రభుత్వ ప్రాధాన్యతని భక్తులతో అన్నారు. గతంతో పోలిస్తే లడ్డూ నాణ్యత, రుచి చాలా బాగుందని భక్తులు ముఖ్య మంత్రికి వివరించారు. దర్శనం కోసం వేచి ఉండే సమయాన్ని మరింత తగ్గించేలా చర్యలు తీసుకోవాలని పలువురు భక్తులు ఈ సం దర్భంగా సిఎంను కోరారు. భక్తుల విజ్ఞప్తిపై స్పందించిన చంద్రబాబు, శ్రీవారి దర్శనాన్ని మరింత సులభతరం చేసేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికతను వినియోగించబో తున్నామని తెలిపారు. సాంకేతికత వినియో గంతో క్యూ లైన్ల నిర్వహణను క్రమబద్ధీకరించి, భక్తులకు తక్కువ సమయంలోనే స్వామివారి దర్శనం కలిగేలా టిటిడి చర్యలు తీసు కుంటుందని చంద్రబాబు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడటమే తమ లక్ష్యం అని స్పష్టం చేశారు.

# వార్ ఆపండి..చర్చలు జరపండి

>> ఖాతా ద్వారా పంచుకున్నారు. ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెష్కియన్‌తో మాట్లాడాను. ఈద్, నౌరూజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగల సమయం పశ్చిమాసియాకు శాంతి, స్థిరత్వం, శ్రేయస్సును తీసుకురావాలని ఆకాంక్షించామని మోడీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు. పండుగ వాతావరణంలో శాంతియుత వాతావరణం నెలకొనాలని ఇరువురు నేతలు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ చర్చల సందర్భంగా, పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను ప్రధాని మోడీ తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికే కాకుండా, ప్రపంచ సరఫరా గొలుసులకు కూడా తీవ్ర అంతరాయం కలిగిస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ వాణిజ్యానికి జీవనాడి అయిన నౌకాయాన స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకం కలగకూడదని ఆయన స్పష్టం చేశారు. ముఖ్యంగా, హార్మూజ్ జలసంధి వంటి కీలకమైన షిప్పింగ్ మార్గాలు ఎల్లప్పుడూ తెరిచి ఉండి, సురక్షితంగా ఉండాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పారు. ఇరాన్‌లో నివసిస్తున్న భారతీయ పౌరుల భద్రత, సంక్షేమానికి ఇరాన్ ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి ప్రధాని మోడీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో తమ పౌరుల భద్రతకు భారత్ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశాన్ని ఇది పరోక్షంగా తెలియజేసింది. పశ్చిమాసియాలో శాంతి, సుస్థిరతలను నెలకొల్పేందుకు భారత్ చేస్తున్న దౌత్య ప్రయత్నాల్లో ఇదొక ముఖ్యమైన ముందడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. వివాదాల పరిష్కారానికి చర్చలే సరైన మార్గమని భారత్ మరోసారి తన వైఖరిని స్పష్టం చేసినట్లయింది. ఇదిలా ఉండగా, మార్చి 12న జరిగిన తొలి ఫోన్ సంభాషణలో కూడా ప్రధాని మోడీ పశ్చిమాసియాలో పెరుగుతున్న ఉద్రిక్తతలు, పౌరుల మరణాలు, మౌలిక సదుపాయాల విధ్వంసంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని సమస్యలను చర్చలు, దౌత్య మార్గాల ద్వారానే పరిష్కరించుకోవాలన్నది భారత్ స్థిరమైన వైఖరి అని ఆయన స్పష్టం చేశారు. సరుకు రవాణా, ఇంధన సరఫరాకు ఆటంకాలు ఏర్పడితే భారత ఆర్థిక వ్యవస్థపై, ప్రాంతీయ స్థిరత్వంపై తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరించారు.

### అవినీతి అధికారులపై కొరడా..

# తహసీల్దారు, విఆర్వో సస్పెన్షన్

**పెద్దారవీడు(మార్కాపురం), ప్రభాతవార్త:** భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడిన అవినీతి అధికారులను జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సస్పెండ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. పెద్దారవీడు తహసిల్దారు దిలీప్ కుమార్, దేవరాజుగట్టు వీఆర్వో విజయభాస్కర్ రెడ్డి లు కలిసి భూముల వ్యవహారంలో అక్రమాలకు పాల్పడినట్లు అధికారులు నిగ్గు తేల్చారు..తహసిల్దారు దిలీప్ కుమార్ సెలవులు ఉన్నప్పటికీ కార్యాలయంలో జరగాల్సిన ప్రక్రియను వైద్యశాల నుంచే నడిపి అక్రమాలకు పాల్పడ్డారు. సుమారు 30కి పైగా ప్రభుత్వ భూములకు సంబంధించిన ఫైల్స్ మ్యుటేషన్ చేసినట్లు విచారణలో వెల్లడయింది. బాధితుల ఫిర్యాదు మేరకు జాయింట్ కలెక్టర్ పి శ్రీనివాసులు విచారణ చేసి అక్రమాలను నిగ్గు తేల్చి జిల్లా కలెక్టర్ పి రాజా బాబుకు నివేదించారు. నిబంధనలకు విరుద్ధంగా వీరు ఇరువురు వ్యవహారించినట్లు తేల్చారు. దేవరాజు గట్టు గ్రామానికి సంబంధించిన భూముల వ్యవహారమే ఎక్కువగా ఉన్నట్లు సమాచారం. తహసిల్దార్ దిలీప్ కుమార్ పై గత సంవత్సరం డిసెంబర్ నెలలో కాళహస్తి సబ్ కలెక్టర్ విచారణ చేసి వెళ్లారు. అయితే సంబంధిత ఫైల్స్ ఆమెకు ఇవ్వకపోవడంతో జిల్లా రెవెన్యూ ఆఫీసర్ కు తహసిల్దార్ దిలీప్ కుమార్ వ్యవహారంపై చర్యలకు నివేదించారు. తహసిల్దార్ దిలీప్ కుమార్ అక్రమాలకు పాల్పడి ఇప్పటికి మూడు పర్యాయాలు సస్పెన్షన్ గురయ్యారు. పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడడం, అధికారులు విచారణ చేయడం వాస్తవాలపై చర్యలు తీసుకోవడం పరిపాటిగా మారింది. గతంలో ఒంగోలులో పనిచేస్తున్న సమయంలో వచ్చిన ఆరోపణలపై తొలిసారిగా సస్పెన్షన్ వేటు వేశారు.పెద్దారవీడులోనే భూ అక్రమాల్లో తహసిల్దార్ దిలీప్ కుమార్ రెండు పర్యాయాలు సస్పెన్షన్ కు గురయ్యారు. ప్రభుత్వ భూముల వ్యవహారంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడం సస్పెన్షన్ కు గురి కావడం తహసిల్దారు దిలీప్ కుమార్ కు పరిపాటిగా మారింది. భూముల వ్యవహారంలో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన తహసిల్దారు దిలీప్ కుమార్‌తో పాటు, దేవరాజు గట్టు విఆర఼్ విజయభాస్కర్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



శ్రీవారి చిత్రపటాన్ని సిఎంకు బహూకరిస్తున్న టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు

# ఇష్టదైవాన్ని దర్శించుకున్న సిఎం కుటుంబం

**తిరుమల,మార్చి 21ప్రభాతవార్తప్రతినిధి:** ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి ఆలయంలో మహద్వార ప్రవేశం అవకాశం ఉన్నా సామాన్యుడిలా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచే ఆలయంలోనికి చేరుకునే సాంప్రదాయాన్ని పాటిస్తున్నారు. శనివారం మనవడు నారాదేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలసి తిరుమలకు వచ్చిన ఆయన సతీమణి నారా భువనేశ్వరి,కుమారుడు, మంత్రి నారా లోకేష్‌తో కలసి క్యూలైన్‌లోనే ఆలయంలోకి చేరుకున్నారు. మహాద్వారం వద్ద టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ వెంకయ్యచౌదరి, అర్చకులు ఇస్తికఫాల్‌తో స్వాగతం పలికారు. ఆలయంలో తొలుత ధ్వజస్తంభానికి నమస్కరించారు. ఆనంద నిలయంలోని చేరుకుని శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. వరుసగా వకుళమాతను దర్శించుకుని ఆలయ ప్రదక్షణగా విమాన వేంకటేశ్వరస్వామి , సబేరా, భాష్యకార్ల సన్నిధి, యోగనరసింహస్వామివారిని దర్శించుకుని హుండిలో కానుకలు సమర్పించారు. రంగనాయకుల మండపంలో సిఎం కుటుంబసభ్యులకు వేదపండితులు వేదాశీర్వచనం అందజేశారు. టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడు, ఇఒ రవిచంద్ర స్వామివారి శేషవస్త్రం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో ఆద్యంత్యం భక్తిభావంతోనే గడిపారు.

# మరో రెండు రోజులు వర్షాలు

>>హెచ్చరిక చేసింది. అల్లూరి, పోల వరం, కాకినాడ, తూర్పుగోదావరి , ఏలూరు,ఎన్టీఆర్, గుంటూరు,పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడతాయని అంచనా వేసింది. ఈ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక, ఎల్లో అలర్ట్ జారీ చేసిన విశాఖ, అనకాపల్లి, నెల్లూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. దీంతో, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని.. ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు సురక్షితమైన భవనాల్లో తలదాచుకోవాలని విపత్తుల నిర్వహణ అధికారులు సూచించారు. పిడుగులు పడేఅవకాశం ఉన్నందున చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో నిలబడరాదని, ఇంట్లో ఉన్నప్పుడు ఎలక్ట్రానిక్ వస్తువులను వాడటం తగ్గించాలని సూచన చేసారు.ఏపీలోని పలు జిల్లాల్లో పిడుగుపాటు పైన ఏపీ విపత్తుల శాఖ హెచ్చరిక చేసింది. అల్లూరి, పోలవరం, కాకి నాడ, తూర్పుగోదావరి, ఏలూరు,ఎన్టీఆర్, గుంటూరు,పల్నాడు, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులు పడతాయని అంచనా వేసింది. ఈ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఇక, ఎల్లో అలర్ట్ జారీ చేసిన విశాఖ, అనకాపల్లి, నెల్లూరు, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. దీంతో, ప్రజలు అప్రమత్తంగా ఉం డాలని, ఉరుములు, మెరుపులు ఉన్నప్పుడు సురక్షితమైన భవనాల్లో తలదాచుకోవాలని విపత్తుల నిర్వహణ అధికారులు సూచించారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున చెట్ల కింద, బహిరంగ ప్రదేశాల్లో నిలబడరాదని, ఇంట్లో ఉన్నప్పుడు ఎలక్ట్రానిక్ వస్తువులను వాడటం తగ్గించాలని సూచన చేసారు.ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట, నందిగామ ప్రాంతంలో వర్షం భారీగా ఉండటంతో పంటలు దెబ్బతిన్నాయి.

# 140 మెట్రిక్ టన్నుల పిడిఎస్ బియ్యం సీజ్

>> (విశాఖపట్నం), శ్రీ లక్ష్మీ శ్రీనివాస రైస్ మిల్, (మోతుకూరు)ల కి చెందిన మొత్తం 140 మెట్రిక్ టన్నుల బియ్యం అక్రమంగా కాకినాడ పోర్టు ద్వారా ఇతర దేశాలకు ఎగుమతి అవుతుండగా సీజ్ చేయడం జరిగింది.జిల్లా పౌరసరఫరాధికారి సత్యనారాయణ రాజు తెలిపిన వివరం ప్రకారం సదరు బియ్యం నువ్వు శాంపిల్స్ తీసుకొని ఎనాలసిస్ చేయగా ఫోర్ట్ ఫైడ్ కెర్నల్స్ ఉన్నట్లుగా గుర్తించిన పిదప నిత్యవసర వస్తువులు చట్టం 1955 ప్రకారం నమోదు చేయడం జరిగింది. అక్రమంగా రవాణా చేయుచున్న మిల్లర్స్ మరియు ట్రేడర్స్, లారీ డ్రైవర్లు, యాజమాన్యంపై క్రిమినల్ చర్య తీసుకోనున్నారు.

సీజ్ చేయబడిన బియ్యం విలువ రూ65 లక్షలు, లారీల విలువ రూ 60 లక్షలు, మొత్తం 1.25 కోట్ల రూపాయలు గా అంచనా వేస్తున్నారు. జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు పోర్టులో తనిఖీలు నిర్వహించడం జరుగు తుందని, అక్రమంగా పిడిఎస్ బియ్యం కొన్న, అమ్మిన, రీసైకిలింగ్ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అలాగే ఈసంఘటనకు సంబంధించిన సదరు వ్యక్తులను రిమాండ్కు పంపించడం జరుగుతుందని సత్యనారాయణ రాజు తెలియజేశారు.

## వారం - వర్జ్యం

22-02-2026, ఆదివారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, శుక్లపక్షం, ఉత్తరాభాద్ర కార్తె
చవితి రా.9.17
భరణి రా.10.42
వర్జ్యం : ఉ.9.27-ఉ.10.55
దు.సా.4.38-సా.5.27
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం:** అస్తవ్యస్తంగానున్న వ్యవహారాలను మీ వ్యక్తిగత ప్రతిభతో చక్కదిద్దుతారు. వివాదాలకు దూరంగావుండండి.

**వృషభం:** నష్టాలను ఆదిలోనే వారించ గలుగుతారు. అత్యాశకు పోరు, కలిగిన దానితోనే తృప్తిపడతారు. ధనలాభం.

**మిథునం:** సాంకేతిక కారణాలవలన వీసా, పాస్పోర్ట్ వంటి వ్యవహారాలలో జాప్యం చోటుచేసుకుంటుంది. వస్త్రలాభం.

**కర్కాటకం:** ఋణాలు తీరతాయి. బాధ్యతలు సమర్థవంతంగా పూర్తిచేస్తారు. కుటుంబ సభ్యుల ప్రోత్సాహం. వాహన సౌఖ్యం.

**సింహం:** సంఘంలో విశేషగౌరవం లభిస్తుంది. విద్య, ఉద్యోగావ కాశాలు లాభిస్తాయి. కోర్టు కేసుల నుండి బయటపడతారు.

**కన్య:** ముఖ్యమైన విషయాలలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు. అరుదైన ఆహ్వానాలు అందుతాయి.విద్య, ఉద్యోగావకాశాలు పొందుతారు.

**తుల :** వాహనాలు నడి పేటప్పుడు జాగ్రత్తలు పాటించడం చెప్పదగినది, కోపతాపాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** మాటల నైపుణ్యంతో అందరినీ ఆకట్టుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో స్వల్పమార్పులు చోటుచేసుకుంటాయి.

**ధనుస్సు:** పారిశ్రామిక, కళా రంగాలలోని వారికి సన్మానాలు. కాస్త నిదానంగానైనా పనులు పూర్తిచేస్తారు. వస్త్రలాభం కలదు.

**మకరం:** భూములకు సంబంధించిన విషయాలు వివాదాస్పదం కాకుండా జాగ్రత్తలు పాటించవలసి ఉంటుంది.

**కుంభం:** అంతరంగిక చర్చలు జరిగేచోట కొత్తవారికి చోటు ఇవ్వకండి. ముఖ్యమైన వ్యక్తుల అండదండలు లభిస్తాయి.

**మీనం:** ఉద్యోగంలో మీరు ఆశించిన ప్రమోషన్ అతిత్వరలోనే లభించబోతోందన్న శుభసమాచారం అందుతుంది.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



శనివారం తిరుమలలో భక్తులకు అన్నదానం చేస్తున్న సిఎం చంద్రబాబు, మనవడు దేవాన్ష్

# మనవడితో కలిసి భక్తులకు సిఎం అన్నప్రసాద వితరణ

**తిరుమల,మార్చి 21ప్రభాతవార్తప్రతినిధి:** మనవడు నారాదేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా శనివారం తిరుమలలో సిఎం చంద్రబాబు నాయుడు భక్తులకు అల్పాహారం వితరణ చేశారు. అంతకు ముందు సిఎం చంద్రబాబు, సతీమణి భువనేశ్వరి, కుమారుడు, మంత్రి లోకేష్‌తో కలిసి మనవడు పేరున 44లక్షల రూపాయలు విరాళాన్ని టిటిడికి అందించారు. దేవాన్ష్ పేరున ఒకరోజు భోజనం భక్తులకు వడ్డించారు. ఉదయం అల్పాహారాన్ని స్వయంగా సిఎం చంద్రబాబునాయుడు మనవడు దేవాన్ష్‌తో కలసి కుటుంబసభ్యులు నారా భువనేశ్వరి, నారాలోకేశ్ భక్తులకుఅన్నదానం వడ్డించారు.అనంతరం భక్తులతో కలిసి చంద్రబాబు కుటుంబం అల్పాహారాన్ని స్వీకరించారు.

భక్తులకు మరింత మెరుగైనసౌకర్యాలు కల్పించేందుకు అభిప్రాయ సేకరణ ప్రణాళికబద్దంగా చేపట్టాలని టిటిడి ఇఒ రవిచంద్ర,అదనపు ఇఒ వెంకయ్య చౌదరికి సూచించారు.



వెంగమాంబ భవనంలో అన్నప్రసాదాలు స్వీకరిస్తున్న సిఎం కుటుంబం

# గ్రీన్ సిగ్నల్

>> తాము ఇచ్చిన ఆప్షన్లను పరిగణనలోకి తీసుకోలేదని ఆరోపిస్తూ పలువురు వ్యవసాయ అసిస్టెంట్లు హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన సింగిల్ జడ్జి తాజాగా కౌన్సెలింగ్ జరపాలని తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ దాఖలైన అప్పీలును విచారించిన డివిజన్ బెంచ్ కూడా సింగిల్ జడ్జి తీర్పును సమర్థిస్తూ కీలకఆదేశాలు జారీ చేసింది. ఉద్యోగులు గతంలో ఇచ్చిన ఆప్షన్ల ఆధారంగానే బదిలీలు చేపట్టాలని, ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని కోర్టు స్పష్టం చేసింది. వారు కోరుకున్న స్థానాన్ని కేటాయించలేకపోతే, అందుకు గల కారణాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని ఆదేశించింది. కొత్త బదిలీల ప్రక్రియ పూర్తయ్యేవరకు ఉద్యోగులను ప్రస్తుతం పనిచేస్తున్న చోటనే కొనసాగించాలని, మొత్తం ప్రక్రియను మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించింది. రాష్ట్రంలో గత ఏడాది జూన్ నుంచి ఉద్యోగుల బదిలీలపై నిషేధం అమల్లో ఉంది. అయినప్పటికీ, హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో ఈ ప్రత్యేక కేసుకు ప్రభుత్వం మినహాయింపు ఇచ్చింది. త్వరలో స్వర్ణగ్రామం, స్వర్ణ వార్డు విభాగం డైరెక్టర్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేయనున్నారు. ఆతర్వాత కృష్ణా, కర్నూలు జిల్లాల కలెక్టర్లు బదిలీల ప్రక్రియను పూర్తి చేస్తారు.

# మళ్లీ కిరోసిన్

>>కొనసాగుతాన్నారు. గృహ అవసరాలకు కచ్చితంగా ఓటిపీ ద్వారానే సరఫరా జరుగుతుందని, ఎట్టి పరిస్థితుల్లోనూ గృహ అవసరాల గ్యాస్ పక్కదారి పట్టించే వారిని ఉపేక్షించమన్నారు. రాష్ట్రంలో ఉన్న 55 వేల అంగన్వాడీ కేంద్రాల్లో 12 వేల కేంద్రాలకు ఇండక్షన్ స్టవ్‌లు అందించామన్నారు.



# ఆధ్యాత్మిక కేంద్రాలు

>> ఇంటెలిజెన్స్ ద్వారా భక్తుల రద్దీని ముందుగానే అంచనా వేసి, వనరులను సమర్థవంతంగా వినియోగించే విధంగా చర్యలు తీసుకున్నామని అధికారులు తెలిపారు. లడ్డూల తయారీ, విక్రయాలు, నిల్వ వంటి అంశాలను కూడా సమగ్రంగా పర్యవేక్షిస్తున్నామని చెప్పారు. పలువురు ఎన్ఆర్ఐ దాతల సహకారంతో కార్యా ఫౌండేషన్ ద్వారా కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా అందిస్తున్న సేవలను అమెరికాలోని దాత వేజేండ్ల జయప్రసాద్ వర్చువల్ ద్వారా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మంత్రి అనగాని సత్యప్రసాద్ , చంద్రగిరి ఎమ్మెల్యే పులిపర్తి నాని, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, ముఖ్యమంత్రి కార్యదర్శి ప్రద్యుమ్న, తిరుపతి కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ , టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్య చౌదరి, తిరుపతి ఎస్పీలంకెల సుబ్బ రాయుడు, సివిఎస్ఒ కె. వి మురళీ కృష్ణ, సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, విజిలెన్స్,ఐటి విభాగం అధికారులు పాల్గొన్నారు.

# 62కు పెంపు

>>గా అంగీకరించినట్లు తెలిసింది. ఈ నిర్ణయం అమలైతే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 8,500 మంది ఉద్యోగులకు లబ్ధి చేకూర నుంది. ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, 9, 10 షెడ్యూల్ సంస్థలలో పనిచేస్తున్న ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపు డిమాండ్ చాలా కాలంగా పెండింగ్‌లో ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఈ ప్రతిపాదనలు ముందుకు సాగలేదు. అయితే, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ అంశంపై దృష్టి సారించి, మంత్రులతో సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. వయసు పెంపు వల్ల ప్రభుత్వంపై పడే ఆర్థిక భారం వంటి అంశాలను కూడా కమిటీ క్షుణ్ణంగా పరిశీలించి, ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. కేబినెట్ సబ్ కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది. దీనిపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

# భారత్ నౌకాదళానికి తారాగిరి సిద్ధం

**విశాఖపట్నం, మార్చి 21 ప్రభాతవార్త:** భారత నౌకాదళం తన సరికొత్త స్టెల్త్ ఫ్రిగేట్ 'తారాగిరి'ని అధికారికంగా ప్రారంభించడానికి సిద్ధమయింది. భారత సముద్ర సార్వభౌమాధికారానికి ఒక కీలక ఘట్టంగా నిలిచే ఈ వేడుకలో, భారత నౌకాదళం తన సరికొత్త స్టెల్త్ ఫ్రిగేట్, తారాగిరి (ఎఫ్41)ని 03ఏప్రిల్ 2026న అధికారికంగా ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరగనున్న ఈ వేడుక, దేశం సంపూర్ణ స్వయం సమృద్ధి గల నౌకా శక్తిగా మారే దిశగా సాగిస్తున్న ప్రయాణానికి ఒక శక్తివంతమైన నిదర్శనంగా నిలుస్తుంది.ప్రాజెక్ట్ 17ఏ శ్రేణిలో నాలుగవ శక్తివంతమైన నౌకగా, తారాగిరి కేవలం ఒక ఓడ మాత్రమే కాదు; ఇది 6,670 టన్నుల బరువుతో 'మేక్ ఇన్ ఇండియా' స్ఫూర్తికి మన స్వదేశీ నౌకా నిర్మాణ కేంద్రాల అధునాతన ఇంజనీరింగ్ సామర్థ్యాలకు ప్రతిరూపం.ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించిన ఈ ఫ్రిగేట్, మునుపటి డిజైన్‌ల కంటే ఒక తరం ముందడుగు వేసింది. ఇది మరింత నాజూకైన రూపాన్ని, గణనీయంగా తగ్గిన రాడార్ క్రాస్ సెక్షన్‌ను కలిగి ఉండి, అత్యంత ప్రాణాంతకమైన రహస్య పద్ధతిలో పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. 75 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో, ఈ నౌక దేశీయ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ యొక్క పరిపక్వతను చాటిచెబుతోంది. ఈ వ్యవస్థలో ఇప్పుడు 200కు పైగా సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. ఇవి భారత ప్రభుత్వ ఆత్మనిర్భర కార్యక్రమాలకు దోహదపడుతూ, వేలాది భారతీయ ఉద్యోగాలకు మద్దతు ఇస్తున్నాయి.కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ ప్రొపల్షన్ ప్లాంట్‌తో నడిచే తారాగిరి, ఖిఅధిక వేగం అధిక ఓర్పుఖి గల బహుముఖ ప్రజ్ఞ మరియు బహుళపరిమాణ సముద్ర కార్యకలాపాల కోసం రూపొందించబడింది. ఈ నౌక యొక్క ఆయుధ సముదాయం ప్రపంచ స్థాయిది. ఇందులో సూపర్‌సోనిక్ ఉపరితలం నుండి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణులు, మధ్య శ్రేణి ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు ప్రత్యేకమైన జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ సామగ్రి ఉన్నాయి. ఈ వ్యవస్థలు అత్యాధునిక యుద్ధ నిర్వహణ వ్యవస్థ ద్వారా సజావుగా అనుసంధానించబడ్డాయి, దీనివల్ల సిబ్బంది ముప్పులకు క్షణాల కచ్చితత్వంతో స్పందించగలరు. సముద్రాలలో ఒక అగ్రశ్రేణి వేట నౌకగా దాని పాత్రకు అతీతంగా, తారాగిరి ఆధునిక దౌత్యం మానవతా సంక్షోభాల సంక్లిష్టతల కోసం నిర్మించబడింది. దీని బహుముఖ మిషన్ ప్రొఫైల్, తీవ్రమైన పోరాటం నుండి మానవతా సహాయం మరియు విపత్తు ఉపశమనం వరకు ప్రతి దానికీ దీనిని ఆదర్శంగా చేస్తుంది.భారతీయులు రూపొందించి, నిర్మించి, నడిపే నౌకలచే రక్షించబడే విక్సిత్, సమృద్ధ భారత్‌కోసం సముద్రాలను కాపాడుతూ, భారతనౌకాదళం ఒక యుద్ధానికి సిద్ధంగా ఉన్న,సమైక్య, విశ్వసనీయ, ఆత్మనిర్భర్ శక్తిగా ఎదుగుతూనే ఉంది. పెరుగుతున్న సముద్ర శక్తికి ఒక మార్గదర్శిగా మన నీలి సరిహద్దులకు ఇనుప కవచ సంరక్షకుడిగా, తారాగిరి ఒక ఉజ్వల భవిష్యత్తుకు సిద్ధంగా ఉంది.



# స్వర్ణాంధ్రవైపు అడుగులు

>> బలమైన భాగస్వామ్యాలు అవసరమైన తరుణంలో పూర్తి తోడ్పాటు కేంద్రం నుండి లభిస్తూ ఉండటం శుభపరిణామం అని అన్నారు. రాజకీయాలు ఈ వేదికపై అప్రస్తుతం అని తెలిపిన రామ్మోహన్ నాయుడు విభజిత ఆంధ్రప్రదేశ్ సమయంలో ఇబ్బందులు, గత అయిదేళ్ల పాలన ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రానికి సరైన సమయంలో కేంద్రం నుండి బలమైన తోడ్పాటు అందిందని అన్నారు. పోలవరం కు 6000కోట్లు, విశాఖ స్టీల్ కు 12000 కోట్లు అందించి లాభాల్లోకి తీసుకురావడం కేంద్రం తోడ్పాటుకు నిదర్శనం కాగా ఇంతకన్నా బలమైన భరోసా భవిష్యత్‌కు అవసరమని అన్నారు. రాష్ట్రంలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ మంచి ఫలితాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాబట్టుకుంటూ ఉన్నారని అన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో ఐటీ విఫలం రాష్ట్ర అభివృద్ధి దిశను మార్చుతోందని అన్నారు. పార్లమెంట్‌లో యువకుడైన తనతో పాటు ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, హరీష్ బాలయోగి, ఇలా మిగిలిన వారితో యంగెస్ట్ పార్లమెంట్ పార్టీ ఇప్పుడు కేంద్రంలో భాగస్వామ్యం అయిందని అన్నారు. రాష్ట్రంలో కూడా నూతన ఎమ్మెల్యేలు ఎక్కువ మంది కాగా 80 మందికి పైగా 40 ఏళ్ల లోపు వాళ్ళే ఎమ్మెల్యే లుగా ఉండటం.. పొలిటికల్ ఇండికేషన్ కాదని యువశక్తిపై చంద్రబాబు నాయుడు కు ఉన్న నమ్మకం అని అన్నారు. జాతీయ రహదారులు, పోర్టులు, ఎయిర్ పోర్టులు అభివృద్ధి చేసుకుంటూ దక్షిణాది రాష్ట్రాలు మరింత వృద్ధిలోకి వస్తున్నాయని అన్నారు. అభివృద్ధి వికేంద్రీకరణ విధానాన్ని ప్రస్తుతం రాష్ట్రం అవలంభిస్తోందని, శ్రీకాకుళం నుండి అనంతపురం వరకు.. రీజియన్ల వారీగా అభివృద్ధి చేసుకుంటూ వెళ్తున్నామని అన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ తన బలాన్ని ప్రపంచానికి చూపిస్తోందని, డ్రోన్ విప్లవం ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో డ్రోన్ సిటీగా ఏపీ మారుతోందని అన్నారు. రాష్ట్రంలో నూతన ఎయిర్పోర్ట్‌లను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ప్రస్తుతం ఉన్న 14 ఎయిర్పోర్ట్ లను సైతం అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రతీ ఒకరికి 2 గంటల దూరంలో ఎయిర్పోర్ట్ ఉండాలనే లక్ష్యంతో నూతన నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ఆలోచనతో నారా లోకేష్ వెళ్తున్నారని.. స్పీడ్, క్వాలిటీ చూపిస్తూ ఉండటంతో అంతర్జాతీయంగా మనవైపు అందరి దృష్టి నిలిచిందని అన్నారు. ఒకప్పుడు ఉత్తరాంధ్ర అంటే వేరే అభిప్రాయం ఉండేదని.. తక్కువ అభివృద్ధి, జిడిపి, తలసరి ఆదాయం గతంలో ఉండేవని రామ్మోహన్ నాయుడు అన్నారు. బలహీనతలను బలంగా మార్చడంతో.. ఉత్తరాంధ్ర ఇప్పుడు గ్లోబల్ డెస్టినేషన్ గా మారిందని అన్నారు. తాను రెండు సార్లు దావోస్ లో పర్యటించానని.. మొదటి సారి వెళ్ళేటప్పుడు మా పెట్టుబడులకు భద్రత ఏది అనే భయం ఉండేది అని.. కానీ రెండవ సారి వెళ్ళేటప్పుడు ఆంధ్రప్రదేశ్ ను ఒక రాష్ట్రం మాదిరి కాకుండా.. దేశంలా భావిస్తూ ప్రాధాన్యత ఇస్తుండటం ఆనందంగా అనిపించిందని అన్నారు. సీఐఐ కు మొదటి నుండి నారా చంద్రబాబు నాయుడు తోడ్పాటు అందిస్తూనే ఉన్నారని.. ఆయనే ప్రమోటర్‌గా మారి.. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని అన్నారు. చంద్రబాబు నాయకత్వం ఎప్పుడూ వందేళ్లకు సరిపడే అభివృద్ధిని ఆలోచిస్తుందని అన్నారు. త్వరలోనే భోగాపురం, మూలపేట పోర్ట్, మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్, బ్రాండెడ్ హోటళ్లు, ఇలా ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారబోతోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇందులో సీఐఐ కీలక భూమిక పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఉడాన్ యాత్రీ కేఫ్ ద్వారా సామాన్యులు సైతం విమాన ప్రయాణం వైపు చూసేలా ఆలోచనలు చేశామని అన్నారు. సంగీత సాధనాలు, క్రీడా పరికరాలు గతంలో విమాన ప్రయాణంలో అనుమతించేవారు కాదని.. వాటిని మేము గౌరవంగా భావిస్తూ తగిన భద్రత కల్పిస్తూనే రవాణా సదుపాయాన్ని చేరువ చేశామని గుర్తు చేశారు. పెంపుడు జంతువులకు సైతం ప్రయాణ సౌలభ్యాన్ని అందించామని అన్నారు.అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ను సీఐఐ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ఆంధ్రపదేశ్ సి.ఈ.ఓ మురళి కృష్ణ, గ్రీన్ కో గ్రూప్ ప్రెసిడెంట్ మహేష్ కోలి, ముత్తూట్ ఫిన్ కార్ప్ చైర్మన్ థామస్ జాన్, సీఐఐ వైస్ ఛైర్మన్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో జోరుగా 'సంక్షేమ' బడ్జెట్లు

**డాక్టర్ వై.నాగేశ్వరరావు**

రెండు తెలుగు(ఏపీ, తెలంగాణ) రాష్ట్రాల్లో బడ్జెట్ ప్రతిపాదనలు వచ్చేశాయి. జోరుగానే బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టాయి. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ ఫిబ్రవరి 14న రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టి సభ ఆమోదం తీసుకున్నారు. తెలంగాణలో డిప్యూటీ సిఎం,ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క మార్చి 20న తెలంగాణ రాష్ట్ర బడ్జెట్ ప్రతిపాదనలు ప్రవేశపెట్టారు. ఈ ప్రతిపాదనలను ఆమోదించేందుకు సోమవారం నుంచి సభలో చర్చ జరగనుంది. మొత్తంగా రెండు రాష్ట్రాలు తమ తమ బడ్జెట్లను ఏప్రిల్ నుంచి ప్రభుత్వ నిర్వహణకు, పథకాల కొనసాగింపునకు వ్యయం చేయాల్సి ఉంటుంది. ఈసారి కూడా ఎప్పటిలానే రెండు రాష్ట్రాల బడ్జెట్ ప్రతిపాదనలు పెరిగిపోయాయి. తెలంగాణ ప్రభుత్వం కంటే ముందే ఏపీ ప్రభుత్వం భారీ అంచనాలతో 2026-27 వార్షిక బడ్జెట్‌ను అసెంబ్లీలో ప్రవేశ పెట్టింది. ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బడ్జెట్ ప్రసంగంలో గత ప్రభుత్వంలో సాగిన పాలన పైన విమర్శలు చేసారు. రాష్ట్ర విభజన ఒక నష్టం అయితే ఆ తరువాత అయిదేళ్ల పాలన రాష్ట్రానికి నష్టం చేసిందని ఆరోపించారు. ఈ బడ్జెట్ కేవలం పద్దులే కాదని.. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంటుందని వెల్లడించారు. అభివృద్ధి సంక్షేమంతో రాష్ట్రాన్ని పరుగులు పెట్టించాలనేదే తమ విధానమని స్పష్టం చేసారు. రాష్ట్ర బడ్జెట్ 2026-27ను ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. రానున్న ఆర్థిక సంవత్సరానికి రూ. 3,32,205 లక్షల కోట్లతో బడ్జెట్ ప్రతిపాదించారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంతో ఈ బడ్జెట్ ప్రతిపాదించినట్లు వెల్లడించారు. రాయలసీమ రైతుల కలలను సాకారం చేసేలా ప్రాధాన్యత ఇచ్చామన్నారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించామని ఆర్థిక మంత్రి వివరించారు. కీలక రంగాలకు కేటాయింపులు భారీగా పెంచారు. రెవెన్యూ వ్యయం రూ.2,56,143 కోట్లు కాగా, మూలధన వ్యయం రూ.53,915 కోట్లు, రెవెన్యూ లోటు రూ.22,002 కోట్లు.. ద్రవ్యలోటు రూ.75,868 కోట్లు ఉందని ప్రకటించారు. ఇక, శాఖల వారీగా వ్యవసాయ శాఖకు రూ. 11,745 కోట్లు, పాఠశాల విద్యకు రూ. 32,208, బీసీ సంక్షేమం రూ. 23,650 కోట్లు, ఇంధన శాఖ రూ.19,306 కోట్లు, పంచాయితీ రాజ్‌కు రూ. 22,941 కోట్లు, ఇరిగేషన్ రూ.18,223 కోట్లు, అన్నదాత సుఖీభవ కోసం రూ.6,600 కోట్లు, మత్స్యకార సేవకు రూ.600 కోట్లు, ధరల స్థిరీకరణకు రూ.


తెలంగాణ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క


ఎపి ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్

560కోట్లు మనబడి మన భవిష్యత్ పథకానికి రూ. 1,500 కోట్లు, పీఎం స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియాకు రూ.707 కోట్లు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర పథకానికి రూ. 654 కోట్లు, యూత్ అండ్ స్పోర్ట్స్‌కు రూ. 438 కోట్లు, సాగు నీటి ప్రాజెక్టులు: రూ. 9,906 కోట్లు, రాష్ట్రీయ కృషి వికాస్ యోజన: రూ. 1,927 కోట్లు.. అన్నదా సుఖీభవ: రూ. 6,600 కోట్లు, మత్స్యకారులకు రూ. 260 కోట్లు.. పోలవరం: రూ. 6,105 కోట్లు, ధరల స్థిరీకరణ నిధి: రూ. 500 కోట్లు.. పాఠశాల విద్యకు రూ.32,308 కోట్లు, వైద్య ఆరోగ్య శాఖకు రూ. 19,306 కోట్లు.. బీసీ సంఘాల కోసం రూ.23,650 కోట్లు.. జల వనరుల శాఖకు రూ. 18,223 కోట్లు.. పంచాయతీరాజ్‌కు రూ.22,941 కోట్లు, మున్సిపల్ శాఖకు రూ.14,538 కోట్లు కేటాయింపులు చేశారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరానికి రూ. 3,24,234 కోట్ల అంచనా ప్రతిపాదనలతో బడ్జెట్ ప్రవేశపెట్టింది. రెవెన్యూ వ్యయం రూ.2,34,406 కోట్లుగా, మూలధన వ్యయం రూ.47,267 కోట్లుగా పేర్కొన్నది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931గా ఉన్నట్టు తెలిపింది. రాష్ట్ర వృద్ధి రేటు 10.2 శాతమని ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌ను శుక్రవారం అసెంబ్లీలో డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రి భట్టివిక్రమార్క ప్రవేశపెట్టగా, శాసనమండలిలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ ప్రవేశపెట్టారు. ఈ బడ్జెట్‌లో ఆర్థిక శాఖకు రూ.60,438 కోట్లు, పంచాయతీరాజ్ శాఖకు రూ. 33,688 కోట్లు ప్రతిపాదించారు. సెకండరీ, ఉన్నత విద్యాశాఖలకు రూ.26,674 కోట్లు, వ్యవసాయం, సహకార శాఖలకు రూ.23,179 కోట్లు, సాగునీటి పారుదల శాఖకు రూ.22,615 కోట్లు, విద్యుత్తు శాఖకు రూ.21,285 కోట్లు, పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు రూ.17,907కోట్లు, ఎస్సీ సంక్షేమానికి రూ.11,784 కోట్లు, గృహనిర్మాణ శాఖకు రూ.7,430 కోట్లు కేటాయించారు. అసెంబ్లీలో గంట 56 నిమిషాల పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మండలిలో మంత్రి ఉత్తమ్ తమ బడ్జెట్ ప్రసంగం కొనసాగించారు. వరుసగా 4వ సారి అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టిన భట్టిని సీఎం రేవంత్ మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారులు అభినందించారు. 2026-27 వార్షిక బడ్జెట్‌లో వివిధ శాఖలకు కేటాయింపులు ఇలా ఉన్నాయి. వ్యవసాయం, సహకార శాఖ రూ. 23,179 పశుసంవర్ధక, మత్స్యశాఖ రూ.1,529,బీసీసంక్షేమ శాఖ రూ.12,511,ఎస్సీ సంక్షేమం రూ.11,784,ఎస్టీ సంక్షేమం రూ.7,937,మైనారిటీ సంక్షేమం రూ.3,679, మహిళా,శిశు, దివ్యాంగ, వయోవృద్ధులశాఖ రూ.3,143, విద్యుత్తు శాఖ రూ.21,285,పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ రూ.1,049,ఆర్థిక శాఖ రూ.60,438, పౌర సంబంధాలు రూ.7,366,సాధారణ పరిపాలనా శాఖ రూ. 1,190, వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం రూ.13,679, హోంశాఖ రూ.11,907, గృహ నిర్మాణం రూ.7,430, వాణిజ్య, పారిశ్రామిక రూ.3,747,ఐటీ, కమ్యూనికేషన్ రూ.875, సాగునీటి పారుదల రూ.22,615,న్యాయశాఖ రూ.2,367,అసెంబ్లీ నిర్వహణ రూ.259, మున్సిపల్, పట్టణాభివృద్ధి రూ.17,907,పంచాయతీరాజ్ రూ.33,688, ప్రణాళిక శాఖ రూ.7,971, రెవెన్యూ రూ.4,020,సెకండరీ విద్యాశాఖ రూ.21,231, ఉన్నత విద్య రూ.5,443,రవాణా శాఖ రూ.4,491,రోడ్లు, భవనాల శాఖ రూ.8,298 పర్యాటక, సాంస్కృతికశాఖ రూ.2,127 కేటాయించారు.తెలంగాణ ప్రభుత్వం బడ్జెట్‌లో కొత్త పథకాలను ప్రకటించింది. సంక్షేమ రంగానికి అధిక మొత్తంలో నిధులు కేటాయించారు. కొత్తగా ప్రతీ కుటుంబానికి రూ.5 లక్షల భీమా సదుపాయం కల్పించేలా నిర్ణయం తీసుకున్నారు. చేయూత పథకానికి అర్హులైన వారికి 2 లక్షల నూతన పెన్షన్లను మంజూరు చేస్తున్నామన్నారు. బడ్జెట్‌లో చేయూత పథకానికి రూ.14,861 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు.కొత్తగా రాష్ట్రంలోని అందరికీ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు నిర్ణయించారు. దీని ద్వారా రాష్ట్రంలోని 1 కోటి 15 లక్షల కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా పథకం కింద భరోసా లభిస్తుంది. జూన్, 02, 2026 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభిస్తామని తెలిపారు. ఈ పథకానికి బడ్జెట్‌లో రూ.4వేల కోట్ల మేర కేటాయింపు చూపించారు. అదే విధంగా కొన్ని ప్రభుత్వ పాఠశాలలకు ఆధునిక మౌలిక సదుపాయాలు కల్పించి, నాణ్యమైన శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, డిజిటల్ సదుపాయాలతో ప్రత్యేక రవాణా వ్యవస్థలను ఏర్పాటు చేసి అన్ని వనరులతో కూడిన తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మార్పు చేయాలని భావిస్తున్నట్లు వెల్లడించారు. ప్రీ ప్రైమరీ నుంచి 12వ తరగతి వరకు 1500 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందిస్తామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్మీడియట్ కోర్సు చదువుతున్న విద్యార్థులకు ఇకపై నూతనంగా మధ్యాహ్న భోజన పథకాన్ని విస్తరించనున్నారు. అదే విధంగా జూన్ లో ప్రారంభం కానున్న కొత్త విద్యాసంవత్సరం నుంచి ప్రీప్రైమరీ నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో రాష్ట్రంలో నూతనంగా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని అందించనున్నారు. అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌లలో శిక్షణ పొందుతున్న ట్రైనీలకు ప్రతినెల రూ. 2వేల స్కాలర్‌షిప్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులందరికీ దాదాపు 23 లక్షల 51 వేల మందికి నగదు రహిత ఆరోగ్య భద్రత పథకాన్ని అందించనున్నారు. ●

ఉద్యోగుల భద్రత కోసం దేశంలోనే తొలిసారిగా సమగ్ర ప్రమాద బీమా పథకాన్ని ప్రవేశపెట్టినట్లు భట్టి తెలిపారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.1.20 కోట్ల ప్రమాద బీమా వర్తించనుంది. ఆరు గ్యారంటీలకు రూ. 50,713 కోట్లను కేటాయించింది. ఈసారి పద్దులో రైతు భరోసాకు రూ.18 వేలకోట్లను కేటాయించింది. ఈ సంవత్సరం మహాలక్ష్మి పథకానికి రూ.4,305 కోట్లు కేటాయిస్తున్నట్లు వెల్లడించారు. గృహజ్యోతి పథకం ద్వారా సుమారు 53 లక్షల 9 వేల పేద, మధ్య తరగతి కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంట్ అందిస్తున్నామని భట్టి పేర్కొన్నారు. ఈ పథకం కింద ఇప్పటి వరకు 10.97 కోట్ల సున్నా బిల్లులు జారీ చేశామన్నారు. కాగా ఈ సంవత్సరానికి గృహజ్యోతి పథకానికి రూ.2,080 కోట్లు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర యువతకు సురక్షితమైన విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించేందుకు వీలుగా ఏర్పాటు చేసిందని ఆయన అన్నారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ టామ్‌కామ్ ద్వారా యూఏఈ, జర్మనీ, జపాన్, యూకే, కెనడా వంటి 16 దేశాలలో సుమారు 13,930 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ఈ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు వీలుగా నూతనంగా 'సీ.ఎం. ఓవర్సీస్ ఎంప్లాయిమెంట్ ప్రోగ్రాం'ను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ బడ్జెట్‌లో కార్మిక సంక్షేమ శాఖకు రూ.998 కోట్ల రూపాయలు ప్రతిపాదిస్తున్నామని తెలిపారు. రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు పోటాపోటీగా బడ్జెట్ ప్రతిపాదనలు రూ.3లక్షల కోట్లకు పైగా ప్రవేశపెట్టినా బడ్జెట్ లోటును తీర్చుకుంటూ వ్యయం దగ్గర జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంటుంది.

# 'చే' జారిన చుక్కాని!

అసోం

**ఎ.వి.వి ప్రసాద్**

చుక్కాని లేని నావ ఎటు వెడుతుందో ఎవరూ చెప్పలేరు. అసోంలో కాంగ్రెస్ పరిస్థితి ఇప్పుడు అలాగే ఉంది. ఎన్నికల షెడ్యూలు విడుదలవడంతో అన్ని పార్టీల్లోను హడావుడి పెరిగింది కానీ రాష్ట్రంలో కాంగ్రెస్ మాత్రం మందు తిన్న పాములా ముందుకు కదలలేకపోతోంది. ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ వరుసగా మూడోసారి అధికారంలోకి రావడానికి పావులు కదుపుతుండగా, ముందుకునడిపించగల సరైన నాయకత్వం లేక కాంగ్రెస్ అల్లాడుతోంది. గౌరవ్ గొగొయ్ నాయకత్వంలో ఎన్నికలను ఎదుర్కొనడానికి కార్యకర్తలు సిద్ధంగా ఉన్నా, నాయకుల మధ్య సమన్వయం లోపించడం, కీలక నేతలు పార్టీని వదలివెళ్లడం ప్రధాన సమస్యలుగా చుట్టుముడుతున్నాయి. ఎన్డీయే కూటమిలో ఉన్న అసోం గణపరిషత్, బోడోలాండ్ ఫ్రంట్‌తో బిజెపి సీట్లఒప్పందాలు ఇప్పటికే పూర్తి కాగా, కాంగ్రెస్ నాయకత్వంలోని 'మహాజోట్'లో మాత్రం ఇంకా ఆరంభదశలోనే ఉన్నాయి. కూటమి పార్టీల మధ్య అవగాహన లోపమే అందుకు కారణం.అన్నిటికంటే ముఖ్యంగా పలువురు సీనియర్ నేతలు ఇటీవల కాంగ్రెస్‌కు దూరంకావడం కూడా పార్టీనేతలను ఎక్కువగా కలవరపరుస్తోంది. మహాజోట్‌లో కాంగ్రెస్‌తోపాటు అసోంజాతీయ పరిషత్, సిపిఎం, ఆల్ పార్టీ హిల్ లీడర్స్ కాన్ఫరెన్స్ కూడా ఉన్నాయి. కాంగ్రెస్ మినహా కూటమిలోని మిగిలిన పార్టీలకు గత ఎన్నికల్లో కూడా లభించిన ఓట్ల శాతం చాలా తక్కువ. కాంగ్రెస్ గత ఎన్నికల్లో బిజెపికి దగ్గరగా వచ్చింది కానీ అధికారానికి ఆమడ దూరంలోనే ఆగిపోయింది. బిజెపి గత రెండుఅసెంబ్లీ ఎన్నికల నుంచిరాష్ట్రంలో ఓట్ల శాతం బాగా పెంచుకొంటూ వచ్చింది. దానికి ప్రధాన కారణం హిమంత బిశ్వ శర్మఅనే చెప్పాలి.బిజెపిని పటిష్ఠం చేయడమేగాక కాంగ్రెస్‌ను మరింతగా బలహీనపరచడం ఆయనగెలుపు వ్యూహంగా కనిపిస్తుంది.పార్టీలో విభేదాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ఇతర పార్టీలను మచ్చిక చేసుకోవడం ఆయనకుఓటుతోవచ్చిన విద్యఅనే చెప్పాలి. ఏప్రిల్ 9న జరిగే ఎన్నికలకు కూడా ఆయన అటువంటివ్యూహాలనే అనుసరిస్తున్నారనిపిస్తుంది.అందుకే సీట్ల సర్దుబాట్లు సజావుగా సాగిపోయాయి. అయితే మహాజోట్‌లో చిన్నపార్టీలు ఎక్కువ కావడంతో సీట్లపంపిణీ కూడా తలనొప్పిగా మారింది. దానికంటే, పలువురు సీనియర్ నేతలు కాంగ్రెస్‌ను వదిలి బిజెపిలో చేరడం పార్టీ అధిష్ఠానాన్ని కుదిపేస్తోంది. తరుణ్ గొగొయ్ వంటి సమర్థ నేతల ప్రభావం ఇప్పుడులేదు.ఉన్న మరికొందరు సీనియర్ నేతలు బిజెపిలోకి వెళ్తుండడంతో పార్టీ అధిష్టానం అయోమయంలో పడుతోంది. ఎన్నికలు జరుగుతున్న ఐదు రాష్ట్రాల్లో బిజెపినికాంగ్రెస్ నేరుగా ఢీకొంటున్నది ఒక్క అసోంలోనే. మిగిలిన నాలుగు చోట్ల అంతగా ప్రభావం చూపలేని భాగస్వామిగా మాత్రమేఉంది. పిసిసి చీఫ్‌గా ఉన్న భూపేన్ కుమార్ బోరా ఫిబ్రవరిలో పార్టీని వీడి బిజెపిలో చేరడంతో కాంగ్రెస్‌కు ఒకదాని తర్వాత ఒకటి దెబ్బలు తగులుతూనే ఉన్నాయి.పార్టీని పటిష్ఠం చేయడంలో గతంలో కీలకపాత్ర వహించిన బోరా హఠాత్తుగా బిజెపి పంచన చేరడంతో అధిష్ఠానం సైతం అవాక్కయింది. అది ఎవరూ ఊహించని పరిణామం. ఆ దెబ్బ నుంచి ఇంకా కోలుకోకుండానే మరో దెబ్బ తగిలింది. మూడు దశాబ్దాలు పైగా కాంగ్రెస్‌లో సమైక్యతకు కృషి చేసిన ఎంపి ప్రద్యుత్ బోర్దోలయ్ కూడా ఫిరాయించి బిజెపి తీర్థం పుచ్చుకోవడంతో అధిష్ఠానం మరింత సంక్షోభంలోకి జారిపోయింది.మరి కొందరు సీనియర్ నేతలు, పెద్దసంఖ్యలోకార్యకర్తలు కూడా వలస బాటపట్టారు. పార్టీపరిస్థితిమరింత క్షీణించకుండా 'అడ్డుచక్రం' వేయడానికి అసోం ఎన్నికల స్క్రీనింగ్ కమిటీచైర్‌పర్సన్‌గా ప్రియాంక గాంధీని అధిష్ఠానం నియమించింది. ఆమె తరచుగా గువాహతి,ఇతర ప్రాంతాలలో పర్యటిస్తూ పార్టీ కార్యకర్తలు, నేతల్లో కొత్త ఉత్సాహం నింపడానికి యధాశక్తి ప్రయత్నిస్తున్నారు. కానీ వలసలను మాత్రం ఆపలేకపోతున్నారు.హిమంత ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆమె తయారుచేసిన ఛార్జిషీట్ల ప్రభావం కూడా అంతగాకనిపించలేదనే చెప్పాలి.కాంగ్రెస్‌లోని చివరి హిందూ నేత కూడా బిజెపిలోకి వచ్చేదాకా విశ్రమించబోనంటూ హిమంత ఇటీవల చేసిన మరో ప్రకటన మరింత కాక పుట్టిస్తోంది. కాంగ్రెస్ కేవలం ఒక నిర్దిష్ట వర్గానికే పరిమితమైన పార్టీ అంటూ హిమంత చేస్తున్న విమర్శలు కూడా ఎక్కువ ప్రభావాన్నే చూపుతున్నాయి. ముఖాముఖి పోరులో కాంగ్రెస్‌ను మానసికంగా దెబ్బతీసిఎన్నికల ముందే విజయాన్ని ఖరారు చేసుకొనే దిశగా బిజెపిఅడుగులు వేస్తున్నట్లుగా కనిపిస్తోంది. ప్రధాని మోడీ ఇటీవల రెండు సార్లు అసోంలోపర్యటించి భారీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయడంతో వాటి ప్రభావం కూడా ఎన్నికలపై కనిపిస్తుందని భావిస్తున్నారు. నెలరోజుల వ్యవధిలో ఇద్దరు కీలకనేతలు పార్టీని వదలి వెళ్లడంతో ప్రియాంక గాంధీకి కూడా పరిస్థితి దిక్కుతోచకుండా ఉంది. 2015కు ముందు హిమంత కూడా కాంగ్రెస్ నాయకుడే. కానీ ఇప్పుడు! ఆ పార్టీని నామరూపాలు లేకుండా చేస్తానని ప్రతిజ్ఞ చేసినవాడు. అందుకే రానురాను కాంగ్రెస్ మరింతగా బలహీనపడుతోంది. తాజా ఫిరాయింపులన్నిటికి సూత్రధారి ఆయనే అనడంలో సందేహం లేదు. గౌరవ్ గొగొయ్‌కి పార్టీ రాష్ట్ర నాయకత్వం అప్పగించిన తర్వాత నాయకుల మధ్యవిభేదాలు అధికమయ్యాయి. ప్రచార కమిటీ సారథి అయిన బోరా, మేనిఫెస్టో కమిటీ ఛైర్మన్ అయిన బోర్దొలాయ్ 'చే' జారిన తర్వాత పదిమందిని ఆకట్టుకోగల సీనియర్ నాయకులే కాంగ్రెస్‌కు కరవయ్యారు. ఈ పరిస్థితిలో కాంగ్రెస్ చుక్కాని జారిపోయినట్లే కనిపిస్తోంది. సరైన నాయకులు లేనిచోట ప్రియాంక మాత్రం పార్టీని ఎలా గట్టెక్కించగలరో చూడాలి. గత ఎన్నికల్లో కాంగ్రెస్‌కు 29 శాతం ఓటు బ్యాంకు ఉంది. అది ఎంత వరకు నిలబడుతుందో, ప్రియాంక గాంధీ ఎలా నిలబెట్టగలుగుతారో సందేహమే. ●


ప్రియాంక గాంధీ

# అనుతిన్‌కే 'థాయ్' పట్టం!

థాయిలాండ్

**గన్ని మోహన్**

ఆగ్నేయాసియాలోని చిన్నదేశంలో జరిగిన ఎన్నికల్లో ఆ దేశ పార్లమెంటుకు అనుతిన్ చర్నవిరకుల్ రెండోసారి ఎన్నిక కావడం దేశంలో ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలేనని తెలుస్తోంది. ఆయన స్థాపించిన భూంజాథాయ్ పార్టీ గణనీయమైన ఫలితాలు సాధించింది. కింగ్‌డమ్ ఆఫ్ థాయిలాండ్‌గా పేర్కొంటున్న ఈ చిన్న దేశంలో మైన్మార్, లావోస్, కాంబోడియా, మలేసియా దేశాలు సరి హద్దులుగా కొనసాగుతుంటే అత్యధికంగా 2615 కిలోమీటర్ల సముద్ర తీరం కూడా ఉన్న దేశంగా ఉంది. దేశజనాభా కూడా 71.5 మిలియన్లుగా ఉంది. ప్రతి చదరపు కిలోమీటరుకు 140మంది వ్యక్తుల నివాస సాంద్రత కలిగి ఉన్న ఈ దేశంలో అధికారం కోసం కూటముల కుమ్ములాటలు తీవ్రస్థాయిలోనే జరిగాయి. ఫిబ్రవరిలో జరిగిన ఎన్నికల్లో మొత్తం 299 స్థానాలున్న పార్లమెంటులో 292 స్థానాలు గెలిచి భూంజాథాయ్ పార్టీ మెజార్టీ మార్కును అధిగమించింది. దీనితో వెంటనే బాధ్యతలు స్వీకరించిన అనుతిన్ కేబినెట్‌ను కూడా తనదైన శైలిలో విస్తరించేపనిలో పడ్డారు. ముందు థాయిలాండ్ ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయన దృష్టిసారించారు. విపక్షాలు కూడా సలహాలు, సూచనలు ఇవ్వవచ్చని దేశ ప్రజల సంక్షేమం కోసం సమిష్టిగా కృషి చేద్దామంటూ బాధ్యతలు స్వీకరించిన వెంటనే థాయ్ ప్రధాని ఇచ్చిన పిలుపు అందరిని కలుపుకుని వెళ్లాలన్న లక్ష్యంగా కనిపిస్తోంది. రెండు దశాబ్దాల పాటు కొనసాగిన ఏకపక్ష పాలన అనంతరం భూంజాయ్‌థాయ్ పార్టీ కొన్ని సవాళ్ల ఎదుర్కొన్నా చివరకు నిలదొక్కుకుని అధికారం చేపట్టగలిగింది. దేశ ఆర్థికవ్యవస్థ అతలాకుతలం అయింది. రుణభారం పెరిగింది. వాణిజ్యపరంగా అనిశ్చితి ఉంది. దీనికితోడు ఇజ్రాయెల్, అమెరికాలు ఇరాన్‌పై జరుపుతున్న యుద్ధం కూడా కొంత దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపించింది. 558.57 బిలియన్ డాలర్ల జిడిపి కలిగిన థాయిలాండ్ తలసరి ఆదాయం కూడా నామ మాత్రంగానే ఉంది. గత ఏడాది కొలమానం చూస్తే 7942 డాలర్లుగా ఉంది. ఇక వృద్ధిరేటు కూడా 2 శాతం నుంచి 2.5 శాతానికి మించిపోవడం లేదు. ఉత్పత్తిరంగం, పర్యాటకం వ్యవసాయ రంగాలపైనే ఆధారపడిన ఈ దేశంలో ఇప్పుడు సంస్కరణలు అత్యవసరం. ఆటో విడిభాగాలు, ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ దేశానికి నంబర్‌వన్‌గా పేరుంది. పర్యాటకరంగ పరంగా కూడా ఏటా 39 మిలియన్ల మంది సందర్శిస్తారు. వీటి నుంచే ప్రధాన ఆదాయ వనరులు సమకూర్చుకుంటున్న థాయిలాండ్‌లో ఇప్పుడు సంస్కరణలు అనివార్యం అవుతున్నాయి. శక్తివంతమైన మిలిటరీ, న్యాయ వ్యవస్థలకు అనుగుణంగా అనుతిన్ పాలన చేయగలరన్న అంచనాలు ఇప్పటికే దేశ ప్రజల్లో నెలకొన్నాయి. థాయిలాండ్‌లో దశాబ్దాల తరబడి నెలకొన్న సంస్థాగత పాలన నుంచి ఇప్పుడిప్పుడే ప్రజాభీష్ట పాలనవైపు కొనసాగుతున్నదన్న భావన నెలకొంది. దేశంలో నిర్వహించిన రిఫరెండమ్ కూడా మార్పు రావాలనే కోరుకుంది. అందువల్లనే ఇప్పుడు మార్పు అనివార్యమై అనువంశిక పాలనకు తెరదించి కొత్తపార్టీని ప్రజలు ఎన్నుకున్నారు. జాతీయ వాదంతోను, మిలిటరీ సానుకూల, రాజరిక సానుకూల వ్యవస్థను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఇప్పుడు అనుతిన్‌పై పడింది. అలాగే కాంబోడియాతో ఉన్న సరిహద్దు వివాదాన్ని కూడా తక్షణమే పరిష్కరించుకోవాల్సిన అవసరం కూడా సూచిస్తోంది. ఈ సమస్యల పరిష్కారం తోనే అనుతిన్ సామర్థ్యం, నాయకత్వ సత్తా వెలుగులోకి వస్తుందని రాజకీయ పండితులు పేర్కొంటున్నారు. థాయిలాండ్ కొత్త ప్రధానికి తక్షణమే ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడం, ఆ తర్వాత కాంబోడియాతో నెలకొన్న సరిహద్దు వివాదాన్ని పరిష్కరించుకోవం ముందున్న సవాళ్లని తెలుస్తోంది. ఈ సరిహద్దు వివాదంపై కాల్పుల విరమణ అవగాహన ప్రస్తుతం అమలులో ఉంది. 800 కిలోమీటర్ల సరిహద్దు వివాదాన్ని శాంతియుత మార్గంలో పరిష్కరించుకోవాల్సిన అవసరం భూంజైథాయ్ పార్టీకి సూచిస్తోంది. అంతేకాకుండా సరిహద్దు ప్రహరీ నిర్మాణం, అటూ ఇటూ రాకపోకలు మూసివేతతోపాటు లక్షమందికిపైగా వలంటీర్ సైనికులను నియమించుకుని భద్రతను పెంచాల్సిన అవసరం ఎంతో ఉంది. గతంలో ఆయన హయాంలోనే మిలిటరీకి తక్షణ కార్యాచరణ చేపట్టే అధికారాలను కూడా కల్పించింది. భూమ్‌జాయ్‌థాయ్ పార్టీకి ఇతర పక్షాల నుంచి అసమ్మతిని కూడా ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయి. రెండో అతి పెద్ద పార్టీగా ఉన్న ప్రొగ్రెసివ్ పీపుల్స్ పార్టీ 120 సీట్లతో అనుతిన్‌కు పక్కలో బల్లెంగా నిలిచింది. దశాబ్దాలుగా పాలించిన ఫ్యూథాయ్ పార్టీ కేవలం 74 సీట్లతో మూడో స్థానానికే పరిమితం కావడంతో తిరుగుబాటు ఉండదని తేలిపోయింది. అంతకుముందు పాలించిన పేటోంగ్టార్న్ షినవత్రా కాంబోడియాతో ఉన్న సంబంధాలపై నైతిక నియమావళి ఉల్లంఘించారని గద్దెదిగాల్సి వచ్చింది. ఆ తర్వాత ప్రధానిగా వచ్చిన అనుతిన్ పార్లమెంటును రద్దుచేసి ముందస్తు ఎన్నికలకు పిలుపు నిచ్చారు. అప్పటి నుంచి ఆయన సరిహద్దు వివాదం, ఆర్థిక వ్యవస్థలనే ప్రచారాస్త్రాలుగా చేసుకుని పాలన పగ్గాలు చేపట్టారు. అన్నింటికంటే ముఖ్యంగా థాయ్ రాజ్యాంగ న్యాయస్థానం అనుతిన్ ఎన్నికలను ధృవీకరించాల్సి ఉంది. ఎన్నికల సంఘంపై అంబుడ్స్‌మన్ ఆఫీస్ పిటిషన్ దాఖలు చేయడంతో ఎన్నికలపై మళ్లీ సందిగ్ధత నెలకొంది. మూడొంతుల మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడంతో అనుతిన్ చర్నవిరకుల్ తనశైలి పాలన మార్కును చూపించగలరన్న ఆశాభావం థాయ్‌ప్రజల్లో నిలువెల్లా నెలకొంది. ప్రజల ఆశలు ఎంతమేరకు నెరవేరుస్తారన్నది ఇప్పుడు దేశ ప్రధాని చర్నవిరకుల్ పాలనా దక్షతపైనే ఆధారపడి ఉంది. ●


అనుతిన్

# ప్రశ్నార్థకంగా మారిన తైవాన్ భవితవ్యం

**సుంకవల్లి సత్తిరాజు**

ఒక వైపు పశ్చిమాసియా భగ్గుమంటుంటే, తూర్పు ఆసియాలో కూడా యుద్ధమేఘాలు కమ్ముకుంటున్నాయి. తైవాన్‌పై చైనా ఏక్షణంలోనైనా దాడి చేసే అవకాశముంది. ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా ప్రజలంతా సుఖశాంతులతో జీవిస్తున్న తైవాన్‌లో చైనా కాలు మోపడానికి సిద్ధంగా ఉంది. ప్రజాస్వామ్యానికి ప్రతీకగా భాసిల్లుతున్న తైవాన్‌ను ప్రజాభీష్టానికి వ్యతిరేకంగా తనలో విలీనం చేసుకుని నియంతృత్వ బీజాలను నాటడానికి డ్రాగన్ తహతహలాడుతున్నది. తూర్పు ఆసియాలో భూసరిహద్దులు లేని ద్వీప దేశం తైవాన్. తైవాన్‌ను 'ఫార్మోసా' అని కూడా పిలుస్తారు. చైనా ప్రధాన భూభాగం నుండి తైవాన్ ప్రావెన్స్‌ని 'స్ట్రయిట్ ఆఫ్ తైవాన్' వేరు చేస్తున్నది. ఇటీవలి కాలంలో చైనా,తైవాన్‌ల మధ్య ఉద్రిక్తతలు చెలరేగి సర్దుమణిగిన విషయం విదితమే. అయితే తాజాగా తైవాన్ చైనాల మధ్య ఉద్రిక్తతలు తిరిగిఊపిరి పోసుకుంటున్నాయి. ఇరాన్‌పై అమెరికా ఇజ్రాయిల్ దేశాలు క్షిపణుల వర్షం కురిపిస్తూ భీకర యుద్ధం చేస్తున్న తరుణంలో, ఇరాన్ డ్రోన్ల సహాయంతో అమెరికాకు ముచ్చెమటలు పట్టిస్తూ, హార్ముజ్ జలసంధి పై పట్టు బిగించి, చమురు సరఫరా జరగకుండా నిలిపివేసి ప్రపంచాన్ని తీవ్రమైన సంక్షోభంలోకి నెట్టిన క్లిష్ట సమయంలో సందట్లో సడేమియా అన్నట్టుగా తైవాన్ ఆక్రమణకు చైనా పావులు కదపడం పెరుగుతున్న సామ్రాజ్య వాద కాంక్షకు పరాకాష్టగా భావించాలి. వర్తమాన ప్రపంచం అశాంతికి నిలయంలా మారింది. ఈ పరిస్థితులను ఇలాగే గాలికి వదిలేస్తే మూడవ ప్రపంచ మహాసంగ్రామాన్ని ఏరి కోరి ఆహ్వానించడమే కాగలదు. శాంతి భద్రతలు కరువైతే యుద్ధోన్మాదం విలయతాండవం చేయకతప్పదు. ఎక్కడైతే శాంతి సుస్థిరతలకు భంగం వాటిల్లుతుందో,అక్కడ అభివృద్ధి కుంటుబడుతుంది. ఇప్పటి వరకు జరిగిన యుద్ధాలు, వర్తమానంలో పలుదేశాల మధ్య జరుగుతున్న సంఘర్షణలు ఈ విషయాన్ని తేటతెల్లం చేస్తున్నాయి. విజ్ఞానం పెరిగినా అజ్ఞానం వెర్రితలలు వేస్తూ యుద్ధాలకు పురిగొల్పుతున్నది. ఇతర దేశాలకుచెందిన భూభాగాలను ఆక్రమించాలనేదుగ్ధతో, ఆధిపత్య జాడ్యంతో జరుగుతున్న సంఘటనలు ప్రపంచ ప్రజలను అశాంతికి గురిచేసి,వారి జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నాయి. అశాంతి, అలజడులతో, యుద్ధాలతో ప్రజల ఆర్థిక స్థితిగతులు తిరగబడుతున్నాయి.ప్రపంచంలోని పలు దేశాల్లో ఇప్పటికీ ప్రజలు జీవించడానికి కనీస మౌలిక సదుపాయాలు లేవు. ఆకలి,దరిద్రం,నిరుద్యోగం, నిరక్షరాస్యత, అవినీతి వంటి పలుఅంశాలు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. మూలిగే నక్కపై తాటి పండు పడిన చందంగా సామ్రాజ్య విస్తరణ కోసం వివిధ దేశాల మధ్య జరిగే యుద్ధాల వలన ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించుకున్నామన్న అహంకారంతప్పయుద్ధాల వలన సాధించేదేమీ ఉండదన్న సత్యం బోధ పడేదెప్పుడు? ప్రజలను నిత్య మారణహోమంలో సమిధలుగా చేసి తృప్తి పడడం ఆధునిక యుగంలో చోటుచేసుకుంటున్న తీవ్రమైన ఉన్మాదం. ఆధునిక యుగంలో యుద్ధాలు అనాగరికానికి, అరాచక వాదానికి పరాకాష్ట. తైవాన్ సరిహద్దుల్లోకి చైనా తన యుద్ధ విమానాలను, సైన్యాన్ని భారీగా మోహరిస్తుందన్న వార్తలు భయోత్పాతాన్ని కలిగిస్తున్నాయి. తైవాన్ పై డ్రాగన్ దేశం దాడిచేసి, ఆక్రమించుకోబోతున్నదా? దీనిపై ప్రపంచ దేశాల ప్రతిస్పందన ఎలాఉండబోతున్నది? ప్రశాంతంగా ఉన్న ప్రపంచాన్ని తన అహంకారంతో యుద్ధాల వైపు నెట్టిన అమెరికాకు చైనాను విమర్శించే నైతిక హక్కు ఉంటుందా?ఒక సమస్య తరువాత మరొక సమస్య ప్రపంచ దేశాలను కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఒక వైపు అమెరికా ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్ పై సాగిస్తున్న యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. అమెరికాకు మిత్ర దేశాలుగా మారిన గల్ఫ్‌దేశాలన్నీ విధ్వంసమైపోతుంటే, ప్రపంచంలో చమురు సంక్షోభం తీవ్రమైపోతుంటే ఆగని ఇరాన్ ప్రతీకార జ్వాలల్లో అమెరికా ఆయుధ సంపత్తి భస్మీపటలమైపోతున్నది. అమెరికా,ఇరాన్ దేశాల ఇగోలకు ప్రపంచ దేశాలన్నీ విలవిల్లాడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో ప్రపంచ దేశాలను వణికిస్తున్న మరోసంఘర్షణకు చైనా తెరతీసింది. తైవాన్ పైదాడికి తెగబడుతున్నది. తూర్పు ఆసియాలో వాయవ్య పసిఫిక్ మహాసముద్రంలో భూ సరిహద్దులు లేని ద్వీప దేశమైన తైవాన్‌ను ఆక్రమించుకుని, పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనాలో విలీనంచేసి తూర్పు ఆసియాలో తిరుగులేనిశక్తిగా ఎదగాలని చేసే ప్రయత్నంలో భాగంగానే చైనా తన సైనిక బలగాలను, యుద్ధ విమానాలను తైవాన్ సమీపంలో మోహరిస్తున్నది. చైనా చాలా కాలంగా తైవాన్‌ను తన దేశంలో విలీనం చేసుకోవాలనే కుతంత్రానికి తెరలేపింది. తైవాన్‌తో కుదిరిన ఒప్పందం ప్రకారం తైవాన్‌కు ఆయుధాల సరఫరా వేగవంతం చేయాలని ఇటీవల అమెరికా సెనేట్ కోరింది.ఇప్పటికే తైవాన్ తన దేశ రక్షణ కోసం 3.5లక్షల కోట్లు కేటాయించింది. తైవాన్ చైనాలో అంతర్భాగమని, తైవాన్‌ను ఆక్రమించుకుంటామని జిన్‌పింగ్ హెచ్చరించగా, ప్రజాస్వామ్యదేశమైన తైవాన్ సార్వభౌమత్వాన్ని కాపాడుకుంటామని ఆ దేశ అధ్యక్షుడు లైచింగ్ టె ప్రకటించడమే కాకుండా,ఇందుకు అమెరికా సహాయాన్ని అర్థించడం కూడా జరిగింది. దక్షిణ కొరియా, జపాన్ వంటి పలు దేశాలు తైవాన్‌కు అండగా నిలబడే అవకాశాలున్నాయి. అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధంగా వెనిజులాపై దాడిచేసి ఆ దేశ అధ్యక్షుడైన నికోలస్ మదురోను నిర్బంధించడం, ఇరాన్‌పై యుద్ధానికి దిగడంవంటి పలుకారణాలను సాకుగాచూపి, తాము కూడా తైవాన్‌ను ఆక్రమించుకుంటే తప్పేంటనే ఆలోచన చైనాలో అంకురించింది. తైవాన్ అంశం చిలికి చిలికి గాలివానలా మారి పెను యుద్ధానికి దారితీసే అవకాశాన్ని తోసి పుచ్చలేం. ఇప్పటికే తైవాన్ జలసంధి చుట్టూ చైనా వందలాది యుద్ధ విమానాలను, పదుల సంఖ్యలో యుద్ధ నౌకలను మోహరించినట్టు వార్తలు వెలువడ్డాయి. తైవాన్ చుట్టూ ఇటీవల చైనా సైనిక, నౌకా వైమానిక విన్యాసాలు చేసింది. తైవాన్ భూతల, గగనతలాల్లో చైనా ఆధిపత్యం చెలాయించడం ఏమిటి? ఈ పరిస్థితులు ఏర్పడడానికి కారణమేమిటి? తైవాన్‌ను తన దేశ అంతర్భాగంగా చైనా పేర్కొనడానికి కారణమేమిటి? తైవాన్ తనను తాను స్వతంత్ర దేశంగా ఎందుకు భావిస్తున్నది? చైనా తైవాన్ మధ్యలో అమెరికా ఎందుకు జోక్యం చేసుకుంటున్నదనే విషయాలపై అవగాహన కలగాలంటే చరిత్ర పుటలను తిరగేయాలి. అప్పట్లో చైనాలో చెలరేగిన అంతర్యుద్ధంలో చైనా ప్రధాన భూభాగంపై కమ్యూనిస్టులు పట్టుసాధించారు. 1949 లో చైనా లోని కుమో మింటాంగ్ ప్రభుత్వం పతనంతో మావో జెడాంగ్ నేతృత్వంలో పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా ఆవిర్భవించింది. మావో చేతికి చైనా అధికార పగ్గాలు రావడంతో సివిల్ వార్‌లో ఓడిపోయిన సైనికులు,నాయకులు, వ్యాపారులు, లక్షలాది మంది ప్రజలు తైవాన్‌కు పలాయనం చిత్తగించి,అక్కడ ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకుని ఇప్పటి వరకు శాంతి, సామరస్యాలతో మనుగడ సాగిస్తున్నారు. చైనా ప్రధాన భూభాగం' పీపుల్స్ రిపబ్లిక్ ఆఫ్ చైనా' (పి.ఆర్.సి)గాను, తైవాన్ 'రిపబ్లిక్ ఆఫ్ చైనా' (ఆర్.ఓ.సి) గాను పిలువ బడుతున్నది. 1949 నుండి 1975 వరకు చియాంగ్ కై షేక్ ఆధ్వర్యంలో తైవాన్ గణనీయమైన ప్రగతి సాధించింది. అతని మరణానంతరం కూడా తైవాన్ అనేక రంగాల్లో ముందంజలో దూసుకుపోవడం గమనార్హం. నేడు ప్రపంచంలో తైవాన్ అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థలు గల దేశాల్లో 20వ స్థానంలో ఉంది.వన్ చైనా పాలసీ ప్రకారం తైవాన్‌ను ఏ దేశం స్వతంత్ర దేశంగా గుర్తించకూడదు. తైవాన్‌కు సంబంధించిన విషయాలను చైనాతో మాత్రమే అధికారికంగా సంప్రదించాలి. అమెరికా చైనాల మధ్య 1972, 1979, 1982వ సంవత్సరాల్లోమూడు కమ్యూనిక్ ఒప్పందాలు కుదిరాయి. వన్ చైనా పాలసీని ఉల్లఘించి, తైవాన్‌కు అమెరికా ఆయుధాలను సరఫరా చేయడం,ప్రత్యక్ష ఒప్పందాలు కుదుర్చుకోవడం పట్ల,'త్రీ కమ్యూనిక్స్'ను ఉల్లంఘించడం పట్ల చైనా తీవ్ర అభ్యంతరం చెబుతున్నది. ఇప్పటికైనా తైవాన్‌ను చైనా ప్రత్యేక దేశంగా గుర్తించాలి. ఎకానమిస్ట్ ఇంటిలిజెన్స్‌యూనిట్ జరిపిన సర్వేలో అత్యంత ఉత్తమమైన ప్రజాస్వామ్య వ్యవస్థలు గల దేశాల్లో తైవాన్ 12వ స్థానం సంపాదించింది. ఇలాంటి అభివృద్ధి చెందుతున్న,ఉత్తమప్రజాస్వామ్యదేశమైన తైవాన్ అస్థిత్వాన్ని కాపాడాలి.యుద్ధాలతో ప్రజల జీవితాలు అతలాకుతలమైపోతున్న ప్రస్తుత పరిస్థితుల్లో,చైనా గనుక తైవాన్ పైయుద్ధానికిదిగితే ఎలాంటి పరిస్థితులు ఉత్పన్నమోతాయో ఊహించలేం. ప్రస్తుతం తైవాన్ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారింది. ●



22-3Pg5.qxd:22-3Pg5.qxd 1/1/02 6:43 AM Page 1



# మైనారిటీల ఓట్లు హరిస్తున్న బిజెపి

## ఓటర్ల జాబితా సవరణ దానికోసమే..

## ప్రజాస్వామ్య పరిరక్షణకు పోరాడుతా: మమతా బెనర్జీ



**కోల్‌కత్తా, మార్చి 21:** పవిత్ర రంజాన్ పర్వదినం వేళ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ రాజకీయ ప్రకంపనలు సృష్టించారు. ఈద్ ప్రార్థనల్లో పాల్గొన్న ఆమె, ముస్లిం మైనార్టీలను ఉద్దేశించి మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఓటర్ల జాబితా సవరణ పేరుతో మైనార్టీల ఓటు హక్కును కాలరాస్తోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసేందుకు కేంద్రం కుట్ర పన్నిందని ఆరోపించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) పేరుతో భారీ సంఖ్యలో ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారని, ముఖ్యంగా మైనార్టీలు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనే ఈ తొలగింపులు జరిగాయని ఆమె పేర్కొన్నారు. మోదీ కానీ, బీజేపీ కానీ మీ ఓటు హక్కును దొంగిలించనివ్వను. ప్రజాస్వామ్యాన్ని, పౌరుల హక్కులను కాపాడేందుకు చివరి రక్తపు బొట్టు వరకు పోరాడతానని ఆమె అన్నారు. ఓటర్ల జాబితా సవరణ విషయంలో ఇప్పటికే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం, కేంద్ర ఎన్నికల సంఘం మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడు స్తోంది. వెరిఫికేషన్ సాకుతో అర్హులైన వారిని జాబితా నుంచి తొల గించడం ద్వారా బీజేపీకి లబ్ధి చేకూర్చాలని చూస్తున్నా రంటూ ఎన్నికల సంఘంపై మమత విమర్శలు గుప్పి స్తున్నారు. బెంగాల్‌ను టార్గెట్ చేసి, రాష్ట్రా న్ని విభజించాలని చూస్తున్న వారు ఖినరకానికిఖి వెళతారంటూ ఆమె ఘాటు వ్యాఖ్యలు చేశారు. హిందువులు, ముస్లింలు, సిక్కులు, క్రైస్తవులు ఇక్కడ అన్నదమ్ముల్లా కలిసి జీవిస్తారు. ఈ సామాజిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయాలని చూస్తే ఊరు కోమని మమత స్పష్టం చేశారు. బెంగాల్ అస్తి త్వాన్ని దెబ్బతీసే శక్తులకు ప్రజలు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని ఆమె పిలుపునిచ్చారు.

### బెంగాల్ ఎన్నికలకు భారీ సంఖ్యలో కేంద్ర బలగాలు

పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్రంలో రెండు దశల్లో జరగనున్న పోలింగ్ కోసం రికార్డు స్థాయిలో 2,400 కంపెనీల భద్రతా బలగాలను మోహరించ నున్నట్లు ప్రకటించింది. ఏప్రిల్ 23న తొలిదశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ జరగనుంది. కేంద్ర సాయుధ పోలీసు బలగాలు , ఇండియా రిజర్వ్ బెటాలియన్, ఇతర రాష్ట్రాల సాయుధ పోలీసులతో కూడిన ఈ బలగాలను ప్రతి దశ లోనూ మోహరిస్తారు. ఇప్పటికే ముందస్తు భద్ర తా చర్యల్లో భాగంగా 480 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు బెంగాల్‌లో విధుల్లో ఉన్నాయి. గతంలో 2021 అసెంబ్లీ, 2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత రాష్ట్రంలో పెద్ద ఎత్తున హింస చెలరేగిన నేపథ్యంలో ఈసీ ఈసారి కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. పోలింగ్ ముగిసిన తర్వాత కూడా భద్రతను కొనసా గించాలని నిర్ణయించింది. ఈవీఎంలు, స్ట్రాంగ్ రూమ్‌ల భద్రత కోసం 200 కంపెనీలు, శాంతిభద్రతల పరిరక్షణ, హింస నివారణ కోసం మరో 500 కంపెనీల సీఏపీఎఫ్ బలగాలు కౌంటింగ్ పూర్తయ్యేంత వరకు రాష్ట్రంలోనే ఉంటాయని స్పష్టం చేసింది. పోలింగ్ ముగిసిన తర్వాత మిగిలిన 1,700 కంపెనీల బలగాలను వెనక్కి పంపిస్తారు. బలగాల కదలి కలు, మోహరింపును సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ సమన్వయం చేస్తుంది. సీఆర్పీ ఎఫ్ వెస్ట్ బెంగాల్ సెక్టార్ ఐజీ శలభ్ మాథుర్‌ను ఖిస్టేట్ ఫోర్స్ కోఆర్డినేటర్‌గా ఈసీ నియ మించింది. ఈ బలగాలకు అవసరమైన రవాణా, వసతి ఏర్పాట్లు ప్రభుత్వం చేయాలని ఆదేశాలు జారీ చేసింది.



# డేజియాన్ ఆటో విడిభాగాల ఫ్యాక్టరీలో ప్రమాదం

## 10 మంది మృతి, 59 మందికి తీవ్రగాయాలు

**సియోల్, మార్చి 21:** దక్షిణ కొరియాలో ఘోర అగ్నిప్రమాదం జరిగింది. డేజియాన్ నగరంలోని ఒక ఆటో విడిభాగాల తయారీ కర్మాగారంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ దుర్ఘటనలో 10 మంది కార్మికులు మరణించగా, 59 మంది గాయపడ్డారు. వీరిలో 25 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రమాదం తర్వాత ఫ్యాక్టరీ భవనం ఏ క్షణంలోనైనా కూలిపోయే ప్రమాదం ఉండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. దీంతో అధికారులు రోబోలను రంగంలోకి దింపి, భవనాన్ని చల్లబరిచాక గాలింపు పనులు చేపట్టారు. ప్రమాద సమయంలో లోపల చిక్కుకుపోయిన మరో నలుగురు కార్మికుల ఆచూకీ ఇంకా లభించలేదు. ప్రాణాలు కాపాడుకునేందుకు కొందరు భవనం పైనుంచి దూకగా, మరికొందరు పొగ కారణంగా తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటనపై దక్షిణ కొరియా అధ్యక్షుడు లీ జేమ్యూంగ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యల కోసం అందుబాటులో ఉన్న అన్ని వనరులను వినియోగించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 500 మంది అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. మంటలను అదుపులోకి తెచ్చిన సిబ్బంది, ఫ్యాక్టరీలోని 100 కిలోల ప్రమాదకర రసాయనాలను సురక్షితంగా బయటకు తరలించారు.

# మంటల్లో పశ్చిమాసియా

## నతాంజ్ అణుకేంద్రంపై మళ్లీ దాడులు.. ఖండించిన ఇరాన్



**టెహ్రాన్, మార్చి 21:** ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్‌ల మధ్య దాడు లు, ప్రతిదాడులతో పశ్చిమాసియాలో ఉద్రి క్త పరిస్థితులు కొన సాగుతున్నాయి. ఈ క్రమంలోనే ఇరాన్‌లోని నతాంజ్ అణుశుద్ధి కేంద్రంపై మరోసారి దాడులు జరిగినట్లు స్థానిక మీడియా వెల్లడించింది. అమెరికా-ఇజ్రాయెల్ దళాలు వైమానిక దాడులు చేశాయని తస్నిమ్ వార్తా సంస్థ తెలిపింది. అయితే, రేడియో ధార్మిక పదార్థాల లీకేజీ జరగలేదని, పరిసర ప్రాంతాల నివాసితులకు ఎలాంటి ప్రమాదం లేదని పేర్కొంది. ఈ దాడులను ఇరాన్ అణు ఇంధన సంస్థ తీవ్రంగా ఖండించింది. అమెరికా, ఇజ్రాయెల్‌లు నేరపూరిత చర్యల్లో భాగంగానే నతాంజ్‌ను లక్ష్యంగా చేసుకున్నాయని మండిపడింది. ఈ దాడులు అణ్వస్త్ర వ్యాప్తి నిరోధక ఒప్పందం (ఎన్‌పిటి), ఇతర అణు భద్రత నిబంధనలు, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించాయని పేర్కొంది. తాము జరిపిన దాడులతో ఇరాన్‌కు భారీ నష్టం వాటిల్లిందని, ఇక ఆ దేశానికి యురేనియం శుద్ధి, బాలిస్టిక్ క్షిపణుల తయారీ సామర్థ్యం లేదని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటించిన వేళ తాజా దాడులు జరగడం గమనార్హం. యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే నతాంజ్‌పై ఓసారి దాడి జరిగింది. అంతర్జాతీయ అణు ఇంధన సంస్థ (ఐఎఇఎ) ఈ విషయాన్ని ధ్రువీకరించింది. శాటిలైట్ చిత్రాల ఆధారంగా అనేక భవనాలు దెబ్బతిన్నట్లు వెల్లడించింది. అయితే, రేడియేషన్ లీకేజీ ఉండకపోవచ్చని, అణు కేంద్రానికి పెద్దగా నష్టం లేదని తెలిపింది. టెహ్రాన్‌కు దాదాపు 220 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ అణుశుద్ధి కేంద్రాన్ని గతేడాది సైతం అమెరికా, ఇజ్రాయెల్‌లు లక్ష్యంగా చేసుకున్నాయి.

## యుద్ధం వేళ.. ఇరాన్ చమురుపై ఆంక్షలు ఎత్తివేసిన అమెరికా



**వాషింగ్టన్, మార్చి 21:** యుద్ధం నేపథ్యంలో ఇంధన సరఫరాపై ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తుతు న్నాయి. ఈ క్రమంలో ట్రంప్ యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చము రుపై ఆంక్షలను ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. ఆ దేశ చమురు అమ్మకాలకు 30 రోజుల మినహాయింపు జారీ చేసింది. అమెరికా ట్రెజరీ కార్యదర్శి స్కాట్ బెసెంట్ ఈ విషయాన్ని ప్రకటించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు సరఫరాను పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ తాత్కాలిక చర్యతో 14 కోట్ల బ్యారెళ్ల ఇరాన్ చమురు ప్రపంచ మార్కెట్లలోకి వస్తుందన్నారు. ఇప్పటికే సముద్రంలో నిలిచిపోయిన ఇరాన్ చమురు విక్రయించడానికి మాత్రమే ఈ అనుమతులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. అమెరికా మినహాయింపులపై ఇరాన్ స్పందించింది. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్లకు సరఫరా చేసేందుకు తమ వద్ద అదనపు ముడి చమురు లేదని టెహ్రాన్ తెలిపింది. ఈ మేరకు ఇరాన్ ఇంధన మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎక్స్‌లో పోస్టు పెట్టారు. చమురు సరఫరాపై ఆందోళనలు తగ్గించేందుకే యుఎస్ ఇలాంటి ప్రకటన చేసిందన్నారు.

## ఇరాన్‌తో యుద్ధం ముగించడంపై ఆలోచిస్తున్నాం: ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 21:** పశ్చిమాసియాలో కొనసాగుతోన్న యుద్ధ జ్వాలలపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవు తున్నాయి. ఈ క్రమంలో ఇరాన్‌తో యుద్ధం ముగించే విషయంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ఇరాన్‌పై సైనిక చర్యను క్రమంగా తగ్గించే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిపారు. అయితే, కాల్పుల విరమణకు మాత్రం తాను సిద్ధంగా లేనని పేర్కొనడం గమనార్హం. ఇరాన్‌పై సాధించిన సైనిక విజయాలను వివరిస్తూ ట్రూత్ సోషల్ వేదికగా ట్రంప్ ఒక పోస్టు పెట్టారు. ఇరాన్‌పై మా లక్ష్యాలను చేరుకోవడానికి చాలా దగ్గరగా ఉన్నామన్నారు. మా సైనిక చర్యను ముగించే విషయంపై ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆ దేశ క్షిపణి సామర్థ్యాలను, వైమానిక, నావికా వ్యవస్థలను పూర్తిగా ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఆ దేశం మరోసారి అణ్వాయుధాలను తయారుచేయకుండా అమెరికా చూసుకుంటుందన్నారు. ఒకవేళ అలాంటి పరిస్థితి వస్తే.. తాము తగిన విధంగా స్పందిస్తామని హెచ్చరించారు. ఇక, అమెరికా దాని మిత్ర దేశాలకు భద్రత కల్పించిందని ట్రంప్ అన్నారు. 'ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, ఖతార్, యుఎఇ, బహ్రెయిన్, కువైట్ సహా పశ్చిమాసియాలోని మిత్ర దేశాలకు అత్యున్నత స్థాయిలో రక్షణ కల్పిస్తున్నాం' అని రాసుకొచ్చారు. హార్మూజ్ బాధ్యత తీసుకోవాలి.. ఈ సందర్భంగా హార్మూజ్ జలసంధి గురించి కూడా ట్రంప్ కీలక ప్రకటన చేశారు. దీనిపై ఆధారపడిన దేశాలు నౌకల సురక్షిత ప్రయాణానికి బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. అమెరికా రక్షణ కల్పించదని స్పష్టం చేశారు. ఒకవేళ తమ సాయం కోరితే.. సహాయం అందించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఇరాన్ ముప్పు తొలగిపోయిన తర్వాత ఆ అవసరం ఉండదన్నారు.

## డిగోగార్షియా యుఎస్ బేస్‌లపై ఇరాన్ క్షిపణి దాడులు



**టెహ్రాన్, మార్చి 21:** పశ్చిమాసియాకే పరి మితమైన అమెరికా ఇరా న్ ఉద్రిక్తతలు ఇప్పుడు హిందూ మహా సము ద్రానికి విస్తరించాయి. ఏకంగా 4,000 కిలో మీటర్ల దూరంలో ఉన్న అమెరికా వ్యూహాత్మక సైనిక స్థావరం డియాగోగార్సియాను లక్ష్యంగా చేసుకుని ఇరాన్ దీర్ఘశ్రేణి క్షిపణులను ప్రయోగించడం అంతర్జాతీయంగా కలకలం సృష్టిస్తోంది. ఇరాన్ వద్ద ఇంతటి శక్తిమంతమైన క్షిపణులు ఉన్నాయని అంచనా వేయడంలో విఫలమయ్యామని అమెరికా భావిస్తోంది. ఇరాన్ రెండు క్షిపణులను ప్రయోగించగా, ఒకటి సాంకేతిక లోపంతో విఫలమైంది. మరొకటి అమెరికా రక్షణ వ్యవస్థల చేతిలో నిర్వీర్యమైంది. దాడి విఫలమైనప్పటికీ, కీలకమైన యుద్ధ విమానాలు, బాంబర్లు ఉండే స్థావరంపై దాడికి యత్నించడం అమెరికాను ఆత్మరక్షణలో పడేసింది. ఇరాన్ తన శత్రువులకు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా భద్రత ఉండదని హెచ్చరించింది. పార్కులు, పర్యాటక కేంద్రాలే లక్ష్యంగా దాడులు ఉంటాయని ఇరాన్ జనరల్ ఒకరు ప్రకటించడం ప్రపంచ ఉగ్రవాద ముప్పుపై ఆందోళనలను పెంచుతోంది. ఇప్పటికే హార్మూజ్ జలసంధిలో రవాణా స్తంభించిపోవడంతో అంతర్జాతీయ చమురు మార్కెట్ తీవ్ర సంక్షోభంలో ఉంది. ఒకవైపు దాడులతో రెచ్చిపోతున్న ఇరాన్, మరోవైపు కీలక నేతలను కోల్పోతోంది. ఈ వారంలోనే అలీ లారిజానీ వంటి ముఖ్య నేతతో పాటు, తాజాగా రివల్యూషనరీ గార్డ్ ప్రతినిధి అలీ మహమ్మద్ నైనీ కూడా అమెరికాఇజ్రాయెల్ దాడిలో మరణించారు. ఇరాన్ క్షిపణి సామర్థ్యం తగ్గలేదని ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఆయన ప్రాణాలు కోల్పోవడం గమనార్హం.

## తోటి విద్యార్థిని కాల్చి చంపిన కళాశాల విద్యార్థి



**వారణాసి, మార్చి 21:** ఉత్తరప్రదేశ్‌లోని వారణాసిలో దారుణం చోటుచేసుకుంది. ఓ కాలేజీ క్యాంపస్‌లోనే విద్యార్థిని మరో విద్యార్థి తుపాకీతో అతి కిరాతకంగా కాల్చి చంపాడు. ఉదయ్ ప్రతాప్ కాలేజీలో బీఎస్సీ చదువుతున్న సూర్య ప్రతాప్ సింగ్ (23) అనే విద్యార్థిని మంజీత్ చౌహాన్ అనే మరో విద్యార్థి హత్య చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం వీరిద్దరి మధ్య పాత కక్షలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే హత్య జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. నిందితుడు మంజీత్.. సూర్య ప్రతాప్‌పై దాదాపు 8 రౌండ్లు కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. కింద పడిపోయిన తర్వాత కూడా అతనిపైకి ఎక్కి మరీ కాల్పులు జరపడం అక్కడున్న వారిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ దారుణానికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనతో కాలేజీ క్యాంపస్‌లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఆగ్రహించిన తోటి విద్యార్థులు ఫర్నిచర్ ను ధ్వంసం చేసి నిరసనలకు దిగారు. మరోవైపు, మృతుడి తండ్రి తన కుమారుడి అంత్యక్రియలు నిర్వహించేందుకు నిరాకరించారు.

నా కొడుకును చంపిన వాడిని ఎన్‌కౌంటర్ చేయాలి. అప్పుడే వాడి ఆత్మకు శాంతి అని ఆయన డిమాండ్ చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న వారణాసి పోలీసులు ప్రధాన నిందితుడు మంజీత్ చౌహాన్ ను అరెస్ట్ చేశారు. ఈ కేసులో ప్రమేయమున్న ఇతరుల కోసం గాలిస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కాలేజీ వద్ద భారీగా పోలీసులను మోహరించారు.

# హార్మూజ్ జలసంధిలో చిక్కుకున్న రెండు భారత్ నౌకలు!

**న్యూఢిల్లీ, మార్చి 21:** అమెరికా, ఇరాన్ మధ్య ముదురుతున్న ఉద్రిక్తతలు ఇప్పుడు భారత వంటింటిపై నేరుగా ప్రభావం చూపేలా ఉన్నాయి. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హార్మూజ్ జలసంధి వద్ద యుద్ధ వాతావరణం నెలకొనడంతో, భారత్‌కు వంటగ్యాస్ (ఎల్‌పీజీ) తీసుకువస్తున్న రెండు భారీ ట్యాంకర్లు సముద్ర మార్గంలో నిలిచిపోయాయి. ఈ పరిణామంతో దేశంలో ఎల్‌పీజీ సరఫరాపై ఆందోళనలు మొదలయ్యాయి. ఖతార్ నుంచి ఎల్‌పీజీ లోడ్ చేసుకుని మహానది, నర్మద అనే రెండు భారతీయ నౌకలు స్వదేశానికి బయలుదేరాయి. హార్మూజ్ జలసంధిలో ఇరాన్ క్షిపణులతో, అమెరికా యుద్ధనౌకలతో పహారా కాస్తుండటంతో ఈ మార్గంలో ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతో నౌకల కెప్టెన్లు ముందుజాగ్రత్త చర్యగా ఒమన్ తీరంలోని సురక్షిత ప్రాంతంలో ట్యాంకర్లను నిలిపివేసి, ఉద్రిక్తతలు తగ్గే వరకు వేచి చూస్తున్నారు. గతనెల28న ఈ ప్రాంతంలో ఘర్షణలు మొదలైనప్పటి నుంచి నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. భారత్ తన ఎల్‌పీజీ అవసరాలలో సింహభాగం గల్ఫ్ దేశాల నుంచే దిగుమతి చేసుకుంటుంది. ఇప్పుడు ఈ సరఫరా గొలుసుకు ఆటంకం కలగడంతో, దేశీయంగా వంటగ్యాస్ కొరత ఏర్పడి ధరలు అమాంతం పెరిగే ప్రమాదం ఉంది. ఇప్పటికే అంతర్జాతీయ మార్కెట్లో చమురు ధరలు అధికంగా ఉండటంతో, ఈ రవాణా సమస్య సామాన్యుడిపై మరింత భారం మోపనుంది. ఈ పరిస్థితిని భారత విదేశాంగ, నౌకాయాన మంత్రిత్వ శాఖలు నిశితంగా గమనిస్తున్నాయి. ఇప్పటికే ఆ ప్రాంతంలో గస్తీ కాస్తున్న భారత నౌకాదళం అవసరమైతే రంగంలోకి దిగడానికి సిద్ధమవుతోంది. భారత యుద్ధనౌకల రక్షణతో ఈ ట్యాంకర్లను సురక్షితంగా జలసంధి దాటించేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు సమాచారం.

## ఇరాన్ చమురు విక్రయాలకు అమెరికా అనుమతులు!



**వాషింగ్టన్, మార్చి 21:** ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ అమెరికా అనూహ్య నిర్ణయం తీసుకుంది. గ్లోబల్ ఇంధన మార్కెట్లపై పెరుగుతున్న ఒత్తిడిని తగ్గించేందుకు, సముద్రంలో ఇప్పటికే రవాణా అవుతున్న ఇరాన్ చమురు అమ్మకాలకు 30 రోజుల పాటు తాత్కాలికంగా అనుమతి ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ చర్య ద్వారా ప్రపంచ మార్కెట్లలో చమురు ధరలను స్థిరీకరించాలని ట్రంప్ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్లు అమెరికా ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెస్సెంట్ వెల్లడించారు. ఈ నెల 20 నుంచి ఏప్రిల్ 19 మధ్య నౌకల్లోకి ఎక్కించిన ఇరాన్ ముడి చమురు, పెట్రోలియం ఉత్పత్తుల అమ్మకాలకు మాత్రమే ఈ మినహాయింపు వర్తిస్తుందని యూఎస్ ట్రెజరీ డిపార్ట్‌మెంట్ జారీ చేసిన లైసెన్స్‌లో స్పష్టం చేసింది. కొత్తగా చమురు ఉత్పత్తి చేయడానికి గానీ, కొనుగోలు చేయడానికి గానీ ఈ వెసులుబాటు వర్తించదని అధికారులు తెలిపారు. ఈ నిర్ణయంతో సుమారు 14 కోట్ల బ్యారెళ్ల చమురు ప్రపంచ మార్కెట్లకు అందుబాటులోకి వస్తుందని బెస్సెంట్ వివరించారు.

ఇరాన్‌తో కొనసాగుతున్న ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీకారణంగా ఏర్పడిన సరఫరా అంతరాయాలను అధిగమించేందుకే ఈ చర్య తీసుకున్నామని ఆయన తెలిపారు. ధరలను అదుపులో ఉంచేందుకు మేము ఇరాన్ బ్యారెళ్లనే టెహ్రాన్‌కు వ్యతిరేకంగా వాడుతున్నామని బెస్సెంట్ చేసిన వ్యాఖ్యలు అమెరికా వ్యూహాన్ని స్పష్టం చేస్తున్నాయి. అదే సమయంలో ఈ వెసులుబాటును అలుసుగా తీసుకోవద్దని ఇరాన్‌ను హెచ్చరించారు. ఈ అమ్మకాల ద్వారా వచ్చే ఆదాయాన్ని ఇరాన్ పొందడం కష్టతరం చేస్తామని, ఆ దేశంపై ఒత్తిడి విధానం యథాతథంగా కొనసాగుతుందని ఆయన తేల్చి చెప్పారు.

### అమెరికా దళాలకు సహకరిస్తే తీవ్ర పరిణామాలు..

# బ్రిటన్‌కు ఇరాన్ హెచ్చరికలు



**టెహ్రాన్; మార్చి 21:** అమెరికాఇజ్రాయెల్‌తో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ ఇరాన్, బ్రిటన్‌కు తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. తమపై దాడి చేసేందుకు అమెరికా దళాలకు బ్రిటన్ తన సైనిక స్థావరాలను ఉపయోగించుకునేందుకు అనుమతి ఇస్తోందన్న నివేదికల నేపథ్యంలో ఇరాన్ శనివారం తీవ్రంగా స్పందించింది. ఈ వివాదంలో బ్రిటన్ జోక్యం శ్రుతి మించితే, స్పందన తీవ్రంగా ఉంటుందని ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ స్పష్టం చేశారు. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ చేస్తున్న ఈ యుద్ధంలో భాగం కావాలని బ్రిటన్ ప్రజల్లో అధిక శాతం మంది కోరుకోవడం లేదు. ప్రధాని స్టార్మర్ మాత్రం సొంత ప్రజల అభిప్రాయాన్ని విస్మరించి, ఇరాన్‌పై దాడికి యూకే స్థావరాలను వాడేందుకు అనుమతిస్తున్నారు. తద్వారా ఆయన బ్రిటిష్ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఆత్మరక్షణ హక్కును వినియోగించుకోవడానికి ఇరాన్ వెనుకాడదని అరాఘ్చీ పేర్కొన్నారు. ఈ వివాదం తమది కాకపోయినా, బ్రిటన్ అనవసరంగా తలదూరుస్తోందని ఆయన పరోక్షంగా హెచ్చరించారు. ఈ అంశంపై ఇరాన్ తన ఆందోళనను అధికారికంగా బ్రిటన్‌కు తెలియజేసింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చీ, బ్రిటన్ హోం మంత్రి యెవెట్ కూపర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. అమెరికాకు సైనిక స్థావరాలను అందుబాటులో ఉంచడాన్ని తమపై జరుగుతున్న దురాక్రమణలో పాలుపంచుకోవడంగానే పరిగణిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఇరాన్ హెచ్చరికలకు బ్రిటన్ కూడా గట్టిగానే బదులిచ్చింది. అరాఘ్చీతో జరిగిన ఫోన్ సంభాషణలోనే హోం మంత్రి యెవెట్ కూపర్ తమ వైఖరిని స్పష్టం చేశారు. బ్రిటన్ స్థావరాలు, భూభాగం, లేదా ఇతర ప్రయోజనాలను లక్ష్యంగా చేసుకోవద్దని ఇరాన్‌ను హెచ్చరించారు. అలాంటి ప్రయత్నాలు చేస్తే ఉద్రిక్తతలు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆమె తేల్చిచెప్పారు. ఈ పరస్పర హెచ్చరికలతో ఇరాన్, బ్రిటన్ మధ్య దౌత్యపరమైన వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది.

# ఆ తొమ్మిది దేశాల గగనతలం వాడొద్దు

## విమాన సంస్థలకు డిజిసిఎ ఆదేశాలు

**న్యూఢిల్లీ, మార్చి 21:** పశ్చిమాసియాలో తీవ్రమవుతున్న సైనిక ఉద్రిక్తతల నేపథ్యంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ భారత విమానయాన సంస్థలకు ముఖ్య సూచనలు జారీ చేసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఇరాన్, ఇరాక్, యూఏఈ సహా 9 దేశాల గగనతలాన్ని పూర్తిగా ఉపయోగించవద్దని స్పష్టం చేసింది. ఇరాన్ భూభాగంలో అమెరికా, ఇజ్రాయెల్ సైనిక దాడులు నిర్వహించడం, దీనికి ప్రతిగా ఇరాన్ ప్రతీకార చర్యలకు దిగే అవకాశం ఉండటంతో పౌర విమానయానానికి తీవ్రమైన ప్రమాదం పొంచి ఉందని డీజీసీఏ తన ఆదేశాల్లో పేర్కొంది. సైనిక ఘర్షణల సమయంలో పొరపాటున పౌర విమానాలను శత్రు విమానాలుగా గుర్తించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. డీజీసీఏ ఆదేశాల ప్రకారం బహ్రెయిన్, ఇరాన్, ఇరాక్, ఇజ్రాయెల్, జోర్డాన్, కువైత్, లెబనాన్, ఖతార్, యూఏఈ గగనతలాల్లో అన్ని ఎత్తులలోనూ విమానాలు నడపవద్దు. అయితే, ఒమన్, సౌదీ అరేబియా గగనతలంలో మాత్రం కనీసం 32,000 అడుగుల ఎత్తులో ప్రయాణించేందుకు షరతులతో కూడిన అనుమతి ఇచ్చింది. ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని, మార్చి 28 వరకు కొనసాగుతాయని డీజీసీఏ వెల్లడించింది. ఈ నేపథ్యంలో విమానయాన సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాలను సిద్ధం చేసుకోవాలని,

అత్యవసర ప్రణాళికలు అమలు చేయాలని సూచించింది. ఇప్పటికే కొన్ని విమానయాన సంస్థలు తమ సర్వీసులను దారి మళ్లిస్తుండటంతో ప్రయాణ సమయం పెరిగే అవకాశం ఉంది.

# ఇరాక్ అమెరికా కాన్సులేట్‌పై రాకెట్ల దాడి

**టెహ్రాన్, మార్చి 21:** అమెరికా, ఇరాన్ మధ్య రాజుకుంటున్న ఉద్రిక్తతలు ఇరాక్‌ను తాకాయి. రాజధాని బాగ్దాద్ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలోని అమెరికా దౌత్య, లాజిస్టిక్ కేంద్రంపై మిలిటెంట్లు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో దౌత్య కార్యాలయం అగ్నిప్రమాదానికి గురైంది. దాడి తీవ్రతకు దట్టమైన నల్లటి పొగ కిలోమీటర్ల మేర ఆకాశంలోకి ఎగసిపడటంతో ఆ ప్రాంతంలో భయానక వాతావరణం నెలకొంది. గత కొంతకాలంగా బాగ్దాద్‌లోని అమెరికా రాయబార కార్యాలయం, సైనిక స్థావరాలపై రాకెట్లు, డ్రోన్లతో దాడులు జరుగుతున్నాయి. తాజాగా జరిగిన దాడికి అషాబ్ అల్‌కహ్ఫ్ అనే ఇరాన్ మద్దతు ఉన్న గ్రూప్ బాధ్యత స్వీకరించింది. మరోవైపు, కతైబ్ హిజ్బుల్లా అనే మరో శక్తిమంతమైన గ్రూప్ కీలక ప్రకటన చేసింది. నివాస ప్రాంతాలపై అమెరికా దాడులు నిలిపివేస్తే, తాము ఐదు రోజుల పాటు దాడులు ఆపుతామని షరతు విధించింది. అమెరికా తన కేంద్రాల రక్షణకు సీ-రామ్ వంటి అత్యాధునిక గగనతల రక్షణ వ్యవస్థలను ఉపయోగిస్తోంది. వీటి ద్వారా చాలా డ్రోన్లను గాలిలోనే కూల్చివేస్తున్నప్పటికీ, కొన్ని లక్ష్యాలను ఛేదించడంతో ఆస్తి నష్టం జరుగుతోంది. ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ దాడులు మొదలైనప్పటి నుంచి ఇరాన్ అనుకూల గ్రూపులు ఇరాక్‌లోని అమెరికా ఆస్తులను లక్ష్యంగా చేసుకుంటున్నాయి. ఇరు దేశాల ఆధిపత్య పోరులో ఇరాక్ యుద్ధ క్షేత్రంగా మారుతోంది. అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద దాడులు జరగడంతో విమాన రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఈ భయానక పరిస్థితుల నేపథ్యంలో, తమ పౌరులు తక్షణమే ఇరాక్ విడిచి వెళ్లాలని అమెరికా ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది.



## తమిళనాడులో రామ్‌దాస్, శశికళ కలయికతో పోటీ..

**చెన్నై, మార్చి 21:** తమిళనాడు రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ఇద్దరు సీనియర్ నేతలు, పీఎంకే వ్యవస్థాపకుడు ఎస్. రామదాస్, జయలలిత నెచ్చెలి వీకే శశికళ అనూహ్యంగా చేతులు కలిపారు. ఏప్రిల్ 23న జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ కొత్త కూటమి రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. తమ సొంత పార్టీల్లోనే ఈ ఇద్దరు నేతలు ఒంటరి కావడం గమనార్హం. పీఎంకేలో తన కుమారుడు అన్బుమణి రామదాస్‌తో విభేదాల కారణంగా ఎస్.రామదాస్ పార్టీపై పట్టు కోల్పోయారు. మరోవైపు, అన్నాడీఎంకేను దక్కించుకోలేకపోయిన శశికళ ఏఐపీటీఎంఎంకే పేరుతో సొంత పార్టీని స్థాపించారు. ఈ నేపథ్యంలో తమ రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే వీరిద్దరూ ఏకమైనట్లు విశ్లేషకులు భావిస్తున్నారు. విల్లుపురం జిల్లా తైలాపురంలోని రామదాస్ నివాసంలో వీరిద్దరూ సమావేశమయ్యారు. సుదీర్ఘ చర్చల అనంతరం పొత్తు నిర్ణయాన్ని ప్రకటించారు. రాష్ట్రంలోని మొత్తం 234 నియోజకవర్గాల్లోనూ తమ కూటమి తరఫున అభ్యర్థులను నిలబెడతామని స్పష్టం చేశారు. తమ కూటమిలోకి మరిన్ని చిన్న పార్టీలను ఆహ్వానిస్తున్నట్లు రామదాస్ తెలిపారు. ఈ కొత్త కూటమి అధికార డీఎంకే, ప్రతిపక్ష అన్నాడీఎంకే ఓటు బ్యాంకులకు గండి కొట్టే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# భూటాన్‌లోనూ భారత్ యుపిఐ సేవలు!




**థింపు, మార్చి 21:** భారత యూనిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలు సరిహద్దులకు ఆవల కూడా విస్తరి స్తున్నాయి. పొరుగుదేశమైన భూటాన్‌తో సరిహద్దు చెల్లింపుల కోసం భారత్ చేసుకున్న ఒప్పందం ద్వారా ఇరు దేశాల మధ్య డబ్బు పంపడం మరింత చౌకగా, సులభంగా మారనుంది. పోస్టల్ నెట్‌వర్క్‌ను ఉపయోగించి ఈ నగదు బదిలీ ప్రక్రియను అమలు చేయనున్నారు. భారత పోస్టల్ శాఖ, భూటాన్ పోస్టల్ శాఖ మధ్య ఒక అవగాహన ఒప్పందం కుదిరింది. యూనివర్సల్ పోస్టల్ యూనియన్ (యూపీయూ) వారి పోస్‌ట్రాన్స్‌ఫర్ సిస్టమ్‌ను భారత్ యూపీఐతో అనుసంధానించడం ద్వారా ఈ సేవలను అందిస్తారు. ఈ చొరవతో ఇరు దేశాల పౌరులకు డిజిటల్ చెల్లింపు సేవలు మరింత అందుబాటులోకి వస్తాయని, ఆర్థిక సంబంధాలు బలపడతాయని అధికారిక ప్రకటనలో తెలిపారు. కేవలం నగదు బదిలీకే పరిమితం కాకుండా, పోస్టల్ కార్యకలాపాలు, టెక్నాలజీ అభివృద్ధి, శిక్షణ, లాజిస్టిక్స్, ఫిలాటెలీ (తపాలా బిళ్లల సేకరణ) వంటి రంగాల్లో సహకరించుకోవాలన్నారు.

22-3Pg6exHMNWJQE.qxd:22-3Pg6exHMNWJQE.qxd 1/1/02 6:47 AM Page 1



# అరసవల్లి క్షేత్రానికి మహర్దశ

- రూ.4 కోట్లతో పుష్కరిణి పునరుద్ధరణ
- శంకుస్థాపన చేసిన రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడు
- ప్రసాద్ స్కీమ్ ద్వారా రూ.58 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు
- కూటమి ప్రభుత్వంతోనే ఆధ్యాత్మిక వైభవం: కేంద్ర మంత్రి

**అరసవల్లి (శ్రీకాకుళం జిల్లా), మార్చి 21 ప్రభాతవార్త:** ప్రపంచ దేశాల నుంచి భక్తులు తరలివస్తున్న ప్రసిద్ధ అరసవల్లి క్షేత్రాన్ని కేంద్ర ప్రభుత్వ 'ప్రసాద్' పథకం ద్వారా రూ.58 కోట్లతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలోని ఇంద్రపుష్కరిణి ఆధునీకీకరణ పనులకు శనివారం ఘనంగా శంకుస్థాపన జరిగింది. కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఈ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. రూ.58 కోట్లతో మెగా మాస్టర్ ప్లాన్ ఈ సందర్భంగా కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ అరసవల్లి క్షేత్ర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మంత్రి అచ్చెన్నాయుడు కృషితో ఇప్పటికే పుష్కరిణి పనులకు రూ.4 కోట్లు మంజూరయ్యాయని, కేంద్ర ప్రభుత్వ ప్రసాద్ పథకం కింద మరో రూ.58 కోట్లతో అభివృద్ధి ప్రతిపాదనలు సిద్ధం చేశామని వెల్లడించారు. ఈ మెగా ప్రాజెక్టులో భాగంగా అత్యాధునిక వంటశాల,



భోజనశాల, భక్తుల కోసం వసతి గృహాలు, విశాలమైన రహదారులను నిర్మిస్తామన్నారు. ఈ పనులను రెండు దశల్లో చేపట్టి త్వరలోనే పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. అరసవల్లి రథసప్తమిని రాష్ట్ర పండుగగా ప్రకటించిన నాటి నుంచి భక్తుల తాకిడి గణనీయంగా పెరిగిందని, దేశవిదేశాల నుంచి పర్యాటకులు వస్తున్నారని మంత్రులు పేర్కొన్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో విశాలమైన రహదారులు, సెంటర్ లైటింగ్ పనులను ఇప్పటికే పూర్తి చేశామన్నారు. ఆధ్యాత్మిక కేంద్రాలను పర్యాటక హబ్‌లుగా మార్చడమే లక్ష్యమని, గత ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని వీడి కూటమి హయాంలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తామని స్పష్టం చేశారు.

**అమరవీరుల త్యాగాలకు చిహ్నం.. కార్గిల్ విక్టరీ పార్క్!**

కార్గిల్ యుద్ధంలో ప్రాణాల ర్పించిన జిల్లా ముద్దుబిడ్డ, అమరవీరుడు చింతాడ మోహనరావు సాహసాన్ని స్మరించుకునేలా ఈ పార్కును తీర్చిదిద్దడం గర్వకారణమని, వినోదం కోసం వైజాగ్ వెళ్లాల్సిన పని లేకుండా జిల్లా కేంద్రంలోనే అద్భుతమైన వసతులు కల్పించామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు. శనివారం ఏపీహెచ్‌బీ కాలనీలో రూ.2 కోట్ల వ్యయంతో సుడా ఆధ్వర్యంలో నిర్మించిన 'కార్గిల్ విక్టరీ పార్కు'ను ఆయన రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు పార్కులోని క్రీడా ప్రాంగణాలను పరిశీలించి, స్వయంగా బ్యాట్ పట్టి బాక్స్ క్రికెట్, పికిల్ బాల్ ఆడి సందడి చేశారు. యుద్ధంలో గాయపడిన హవిల్దార్ చిన్ని సింహాచలం, హవిల్దార్ టొంప నీలాచలం సహా ఆ పోరులో పాల్గొన్న జిల్లాకు చెందిన 58 మంది యోధుల చరిత్రను నేటి తరం తెలుసుకునేలా పార్కులో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం విశేషమని, జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీలు ఈ ప్రాజెక్టు కోసం ఎంతో కష్టపడ్డారని మంత్రి కొనియాడారు.కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ.. ఇది పూర్తిస్థాయిలో 'యూజర్ ఫ్రెండ్లీ' పార్కని, ఇందులో ఓపెన్ ఎయిర్ థియేటర్, ఎల్‌సీడీ ప్రొజెక్టర్ స్క్రీన్, సోలార్ దీపాలు, స్ప్రింక్లర్ వ్యవస్థను ఏర్పాటు చేశామని వివరించారు. పార్కులోకి ప్రవేశం ఉచితం కాగా, క్రీడా కోర్టులను వినియోగించుకునే వారి నుంచి వసూలు చేసే స్వల్ప ఛార్జీలతోనే పార్కు నిర్వహణ చేపడతామని ఆయన స్పష్టం చేశారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో అభివృద్ధికి ఈ పార్కు ఒక 'ట్రయల్ రన్' మాత్రమేనని, రాబోయే రోజుల్లో మరిన్ని భారీ అభివృద్ధి పనులు చేపడతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోరికాన రవికుమార్, ఇంజనీర్ సుగుణాకర్, ఇతర జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పశుసంవర్ధక రంగానికి భారీ ఊరట: మంత్రి అచ్చెన్నాయుడు

**సచివాలయం, మార్చి 21 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపే తం చేస్తూ పశుపోషకులు, చిన్న రైతులకు పెద్దఎత్తున ఊరటనిచ్చే నిర్ణయం తీసుకు న్నామని రాష్ట్ర వ్యవసాయ, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు తెలిపారు. పురపాలక పరిపాలన పట్టణా భివృద్ధి శాఖ జారీ చేసిన జీవో ప్రకారం రాష్ట్రంలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థల పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు/ మేకల పెంపకం కేంద్రాలు,పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్ చార్జీలు,డెవలప్‌మెంట్ చార్జీల నుండి పూర్తిగా మినహా యింపు మంజూరు చేయబడిందని తెలిపారు.అదేవిధంగా ఈ ఫారాలకు భవన అనుమతి/లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయితీలో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు వెల్లడించారు.ఈ నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు,చిన్న వ్యవ సాయ దారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గి వారి జీవనోపాధి మెరు గుపడుతుందని, మరింత మందికి స్వయం ఉపాధి,సంవృద్ధి లభిస్తుందని మంత్రి పేర్కొన్నారు.గత జూన్‌నెలలో జరిగిన సీఎం కాంక్లేవ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

# పారిశ్రామిక రంగంలో రాష్ట్రం ముందడుగు

- ఫలితాలను ఇస్తోన్న 21 నెలల కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు
- అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమకు శంకుస్థాపన
- కేంద్ర మంత్రులతో కలిసి ఈనెల 23న సీఎం చంద్రబాబు భూమిపూజ
- రూ.1,35,964 కోట్ల పెట్టుబడి, ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగావకాశాలు

**విజయవాడ, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిలో మరో చారిత్రాత్మక అడుగు పడుతోంది. ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా) సంస్థ 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థంతో రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పడానికి సిద్ధమైంది. దీనికి ఈనెల 23న అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో కేంద్ర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నారు. రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. 5,465 ఎకరాల్లో మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టు సాకారం కానుంది. మొదటి దశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థంతో ఉక్కు ఉత్పత్తి చేయనుంది.

**క్యాప్టివ్ పోర్టుతో మరో 6 వేల ఉద్యోగాలు**

స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా 50 మి.మె.ట సామర్థంతో అదనంగా 316 ఎకరాల్లో క్యాప్టివ్ పోర్టును కూడా ఏఎంఎన్ఎస్ ఇండియా ఏర్పాటు చేయనుంది. దీని కోసం ప్రత్యేకంగా రూ.11,198 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీంతో మరో 6,000 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏఎంఎన్ఎస్ ఇండియా ప్లాంట్ ఏర్పాటుతో విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిశ్రమల హబ్‌గా రూపుదిద్దుకోనుంది. గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా దేశంలో భారీగా పెరిగిన ఉక్కు మార్కెట్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఏఎంఎన్ఎస్ ఇండియాకు లభించనుంది.

**అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వ సహకారం**

ఈ ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. స్టీల్ ప్లాంట్‌ను ఎన్‌హెచ్16తో కలిపేలా 4 లేన్ రహదారి విస్తరణ పనులు చేపట్టింది. కనెక్టివిటీ పెంచడంతో పాటు పరిశ్రమకు అవసరమయ్యే నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు శరవేగంగా కల్పిస్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు..**

సోమవారం జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు హాజరు కానున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారు. అలాగే కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి. కుమారస్వామి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూప తిరాజు శ్రీనివాస వర్మ, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల అభి వృద్ధి శాఖ మంత్రి లోకేష్ ముఖ్యఅతిథులుగా పాల్గొంటారు. ఇంకా ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టి.జి. భరత్, ఎంపీ సి.ఎం. రమేష్ విశిష్ట అతిథులుగా హాజరవుతారు. ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ భూమి పూజలో పాల్గొంటారు. సోమవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి చంద్రబాబు అమరావతి నుంచి నేరుగా నక్కపల్లి మండలం రాజయ్యపేటకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. మధ్యాహ్నం 3.40 గంటలకు ఎక్స్‌పీరియన్స్ జోన్ సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ మోడల్‌ను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకం ఆవిష్కరిస్తారు. అలాగే అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు.

# చర్చనీయాంశంగా సిఆర్డిఏ కమీషనర్ ఆకస్మిక బదలీ

### కన్నబాబు స్థానంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ రామరాజు





**విజయవాడ, మార్చి21 ప్రభాతవార్త ప్రతినిధి:** సిఆర్డిఏ కమీషనర్ కూనపరెడ్డి కన్నబాబు ఆకస్మిక బదిలీ కావడం ప్రభుత్వ యంత్రాంగం లో చర్చనీయంశంగా మారింది. ఉగాది పర్వది నం రోజున ఢిల్లీలో సీఆర్డీఏ పనివిధానానికి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి అవార్డును ఆయన స్వీకరించారు. 24గంటల తిరుగక ముందే ఆయనకు బదిలీ వేటుపడటం రాజకీయంగాను చర్చనీయంశంగా మారింది.సీఆర్డీఏ కమిషనర్‌గా 2025 జనవరిలో బాధ్యతలు చేపట్టిన కన్న బాబును 14 నెలల్లోనే ప్రభుత్వం ఆకస్మికంగా బదిలీ చేసింది. కన్నబాబు కీలకమైన సమయం లో సీఆర్డీఏ కమిషనర్‌గా వ్యవహరించారు. రాజ ధానికి నిధుల సమీకరణ, నిర్మాణ పనుల్ని పూర్తి స్థాయిలో పట్టాలెక్కించడంలో క్రియాశీలంగా వ్యవహరించారు. ఏ రోజు ఎంత పని జరిగిందో మదింపు చేసేందుకు ప్రత్యేక ప్లాట్‌ఫామ్ రూపకల్పన, గుత్తేదారులకు బిల్లుల చెల్లింపునకు సంబంధించి పలు సంస్కరణలు తీసుకొచ్చారు. కన్నబాబు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన తొలినాళ్లలో రాజధాని గ్రామాల రైతులు చాలా సమస్యల్ని సీఆర్డీఏ దృష్టికి తెచ్చారు. వాటిని సానుకూలంగా పరిష్కరించడంలో కన్నబాబు విఫలమయ్యారన్న అసంతృప్తి ప్రభుత్వంలో ఉంది. ఆ తర్వాత కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్‌లతో ప్రభుత్వం కమిటీని నియమించడం, సమస్యల పరిష్కారానికి ఆ కమిటీ చొరవ తీసుకోవడంతో రైతుల్లో అసం తృప్తి చాలా వరకు తగ్గింది.కన్నబాబు తయారు చేయించిన సాఫ్ట్‌వేర్ వల్ల కాంట్రాక్టర్లు బిల్లుల చెల్లింపులో జాప్యం జరుగుతోందన్న అభిప్రా యం ఉంది. ఈ విషయంలో కాంట్రాక్టర్లుకు సీఎంవోకు ఫిర్యాదు చేసినట్టు సమాచారం. వైఎ స్సార్సీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రుల వద్ద, కీలక స్థానాల్లోనూ పనిచేసిన కొందరు అధికా రులు, ఆ తర్వాత సీఆర్డీఏ చేరారు. వారిని మార్చాల్సిందిగా కన్నబాబుకు ప్రభుత్వం నుంచి సంకేతాలు వచ్చినా ఆయన చర్యలు తీసుకోలే దని అభియోగాలున్నాయి.కన్నబాబును ఆకస్మి కంగా బదిలీ చేయడానికి ఇవన్నీ కారణాలని అధికార వర్గాల సమాచారం. ఆయన స్థానంలో పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌గా ఉన్న విజయ రామరాజును ప్రభుత్వం నియమించింది.పోతే సీఎస్‌గా పని చేసిన మాజీ ఐఏఎస్ అధికారి, మాజీ సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితుడు కేఎస్ జవహర్ రెడ్డిని ఇటీవల కొందరు ఐఏఎస్ అధికారులు తాడేపల్లిలోని ఒక ఆపార్ట్‌మెంట్‌లో రహస్యంగా కలసి మంతనాలు జరపడాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోంది. ఎపి ఎయి డ్స్ నియంత్రణ సొసైటీ ఎండీ నీలకంఠారెడ్డిపై బదిలీ వేటు వేసింది. ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండా సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశించింది. జవహర్‌రెడ్డిని కలిసిన ఐఏఎస్ అధికారుల్లో కొందరిని సీఎం కార్యాలయానికి పిలిచి వివరణ కోరింది. ఆ ఐఏఎస్‌ల వ్యవహారంపై సీఎం చంద్రబాబు తీవ్ర ఆగ్రహంతో ఉన్నట్టు తెలిసింది. వారిపై ఏదో ఒక రూపంలో ప్రభుత్వం చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం. కన్నబాబు గతంలో ఒక సారి బది లీ చేసిన ప్రభుత్వం కొన్ని గంటల వ్యవధిలోనే ఆ నిర్ణయాన్ని మార్చుకుంది. ఇకఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యంత్రాంగంలో పలు కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మార్పుల్లో భాగంగా, అత్యంత కీలకమైన రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) నూతన కమిషనర్‌గా విజయరామరాజును నియమిం చింది. ఇప్పటివరకు సీఆర్‌డీఏ కమిషనర్‌గా ఉన్న కన్నబాబును పౌర సరఫరాల శాఖ కమిష నర్‌గా బదిలీ చేశారు. ఆయన స్థానంలో విజయ రామరాజుకు ఈ బాధ్యతలు అప్పగించారు.

## కళ్యాణదుర్గం మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి మృతి పార్టీకి తీరని లోటు: చంద్రబాబు

**తిరుపతి, మార్చి21 ప్రభాతవార్త ప్రతినిధి:** అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం మాజీ ఎమ్మెల్యే హనుమంతరాయ చౌదరి మృతి పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సీనియర్ నేత అయిన హనుమంతరాయ చౌదరి మరణం ఆ జిల్లాలో పార్టీకి లోటు అని వ్యాఖ్యానించారు. ఆయన మృతి కళ్యాణదుర్గం నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని అన్నారు. వార్డు సభ్యుడిగా ప్రజాసేవను ప్రారంభించి, సర్పంచ్‌గా, మార్క్‌ఫెడ్ జిల్లా చైర్మన్‌గా, 10 ఏళ్ల పాటు అనంతపురం జిల్లా టీడీపీ అధ్యక్షుడిగా పని చేశారని సిఎం గుర్తు చేసుకున్నారు. 2014లో ఎమ్మెల్యేగా గెలిచి కళ్యాణదుర్గం నియోజకవర్గాన్ని అభివృద్ధి బాటలో నడిపారని కొనియాడారు. పార్టీ బలోపేతానికి హనుమంతరాయ ఎనలేని సేవలు అందించారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని చంద్రబాబు తన పర్యటనలో తెలిపారు.

**టిడిపి నేతల ఘన నివాళి....**

తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి మృతి పట్ల టీడీపీ నేతలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నేతలు ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీఈడబ్ల్యూఐడీసీ ఛైర్మన్ ఎస్.రాజశేఖర్ ,టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి, నాలెడ్జ్ సంఎటర్ ఛైర్మన్ గురజాల మాల్యాద్రి, శ్రీశైలం ఆలయ కమిటీ సభ్యులు ఏవీ రమణ, మీడియా కోఆర్డినేటర్ దారపనేని నరేంద్రబాబు, నేతలు పర్చూరి కృష్ణ తదితరకు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నేతలు ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. పార్టీ అభివృద్ధికి ప్రజల సేవకు ఆయన చేసిన కృషిని గుర్తు చేసుకున్నారు. ఉన్నం హనుమంతరాయ చౌదరి మరణం పార్టీకి తీరని లోటని, వారి క్రమశిక్షణ, సేవా దృక్పథం కార్యకర్తలకు ఆదర్శమని కొనియాడారు. వారి కుటుంబ సభ్యులకు తమ గాఢ సానుభూతిని తెలియజేశారు.

# ఇంధన పునరుత్పాదక రంగంలో కీలకం కానున్న రాష్ట్రం

**విజయవాడ, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఇంధన పునరుత్పాదక రంగంలో జాతీయ స్థాయిలో ఏపీ కీలకం కానునన్నది. 88 వేల మెగావాట్ల పునరుత్పా దక విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుతో దక్షి ణాది రాష్ట్రాల్లో అత్యంత పెద్ద ప్రత్యామ్నయ ఇంధన కేంద్రంగా మారే దిశలో కార్యచరణ చేపట్టింది..రాష్ట్రంలో రూ.40 వేల కోట్లతో పీజీసీఐఎల్ నెట్‌వర్క్‌ను విస్తృతం చేయనుంది. 53 వేల 400 మెగావాట్ల విద్యుత్ ట్రాన్స్‌మిషన్ లైన్ల అభివృద్ధికి సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ (సీఈఆర్‌సీ) ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో విద్యుత్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను కేంద్ర విద్యుత్ సంస్థ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా విస్తరించనుంది. ఇందుకు సంస్థ రూ. 40 వేల కోట్లు ఖర్చు చేయనుం ది. మొత్తం లక్షా 41 వేల 700 మెగావాట్ల సౌర, పవ న విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు దక్షిణాది రాష్ట్రాలు అంగీకరిస్తే అందులో 88 వేల మెగావాట్ల ప్రాజెక్టులు ఏపీలోనే ఏర్పాటు కానున్నాయి. ఇందుకు అనుగుణం గా 38 వేల 400 మెగావాట్ల విద్యుత్ సరఫరా నెట్‌వర్క్‌ను పీజీసీఐఎల్ రాష్ట్రంలో అభివృద్ధి చేయనుం ది. మరో 15 వేల మెగావాట్ల నెట్‌వర్క్ విస్తరణకు



ప్రతిపాదనలు రూపొందించింది. కర్ణాటకలో 31 వేల 240 మెగావాట్లు, తెలంగాణలో 13 వేల మెగావాట్లు, తమిళనాడులో 8 వేల 380 మెగావాట్ల సరఫరా నెట్‌వర్క్‌ను మాత్రమే కేంద్రం ఏర్పాటు చేస్తోంది. 2026-27లో జీఈసీ3 పథకం కింద రాష్ట్రంలో 11 వేల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను సరఫరా చేసేందుకు అనువైన నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. దీని కోసం 7 వేల 872 సర్క్యూట్ కిలోమీటర్ల లైన్లను పీజీసీఐఎల్ ఏర్పాటు చేయనుంది. సరఫరా లైన్లతో పాటు కర్నూలు న్యూ, కర్నూలు3, కర్నూలు4, అనంతపురం ఎన్ పీ.కుంట, అనంతపురం3, కృష్ణగిరిలో 765/400 పూలింగ్ సబ్ స్టేషన్లను పీజీసీఐఎల్ నిర్మించనుంది. ఒక్కొక్క సబ్‌స్టేషన్‌కు సగటున 12 వందల కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేసింది. పీజీసీఐఎల్ నెట్‌వర్క్ మొత్తం రాయలసీమలో ఏర్పాటు కానుంది. మెజారిటీ విద్యుత్ ప్రాజెక్టులు అక్కడ ఏర్పాటు కానుండటంతో. అక్కడి నుంచి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసేందుకు నెట్‌వర్క్ అవసరం కానుంది. రానున్న నాలుగేళ్లలో 53 వేల 400 మెగావాట్ల విద్యుత్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనుంది. 2030 నాటికి దేశంలో 5 లక్షల మెగావాట్ల పునరుత్పాదక విద్యుత్‌ను ఉత్పత్తి చేయాలన్నది కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. రాష్ట్రంలో విద్యుత్ ఎగుమతి విధానం కింద సుమారు 88 వేల మెగావాట్ల సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ విద్యుత్ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. వాటి ద్వారా ఉత్పత్తి చేసే విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు అంతర్ రాష్ట్ర ట్రాన్స్‌మిషన్ సిస్టంను అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇందులో భాగం గా గ్రీన్ ఎనర్జీ కారిడార్3లో విద్యుత్ ట్రాన్స్‌మిషన్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్ర విద్యుత్ నియంత్రణ మండలి అనుమతి ఇచ్చింది. పునరుత్పా దక విద్యుత్ ఉత్పత్తి ప్రాజెక్టుల ఏర్పాటుకు అనుమతు లు ఇచ్చిన ఏపీతోపాటు రాజస్థాన్, గుజరాత్, కర్ణాటక, తెలంగాణ, మహారాష్ట్రల్లోనూ సరఫరా నెట్‌వర్క్‌ను విస్తరించాలని కేంద్రం నిర్ణయించింది. దక్షి ణాది రాష్ట్రా ల్లో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తిలో ఏపీ కీలకమని కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల మంత్రిత్వశాఖ గుర్తించింది.విశాఖలో గూగుల్, రిలయన్స్ ఒక్కొక్కటి వెయ్యి మెగావాట్ల సామర్థం ఉన్న డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాయి. వాటికి అవసరమైన విద్యుత్ సరఫరా చేసేందుకు ఇప్పట్నుంచే నెట్‌వర్క్ విస్తరణపై కేంద్రం దృష్టి పెట్టింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థకు సమాంతరంగా ట్రాన్స్‌కో రూ. 21 వేల 500 కోట్లతో సరఫరా నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనుంది. దీని ద్వారా 10 వేల మెగావాట్ల విద్యుత్ సరఫరా నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది. దీని కోసం సుమారు 2 వేల సర్క్యూట్ కిలోమీటర్ల విద్యుత్ లైన్లు, 400 కె.వి.సబ్‌స్టేషన్లను ట్రాన్స్‌కో ఏర్పాటు చేయనుంది.

# ఘనంగా రంజాన్ వేడుకలు

**విజయవాడ, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్ర వ్యాప్తంగా ముస్లింలు రంజాన్ (ఈద్‌ఉల్‌ఫితర్) పండుగను అత్యంత వైభవంగా జరుపుకుంటున్నారు. నెల రోజులపాటు పాటించిన ఉపవాస దీక్షల అనంతరం, అన్ని ప్రాంతాల్లోనూ ఈద్ సందడి నెలకొంది.ఏపీ రాజధాని ప్రాంతంలోని చారిత్రాత్మక మసీదులు,ఈద్ ఘూల వద్ద వేలాదిమంది ముస్లింలు ఒకచోట చేరి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలు త్వరగా ముగిసి, శాంతి సౌభ్రాతృత్వాలు నెలకొనాలని ఈ సందర్భంగా వారు ప్రత్యేకంగా దువా చేశారు.విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఏర్పాటు చేసిన ఈద్గా వద్ద భారీ సంఖ్యలో ముస్లింలు ప్రార్థనల్లో పాల్గొన్నారు. పరస్పరం ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ తెలుపుకుంటూ పండుగ శుభాకాంక్షలు మార్పిడి చేసుకున్నారు. ఈ పండుగ వేళ మత సామరస్యం వెల్లివిరిసింది. ప్రభుత్వాలు, స్థానిక యంత్రాంగం ముస్లిం సోదరసోదరీల కోసం అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేశాయి. విశాఖ, గుంటూరు, కాకినాడ, ఏలూరు, కడప, అనంతపురం, కర్నూల్లో రంజాన్ పవిత్ర ప్రార్దనలకు నిర్దేశించిన ఈద్‌గాల వద్ద ముస్లిము సోదరులు దువా నిర్వహించారు.

## పాల నాణ్యతను కాపాడేందుకు ఉత్పత్తి, విక్రయదారులకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

### పశుసంవర్థక శాఖ సంచాలకులు డాక్టర్ టి. దామోదర్ నాయుడు

**సచివాలయం, మార్చి 21 ప్రభాతవార్త:** రాష్ట్రంలో పాల కల్తీని అరికట్టడానికి,వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించడానికి పాల వ్యాపారంలో ఉన్న వారందరూ తప్పనిసరిగా ఎఫ్ఎస్ఎస్ఐ (ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథార్టి ఆఫ్ ఇండియా) గుర్తింపు పొందాలని పశుసంవర్ధక శాఖ సంచాలకులు డాక్టర్ టి.దామోదర్ నాయుడు తెలిపారు.పాల సహకార సంఘాల సభ్యులు కాని పాల ఉత్పత్తిదారులు,విక్రయదారులు ఎవరైనా సరే,వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే ముందు ఎఫ్ఎస్ఎస్ఐ లైసెన్స్ లేదా రిజిస్ట్రేషన్ కలిగి ఉండడం తప్పనిసరి అన్నారు. ఇటీవల వెలుగు చూసిన పాల కల్తీ ఘటనల దృష్ట్యా పాలు, పాల ఉత్పత్తుల సేకరణ, నిల్వ మరియు విక్రయాల్లో అత్యున్నత భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుందన్నారు. పశుసంవర్ధక శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, విక్రయదారుల వద్ద సరైన పత్రాలు ఉన్నాయా లేదా అని తనిఖీ చేస్తారన్నారు. నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకునేలా అధికారులను ఆదేశించామన్నారు. పాలు, పాల ఉత్పత్తుల విక్రయాల్లో ఆహార భద్రతా ప్రమాణాలు పాటించని పక్షంలో, తక్షణమే సమీపంలోని ఫుడ్ సేఫ్టీ అధికారి ఫిర్యాదు చేయాలని దామోదర్ నాయుడు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఎయిమ్స్‌లో లైంగిక వేధింపులు

**విజయవాడ, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** మంగళగిరి ఎయిమ్స్ ఆస్పత్రిలో లైంగిక వేధింపులు జరిగాయన్న ఆరోపణలు కలకలం రేపాయి. సెక్యూరిటీ సూపర్‌వైజర్ వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసిందొక మహిళ. ఎయిమ్స్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న మహిళకుసెక్యూరిటీ సూపర్ వైజర్ వేధింపులు గురి చేస్తున్నారని ఆరోపణ. వమహిళా సెక్యూరిటీ గార్డుకు రాత్రిపూట సూపర్‌వైజర్ ఫోన్ చేసి వేధిస్తున్నట్లు అభియోగం. ఆ మేరకు పోలీసులకు మహిళ ఫిర్యాదు చేసింది. దాంతో లైంగిక వేధింపుల కేసు నమోదు చేసిన మంగళగిరి పోలీసులు సెక్యూరిటీ సూపర్‌వైజర్ మోహనాచారిని అరెస్టు చేసారు. ఈ కేసుపూర్తి వివరాలు వెల్లడి కావాల్సి ఉంది.

## జిఏడి రిపోర్ట్ చేయాలని ఎపిఎస్ఎసిఎస్ ఎండికి ప్రభుత్వం ఆదేశం

**విజయవాడ, మార్చి21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కీలక ఐఏఎస్ అధికారి బదిలీ అయ్యారు. రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (ఏపీఎస్ ఏసీఎస్) మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న 2017 బ్యాచ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ కె. నీలకంఠ రెడ్డిని ప్రభుత్వం బదిలీ చేసింది. ఆయన సేవలను వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నుంచి ఉపసంహరించుకుంటున్నట్లు ప్రకటించింది. తదుపరి పోస్టింగ్ ఇచ్చేవరకు సాధారణ పరిపాలన శాఖలో (జీఏడీ) రిపోర్ట్ చేయాలని ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్ నిన్న ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమల్లోకి వస్తాయని అందులో స్పష్టం చేశారు. ప్రస్తుతం ఖాళీ అయిన ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ మేనేజింగ్ డైరెక్టర్ పోస్టుకు అవసరమైన ఇన్‌ఛార్జ్ ఏర్పాట్లు చేయాలని వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శిని ప్రభుత్వం ఆదేశించింది.

## దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ నియామకంపై కీలక మలుపు

### జీవో వెనక్కి తీసుకున్న ప్రభుత్వం

**విజయవాడ, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ దేవాదాయ శాఖ ట్రిబ్యునల్ చైర్మన్ నియామకంపై కీలక మలుపు చోటుచేసుకుంది. రిటైర్డ్ జిల్లా జడ్జిని చైర్మన్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం, కొద్ది గంటల వ్యవధిలోనే ఆ జీవోను వెనక్కి తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. ఈ అనూహ్య పరిణామంతో నియామక ప్రక్రియపై అనిశ్చితి నెలకొంది. వివరాల్లోకి వెళితే.. రిటైర్డ్ జిల్లా జడ్జి ఎన్ నాగరాజును ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా నియమిస్తూ నిన్న దేవాదాయ శాఖ ఎక్స్‌అఫిషియో సెక్రటరీ డాక్టర్ హరి జవహర్‌లాల్ జీవో నంబర్ 447ను జారీ చేశారు. ఆయన ఈ పదవిలో మూడేళ్లపాటు లేదా 65 ఏళ్ల వయసు వచ్చే వరకు కొనసాగుతారని ఆ ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. అయితే, జీవోను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిన కొద్దిసేపటికే దాన్ని తొలగించారు. ఈ పరిణామంతో అధికార వర్గాల్లో గందరగోళం నెలకొంది.

## వైసీపీ నాయకులకు అధిక మత్తు వదలలేదు: జూలకంటి

**విజయవాడ మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఈవీఎం ధ్వంసం, జంట హత్యల కేసులో 99 రోజులు జైలులో చిప్పకూడు తిన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి బుద్ధి మారలేదని చింత చచ్చిన పులుపు చావనట్లు పిన్నెల్లి తీరు ఉంది. రాష్ట్రంలో వైసీపీ పార్టీ ఇప్పటికీ అధికారంలో ఉందనే భ్రమలో ఆ నేతలు అధికారులను బెదిరిస్తున్నారు. అధికారులను పని చేయకుండా వైసీపీ నాయకులు కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అధికారం కోల్పోయి రెండు సంవత్సరాలు అయినా, తమ నాయకుడు జగన్ రెడ్డి ఇంకా ముఖ్యమంత్రి అనే భ్రమలోనే వైసీపీ నేతలు ఉన్నారు. అధికారులకు వార్నింగ్‌లు ఇవ్వడం, బెదిరింపులు చేయడం వైసీపీ నాయకులు అధికార పిచ్చిక పరాకాష్ట. జైలు నుంచి బయటకు వచ్చినా పిన్నెల్లి మనసు ఇంకా జైలునే కోరుకుంటుంది. రాష్ట్రంలో విధ్వంసానికి తావులేదు. కూటమి ప్రభుత్వం శాంతి భద్రతలకు ప్రాధాన్యత ఇస్తోంది. మత్తు తగ్గేదాకా ఇలాంటి బెదిరింపులు భ్రమలు కొనసాగిస్తూ అధికారులను బెదిరిస్తే, చట్టం తన కర్తవ్యం నిర్వహిస్తుంది. వైసీపీ నాయకులు ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకోవాలి. వైసీపీ సైకో బ్యాచ్ బెదిరింపులకు అధికారులు ఎవరు భయపడకండి. చట్టం ప్రకారం ప్రతి ఒక్కరూ సమానమే. ప్రభుత్వం అధికారులకు పూర్తి రక్షణ కల్పిస్తుంది.

# పెరిగిన చికెన్ ధరలు

**విజయవాడ,మార్చి22 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో చికెన్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. నిన్నటి వరకు కిలో రూ.330గా ఉన్న చికెన్ ధర నేడు రూ.400కు చేరింది. మాల్స్‌లో ప్యాకేజెడ్ చికెన్ ధరలు అధికంగానే ఉన్నాయి, విజయవాడలో స్కిన్‌లెస్ చికెన్ కిలో రూ.380-రూ.400 మధ్య అమ్ముడవుతుండగా, విశాఖలో రూ.350-400 వరకు విక్రయిస్తున్నారు. నాటు కోడి ధర కిలో రూ.800ల వరకు ఉంది. చికెన్ రేట్లు ఇలాగే పెరిగితే, త్వరలోనే అర కిలో మటన్ ధరతో ఇది పోటీ పడటం ఖాయమని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న ఎండల తీవ్రత కారణంగా పౌల్ట్రీ ఫారాల్లో కోళ్లు పెద్ద సంఖ్యలో మత్యువాత పడుతున్నాయి. రావాల్సిన సప్లై గణనీయంగా తగ్గింది. శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో డిమాండ్ రెట్టింపయింది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగాయి. అలాగే కోళ్లకు వేసే దానా ధరలు కూడా పెరగడంతో పౌల్ట్రీ రైతులు రేట్లు పెంచక తప్పడం లేదు.

## రంజాన్ వేడుకలో పాల్గొన్న శాసనసభ్యులు వంశీకృష్ణ శ్రీనివాస్

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



ముస్లింల కుటుంబ సభ్యులకు పరమ పవిత్రమైన రంజాన్ వేడుకలో దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పెర్రీ వీధి, కోట వీధి,వన్ టౌన్‌లో రంజాన్ వేడుకలో పాల్గొన్నారు. నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలను ముగించి పండుగను ఆనందోత్సవాలతో జరుపుకున్నారు. ఈ ముబారక్ అంటూ పలువురు ముస్లిం సోదరులను వంశీ ఆలింగనం చేసుకున్నారు. ముస్లిం సోదరులు సంప్రదాయ నూతన దుస్తులు ధరించి, ఈద్ ముబారక్ అంటూ పరస్పరం ఆ లింగనం చేసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ సాదిక్, హీరా, గఫూర్ (లడ్డుబాయ్)హనీఫ్, దానేశ్, ప్రణీత్, రాజు, కోటమ్మ పాల్గొన్నారు.

## గాజువాకలో ఉరుములు..మెరుపులతో కూడిన భారీ వర్షం

**గాజువాక, మార్చి 20, ప్రభాతవార్త**



గాజువాకలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయింది. శుక్రవారం ఉదయం నుంచి భానుడు తన ప్రతాపాన్ని చూపించగా, సాయంత్రం అయ్యేసరికి ఆకాశం మేఘావృతమై భారీ వర్షం కురిసింది. గాలులు, ఉరుములు,మెరుపులతో కూడిన ఈ అకాల వర్షం స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. ముఖ్యంగా గాజువాక, శ్రీనగర్, కూర్మన్నపాలెం, శీలానగర్, ఆటోనగర్ పరిసర ప్రాంతాల్లో వర్షం తీవ్రత ఎక్కువగా ఉంది. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతో ఎండ వేడి నుంచి ఉపశమనం లభించినప్పటికీ, భారీ ఉరుముల శబ్దాలకు జనం కాస్త ఆందోళనకు గురయ్యారు. రహదారులపైకి నీరు చేరడంతో వాహనదారులు కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త

## నర్సీపట్నంలో వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం

- పాల్గొన్న స్పీకర్ చింతకాయల దంపతులు

**నర్సీపట్నం, ప్రభాతవార్త**



స్థానిక కాపువీధిలోని శ్రీశ్రీశ్రీ సీతారామాంజనేయ స్వామి వారి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి పద్మావతి గారు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వద్దకు చేరుకున్న స్పీకర్ దంపతులకు ఆలయ కమిటీ సభ్యులు,వేదపండితులు సన్నాయి మేళం పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో జరిగిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, మహా పూర్ణాహుతి కార్యక్రమాల్లో వారు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు స్పీకర్ దంపతులకు ఆశీర్వచనాలు అందజేయగా, ఆలయ కమిటీ సభ్యులు స్వామి వారి చిత్రపటాన్ని బహుకరించి వారిని ఘనంగా సత్కరించారు. నర్సీపట్నం శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీమాన్ నేతేటి శరత్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో ఈ శాస్త్రోక్త కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో, కొల్లానా పరదేశి నాయుడు, గొలుసు నరసింహమూర్తి, బలిజి బుజ్జి, దాడి శ్రీను, పెదరెడ్ల నాగేశ్వరావు, గోలజానా రాజు పాల్గొన్నారు.

## 25న ఆంధ్రవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

- హాజరవుతున్న రాష్ట్ర గవర్నర్, చాన్సలర్ డాక్టర్ ఎస్.అబ్దుల్ నజీర్
- ముఖ్య అతిథిగా బ్యాంక్ అఫ్ అమెరికా వైస్ చైర్మన్ డాక్టర్ పూర్ణ చంద్రరావు సగ్గుర్తి
- స్నాతకోత్సవంలో పాల్గొంటున్న విద్యశాఖ మంత్ర నారా లోకేష్

**ఆంధ్రవిశ్వవిద్యాలయం, మార్చి 21, ప్రభాతవార్త**

మిగతా 8..లో



## శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం సింహాచలం

- భైరవస్వామి ఆలయ అభివృద్ధికి ప్రాధాన్యం
- భక్తుల సౌకర్యాలే ముఖ్యం: ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

**సింహాచలం, 21 మార్చి, ప్రభాతవార్త**



సింహాచలం దేవస్థానం అనుబంధ ఆలయమైన భైరవస్వామి ఆలయాన్ని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనతో పాటు ఆలయ కార్యనిర్వహణ అధికారి జె. వెంకట్రావు, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఐ. రాము, జీవీఎంసీ మధురవాడ జోనల్ కమిషనర్ పాల్గొన్నారు. ఆలయ పరిసరాలను పరిశీలించిన అనంతరం ఎమ్మెల్యే గంటా అధికారులతో సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఆలయానికి వెళ్లే కిలోమీటరు మేర రోడ్డు పూర్తిగా రాళ్లు తేలి భక్తులకు నడక సాగించడం కష్టతరంగా ఉంది. అటవీ శాఖ భూమి అయినప్పటికీ, భక్తుల సౌకర్యం కోసం ఈ రోడ్డును తక్షణమే అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు.

మిగతా 8..లో

## ముస్లిం సోదరులు రంజాన్ సంబరాలు

- భక్తిశ్రద్ధలతో నమాజ్ వేడుకల్లో హిందూ ముస్లింలు

**విశాఖపట్నం, మార్చి 21, ప్రభాతవార్త**



రంజాన్ (ఈద్‌ఉల్‌ఫితర్) వేడుకలు శనివారం అత్యంత ఘనంగా ముస్లిం సోదరులు నిర్వహించారు. పవిత్ర మాసంలో నెల రోజు లపాటు కఠిన ఉపవాస దీక్షలు ముగించుకుని, శుక్రవారం నెలవంక దర్శనంతో ముస్లిం సోదరులు పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ప్రముఖ మసీదులు, ఈద్గాల వద్ద ముస్లింలు వేల సంఖ్యలో చేరి సామూహిక నమాజ్ నిర్వహించారు. శనివారం తెల్లవారుజాము నుంచే కొత్త దుస్తులు ధరించి, అల్లాహ్ నామస్మరణతో ప్రార్థనా స్థలాలకు చేరుకోవడంతో పండుగ వాతావరణం నెలకొంది. మసీదుల వద్ద చిన్నపిల్లలు ఆప్యాయంగా ఆలింగనం చేసుకుంటూ ఖిఈద్ ముబారక్ఖి చెప్పుకుంటున్న దృశ్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. చిన్నాపెద్దా పరస్పర ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ముస్లింల ప్రార్థనలతో మసీదులు కళకళలాడాయి. ముస్లింల గృహాల వద్ద సందడి నెలకొంది. విశాఖలో కన్నుల పండువగా రంజాన్ వేడుకలు.విశాఖ నగరంలో రంజాన్ వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మసీదులను రంగురంగల విద్యుద్దీపాలతో అలంకరించారు.

మిగతా 8..లో

## పెద ఉప్పరగుడెంలో వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ..

- వేములపూడి పంచాయతీ అభివృద్ధికి రూ. 4 కోట్లు: స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**అనకాపల్లి, ప్రభాతవార్త**



అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం వేములపూడి పంచాయతీ పరిధిలోని పెద ఉప్పరగుడెం గ్రామంలో భగీరథ వంశీకుల ఆధ్వర్యంలో శ్రీ సీతారాములు, వినాయకుడు మరియు లక్ష్మీదేవి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు విచ్చేసి, స్వామివారికి తొలి పూజలు నిర్వహించారు. అంతకుముందు గ్రామానికి చేరుకున్న స్పీకర్‌కు గ్రామస్థులు, మహిళలు మేళతాళాలు, మంగళ హారతులతో ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపిస్తూ ఆలయం వద్దకు తోడ్కొని వెళ్లారు. పూజా కార్యక్రమాల అనంతరం గ్రామ పెద్దలు స్పీకర్‌ను ఘనంగా సత్కరించారు.



మిగతా 8..లో

### బలహీనతలను బలంగా మార్చుతూ

# గ్లోబల్ డెస్టినేషన్‌గా ఉత్తరాంధ్ర

**విశాఖపట్నం మార్చి 21 ప్రభాతవార్త**

విజనరీ లీడర్ చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ తన బలాన్ని ప్రపంచానికి చూపిస్తోందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. శనివారం విశాఖపట్నం నోవాటెల్ హోటల్‌లో సి.ఐ.ఐ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర ప్రదేశ్ కాన్ఫరెన్స్ కార్యక్రమంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్థిరత్వం, పోటీతత్వం, భవిష్యత్ కు సిద్ధంగా ఆంధ్రపదేశ్ అనే అంశంపై జరిగిన కాన్ఫరెన్స్‌లో తొలుతగా పలువురు వక్తలు తమ అభిప్రాయాన్ని సభకు తెలియపరిచారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ.. ఇటీవల పలు ప్రాంతాల్లో సీఐఐ సమ్మిట్ లలో వరుసగా భాగస్వామ్యం అవుతుండటం ఆనందంగా ఉందని అన్నారు. స్వర్ణాంధ్ర ప్రదేశ్ గురించి మాట్లాడే ముందు.. అందుకు నాయకత్వ బాధ్యత తీసుకున్న చంద్రబాబు నాయుడు విజన్ ను ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు. తొలిసారిగా 1995 లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న సమయం నాడే తన నాయకత్వాన్ని పరిచయం చేస్తూ దేశాన్ని అబ్బురపరిచారని అన్నారు. అప్పులతో

మిగతా 8..లో



- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు
- సీఐఐ స్వర్ణాంధ్ర కాన్ఫరెన్స్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి
- స్వర్ణాంధ్ర 2057కు అన్ని అనుకూల పరిస్థితులు.
- యువ రక్తంతో నేటి నాయకత్వం..
- అభివృద్ధి వికేంద్రీకరణ ద్వారా రాష్ట్రం మొత్తం అభివృద్ధి
- ఒకప్పుడు ఉత్తరాంధ్ర వేరే.. ఇప్పుడు వేరే..




## విశాఖలో గ్యాస్ గండం..

- బ్లాక్‌లో విక్రయాల జోరు!

**గాజువాక, మార్చి 21, ప్రభాతవార్త**

విశాఖ జిల్లాలో గృహ వినియోగ గ్యాస్ (ఎల్పీజీ) కొరత సామాన్యులను వేధిస్తోంది. రీఫిల్లింగ్ కోసం బుక్ చేసుకున్న వేలాది మంది వినియోగదారులు సిలిండర్ల కోసం వారాల తరబడి నిరీక్షించాల్సి వస్తోంది. ఇదే అదనుగా అక్రమార్కులు రంగ ప్రవేశం చేసి, డొమెస్టిక్ సిలిండర్లను బ్లాక్ మార్కెట్లో భారీ ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.లక్ష దాటిన పెండింగ్ రీఫిల్లులు..జిల్లాలో మొత్తం 62 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా, దాదాపు 8.95 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. మార్చి 20 నాటి గణాంకాల ప్రకారం.. జిల్లా వ్యాప్తంగా 1.16 లక్షల సిలిండర్లు పెండింగ్‌లో ఉండటం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పదిహేను రోజులు గడిచినా సిలిండర్ అందకపోవడంతో సామాన్య గృహిణులు వంట గ్యాస్ కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిలిండర్ ధర రూ.2,500 పైమాటే.. కొరతను ఆసరాగా చేసుకుని కొందరు అక్రమ విక్రయదారులు గృహ అవసరాలకు వాడాల్సిన సిలిండర్లను చిరు వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. బహిరంగ మార్కెట్లో ఒక్కో సిలిండర్ రూ. 2,000 నుండి రూ. 2,500 వరకు పలుకుతున్నట్లు సమాచారం. గృహ వినియోగ గ్యాస్ వాణిజ్య అవసరాలకు మళ్లుతుండటంతోనే ఈ పరిస్థితి తలెత్తిందనే విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారుల పర్యవేక్షణ వినియోగదారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అప్రమత్తమైంది. హెచ్‌పీసీఎల్,ఐఓసీ బాటిలింగ్ యూనిట్ల వద్ద సరఫరా ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రత్యేక పర్యవేక్షణ అధికారులను నియమించింది. అక్రమ విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖను ఆదేశించింది.



## అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట..

- మెట్టపాలెంలో నూతన పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, ప్రభాతవార్త**

నర్సీపట్నం మండలం మెట్టపాలెం పంచాయతీ నూతన భవనాన్ని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం లాంఛనంగా ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్) నిధులు రూ. 43.60 లక్షలతో ఈ భవనాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో స్పీకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం లో భవనాన్ని ప్రారంభించి నిధులు ఇవ్వకుండా ఈ భవన నిర్మాణాన్ని మధ్యలో నిలిపివేయగా, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రత్యేకంగా రూ. 22 లక్షలు మంజూరు చేసి పూర్తి చేశామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామని, తొలి ప్రాధాన్యతగా

మిగతా 8..లో



## విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభం..



- నెరవేరిన విశాఖ ప్రజల కల..
- ప్రధాని మోదీకి,కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఏపీ బీజేపీ అధ్యక్షులు పివియన్ మాధవ్ కృతజ్ఞతలు

**విశాఖపట్నం, ప్రభాతవార్త**

విశాఖపట్నం కేంద్రంగా ఏర్పాటు చేస్తున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కార్యకలాపాలు 2026 ఏప్రిల్ 1 నాటికి పూర్తి స్థాయిలో ప్రారంభం కానున్నాయని కేంద్ర రైల్వే శాఖా మంత్రి అశ్వినీ వైష్ణవ్ పార్లమెంట్ సమావేశాల్లో వెల్లడించడంతో, ఆంధ్రప్రదేశ్ భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేస్తూ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2019 ఫిబ్రవరి 17న విశాఖపట్నం కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని, అదే నెల 28న కేంద్ర కేబినెట్ దీనికి సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్ )కు ఆమోదం తెలిపిందని గుర్తుచేశారు.జోన్‌కు శాశ్వత ప్రధాన కార్యాలయం నిర్మాణానికి 2025 జనవరి 8న భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ముడసర్లోవలో శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. సుమారు రూ.183 కోట్లకు పైగా అంచనా వ్యయంతో ఈ ప్రాజెక్టు రూపొందించినట్లు పేర్కొన్నారు. విశాఖపట్నంలోని ముడసర్లోవలో 52.2 ఎకరాల విస్తీర్ణంలో విశాఖ సముద్ర తీరానికి ప్రతీకగా క్రూయిజ్ ఆకారంలో ఆధునిక సదుపాయాలతో

మిగతా 8..లో

## బిజెపిలో చేరిన ప్రముఖ వ్యాపారవేత్త ఎం.వి.ఆర్

- జిల్లాలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని రాష్ట్ర అధ్యక్షులు మాధవ్
- ఆశాభావం పార్టీకి విశిష్టమైన సేవలు అందిస్తా: స్పష్టం చేసిన ఎం వీ ఆర్

**అనకాపల్లి, మార్చి21:( ప్రభాతవార్త)**

అనకాపల్లి జిల్లాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వరరావు (ఎం.వి.ఆర్) మంగళవారం విశాఖ బిజెపి పార్టీ కార్యాలయంలో భారతీయ జనతా పార్టీ బిజెపి చేరారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్ పార్టీ కండువా వెంకటేశ్వర రావు కు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎం.వి.ఆర్‌తో పాటు పెద్దసంఖ్యలో అనుచరులు, వివిధ గ్రామాల

మిగతా 8..లో



## విశాఖ తీరాన అంతర్జాతీయ స్థాయి ఆతిథ్యం

- హయత్ హోటల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన మంత్రి కందుల దుర్గేష్,శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు
- రూ. 250 కోట్ల పెట్టుబడితో 3ఎకరాల విస్తీర్ణంలో ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణం.. రెండేళ్లలో పూర్తికి చర్యలు

**విశాఖపట్నం, ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ పటంలో అగ్రస్థానంలో నిలిపే లక్ష్యంతో విశాఖపట్నంలోని సాగర్ నగర్ఎండాడ సమీపంలో (సన్ ఇంటర్నేషనల్ స్కూల్ వెనుక) పీవీఆర్ గ్రూప్‌కు చెందిన ప్రతిష్టాత్మక హయత్ ఫైవ్ స్టార్ హోటల్ నిర్మాణానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్, స్థానిక శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు శనివారం భూమి పూజ నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో జరిగిన సీఐఐ సమ్మిట్ ఫలితంగా కుదిరిన ఎంవోయూలు నేడు కార్యరూపం దాల్చుతున్నాయని హర్షం వ్యక్తం చేశారు. దాదాపు రూ. 250 కోట్ల భారీ పెట్టుబడితో 3 ఎకరాల సువిశాల విస్తీర్ణంలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఈ హోటల్ నిర్మితమవుతోందని, రెండేళ్ల కాలపరిమితిలో ఇది అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. విశాఖపట్నం గ్లోబల్ సిటీగా ఎదుగుతున్న తరుణంలో, ఈ నూతన హోటల్ పర్యాటక రంగానికి వెన్నెముకగా నిలవనుందని పేర్కొన్నారు. వరుణ్ గ్రూప్, రాడిసన్ బ్లూ వంటి అగ్రశ్రేణి హోటళ్ల సరసన పీవీఆర్ గ్రూప్ ఆధ్వర్యంలో రానున్న ఈ హయత్ హోటల్ ప్రపంచ స్థాయి విలాసవంతమైన

మిగతా 8..లో



ong-8_ong-8.qxd 3/21/2026 11:22 PM Page 1



మొదటిపేజీ తరువాయిలు

## గ్లోబల్ డెస్టినేషన్‌గా ఉత్తరాంధ్ర

విజన్ 2020 అంటే అపహాస్యం చేసిన వారు నేడు వాటి ఫలాలను అనుభవిస్తున్నారని.. విజన్ 2020 సాధనకు గతంలో ప్రధానిగా వాజ్ పేయ్ నాయకత్వం కూడా తోడై స్పష్టమైన ఫలితాలు అందించిందని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆలోచన స్వర్ణాంధ్ర 2047 కు అన్ని అనుకూల పరిస్థితులు ఉన్నాయని.. ఆయన లక్ష్యం వైపు బలంగా వేస్తున్న అడుగులు నేటి తరానికి ఒక పాఠ్యాంశంగా మారాలని కోరారు. విజన్ 2047 సాధనకు బలమైన భాగస్వామ్యాలు అవసరమైన తరుణంలో పూర్తి తోడ్పాటు కేంద్రం నుండి లభిస్తూ ఉండటం శుభపరిణామం అని అన్నారు. రాజకీయాలు ఈ వేదికపై అప్రస్తుతం అని తెలిపిన రామ్మోహన్ నాయుడు.. విభజిత ఆంధ్రప్రదేశ్ సమయంలో ఇబ్బందులు, గత అయిదేళ్ల పాలన ఇబ్బందులు ఎదుర్కొన్న రాష్ట్రానికి.. సరైన సమయంలో కేంద్రం నుండి బలమైన తోడ్పాటు అందిందని అన్నారు. పోలవరం కు 6000కోట్లు, విశాఖ స్టీల్ కు 12000 కోట్లు అందించి లాభాల్లోకి తీసుకురావడం కేంద్రం తోడ్పాటుకు నిదర్శనం కాగా.. ఇంతకన్నా బలమైన భరోసా భవిష్యత్ కు అవసరమని అన్నారు. రాష్ట్రంలో యువ నాయకత్వాన్ని ప్రోత్సహిస్తూ మంచి ఫలితాలను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాబట్టుకుంటూ ఉన్నారని అన్నారు. నారా లోకేష్ నాయకత్వంలో ఐటీ విఫలం రాష్ట్ర అభివృద్ధి దిశను మార్చుతోందని అన్నారు. పార్లమెంట్ లో యువకుడైన తనతో పాటు ఎంపీలు లావు శ్రీకృష్ణ దేవరాయలు, హరీష్ బాలయోగి, ఇలా మిగిలిన వారితో యంగెస్ట్ పార్లమెంట్ పార్టీ ఇప్పుడు కేంద్రంలో భాగస్వామ్యం అయిందని అన్నారు. రాష్ట్రంలో కూడా నూతన ఎమ్మెల్యేలు ఎక్కువ మంది కాగా.. 80 మందికి పైగా 40 ఏళ్ల లోపు వాళ్ళే ఎమ్మెల్యే లుగా ఉండటం.. పొలిటికల్ ఇండికేషన్ కాదని.. యువశక్తిపై చంద్రబాబు నాయుడు కు ఉన్న నమ్మకం అని అన్నారు. రాష్ట్రంలో నూతన ఎయిర్పోర్ట్ లను ఏర్పాటు చేసుకోవడం తో పాటు ప్రస్తుతం ఉన్న 14 ఎయిర్పోర్ట్ లను సైతం అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. ప్రతీ ఒకరికి 2 గంటల దూరంలో ఎయిర్పోర్ట్ ఉండాలనే లక్ష్యంతో నూతన నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. శ్రీకాకుళం నుండి నెల్లూరు వరకు పోర్టులను అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. స్పీడ్ ఆఫ్ దూయింగ్ బిజినెస్ ఆలోచనతో నారా లోకేష్ వెళ్తున్నారని.. స్పీడ్, క్వాలిటీ చూపిస్తూ ఉండటంతో అంతర్జాతీయంగా మనవైపు అందరి దృష్టి నిలిచిందని అన్నారు. ఒకప్పుడు ఉత్తరాంధ్ర అంటే వేరే అభిప్రాయం ఉండేదని.. తక్కువ అభివృద్ధి, జిడిపి, తలసరి ఆదాయం గతంలో ఉండేవని రామ్మోహన్ నాయుడు అన్నారు. బలహీనతలను బలంగా మార్చడంతో.. ఉత్తరాంధ్ర ఇప్పుడు గ్లోబల్ డెస్టినేషన్ గా మారిందని అన్నారు. తాను రెండు సార్లు దావోస్ లో పర్యటించానని.. మొదటి సారి వెళ్ళేటప్పుడు మా పెట్టుబడులకు భద్రత ఏది అనే భయం ఉండేది అని.. కానీ రెండవ సారి వెళ్ళేటప్పుడు ఆంధ్రప్రదేశ్ ను ఒక రాష్ట్రం మాదిరి కాకుండా.. దేశంలా భావిస్తూ ప్రాధాన్యత ఇస్తుండటం ఆనందంగా అనిపించిందని అన్నారు. ఆ స్థాయి బ్రాండ్ వాల్యూ కల్పిస్తున్న నాయకత్వాన్ని మనం సరిగ్గా వినియోగించుకోవాలని కోరారు. సీఐఐ కు మొదటి నుండి నారా చంద్రబాబు నాయుడు తోడ్పాటు అందిస్తూనే ఉన్నారని.. ఆయనే ప్రమోటర్ గా మారి.. అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చారని అన్నారు. చంద్రబాబు నాయకత్వం ఎప్పుడూ వందేళ్లకు సరిపడే అభివృద్ధిని ఆలోచిస్తుందని అన్నారు. త్వరలోనే భోగాపురం, మూలపేట పోర్ట్, మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్, బ్రాండెడ్ హోటళ్లు, ఇలా ఉత్తరాంధ్ర ముఖచిత్రం మారబోతోందని రామ్మోహన్ నాయుడు తెలిపారు. ఇందులో సీఐఐ కీలక భూమిక పోషిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇబ్బందులను సైతం అభివృద్ధి వైపు మలిచిన ఘనత ప్రధాని మోదీ నాయకత్వం కు చెందుతుందని అని తెలిపిన రామ్మోహన్ నాయుడు.. గ్లోబల్ క్రైసెస్ లో సైతం భద్రమైన దేశంగా ఇండియాను నిలిపిన ఘనత మోదీ నాయకత్వం కు చెందుతుందని అన్నారు. 50 రోజులకు ఒక ఎయిర్పోర్ట్ ప్రారంభోత్సవం చేసుకుంటూ తన శాఖ కార్యాచరణ సిద్ధం చేస్తోందని అన్నారు. 1700 విమానాలు భవిష్యత్ కు అవసరం కాగా.. రానున్న 16 ఏళ్లలో ఇవి దేశానికి చేరనున్నాయని అన్నారు. ఈ ఇబ్బందిని అధిగమించేందుకు ఎంబ్రెర్ తో అసెంబుల్ లైన్ ను దేశంలో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. డిమాండ్ ను చేరుకోవాలంటే లోకల్ ప్రొడక్టివిటీ ద్వారానే సాధ్యమని అన్నారు. ఉడాన్ యాత్రీ కేఫ్ ద్వారా సామాన్యులు సైతం విమాన ప్రయాణం వైపు చూసేలా ఆలోచనలు చేశామని అన్నారు. సంగీత సాధనాలు, క్రీడా పరికరాలు గతంలో విమాన ప్రయాణంలో అనుమతించేవారు కాదని.. వాటిని మేము గౌరవంగా భావిస్తూ తగిన భద్రత కల్పిస్తూనే రవాణా సదుపాయాన్ని చేరువ చేశామని గుర్తు చేశారు. పెంపుడు జంతువులకు సైతం ప్రయాణ సౌలభ్యాన్ని అందించామని అన్నారు. అనంతరం కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ను సీఐఐ ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సీఐఐ ఆంధ్రపదేశ్ సి.ఈ.ఓ మురళి కృష్ణ, గ్రీన్ కో గ్రూప్ ప్రెసిడెంట్ మహేష్ కోలి, ముత్తూట్ ఫిన్ కార్ప్ చైర్మన్ థామస్ జాన్, సీఐఐ వైస్ ఛైర్మన్ నరేంద్ర కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట..



వైద్యరంగాన్ని అభివృద్ధి చేసి నర్సీపట్నం ఆసుపత్రిని జిల్లాలోనే నంబర్ వన్ ఆసుపత్రిగా తీర్చిదిద్దామని ఆయన తెలిపారు. నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధి కోసం రెండేళ్లలో సుమారు రూ. 425 కోట్లు తీసుకువచ్చామని స్పీకర్ వెల్లడించారు. ఇప్పటికే 80 శాతం మేర రోడ్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారుల నిర్మాణంలో భాగంగా మొదటి విడతగా మెట్టపాలెంలో ఐదు రోడ్ల నిర్మాణానికి రూ. 35 లక్షలు, రెండో విడతలో ఎనిమిది రోడ్లకు రూ. 30 లక్షలు కేటాయించినట్లు వివరించారు. అలాగే గ్రామాల్లో శ్మశానవాటికల నిర్మాణానికి కూడా అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ 60 పంచాయతీలకు నిధులు కేటా యించామని, ఇందులో మెట్టపాలెం, మొండికండి గ్రామాలకు రూ. 10 లక్షల చొప్పున మంజూరు చేశామన్నారు. తారు రోడ్ల విషయానికొస్తే మొండికండి నుంచి వేములపూడి వరకు రూ. 80 లక్షలు, అప్పన్నపాలెం నుంచి మెట్టపాలెం రోడ్డుకు రూ. 87 లక్షలు వెచ్చించామన్నారు. బుచ్చన్న పాలెం వద్ద వంతెన నిర్మాణానికి రూ. 35 లక్షలు కేటాయించామని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో కేవలం నర్సీపట్నం మండలానికే ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ. 8.44 కోట్ల నిధులు తీసుకువచ్చినట్లు స్పీకర్ ఉద్ఘాటించారు. పంచాయతీల పదవీకాలం ముగిసిన నేపథ్యంలో వేములపూడి, గబ్బాడ, ఎరకన్నపాలెం, దుగ్గాడ, మెట్టపాలెం గ్రామాలకు సమర్థులైన అధికారులను నియమించామన్నారు. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా, తన స్నేహితుల సహకారంతో నర్సీపట్నం స్థానిక పెద్ద చెరువులో 108 అడుగుల శివపార్వతుల విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నామని ఆయన తెలిపారు. రావణాపల్లి రిజర్వాయర్ నుంచి ఈ చెరువుకు నీరు వస్తుందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతం గొప్ప పర్యాటక కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూకాలమ్మ పండుగను బ్రహ్మాండంగా నిర్వహించామని, రాబోయే 31, 1 తేదీల్లో జరిగే మరిడమ్మ పండుగను కూడా గ్రాండ్ గా నిర్వహించుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జిల్లా అధికార ప్రతినిధి శ్రీరంగ స్వామి, ఎమ్ పి టి సి బోళం రాంప్రసాద్, సర్పంచ్ కుంద్రపు అర్జున, పార్టీ మండలం ప్రెసిడెంట్ సుకల అప్పల నాయుడు, తాసిల్దార్ రామారావు, ఎండిఓ ఉషశ్రీ, డి ఈ ఈ పి ఆర్ ఈశ్వరరావు ఇతర అధికారులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన ప్రముఖ వ్యాపారవేత్త ఎం.వి.ఆర్

సర్పంచులు బిజెపి తీర్థం పుచ్చుకున్నారు. పార్టీ విధానాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం పట్ల ఆకర్షితులై ప్రజల సేవలో భాగస్వామ్యం కావాలనే ఉద్దేశంతో బిజెపి లో చేరినట్లు ఎం.వి.ఆర్



ఈ సందర్భంగా తెలిపారు. నిస్వార్థంగా లాబాపేక్షకుతావు లేకుండా విశిష్టమైన సేవలు అందిస్తానని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పి.వి.ఎన్. మాధవ్ మాట్లాడుతూ త్వరలో రాజకీయ రంగ ప్రవేశం అనే పోస్టర్లతో అనకాపల్లి జిల్లాలోనే రాజకీయాల్లో సరికొత్త సంకేతాలను అందించిన ఘనతను ఎంవిఆర్ దక్కించుకున్నారని కొనియాడారు. అనకాపల్లి జిల్లా వ్యాప్తంగా ఎం వి ఆర్ అందించిన సేవలు పార్టీ గ్రామస్థాయిలో మరింత బలోపేతం అయ్యేందుకు దోహద పడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు . కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని, అనకాపల్లి ప్రాంతంలో పార్టీని అన్ని స్థాయిల్లో బలోపేతం చేయాలని నాయకులకు సూచించారు. కులమతాలకు అతీతంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతూ, రానున్న రోజుల్లో బిజెపి ని అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగా ఎంవిఆర్ సేవలు పార్టీకి దోహదం కానున్నాయని స్పష్టం చేశారు. పార్టీలో చేరిన ముత్యాల వెంకటేశ్వరరావు బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్ ను గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిజెపి అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొనగంటి అప్పారావు, పలువురు రాష్ట్ర జిల్లా స్థాయి బిజెపి నేతలు ఈ కార్యక్రమానికి నేతృత్వం వహించారు. ఈ కార్యక్రమంలో ముద్దుర్తి సర్పంచ్ కడిమి వెంకట్, బంగారం మెట్ట నానాజీ, గంటా సూరిబాబు, నర్సీపట్నం జానకి, గాలి శ్రీను, గైపూరు రాజు అధిక సంఖ్యలో ఎం వి ఆర్ అభిమానులు పాల్గొన్నారు.



## పెద ఉప్పరగుడెంలో వైభవంగా సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ..

ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. గ్రామస్తులంతా ఐకమత్యంతో లక్షల రూపాయలు ఖర్చు చేసి ఈ రామాలయాన్ని బ్రహ్మాండంగా నిర్మించుకోవడం ఎంతో అభినందనీయ మన్నారు. నియోజక వర్గంలోని నాతవరం, వేములపూడి, అమలాపురం తదితర ప్రాంతాల్లో నిరంతరం పర్యటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. పెద ఉప్పరగుడెం గ్రామ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని, వేములపూడి నుంచి ఉప్పరగుడెం వరకు తారు రోడ్డు నిర్మాణానికి రూ. 32 లక్షలు మంజూరు చేశామని వెల్లడించారు. అలాగే పొలాలకు వెళ్లేందుకు వీలుగా కాలువ పనుల కోసం రూ. 2 కోట్లు కేటాయించామన్నారు. విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ స్కూల్ భవనానికి రూ. 13 లక్షలు, అంగన్‌వాడీ భవనానికి రూ. 3 లక్షలు, వేములపూడి పంచాయతీకి మొత్తం రూ. 4 కోట్లు మంజూరు చేసినట్లు స్పష్టం చేశారు. విద్యార్థినుల సౌకర్యార్థం వారు చదువుకోవడానికి వీలుగా ఆశ్రమ పాఠశాలలు (హాస్టల్స్) మంజూరు చేశామని, వేములపూడిలో కూడా 50 సెంట్ల స్థలంలో బాలికల హాస్టల్ ఏర్పాటుకు కృషి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. త్వరలోనే ఈ ఊరి పేరును కూడా మార్చి కొత్త పేరును అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బోలెం రాంప్రసాద్, జెడ్పీటీసీ రమణమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, నక్క పెంటయ్య, నక్క రమణ, లచ్చబాబు, జగ్గయ్య, రామాలయం గ్రామ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## 25న ఆంధ్రవిశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

ఆంధ్రవిశ్వవిద్యాలయం 91,92వ సంయుక్త స్నాతకోత్సవం ఈ నెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు ఏయూ వీసీ ఆచార్య జి.పి రాజశేఖర్ తెలిపారు. శనివారం ఏయూ అకడమిక్ సెనెట్ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. స్నాతకోత్సవానికి ఏయూ చాన్సలర్, రాష్ట్ర గవర్నర్ డాక్టర్ ఎస్.అబ్దుల్ నజీర్ హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్య శాఖ మంత్రి నారా లోకేష్ పాల్గొంటారని తెలిపారు. స్నాతకోత్సవానికి ముఖ్య అతిధిగా బ్యాంక్ ఆఫ్ అమెరికా వైస్ చైర్మన్, ఏయూ పూర్వ విద్యార్థి డాక్టర్ పూర్ణచంద్రరావు సగ్గుర్తి హాజరవుతున్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం తరపున ఆయనకు గౌవర డాక్టరేట్‌ను ప్రధానం చేస్తామని చెప్పారు. సాహిత్య విభాగంలో విశేష సేవలకు గుర్తింపుగా కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత తల్లావజ...ల పతంజలి శాస్త్రి కి ఏయూ తరపున డాక్టరేట్ ప్రధానం చేస్తామన్నారు.స్నాతకోత్సవం ఉదయం 9 గంటలకు బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా ప్రారంభమవుతుంది. ఈ స్నాతకోత్సవంలో ఇద్దరు ఆచార్యులకు బెస్ట్ రీసెర్చ అవార్డులు, పిహెచ్‌డిలో రీసెర్చ్ మెడల్స్ 17 మందికి, రీసెస్చ్ ప్రైజ్‌లు 13 మందికి ప్రధానం చేస్తారు. 7 ఎం.ఫిల్ డిగ్రీలను, 441మంది పిహెచ్‌డి డిగ్రీలను అందుకుంటారు. యూజీ పీజీ మెడల్స్ 174, యూజీ పీజీ ప్రైజులు 437 అందిస్తారు. మెత్తం యూజీ పీజీ ప్రైజులు, మెడల్స్ 148 మందికి అందిస్తున్నారు.సమావేశంలో ఏయూ రెక్టార్ ఆచార్య పి.కింగ్, రిజిస్ట్రార్ ఆచార్య కె.రాంబాబు, అకడమిక్ డీన్ ఆచార్య కె.శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి దేవస్థానం సింహాచలం

భక్తుల సౌకర్యాల విషయంలో నిబంధనల పేరుతో ఇబ్బందులు పెట్టకూడదని, ప్రజల అవసరాలకే పెద్దపీట వేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విస్పష్టంగా చెప్పారని ఎమ్మెల్యే గుర్తుచేశారు.భైరవస్వామి దర్శనానికి అమావాస్య, ఆదివారాలు మరియు ప్రత్యేక రోజుల్లో వేలాది మంది వస్తుంటారు. వారికి అవసరమైన మంచినీరు, టాయిలెట్లు, లైటింగ్ వంటి కనీస వసతులను తక్షణమే ఏర్పాటు చేయాలని సూచించారు.కాశీ క్షేత్రం తరహాలోనే ఇక్కడ కూడా భైరవస్వామికి క్రమం తప్పకుండా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు.భక్తులు ఇబ్బంది పడకుండా ఆలయం వద్దే పూజా సామాగ్రి లభించేలా దేవస్థానం ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.భైరవస్వామి ఆలయ ముఖద్వారం వద్ద దేవస్థానం తరపున ఒక భవ్యమైన గ్రాండ్ ఆర్చ్‌ను నిర్మించాలని సూచించారు. "నిబంధనల పేరుతో భక్తులకు అసౌకర్యం కలిగించడం సరికాదు. వేలాది మంది నమ్మకంతో వచ్చే ఈ పుణ్యక్షేత్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తాం," అని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.

## ముస్లిం సోదరులు రంజాన్ సంబరాలు





వేడుకల్లో హిందూముస్లిం ఐక్య తకనిపించింది. ఒకరికొకరు ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మిఠాయిలు తినిపించుకున్నారు. నమాజ్లో పాల్గొన్న ముస్లిం సోదరులు సమీప స్మశానవాటికలోకి వెళ్లి పూర్వీకుల ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ ప్రార్థనలు చేశారు. పేదలకు దానధర్మాలు చేస్తూ పలు సేవా క్యార్యక్రమాలు చేపట్టారు. సెంట్రల్ పార్కు వద్ద వున్న మసీదు, జగదాంబ జంక్షన్ వద్ద మక్కా మసీదు, రేసపువానిపాలెం, ముస్లిం తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం, మద్దిలపాలెం, గాజువాక, మధురవాడ, తదితర ప్రాంతాల్లోని మసీదులను అందరంగా అలంకరించి ప్రత్యేక నమాజ్ లు చేశారు. రంజాన్ వేడుకలతో ఆయా ప్రాంతాల్లో సందడి వాతావరణం నెలకొంది.

## విశాఖ తీరాన అంతర్జాతీయ స్థాయి ఆతిథ్యం



వసతులను కల్పిస్తుందని వెల్లడించారు. జాతీయ అంతర్జాతీయ స్థాయి కార్పొరేట్ సమావేశాలు, ప్రోత్సాహక కార్యక్రమాలు, సదస్సులు నిర్వహించుకోవడానికి అత్యున్నత సాంకేతికతతో కూడిన కాన్ఫరెన్స్ హాళ్లు ఇక్కడ అందుబాటులోకి రానున్నాయన్నారు. విశాఖకు వచ్చే జాతీయ, అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో వారి అభిరుచులకు తగ్గట్టుగా లోకల్ మరియు గ్లోబల్ వంటకాలతో కూడిన ఫైన్ డైనింగ్ అనుభూతిని ఈ హోటల్ అందించనుందన్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానిక యువతకు ఆతిథ్య రంగంలో భారీగా ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధి లభించనుందని స్పష్టం చేశారు.విశాఖకు స్టార్ హోటళ్ల రాక వల్ల నగర ముఖచిత్రాన్ని మారుతుందన్నారు.ఈ కార్యక్రమంలో విశాఖ కలెక్టర్ హరీంద్ర ప్రసాద్, హోటల్ స్టార్ హోటల్స్ అసోసియేషన్ అధ్యక్షులు, హయత్ హోటల్ చైర్మన్ ఆర్. వి. స్వామి, వరుణ్ గ్రూప్ ఛైర్మన్ ప్రభు కిషోర్, అసోసియేషన్ ప్రతినిధులు, టూరిజం ఆర్.డీ. కల్యాణి, డీవీఎం జగదీష్, డీటీవో మాధవి, మరియు ఇతర ప్రభుత్వ అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



## విశాఖ రైల్వే జోన్ కార్యకలాపాలు త్వరలో ప్రారంభం..

కూడిన 12 అంతస్తుల ప్రధాన కార్యాలయ భవనం నిర్మాణం రూ.107 కోట్లతో కొనసాగు తోందని తెలిపారు. శాశ్వత భవనం పూర్తయ్యే వరకు వీఎంఆర్ డి ఏ ఐకానిక్"ది డెక్" భవనం నుంచి తాత్కాలికంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు మాధవ్ తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో దక్షిణ మధ్యరైల్వే జోన్ గా ఉన్న రైల్వే జోన్, విశాఖ కేంద్రంగా సౌత్ కోస్ట్ రైల్వే జోన్ పరిధిలో విశాఖపట్నం డివిజన్ (పాత వాల్తేర్ డివిజన్ నుంచి విడదీసినది), విజయవాడ, గుంటూరు, గుంటకల్ డివిజన్లు ఉండనున్నాయని, ఈ జోన్ ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కొన్ని ప్రాంతాలను కూడా కలుపుకుంటుందని తెలిపారు.భూసేకరణ వంటి కారణాలతో ఆలస్యం అయిన ఈ ప్రాజెక్ట్ ప్రస్తుతం వేగవంతంగా అమలులోకి వచ్చిందని, జనరల్ మేనేజర్ నియామకం పూర్తయ్యి నిర్మాణ పనులు పురోగమిస్తున్నాయని పేర్కొన్నారు.విశాఖ రైల్వే జోన్ ప్రారంభం ద్వారా రాష్ట్రంలో రైల్వే మౌలిక వసతులు మెరుగుపడటంతో పాటు, కొత్త రైళ్ల మంజూరు, ప్లాట్ ఫారమ్ విస్తరణతో పాటు ,15 వేలకు పైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయన్నారు. పారిశ్రామిక అభివృద్ధి, వాణిజ్య కార్యకలాపాలు మరియు ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని పీవీఎన్ మాధవ్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు

## భారత నౌకాదళానికి తారాగిరి సిద్ధం

విశాఖపట్నం, మార్చి 21 ప్రభాతవార్త



భారత నౌకాదళం తన సరికొత్త స్టెల్త్ ఫ్రిగేట్ తారాగిర్రిని అధికారికంగా ప్రారంభించడానికి సిద్ధమయింది. భారత సముద్ర సార్వభౌమాధి కారానికి ఒక కీలక ఘట్టంగా నిలిచే ఈ వేడుకలో, భారత నౌకాదళం తన సరికొత్త స్టెల్త్ ఫ్రిగేట్, తారాగిరి (ఎఫ్41)ని 03 ఏప్రిల్ 2026న అధికారికంగా ప్రారంభించడానికి సిద్ధమవుతోంది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన జరగనున్న ఈ వేడుక, దేశం సంపూర్ణ స్వయం సమృద్ధి గల నౌకా శక్తిగా మారే దిశగా సాగిస్తున్న ప్రయాణానికి ఒక శక్తివంతమైన నిదర్శనంగా నిలుస్తుంది. ప్రాజెక్ట్ 17ఏ శ్రేణిలో నాలుగవ శక్తివంతమైన నౌకగా, తారాగిరి కేవలం ఒక ఓడ మాత్రమే కాదు; ఇది 6,670 టన్నుల బరువుతో మేక్ ఇన్ ఇండియా స్ఫూర్తికి మన స్వదేశీ నౌకా నిర్మాణ కేంద్రాల అధునాతన ఇంజనీరింగ్ సామర్థ్యాలకు ప్రతిరూపం. ముంబైలోని మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ లిమిటెడ్ నిర్మించిన ఈ ఫ్రిగేట్, మునుపటి డిజైన్‌ల కంటే ఒక తరం ముందడుగు వేసింది. ఇది మరింత నాజూకైన రూపాన్ని, గణనీయంగా తగ్గిన రాడార్ క్రాస్‌సెక్షన్‌ను కలిగి ఉండి, అత్యంత ప్రాణాంతకమైన రహస్య పద్ధతిలో పనిచేయడానికి వీలు కల్పిస్తుంది. 75 శాతానికి పైగా స్వదేశీ పరిజ్ఞానంతో, ఈ నౌక దేశీయ పారిశ్రామిక పర్యావరణ వ్యవస్థ యొక్క పరిపక్వతను చాటిచెబుతోంది. ఈ వ్యవస్థలో ఇప్పుడు 200కు పైగా సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు ఉన్నాయి. ఇవి భారత ప్రభుత్వ ఆత్మనిర్భర కార్యక్రమాలకు దోహదపడుతూ, వేలాది భారతీయ ఉద్యోగాలకు మద్దతు ఇస్తున్నాయి. కంబైన్డ్ డీజిల్ లేదా గ్యాస్ ప్రొపల్షన్ ప్లాంట్‌తో నడిచే తారాగిరి, ఖిఅధిక వేగం అధిక ఓర్పుఖి గల బహుముఖ ప్రజ్ఞ మరియు బహుళపరిమాణ సముద్ర కార్యకలాపాల కోసం రూపొందించబడింది. ఈ నౌక యొక్క ఆయుధ సముదాయం ప్రపంచ స్థాయిది. ఇందులో సూపర్‌సోనిక్ ఉపరితలం నుండి ఉపరితలానికి ప్రయోగించే క్షిపణులు, మధ్య శ్రేణి ఉపరితలం నుండి గగనతలానికి ప్రయోగించే క్షిపణులు ప్రత్యేకమైన జలాంతర్గామి వ్యతిరేక యుద్ధ సామగ్రి ఉన్నాయి. ఈ వ్యవస్థలు అత్యాధునిక యుద్ధ నిర్వహణ వ్యవస్థ ద్వారా సజావుగా అనుసంధానించబడ్డాయి, దీనివల్ల సిబ్బంది ముప్పులకు క్షణాల కచ్చితత్వంతో స్పందించగలరు. సముద్రాలలో ఒక అగ్రశ్రేణి వేట నౌకగా దాని పాత్రకు అతీతంగా, తారాగిరి ఆధునిక దౌత్యం మానవతా సంక్షోభాల సంక్లిష్టతల కోసం నిర్మించబడింది. దీని బహుముఖ మిషన్ ప్రొఫైల్, తీవ్రమైన పోరాటం నుండి మానవతా సహాయం మరియు విపత్తు ఉపశమనం వరకు ప్రతిదానికీ దీనిని ఆదర్శంగా చేస్తుంది. భారతీయులు రూపొందించి, నిర్మించి, నడిపే నౌకలచే రక్షించబడే విక్సిత్, సమృద్ధ భారత్ కోసం సముద్రాలను కాపాడుతూ, భారత నౌకాదళం ఒక యుద్ధానికి సిద్ధంగా ఉన్న, సమైక్య, విశ్వసనీయ, ఆత్మనిర్భర్ శక్తిగా ఎదుగుతూనే ఉంది. పెరుగుతున్న సముద్ర శక్తికి ఒక మార్గదర్శిగా మన నీలి సరిహద్దులకు ఇనుప కవచ సంరక్షకుడిగా, తారాగిరి ఒక ఉజ్వల భవిష్యత్తుకు సిద్ధంగా ఉంది.


వార్త VAARTHA CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, KANAGALA SRINIVASA RAO S/O KANAGALA RUDRAYYA, previously called KANGALA SREENIVASA RAO R/O 3-90/2/2, GOWRI VISWESWARA COLONY, PENDURTHI, VISAKHAPATNAM now changed my name from KANGALA SREENIVASA RAO to KANAGALA SRINIVASA RAO. Henceforth I will be called as KANAGALA SRINIVASA RAO for all purposes. (Ro.No.48146)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



రేఖా నెం 18/2026 తేదీ : 18.03.2026

గ్రామ పంచాయతీ కార్యాలయం వేములవలస

**సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన**

విశాఖపట్నం జిల్లా, ఆనందపురం మండలం, వేములవలస గ్రామపంచాయతీ యొక్క మహాత్మాగాంధీ రోజువారి మార్కెట్ నందు ఆశీను రుసుములు వసూలు చేసుకొనే హక్కు 2026-27 సం//నకు సీల్డ్ టెండర్-కం-బహిరంగ వేలం తేదీ 25-03-2026 బుధవారం జరుపబడును. తేదీ 25-03-2026 ఉదయం 10:30 నుండి మధ్యాహ్నం 12:00 వరకు సీలు వేసిన టెండర్లు ఈ గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ఈ దిగువ సంతకము దారునిచే గాని, అనుమతి పొందిన వారిచే గాని స్వీకరించబడును. సీలు వేసిన టెండర్లు దాఖలు చేయు వారు ఈ దిగువ షెడ్యూలు నందు చూపబడిన ధరావతు మొత్తం భారతీయ స్టేట్ బ్యాంక్, వెల్లంకి శాఖ నందు జమ అగునట్లుగా" గ్రామపంచాయతీ వేములవలస" అను పేరు మీద డిమాండ్ డ్రాఫ్ట్ తీసుకొని జత పరచవలెను. శ్రీ తహశీల్దార్ వారి నుండి "మోతు బరి సర్టిఫికేట్" లేదా బ్యాంకు గ్యారెంటీ టెండర్లకు జత పరచవలెను మరియు ఈ గ్రామ పంచాయతీ మహాత్మాగాంధీ రోజువారి మార్కెట్ నోటిఫికేషన్ నందలి నిబంధనలు మరియు షెడ్యూల్ నందలి ధరలకు లోబడి మాత్రమే సీలు వేసిన టెండర్లు దాఖలు చేయవలెను. మరియు బహిరంగ వేలంలో పాల్గొన వచ్చును. రోజువారి మార్కెట్ నోటిఫికేషన్ ఈ గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డ్ నందు ప్రచురించబడును మరియు ఈ గ్రామ పంచాయతీ పని దినములలో, పనివేళలో వచ్చి పొందవచ్చును. పైన తెలిపిన విధముగా దాఖలు కాబడిన సీల్డ్ టెండర్‌లు మాత్రమే పరిగణలోనికి తీసుకొనబడును సీల్డ్ టెండర్‌ల స్వీకరణ అనంతరం అదేరోజు మధ్యాహ్నం 1:00 గంటకు నుండి ఈ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఈ దిగువ సంతకం దారునిచే గాని, వారిచే అనుమతి పొందిన వారిచే గాని బహిరంగ వేలం నిర్వహించబడును. బహిరంగ వేలంలో పాల్గొనుటకు అర్హత కలిగిన వారు షెడ్యూల్ నందు చూపిన ధరావత్తు మొత్తం పైన తెలిపిన విధముగా డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా లేక నగదు రూపంలో చెల్లించి, రోజువారి మార్కెట్ నిబంధనలకు, షెడ్యూల్ ధరలకు అంగీకరించి, శ్రీ తహశీల్దార్ వారి నుండి "మోతు బరి ధ్రువ పత్రము" లేక బ్యాంక్ గ్యారంటీ పొంది, వేలం పాట కాలంలో దాఖలు చేసి వేలం పాట లో పాల్గొన వలెను. బహిరంగ వేలం పాట పూర్తి అయిన పిదప ఎక్కువ మొత్తంలో పాట పాడిన గుత్తేదారుని పాటను అప్పగించవలెనన్న అంతకు ముందుగా వేయబడిన సీల్డ్ టెండర్ దారులు మరియు బహిరంగ వేలం పాట దారులు సమక్షములో సీలు వేసిన టెండర్లు తెరవబడును. సీలు వేసిన టెండర్ నందు నమోదు చేసినా టెండెరు మరియు బహిరంగ వేలం

| షెడ్యూల్ వరుస నెంబరు | వేలం పాట వివరములు | ధరావత్తు రూ//లు |
| --- | --- | --- |
| 1 | వేములవలస గ్రామపంచాయతీ ఈ యొక్క మహాత్మాగాంధీ రోజువారి మార్కెట్ నందు 2026-27 ఆశీలు రుసుములు వసూలు చేసుకొనే హక్కు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం వేయుట | 2,00,000 (అక్షరాలా రెండు లక్షల రూ// మాత్రమే) |

గమనిక: 1.సాల్వెన్సీ/ బ్యాంక్ గ్యారంటీ 2. సెక్యూరిటీ డిపాజిట్ రూ.20,00,000 (అక్షరముల ఇరవై లక్షల రూపాయలు క్యాష్ / డి. డి) తప్పనిసరిగా పాట కాలం నందు సమర్పించి పాట నందు పాల్గొనుటకు చెల్లించవలెను. సాల్వెన్సీ/ బ్యాంక్ గ్యారంటీ లేనిచో పాటనందు పాల్గొనుటకు అనర్హులు. సెక్యూరిటీ డిపాజిట్ (క్యాష్ / డి.డి) లేనిచో పాటనందు పాల్గొనుటకు అనర్హులు 3.పాడిన మొత్తంకు 18% జీఎస్టీ పన్ను మరియు 0.5% స్వచ్ఛభారత్ పన్ను వర్తించును. ఈ సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం ప్రకటన ఈ గ్రామ పంచాయతీ కార్యాలయం నోటీస్ బోర్డు నందు మరియు ముఖ్య ప్రదేశములలో ప్రచురించడమైనది

సం/-లంక కొండమ్మ సర్పంచ్, వేములవలస

సం/ పంచాయతీ కార్యదర్శి గ్రామ పంచాయతీ, వేములవలస



**ఫారం INC - 26**

(2014 కంపెనీలు (పొందుపరచిన ) నియమావళి యొక్క 30వ నియమము ననుసరించి) ఒక రాష్ట్రము నుండి మరొక రాష్ట్రమునకు రిజిస్టర్డ్ కార్యాలయం మార్పుటకు వార్తాపత్రికలో ప్రచురించవలసిన ప్రకటన కేంద్ర ప్రభుత్వ సదరన్ రీజియన్ బెంచ్, ఆంధ్రప్రదేశ్ సమక్షం 2013 కంపెనీల చట్టం 13(4) సెక్షన్ మరియు 2014 కంపెనీల (పొందుపరచిన ) నియమావళి యొక్క 30(6) (a) లకు సంబంధించిన అంశము.

మరియు

మెసర్స్ పొత్తూరి కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ( CIN: U21000AP2025PTC122057 )

రిజిస్టర్డ్ కార్యాలయం: APSEZ, లాలంకోడూరు గ్రామం, 27B3, B4, B11, B12, అచ్యుతాపురం, రాంబిల్లి, విశాఖపట్నం, అనకాపల్లి, ఆంధ్రప్రదేశ్, ఇండియా-531061 వారికి సంబంధించిన అంశము

కంపెని తమ రిజిస్టర్డ్ కార్యాలయంను " ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం" నుండి "తెలంగాణ రాష్ట్రం" నకు మార్చుటకు 13 మార్చి 2026, శుక్రవారం నిర్వహించిన కంపెని అసాధారణ సర్వ సభ్య సమావేశం నందు ప్రత్యేక తీర్మానం ద్వారా ఆమోదించి కంపెని అసోసియేషన్ మెమొరాండం మార్పునకు ధృవీకరణ కోరుతూ 2013 కంపెనీల చట్టం 13వ సెక్షన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం వారికి దరఖాస్తు చేయుటకు కంపెని ప్రతిపాదించి నట్లు ఈ ప్రకటన మూలముగా యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయటమైనది. కంపెని రిజిస్టర్డ్ కార్యాలయం మార్పు ప్రతిపాదన పట్ల ప్రభావితమైన ఏ వ్యక్తి అయిన అతని/ఆమె ఆసక్తిని మరియు అతని/ఆమె ఆక్షేపణలు (అభ్యంతరములు) స్వరూపం నకు మద్దతుగా తగిన రుజువులతో పత్రాలను రిజిస్టర్డ్ పోస్టు ద్వారా రీజినల్ డైరెక్టర్, 2వ ఫ్లోర్, కార్పోరేట్ భవన్, GSI పోస్ట్, తట్టిఅన్నారం, నాగోలు, బండ్లగూడ, హైదరాబాద్-500068 వారికి ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి పద్నాలుగు (14) రోజులు లోగా పంపాలి మరియు సదరు కాపీని దరఖాస్తుదారు కంపెని యొక్క దిగువ తెలిపిన రిజిస్టర్డ్ కార్యాలయం చిరునామాకు పంపాలి. రిజిస్టర్డ్ కార్యాలయం : APSEZ, లాలంకోడూరు గ్రామం, 27B3, B4, B11, B12, అచ్యుతాపురం, రాంబిల్లి, విశాఖపట్నం, అనకాపల్లి, ఆంధ్రప్రదేశ్, ఇండియా-531061

తేదీ: 16-03-2026 ప్రదేశం: విశాఖపట్నం

మెసర్స్ పొత్తూరి కెమికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున శ్రీనివాస రాజు కనుమూరి డైరెక్టర్, DIN :02991690



**ఫారం INC - 26**

(2014 కంపెనీలు (పొందుపరచిన ) నియమావళి యొక్క 30వ నియమము ననుసరించి) ఒక రాష్ట్రము నుండి మరొక రాష్ట్రమునకు రిజిస్టర్డ్ కార్యాలయం మార్పుటకు వార్తాపత్రికలో ప్రచురించవలసిన ప్రకటన కేంద్ర ప్రభుత్వ సదరన్ రీజియన్ బెంచ్, ఆంధ్రప్రదేశ్ సమక్షం 2013 కంపెనీల చట్టం 13(4) సెక్షన్ మరియు 2014 కంపెనీల (పొందుపరచిన ) నియమావళి యొక్క 30(6) (a) లకు సంబంధించిన అంశము.

మరియు

మెసర్స్ వశిష్ఠ ఫార్మా కెమ్ ప్రైవేట్ లిమిటెడ్ ( CIN: U24297AP2015PTC096994)

రిజిస్టర్డ్ కార్యాలయం: 27B1, 27B2, 27B13, 27B14 APSEZ, డీనోటిఫైడ్ ఏరియా, అచ్యుతాపురం, రాంబిల్లి, విశాఖపట్నం, అనకాపల్లి, ఆంధ్రప్రదేశ్, ఇండియా-531061 వారికి సంబంధించిన అంశము

కంపెని తమ రిజిస్టర్డ్ కార్యాలయంను " ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం" నుండి "తెలంగాణ రాష్ట్రం" నకు మార్చుటకు 13 మార్చి 2026, శుక్రవారం నిర్వహించిన కంపెని అసాధారణ సర్వ సభ్య సమావేశం నందు ప్రత్యేక తీర్మానం ద్వారా ఆమోదించి కంపెని అసోసియేషన్ మెమొరాండం మార్పునకు ధృవీకరణ కోరుతూ 2013 కంపెనీల చట్టం 13వ సెక్షన్ పరిధిలో కేంద్ర ప్రభుత్వం వారికి దరఖాస్తు చేయుటకు కంపెని ప్రతిపాదించి నట్లు ఈ ప్రకటన మూలముగా యావన్మంది ప్రజానీకమునకు తెలియచేయటమైనది. కంపెని రిజిస్టర్డ్ కార్యాలయం మార్పు ప్రతిపాదన పట్ల ప్రభావితమైన ఏ వ్యక్తి అయిన అతని/ఆమె ఆసక్తిని మరియు అతని/ఆమె ఆక్షేపణలు (అభ్యంతరములు) స్వరూపం నకు మద్దతుగా తగిన రుజువులతో పత్రాలను రిజిస్టర్డ్ పోస్టు ద్వారా రీజినల్ డైరెక్టర్, 2వ ఫ్లోర్, కార్పోరేట్ భవన్, GSI పోస్ట్, తట్టిఅన్నారం, నాగోలు, బండ్లగూడ, హైదరాబాద్-500068 వారికి ఈ ప్రకటన ప్రచురించిన తేదీ నుండి పద్నాలుగు (14) రోజులు లోగా పంపాలి మరియు సదరు కాపీని దరఖాస్తుదారు కంపెని యొక్క దిగువ తెలిపిన రిజిస్టర్డ్ కార్యాలయం చిరునామాకు పంపాలి. రిజిస్టర్డ్ కార్యాలయం: 27B1, 27B2, 27B13, 27B14 APSEZ, డీనోటిఫైడ్ ఏరియా, అచ్యుతాపురం, రాంబిల్లి, విశాఖపట్నం, అనకాపల్లి, ఆంధ్రప్రదేశ్, ఇండియా-531061

తేదీ:16-03-2026 ప్రదేశం: విశాఖపట్నం

మెసర్స్ వశిష్ఠ ఫార్మా కెమ్ ప్రైవేట్ లిమిటెడ్ తరపున శ్రీనివాస రాజు కనుమూరి అదనపు డైరెక్టర్, DIN :02991690

ong-9_ong-9.qxd 3/21/2026 11:22 PM Page 1



# మైనర్ల చేతుల్లో సిగరెట్లు..!

- పొగతోపాటు పెరుగుతున్న నిర్లక్ష్యం
- విశాఖలో నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు
- శివాజీ పార్క్ రోడ్డులో అర్ధరాత్రి వరకు దుకాణం..!
- స్థానికుల్లో ఆందోళన

(విశాఖ క్రైమ్, ప్రభాతవార్త)

మైనర్లకు పొగాకు ఉత్పత్తుల విక్రయం నిషేధమని చట్టం స్పష్టంగా చెబుతున్నా, నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రం ఆ నిబంధనలు కాగితాలకే పరిమితమవుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. విశాఖలోని ఎంవీపీ పోలీస్‌స్టేషన్ పరిధి లక్ష్మీనగర్, శివాజీ పార్క్ రోడ్డులో వాష్ అండ్ వాక్స్ కార్ వాష్ సమీపంలో ఉన్న ఓ కిరాణా అండ్ జనరల్ స్టోర్‌లో మైనర్లకు సిగరెట్లు విక్రయిస్తున్నారన్న ఆరోపణలు స్థానికుల్లో ఆందోళన కలిగిస్తున్నాయి. పొగతోపాటు పెరుగుతున్న నిర్లక్ష్యం స్థానికుల వివరాల ప్రకారం సంబంధిత దుకాణం వద్ద విద్యార్థులు, యువకులు సులభంగా సిగరెట్లు కొనుగోలు చేస్తున్నట్లు కనిపిస్తోందని చెబుతున్నారు. చిన్న వయసులోనే అలవాట్లకు గురయ్యే ప్రమాదం ఉన్నప్పటికీ, విక్రయాలపై ఎలాంటి నియంత్రణ లేకపోవడం ఆందోళనకరంగా మారింది. మైనర్లకు విక్రయాలు జరగకూడదన్న ప్రాథమిక నిబంధనలను కూడా పట్టించుకోవడం లేదని స్థానికులు అంటున్నారు. అర్ధరాత్రివరకు తెరిచే దుకాణం పోలీసులు రాత్రి 10 గంటలకల్లా దుకాణాలు మూసివేయాలని పలుమార్లు హెచ్చరిస్తున్నప్పటికీ, సదరు దుకాణం అర్ధరాత్రి వరకు తెరిచి ఉంచుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. రాత్రివేళల్లో దుకాణం



వద్దకు చేరే మద్యం సేవించినవారికి కూడా సిగరెట్లు విక్రయిస్తున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. దీంతో ఆ ప్రాంతంలో రాత్రి వేళల్లో రాకపోకలకు అంతరాయం కలుగుతోందని చెబుతున్నారు. బహిరంగ ధూమపానం.. మహిళలకు ఇబ్బందులు దుకాణం వద్దే కొందరు బహిరంగంగా సిగరెట్లు తాగడం సాధారణంగా మారిందని స్థానికులు వాపోతున్నారు. అటుగా వెళ్లే మహిళలు, వృద్ధులు, కుటుంబ సభ్యులు అసౌకర్యానికి గురవుతున్నారని చెబుతున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చట్టరీత్యా నేరమని తెలిసినా, ఆ నిబంధనలు అమలు కానట్టే పరిస్థితి కనిపిస్తోందని అభిప్రాయపడుతున్నారు. చట్టం ఎక్కి? మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అమలు చేస్తున్న సిగరెట్లు ఇతర పొగాకు ఉత్పత్తుల చట్టం (కాట్పా) ప్రకారం 18 ఏళ్లలోపు వారికి పొగాకు ఉత్పత్తుల విక్రయం నిషేధం. అలాగే బహిరంగ ప్రదేశాల్లో ధూమపానం చేసినా జరిమానా విధించే నిబంధనలు ఉన్నాయి. విద్యాసంస్థల సమీపంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపైనా పరిమితులు అమల్లో ఉన్నాయి. చర్యలు



తీసుకోవాలంటున్న స్థానికులు ఈ అంశంపై విశాఖ నగరంలోని ఎంవిపి పోలీస్ స్టేషన్ పరిధిలోని పోలీసులు దృష్టిసారించి తనిఖీలు నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తున్న దుకాణాలపై చర్యలు తీసుకుని, మైనర్లకు సిగరెట్ విక్రయాలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

## రైలు ప్రయాణికుల ల్యాప్‌టాప్‌లు, నగదు చోరీ..

**- పాత నేరస్తుడు అరెస్ట్**



(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)

రైళ్లలో ప్రయాణిస్తున్న వారి ల్యాప్‌టాప్‌లు, నగదు అపహరిస్తున్న పాత నేరస్తుడిని జీఆర్పీ పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి మూడు ల్యాప్‌టాప్‌లు, నగదు స్వాధీనం చేసుకు న్నారు. జీఆర్పీ, ఆర్‌పిఎఫ్ సిబ్బంది సంయుక్తంగా విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా తిరుగుతున్న కాకినాడ జిల్లాకు చెందిన అనంత దుర్గారావు (27)ను అదుపులోకి తీసుకుని విచారించారు. తనిఖీల్లో అతని వద్ద సుమారు రూ.50 వేల విలువైన మూడు ల్యాప్‌టాప్‌లు, రూ.20 వేల నగదు లభ్యమయ్యాయి. స్వాధీనం చేసుకున్న వస్తువులతో పాటు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచినట్లు పోలీసులు తెలిపారు. విచారణలో అతడు గతంలో కూడా వివిధ రైల్వే పోలీస స్టేషన్ల పరిధిలో ల్యాప్‌టాప్ దొంగతనాల కేసుల్లో నిందితుడిగా ఉన్నట్టు వెల్లడైంది. రైలు ప్రయాణికులు తమ విలువైన వస్తువుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే రైల్వేపోలీసులకు సమాచారం అందించాలని జీఆర్పీ సీఐ ధనుంజయనాయుడు సూచించారు.

## రంజాన్ పండుగ క్రమశిక్షణ..

**- దాతృత్వం సోదరభావానికి ప్రతీప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గణబాబు**

గాజువాక,మార్చి 21,ప్రభాతవార్త



రంజాన్ పండుగ క్రమశిక్షణ, దాతృత్వం,సోదరభావానికి ప్రతీక అని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, విశాఖ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గణబాబు పేర్కొన్నారు. శనివారం రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని నియోజకవర్గ పరిధిలోని ముస్లిం సోదరులతో కలిసి ఆయన వేడుకల్లో పాల్గొన్నారు. శ్రీహరిపురం ప్రధాన రహదారి సమీపంలోని ఈద్గా,ఖబ్రిస్థాన్ ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లిం సమాజానికి ఆయన పవిత్ర రంజాన్ (ఈద్‌ఉల్‌ఫితర్) శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గణబాబు మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ముస్లింల సంక్షేమానికి తాము ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటామని, ఈ పవిత్ర పర్వదినం అందరి జీవితాల్లో సుఖశాంతులు నింపాలని ఆకాంక్షించారు. ముస్లిం సమాజానికి ఎమ్మెల్యే గణబాబు అందిస్తున్న నిరంతర సేవలను గుర్తించి, ముస్లిం వెల్ఫేర్ ట్రస్ట్ ప్రతినిధులు ఆయనను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ముస్లిం సోదరులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయనిధి

**- కొండంత అండఏపీటీడీపి అధ్యక్షులు,ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**

గాజువాక,మార్చి 21,ప్రభాతవార్త




ఆపదలో ఉన్న పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి కొండంత అండగా నిలుస్తుందని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలోని 72వ వార్డుకు చెందిన సిహెచ్. రోహిత్‌కు మంజూరైన రూ. 2,97,048 ఆర్థిక సహాయం చెక్కును ఎమ్మెల్యే చేతుల మీదుగా లబ్ధిదారుడికి అందజేశారు. 72వ వార్డు టీడీపీ అధ్యక్షులు అక్కిన లక్ష్మణరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గాజువాక నియోజకవర్గ ఇన్‌చార్జ్ ప్రసాదు శ్రీనివాస్ పాల్గొని మాట్లాడారు. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న రోహిత్ కుటుంబానికి ఈ ఆర్థిక సాయం ఎంతో ఊరటనిస్తుందని వారు తెలిపారు. ప్రభుత్వం ద్వారా అందుతున్న ఇటువంటి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ సిహెచ్. కన్నారావు, డి. విజయసాయి, డి.వి. సత్యరావు, బి. సురేష్ బాబు, తుమ్మల నాగేశ్వరరావు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆటోను ఢీకొట్టిన లారీ..!

**- ఇద్దరికి తీవ్రగాయాలు.. ఫ్లైఓవర్‌పై స్తంభించిన ట్రాఫిక్**

**- మహిళ లారీ కింద చిక్కుకుపోవడంతో కలకలం**

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)



నగరంలోని విశాఖ వెస్ట్ పరిధిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదం కలకలం రేపింది. ఎన్ఏడి కొత్త రోడ్డు ఫ్లైఓవర్ నుంచి కాకాని నగర్ జంక్షన్ వైపు వేగంగా వెళ్తున్న లారీ, ముందుగా వెళ్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాదం తీవ్రతతో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ లారీ కింద భాగంలో చిక్కుకుపోయింది. స్థానికులు, పోలీసులు కలిసి ఆమెను బయటకు తీయడానికి శ్రమించారు. అనంతరం గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనతో ఎన్ఏడి కొత్త రోడ్డు ఫ్లైఓవర్ పైభాగం, కిందభాగంలో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## ఓటర్ల జాబితాపై అప్రమత్తంగా ఉండాలి

**- విశాఖ పశ్చిమ నియోజకవర్గం ఇంచార్జ్ మళ్ల విజయప్రసాద్**

గాజువాక,మార్చి 21,ప్రభాతవార్త



ఎన్నికల ప్రక్రియలో బూత్ కమిటీలది కీలక పాత్ర అని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ మళ్ళ విజయ ప్రసాద్ పేర్కొన్నారు. శనివారం పశ్చిమ నియోజకవర్గ క్యాంప్ కార్యాలయంలో పార్టీ పరిశీలకులు డాక్టర్ జహీర్ అహ్మద్ ఆధ్వర్యంలో బూత్ లెవల్ ఏజెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టనున్న ఓటర్ల జాబితా సవరణలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఓట్లను సరిచూసుకోవాలని సూచించారు. సాంకేతికతను అడ్డం పెట్టుకుని ఓట్లను తారుమారు చేసే అవకాశం ఉందని, మన ఓటర్ల పేర్లు గల్లంతు కాకుండా నిఘా ఉంచాలని కోరారు. అక్రమాలను అడ్డుకునేందుకు అవసరమైతే నియోజకవర్గ స్థాయిలో ఖిటాస్క్‌ఫోర్స్‌ఖి బృందాలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జియ్యని శ్రీధర్, బల్ల లక్ష్మణ్ రావు, గులివిందల లావణ్య, వార్డు అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆపదలో ఉన్న స్నేహితురాలకు రూ. లక్ష ఆర్థిక సాయం

ఆనందపురం, మార్చి21, ప్రభాతవార్త



కష్టంలో ఉన్న మిత్రురాలకు తోటి మిత్రులు అండగా నిలిచారు. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2011 లో చదివిన పదోతరగతి విద్యార్థులు కష్టంలో ఉన్న తమ తోటి స్నేహితురాలకు రూ. లక్ష ఆర్థిక సాయం చేశారు. ఆనందపురం మండలం వేములవలస గ్రామానికి చెందిన బోద ఆమని భర్త ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఇద్దరు పిల్లలతో ఆమె ఇబ్బంది పడడం చూసి చలించిన మిత్రులు అందరూ తమ వంతు సహాయంగా రూ. లక్ష సేకరించి శనివారం అందజేశారు. ఆమె పాప పేరు మీద ఫిక్స్ డ్ డిపాజిట్ చేస్తామని చెప్పారు.

## యువతకు ఉపాధి కల్పనలో శిక్షణ సంస్థల పాత్ర కీలకం

**- ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**

గాజువాక,మార్చి 21,ప్రభాతవార్త



నిరుద్యోగ యువతకు ఉపాధి మార్గాలు చూపడంలో టెక్నికల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు మరింత చొరవ తీసుకోవాలని ఏపీటీడీపి అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కోరారు. శనివారం పాత గాజువాకలోని టీడీపీ కార్యాలయంలో ఏపీ టెక్నికల్ ట్రైనింగ్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సాంకేతిక నైపుణ్యం కలిగిన యువతకు దేశ విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని, వారిని నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దడంలో శిక్షణ సంస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని కొనియాడారు. అసోసియేషన్ అధ్యక్షుడు కరణం కనకారావు మాట్లాడుతూ.. యువతకు మెరుగైన శిక్షణ ఇస్తూ వారు జీవితంలో స్థిరపడేలా కృషి చేస్తున్నామన్నారు. త్వరలోనే అసోసియేషన్ నూతన భవనాన్ని ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, అసోసియేషన్ ప్రతినిధులు పరదేశి, అచ్చిబాబు, వెంకటరమణ, రమణ, శ్రీహరి, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

## కార్డన్ సెర్చ్‌లో 11 బైకులు స్వాధీనం

**- రౌడీషీటర్ల ఇళ్ల తనిఖీ.. రెండు బెల్ట్‌షాపులపై చర్యలు**

(విశాఖ క్రైమ్ ప్రభాతవార్త)





పెందుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలోని గంగిరెద్దుల కాలనీలో శనివారం ఉదయం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పెందుర్తి ఇన్‌స్పెక్టర్ కె.వి. సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు, గృహాలను పరిశీలించారు. సరైన పత్రాలు లేని 11 మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు రౌడీషీటర్ల ఇళ్లలో తనిఖీలు నిర్వహించారు. అలాగే అక్రమంగా మద్యం విక్రయాలు జరుగుతున్న రెండు బెల్ట్‌షాపులను గుర్తించి, ఒకరి వద్ద నాలుగు మద్యం సీసాలు, మరొకరి వద్ద ఐదు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. అక్రమ కార్యకలాపాలపై కఠిన చర్యలు కొనసాగుతాయని, ప్రజలు చట్టాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## మారిటైమ్ వర్సిటీ విద్యార్థుల సాహసయాత్ర

గాజువాక,మార్చి 21,ప్రభాతవార్త



మారిటైమ్ యూనివర్సిటీ విశాఖ క్యాంపస్ బి.టెక్ విద్యార్థులు శనివారం కంబాలకొండలో ఉత్సాహంగా ట్రెక్కింగ్ నిర్వహించారు. వర్సిటీ డైరెక్టర్ ఆచార్య కేశవ్ దేవ్ మార్గదర్శకత్వంలో జరిగిన ఈ సాహసయాత్రలో అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి ఇ.పి.ఎస్. భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఖిమీనాస్ వీడియోస్‌ఖి ద్వారా సామాజిక అంశాలపై అవగాహన కల్పించారు. స్వచ్ఛభారత్, బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన, అక్షరాస్యత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించి, చిన్నారుల్లో చైతన్యం ఎలా తీసుకురావాలో వివరించారు. ఈ కార్యక్రమంలో ఆచార్య షీజా జనార్ధన్, డాక్టర్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మార్డుపూడి పరదేశి దంపతులకు శుభాకాంక్షలు

గాజువాక,మార్చి 21,ప్రభాతవార్త

వైకాపా రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి మార్డుపూడి పరదేశి, ఆయన ధర్మపత్ని 34వ వివాహ వార్షికోత్సవ వేడుకలను శనివారం పెదగంట్యాడలో వైకాపా నాయకులు, మిత్రబృందం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో కేక్ కట్ చేసి, దంపతులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. పరదేశి దంపతులు నిండు నూరేళ్ళ ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. అనంతరం స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు నక్క వెంకటరమణ, గోందేశీ శ్రీనివాస్ రెడ్డి, పిట్టా రెడ్డి, గేదల మధుసూదన్ రెడ్డి, తోకాడ అప్పారావు, ధర్మపూరి చక్రవర్తి, ములకలపల్లి వెంకటేష్, వాసా అప్పలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## జాబ్ క్యాలెండర్ విడుదలతో మంత్రి లోకేష్‌కు కృతజ్ఞతలు

ఆనందపురం, మార్చి 21, ప్రభాతవార్త:

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువత ఆకాంక్షలను నెరవేరుస్తూ ఉగాది పర్వదినాన జాబ్ క్యాలెండర్ విడుదల చేసినందుకు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కు భీమిలి నియోజక వర్గ యువ నాయకులు గంటా రవితేజ ధన్యవాదాలు తెలిపారు. తెలుగు నూతన సంవత్సరం సందర్భంగా టీడీపీ యువనేత గంటా రవితేజ ఆధ్వర్యంలో భీమిలి నియోజకవర్గ తెలుగు యువత నాయకులు ప్రతినిధులు తిరుమల



శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుద్యోగుల కష్టాలను గుర్తించి, పక్కా ప్రణాళికతో ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టిన లోకేష్ నిర్ణయం అభినందనీయమన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం ఇలాగే కొనసాగాలని, నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని, ఉపముఖ్య మంత్రి శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ మద్దతుతో ఈ మంచి ప్రభుత్వం రాబోయే 15 ఏళ్ల పాటు సుస్థిరంగా పాలన సాగించాలని శ్రీవారిని మొక్కుకున్నట్లు టీడీపీ యువనేత గంటా రవితేజ పేర్కొన్నారు.

## నేడు గాజువాకలో కూటమి పార్టీల ఆత్మీయ సమావేశం

గాజువాక,మార్చి 21,ప్రభాతవార్త

గాజువాక నియోజకవర్గ స్థాయి తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి పార్టీల ఆత్మీయ సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో జరగనుంది. ఈ మేరకు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, జనసేన ఇన్‌చార్జ్ కోన తాతారావు, బిజెపి ఇన్‌చార్జ్ కరణంరెడ్డి నరసింహారావు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు. కూటమి విజయానికి కృషి చేసిన నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేస్తూ భవిష్యత్తు కార్యాచరణపై చర్చించనున్నారు. కార్పొరేటర్లకు సన్మానం: ఈ సమావేశం సందర్భంగా గాజువాక నియోజకవర్గ పరిధిలోని కూటమి పార్టీలకు చెందిన కార్పొరేటర్లను ఆత్మీయంగా సన్మానించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల రాష్ట్ర, జిల్లా నాయకులు, మహిళా ప్రతినిధులు, అనుబంధ విభాగాల నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ప్రసాదుల శ్రీనివాస్ కోరారు.

## గందవరం గ్రామంలో వైభవంగా శ్రీరామచంద్రుల విగ్రహ ప్రతిష్ఠ

పద్మనాభం, మార్చి 21, ప్రభాతవార్త



మండలంలో గందవరం గ్రామంలో గ్రామ సర్పంచ్ జి వి వి కె వర్మ ఆధ్వర్యంలో శనివారం సీతా రాములు విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంను గ్రామ ప్రజలు వైభవంగా నిర్వహించారు. ముందుగా వేద పండితులు విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం పూజలు చేసారు. అయితే భక్తులవిరాళాలు సుమారు నలభై లక్షలతో నూతనంగా నిర్మించిన రామాలయంలో ముహూర్తం ప్రకారం వేదమంత్రాలు, సన్నాయి మేళాలు, మంగళ వాయిద్యాలతో సీతారాముల విగ్రహాలను ప్రతిష్ఠించారు. భీమిలి వైసీపీ ఇనచార్జి చిన్నశ్రీను సందర్శించి హోమం నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. అయితే శొంఠ్యాం గ్రామంలో ఉన్న గందవరం గ్రామానికి చెందిన గుప్త వెంకటనాగేశ్వరరావు ఆలయ నిర్మానికి ముందుగా సుమారు పదిహేను లక్షల ఇవ్వడంతో గ్రామస్థులు కూడా సహకరించారు. నెలివాడ వెంకటరమణ ఆలయ నిర్మాణంలో శ్రద్ధ కనబర్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు, వైసీపీ అధ్యక్షులు లక్ష్మణరావు, నాయకులు గోవింద, రామకృష్ణ, పాల్గొన్నారు.

## ముస్లింల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**: ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు**

గాజువాక,మార్చి 21,ప్రభాతవార్త



సర్వమత సమైక్యతకు గాజువాక నియోజకవర్గం నిదర్శనమని, ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా గాజువాకలోని బీసీ రోడ్డు ఈద్గా మైదానంలో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు ఖిఈద్ ముబారక్‌ఖి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మసీదు ఇమామ్‌లు, మోజన్‌ల బకాయి జీతాల కోసం రూ. 45 కోట్లు విడుదల చేశారని గుర్తుచేశారు. ఖిసూపర్ సిక్స్‌ఖి పథకాల ద్వారా ముస్లింలకు అనేక సంక్షేమ ఫలాలు అందుతున్నాయని, ఉర్దూ అకాడమీ, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్‌లకు నిధులు మంజూరు చేస్తూ ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు. మసీదులు, ఈద్గాలు, దర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అజీమాబాద్ సున్నీ జామా మసీదు ఇమామ్ షాకిర్ ఆధ్వర్యంలో ఈద్గా మైదానంలో వేలాది మంది ముస్లింలు నమాజ్ నిర్వహించి, ప్రపంచ శాంతి కోసం ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో 66వ వార్డు టీడీపి ఇన్‌చార్జ్ మహమ్మద్ రఫీ, మసీదు ముత్తవల్లిలు మదిన వల్లి, ఆన్సర్ వల్లి, రజివుల్లా, షౌకత్ అలీ, ఆరిఫ్, రెహమాన్, లుక్మాన్, ఇమ్రాన్ గౌస్ తదితరులతో పాటు వివిధ ముస్లిం యూత్ కమిటీల ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



# ఈ ప్రాంతం అభివృద్ధే నా లక్ష్యం..

### స్టీల్ ప్లాంట్ కోసం కొన్ని గ్రామాల ప్రజలు త్యాగం చేశారు.. ఆయా గ్రామాల ప్రజలత్యాగం మరువలేనిది : హోం మంత్రి అనిత

( అడ్డరోడ్డు, ప్రభాతవార్త)



స్టీల్ ప్లాంట్ నిర్మాణం కోసం భూములు ఇచ్చిన రైతుల త్యాగాలను జీవితాంతం మర్చిపోలేని వారి త్యాగమే ఈరోజు ఈ ప్రాంత అభివృద్ధికి ఉపయోగ పడుతుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. శనివారం నక్కపల్లి మండలంలో ఉన్న మంత్రి నివాసం వద్ద విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అనిత మాట్లాడుతూ నక్కపల్లి మండలం టిడిపి కంచుకోటగా నిలిచిందని పేర్కొన్నారు. నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ అందించే మండలంగా నక్కపల్లి ప్రత్యేక స్థానాన్ని సంపాదించిందన్నారు. ఈ ప్రాంత అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, అభివృద్ధి చరిత్రలో తన పేరు నిలవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. స్టీల్ ప్లాంట్ కోసం నక్కపల్లి మండలంలోని అనేక గ్రామాల ప్రజలు చేసిన త్యాగాలను మంత్రి గుర్తుచేశారు. ఆ గ్రామాల ప్రజల త్యాగం మరువలేనిదని, రాష్ట్ర అభివృద్ధి కోసం వారు చేసిన సహకారం ప్రశంసనీయమని అన్నారు. వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. పాయకరావుపేట నియోజకవర్గ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారని తెలిపారు. టాయ్ పార్క్ ఏర్పాటు ద్వారా సుమారు 20 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు కలగనున్నాయని వెల్లడించారు. ఎన్డీఏ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్య క్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని నాయకులకు పిలుపునిచ్చారు. అడ్డురోడ్డులో రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కూడా సాధించామని పేర్కొన్నారు. స్టీల్ ప్లాంట్ స్థాపనతో నక్కపల్లి, పరిసర ప్రాంతాలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతాయని మంత్రి అనిత ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రస్తుతం నక్కపల్లి ప్రాంతం ప్రపంచ పటంలో గుర్తింపు పొందుతోందని అన్నారు. ఈ సమావేశంలో పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవివర్మ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాశి నాయుడు, మండల టిడిపి అధ్యక్షులు గింజల లక్ష్మణరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కురం దాసు నూకరాజు, పిఎసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి, దార్ల కృష్ణ, వెలగా శ్రీనివాసరావు, మార్కెట్ చైర్మన్ దేవర సత్యనారాయణ, జనసేన మండల శాఖ అధ్యక్షులు సుధాకర్, ఎంపిటిసి మెరుగు నాగేశ్వరరావు, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు వైబోయిన వెంకటరమణ, మండల పార్టీ ఉపాధ్యక్షులు ఐనంపూడి అప్పలరాజు, పల్లా రాంబాబు తదితరులు ఉన్నారు.

## రంజాన్ సందర్భంగా ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు

ఎలమంచిలి మార్చి 21 ప్రభాతవార్త



పట్టణంలోని రంజాన్ సందర్భంగా జామియా మసీద్ ఈద్గా స్థలంలో మస్జిద్ హజరత్ ఇద్రీస్ అహ్మద్ ఆధ్వర్యంలో ఈద్ నమాజ్ నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భారీగా ముస్లిం సోదరులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జామియా మసీదు ప్రెసిడెంట్ షేక్ బాబ్జి, సెక్రటరీ షేక్ కన్నా సాహెబ్, షేక్ దరియ, షేక్ ఖాసీం, షేక్ బషీర్ అహ్మద్ బాబ్జి, పీకే కరంతుల్లా, అబ్దుల్ జాకీర్ చోటా, షేక్ అలీ హుస్సేన్, కాజా మోహిద్దీన్, షేక్ గౌస్, షేక్ ఇస్మాయిల్, షేక్ రఫీ, షేక్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

## నూకాంబికను దర్శించుకున్న విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి

అనకాపల్లి మార్చి 21,ప్రభాతవార్త



ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు, రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన అనకాపల్లి గవరపాలెంలోని శ్రీ నూకాంబిక అమ్మవారిని శనివారం విశాఖ రేంజ్ ఐజీ గోపీనాథ్ జెట్టి దంపతులు దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఐజీ దంపతులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ ఈవో వై శ్రీధర్ వారికి అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని అందజేసి ఘనంగా సత్కరించారు. అనకాపల్లి టౌన్ ఇన్ స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ఎస్సై సంతోష్ కుమార్, ధర్మకర్తలు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయడం కూటమి ప్రభుత్వ ఘనవిజయం

### నియోజకవర్గ ప్రజలు స్వచ్ఛందంగా కార్యక్రమాన్ని పాల్గొని విజయవంతం చేయాలి : ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

ఎలమంచిలి, మార్చి 21, ప్రభాతవార్త



పట్టణంలోని జిల్లా పరిషత్ ఎమ్మెల్యే కార్యాల యంలో శనివారం నియోజకవర్గ కూటమి పార్టీల నాయకులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి రోడ్డు భవనాల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ సోమవారం నక్కపల్లిలో జరిగే స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్ర మానికి ప్రజలందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం అయ్యేటట్లు నాయకులు పనిచేయాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఘనవిజయమని, శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, కేంద్ర మంత్రులు పాల్గొనే కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం నియోజకవర్గంలోని నాలుగు మండలాల గ్రామాలకు సంబంధించిన ప్రజలందరూ ఈ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నక్కపల్లిలో గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపనను విజయవంతం చేయండి

### మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్

అనకాపల్లి మార్చి 21, ప్రభాతవార్త



రాష్ట్ర అభివృద్ధికి తల మానికంగా నిలవనున్న ఆర్సిలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఐటీ విద్యాశాఖ మాత్యులు నారా లోకేష్ అతి పెద్ద పారిశ్రామిక పెట్టుబడును అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం చందనాడ గ్రామంలో ఈనెల 23 సోమవారం సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చేతుల మీదగా శంకుస్థాపన కార్యక్రమానికి అనకాపల్లి జిల్లా నుండి ప్రజానీకం తరలివచ్చి విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక రింగ్ రోడ్ లో ఉన్న టిడిపి పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈ గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు మొదటి దశలో 1,35,000 కోట్లు పెట్టుబడులు పెట్టడం వల్ల సుమారు 75 వేల మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి అవకాశాలు రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తుందని నాగ జగదీష్ అన్నారు. స్టీల్ ప్లాంట్ రెండు విడతల్లో 5,300 ఎకరాల్లో ఏర్పాటు కానున్నదని, తొలి విడతలో 8.2 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్నారని 2029 నాటికి ఉత్పత్తి ప్రారంభించడానికి కంపెనీ ప్రతినిధులు చర్యలు తీసుకుంటున్నారని నాగ జగదీష్ అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన 20 నెలలో 6,28 లక్షల ఉద్యోగాలు కల్పించారని, అలాగే ఉగాది పండగ రోజున జాబ్ క్యాలెండర్ 10,060 ఉద్యోగాలకు ప్రకటించారని అన్నారు. గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మినిస్టర్ కొల్లు రవీంద్ర, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, కేంద్ర మంత్రులు పెమసాని చంద్రశేఖర్, కుమారస్వామి, శ్రీనివాసవర్మ, పార్లమెంట్ సభ్యులు శాసనసభ్యులు ప్రజా ప్రతినిధులు కూటమి తెలుగుదేశం జనసేన బిజెపి నాయకులు, కార్యకర్తలు అశేషంగా పాల్గొని విజయవంతం చేయాలని నాగ జగదీష్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కాండ్రేగుల సత్యనారాయణ ఎలమంచిలి బంగారు రాజు కొమ్మోజు రామకృష్ణ పెంటకోట వెంకటరమణ కాండ్రేగుల రవీంద్ర కుప్పిలి జగన్ బోడి వెంకటరావు శ్రీకాకుళం గణపతి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి వేడుకలు ప్రారంభం

(పాయకరావుపేట, ప్రభాతవార్త)



శ్రీరామనవమి ఉత్సవాలకు పాల్తేరు గ్రామంలో ఘనంగా శ్రీకారం చుట్టారు. స్థిరవారం పెళ్లిరాట వేసి ఉత్సవాలకు అం కురార్పణ చేశారు. అధిక సంఖ్యలో మహిళలు భక్తిశ్రద్ధలతో కార్యక్రమంలో పాల్గొని కళ్యాణ మహోత్సవానికి పసుపు దంచారు. సీతారామ చంద్రుల సేవలో పులకించి తరించారు. పాల్తేరు ముత్యాలమ్మ గుడి ఎదురుగా ఉన్న శ్రీ సీతారాముల ఆలయం వద్దమార్చి 27వ తేదీన శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం నిర్వ హించి, అన్నదానంతో వివిధ కార్యక్రమంలు ఆలయ ధర్మకర్త అయినా ప్రముఖ హైకోర్టు న్యాయవాది దేవవ రపు రాంబాబు, మాధవి దంపతుల సారథ్యంలో గ్రామ పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యుల సహకారంతో నిరవధికంగా నవమి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా మార్చి 21వ తేదీ శనివారం సీతారాముల కళ్యాణ మహోత్సవానికి అంకురార్పణ చేసారు. ముత్తైదువలు పెళ్లిరాటను వేసి కళ్యాణ ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. భక్తిశ్రద్ధలతో పసుపు దంచారు. శ్రీరామనవమి ఉత్సవాలలో నిర్వహించు కార్యక్రమాలను ఉత్సవ కమిటీ సభ్యులు వివరించారు. శ్రీరామనవమి పర్వదినాన, ముందుగా సీతారాములకు కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం భారీ అన్న సమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఉత్సవాలలో భాగంగా 27వ తేదీ సాయంత్రం స్వామి అమ్మవార్ల పల్లకి ఊరేగింపు ఉత్సవం జరుపనున్నట్లు తెలిపారు. శ్రీరామనవమి పర్వదినాన, ప్రత్యేక సాంస్కృతి కార్యక్రమాలు, కేరళ డ్రమ్మ్స్, సంస్కృత డాన్స్ ప్రోగ్రాం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించి తరించాలని కోరారు. స్వామి వారి పూజా కార్యక్రమాలలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించాలని దేవవరపు లోవరాజు కుమారుడు , ఆలయ ధర్మకర్త హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు వారి కుటుంబ సభ్యులు పిలుపునిచ్చారు .

## కసింకోట నూరి మసీదులో రంజాన్ వేడుకలు

కశింకోట మార్చి 21, ప్రభాతవార్త



కశింకోట నూరి మసీదులో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. నెల రోజులు ఉపవాస దీక్షల అనంతరం వచ్చే రంజాన్ పండుగను ఈద్-ఉల్-ఫితర్ అంటారు. ఉదయం నుండి మసీదు కు ముస్లిం సోదరులందరూ చేరి నమాజ్ అనంతరం ఒకరికొకరు ఆలింగనాలు చేసుకొని రంజాన్ శుభాకాంక్షలు ఈద్ ముబారక్ తెలుపుకున్నారు ఈ సందర్భంగా టిడిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రెహమాన్ (బాబర్), మసీద్ సెక్రెటరీ రబ్బాని మాట్లాడుతూ ఈ పవిత్ర రంజాన్ మాసంలో నెలవంక ను చూసి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం అవుతాయి అన్నారు. నెలవంకను చూసి ఈదుల్ ఫితర్ పండుగను ఘనంగా జరుపుకుంటాం అన్నారు. ఉపవాసం ఆకలిని నియంత్రచడమే కాకుండా మనసును శుద్ధి చేసి క్రమశిక్షణ నేర్పుతుంది అన్నారు. ఈ నెల అంతా ఖురాన్ పటించడమే కాకుండా రాత్రికి తరావీహ్ నమాజ్ ప్రత్యేకంగా చేస్తామన్నారు. పేదలకు జకాత్ పిత్ర దానాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ రెహమాన్ (బాబర్ ) మసీద్ సెక్రెటరీ రబ్బాని ఇంతియాజ్ షరీఫ్ ఆసిఫ్ అబ్దుల్ రషీద్ ఖాన్ ముస్తఫా హాఫిస్ రెహమాన్ హాజీ మాస్టర్ సార్ సయ్యద్ అన్వర్ షేక్ జాన్ బాషా షేక్ న్యామతుల్లా అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్సను కలిసిన "దగ్గుపల్లి"

(పాయకరావుపేట ,ప్రభాతవార్త)



ఇటీవల శాసన మండలి సభ సమావేశాల్లో అస్వస్థతకు గురై చికిత్స చేయించుకొన్నా శాసన మండలి ప్రతిపక్ష నేత,మాజీ మంత్రి వర్యులు బొత్స సత్యనారాయణ ని వైకాపా అనకాపల్లి జిల్లా అధికార ప్రతినిధి దగ్గుపల్లి సాయిబాబా శనివారం విజయనగరం లో ఉన్న బొత్స ఇంటికి వెళ్లి పరమశించారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)



మండలంలోని ముస్లిం గ్రామాల్లో అతి పవిత్రమైన రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముస్లిం గ్రామాల్లో వేడుకలు ఘనంగా నిర్వహించి ఒకరు ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఉపవాస దీక్షలు ముగించి ప్రత్యేక ప్రార్థన చేశారు. మండలం లోని పెద్ద బోధి గల్లం వద్ద ఉన్న ఈద్గా వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలుపుకొని ప్రార్థన చేశారు. పెద్ద ఎత్తున యువకులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మజ్జిగను పంపిణీ చేశారు.

## గురునాథరావు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలి

### రూరల్ పోలీస్ స్టేషన్‌లో వైసీపీ నేతలు ఫిర్యాదు

అనకాపల్లి రూరల్ మార్చి 21 (ప్రభాతవార్త)



దివాంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై పోలీసులు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్ లో ఎస్సై జి రవికుమార్ కి శనివారం ఫిర్యాదు చేశారు. అనకాపల్లి మండలం తగరంపూడి గ్రామంలో 2019లో దివాంగత మాజీ మంత్రి గుడివాడ గుర్నాథరావు విగ్రహాన్ని ఆయన అభిమానులు, గ్రామస్తులు ఏర్పాటు చేశారు. శనివారం తెల్లవారుజామున కొంతమంది దుండగులు దివాంగత గుర్నాథరావు విగ్రహాన్ని అక్కడనుండి తొలగించే ప్రయత్నంలో ధ్వంసం చేశారు. ఈ విషయం తెలుసుకున్న వైసిపి నేతలు సంఘటనా స్థలానికి చేరుకొని విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులపై చట్టపరంగా తక్షణమే చర్యలు తీసుకోవాలని నిరసన వ్యక్తం చేస్తూ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వైసీపీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ప్రశాంత వాతావరణ కి నిలయమైన అనకాపల్లి పరిసర ప్రాంతాల్లో ఇటువంటి విగ్రహాలను తొలగించి కుల రాజకీయాలు చేయడం తగదన్నారు. కులాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఇటువంటి విధ్వంసాలకు పాల్పడిన మాజీ జెడ్పిటిసి పూసలపాటి భరత్ బాబును ఆయన అనుచరులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గురునాథరావు విగ్రహాన్ని అక్కడ నుండి తొలగించి ఆ స్థానంలో అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ఉద్దేశంతో కొంతమంది వ్యక్తులు ఆ గ్రామ నాయకులతో చర్చించినట్లు తెలిపారు. ఒకసారి విగ్రహం ఏర్పాటు చేసిన తర్వాత తొలగించే హక్కు ఎవరికీ లేదని, అది చట్టవిరుద్ధమని చెప్పినప్పటికీ చట్టానికి విరుద్ధంగా ఈ విధ్వంసానికి ఒడిగట్టారని ఆ గ్రామ సర్పంచ్ యాదగిరి అప్పారావు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు మందపాటి జానకిరామరాజు, గొర్లి సూరిబాబు, జాజుల రమేష్, పెద్ది శెట్టి గోవింద, కొణతాల మురళీకృష్ణ, కె ఎం నాయుడు, బీసెట్టి జగన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా మత్స్య జయంతి.!

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త



మత్య జయంతి సందర్భంగా మండలం లోని రాజయ్యపేటలో గ్రామ రామాలయంలో మహావిష్ణు పూజా కార్యక్రమాలు శనివారం మత్స్యకారులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురువు కందాల అప్పలరాజు, ఎం ఎస్ ఎస్ అభివృద్ధి డివిజన్ అధ్యక్షులు పేర్ల వెంకటేష్, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కదిరి గురునాథ్ రావు, ఎంఎస్ఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు వాసుపల్లి శివ, సిరిపల్లి అప్పలరాజు, పిక్కి పైడితల్లి ,ముత్యాలు ,నాని, సూరిబాబు ,దేవుడు ,ఎజ్జల, తండేలా అప్పలరాజు, లోవ రాజు, గోపి తదితరులు ఉన్నారు

## దర్గాలో వైకాపా రాష్ట్ర నేత వీసం

(నక్కపల్లి ,ప్రభాతవార్త )



రంజాన్ పండుగ సందర్భంగా భక్తిశ్రద్ధలతో శనివారం ఉదయం రాష్ట్ర వైకాపా కార్యదర్శి, విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిశీలకులు వీసం రామకృష్ణ ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలుపుతూ మండలంలోని పెద్ద బోధిగళం దర్గా వద్ద ప్రార్థనలు నిర్వహించారు.

## రామాలయ ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవం

### రూ. 25 వేల విరాళం అందజేసిన జనసేన నాయకులు అప్పన దొరబాబు

నర్సీపట్నం,మార్చి 21,ప్రభాతవార్త



నర్సీపట్నం మున్సిపాలిటీ పాత సంతబయలు 4వ వార్డులో వెలసిన శ్రీరామాలయ ధ్వజస్తంభ ప్రతిష్టా కార్యక్రమం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి జనసేన పార్టీ నాయకులు అప్పన ఎన్ఎస్ జీ దొరబాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి, కార్యక్రమ నిర్వహణకు తన వంతు సహకారంగా రూ.25వేలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని, ఆలయ అభివృద్ధికి అందరూ తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, కొప్పాక కళ్యాణ్, సూరకాసుల గోపి, ఎస్. నానాజీ, మారిశెట్టి రాజా, పోతల గణేష్, పెద్ద సంఖ్యలో జనసైనికులు, వార్డు ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## భక్తుల రక్షణ కోసం కొట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలి

### విశాఖ రేంజ్ ఐజి గోపీనాథ్ జెట్టి

అనకాపల్లి మార్చి 21, ప్రభాతవార్త



నూకాంబిక ఆలయానికి కొత్త అమావాస్య జాతరలో భాగంగా రాబోయే 90 రోజుల పాటు భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కట్టుదిట్టమైన భద్రత చర్యలు తీసుకోవాలని విశాఖ రేంజ్ ఐజి గోపీనాథ్ జెట్టి స్థానిక పోలీస్ అధికారుల కు, ఆలయ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం నూకాంబిక ఆలయానికి దర్శనానికి వచ్చిన ఆయన ఆలయ పరిసరాలను సందర్శించారు. క్యూలైన్లు, భక్తుల సౌకర్యాలు ఏర్పాట్లపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. క్యూ-లైన్ల వద్ద ఎటువంటి తోపులాటలు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. భక్తుల రక్షణ కోసం ఆలయ పరిసరాల్లోని సిసి కెమెరాల పనితీరును నిరంతరం పర్యవేక్షించాలని, కంట్రోల్ రూమ్ ద్వారా నిఘా పెంచాలని సూచించారు. ప్రస్తుతం ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా, క్యూ-లైన్లలో వేచి ఉండే భక్తులకు ఇబ్బంది కలగకుండా చల్లని తాగునీరు, మజ్జిగ సౌకర్యం కల్పించాలని, నీడ కోసం షామియానాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఆలయానికి వచ్చే రహదారుల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా ముందస్తుగా ట్రాఫిక్ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీలా నాగ శ్రీను, ఆలయ ఈవో వై శ్రీధర్, అనకాపల్లి టౌన్ ఇన్ స్పెక్టర్ ప్రేమ్ కుమార్, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ వెంకట్ నారాయణ, ఎస్సై సంతోష్ కుమార్, ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




## డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రైవేట్ పరం చేయవద్దని నిరసన

నర్సీపట్నం,మార్చి 21,ప్రభాతవార్త



ప్రభుత్వం స్కూల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్నం భోజనం పథకాన్ని ప్రైవేటుకరం చేయొద్దని నర్సీపట్నం మండలం వేములపల్లిలో శనివారం మిడ్ డే మీన్స్ కార్మికులు నిరసన చేపట్టారు. సందర్భంగా నాయకురాలు కే.ప్రసన్న మాట్లాడుతూ మధ్యాహ్నం భోజనం పథకం 2002 సంవత్సరం నుండి జిల్లా వ్యాప్తంగా సుమారు 4000 మంది కార్మికులు పనిచేస్తున్నారని, ఇటువంటి పథకాన్ని ప్రైవేట్ పరం చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని వెంటనే విరమించుకోవాలన్నారు. పెండింగ్లో ఉన్న బకాయిలు బిల్లులు విడుదల చేయాలని, మెనూ చార్జీ పెంచామని ప్రకటన చేశారని ఇప్పుడు వరకు అమలు కాలేదని, తక్షణమే అమలు చేయాలన్నారు. మధ్యాహ్నం భోజనం కార్మికులకు కనీస వేతనాలు 10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఈరెల్లి చిరంజీవి పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు పర్యటన విజయవంతం చేయాలి :ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి మార్చి 21, ప్రభాతవార్త



నక్కపల్లి మండలం చందనాడ గ్రామంలో ఈ నెల 23న గ్రీన్ ఫీల్డ్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ కూటమి నాయకులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం స్థానిక రింగ్ రోడ్డులో గల జనసేన పార్టీ కార్యాలయం నందు, నియోజకవర్గ కూటమి ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు పర్యటనకు అనకాపల్లి నియోజకవర్గం నుండి భారీ స్థాయిలో కూటమి నాయకులు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో, పిఠాపురం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వర్మ, మాజీ శాసనసభ్యులు తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పీలా గోవింద సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు , బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు , మాజీ ఎమ్మెల్సీ బుద్ధ నాగ జగదీష్ , గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర , డీసీఎంఎస్ చైర్మన్ కొట్ని బాలాజీ , కూటమి నాయకులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన ఏర్పాట్లును పరిశీలించిన హోం మంత్రి అనిత

### ప్రజలకు అసౌకర్యాలు కలగకూడదు ..భద్రత ఏర్పాట్లపై అప్రమత్తంగా ఉండాలి :హోంమంత్రి అనిత

(నక్కపల్లి, ప్రభాతవార్త)



మండలంలో ఈ నెల 23న జరగనున్న ప్రతిష్టాత్మక ఆర్సిలర్ మిట్టల్- నిప్పన్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత క్షేత్రస్థాయిలో పరిశీలిం చారు. ప్రతిరోజూ పనుల పురోగతిని మంత్రి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఈ సందర్భంగా సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్ సత్యనారాయణ రాజు, ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ శౌర్యమన్ పటేల్, వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్ గోపాల్, మార్క్ఫెడ్ చైర్మన్ బంగారు రాజు లతో కలిసి చర్చించారు. అనంతరం భద్రతా ఏర్పాట్లపై హోం మంత్రి అనిత పోలీస్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అనకాపల్లి ఎస్పీ తుహిన్ సిన్హా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, భద్రతా ఏర్పాట్లపై వివరించారు. ఈ సమీక్షలో విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, మన్యం జిల్లాల నుండి పోలీస్ అధికారులు పాల్గొన్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, స్పీకర్, ఎమ్మెల్యేలు మరియు భారీ సంఖ్యలో ప్రజలు హాజరుకానున్న నేపథ్యంలో భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి ఆదేశించారు. వీఐపీలకు, సాధారణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ నిర్వహణను పక్కాగా అమలు చేయాలని, విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఆర్డీవో వివి రమణ, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాసినాయుడు, పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ,కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకలపాటి రవి వర్మ, టిడిపి నాయకుడు గుర్రం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు, జిల్లా పార్టీ ఉపాధ్యక్షులు కురం దాసు నూకరాజు ఉన్నారు.

## ప్రజా సమస్యల వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కొణతాల

అనకాపల్లి మార్చి 21 :(ప్రభాతవార్త)

స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో అనకాపల్లి నియోజకవర్గ ప్రజల నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను శనివారం మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ స్వీకరించారు. సమస్యలను శ్రద్ధగా విన్న ఆయన సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు.

## శ్రీ మత్స్య నారాయణ స్వామి జయంతి ఉత్సవాలు

(రాంబిల్లి మార్చి 21 ప్రభాతవార్త)



రాంబిల్లి మండలం వాడ నరసాపురం గ్రామంలో శ్రీ మత్స్య నారాయణ స్వామి జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని పూజలు చేశారు, అనంతరం మత్స్యకారులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు, ఈ కార్యక్రమానికి ఎస్ ఏ ఆర్ డి ఎస్ (ఎన్జీవో) జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ గంగమ్మ మాట్లాడుతూ మత్స్య కార్మికుల సంక్షేమం కోసమే పనిచేయడం జరుగుతుందని అన్నారు, రొయ్యల చెరువులలో పనిచేస్తున్న మత్స్య కార్మికులకు ఆరోగ్యం భద్రత వంటి అంశాలపై అవగాహనతో పాటు రొయ్యల పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు కనీస జాగ్రత్తలు పాటించాలని సూచించారు, ఎం ఎస్ ఎస్ రాష్ట్ర ప్రచార కార్యదర్శి గురునాథ్ మాట్లాడుతూ మొదట మత్స్య అవతారం ఆవిర్భావం గురించి వివరించారు, మత్స్యకారులకు విద్యా వైద్యం క్రీడలు మహిళా సాధికారత పర్యావరణ పరిరక్షణ ఆధ్యాత్మికత భావాలు పెంపొందించడానికి ఎంఎస్ఎస్ కృషి చేస్తుందని ఆయన తెలిపారు, ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, బిజెపి మండల అధ్యక్షులు కారే రాముడు, నూకరాజు, మంగరాజు, సర్పంచ్ కారే రాముడు, మహిళలు మరియు రొయ్యల పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొనాలని కరపత్రాలు పంపిణీ

ఎస్.రాయవరం మార్చి 21 ప్రభాత వార్త



మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో శనివారం సుంకర శ్రీను ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈనెల 23వ తేదీన నక్కపల్లిలో జరుగు అర్చేలర్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమనకు విచ్చేయుచున్న రాష్ట్రం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు మరియు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ విచ్చేసిన సందర్భంగా ఈ భారీ బహిరంగ సభకు మండల ప్రజలందరూ పాల్గొనాలని ఈ కార్యక్రమం హోం మంత్రి వంగలపూడి అనిత ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని ఈ కార్యక్రమనకు మండల ప్రజలు కార్యకర్తలు నాయకులు తరలి రావాలని కరపత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ

( ఎస్ రాయవరం మార్చి 21 ప్రభాతవార్త )



మండలంలోని ఎస్ రాయవరం గ్రామంలో ముస్లిం అతి పవిత్రమైన రంజాన్ పండుగను శనివారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ముస్లిం వేడుకలను మసీదు లోనిర్వహించి ఒకరు ఒకరు శుభాకాంక్షలు తెలుపు కున్నారు. ఉపవాస దీక్షలు ముగించి ప్రత్యేక ప్రార్థన చేశారు. ఎస్.రాయవరంలో వద్ద ఉన్న ఈద్గా వద్దకు వెళ్లి శుభాకాంక్షలు తెలుపుకొని ప్రార్థన చేశారు. పెద్ద ఎత్తున యువకులు ఈ కార్యక్రమాల్లో షేక్ యాసిన్ ఎస్.రాయవరం పీర్ల పంజా, మస్జిద్ ముత్తవల్లి, మస్జిద్ హజరత్ నూరే నజర్ మస్జిద్‌లో గురువు గ్రామం ముస్లిమ్స్ అలాగే లింగరాజుపాలెం గ్రామం ముస్లిమ్స్ ప్రజలు ఈ ఈద్-ఉల్ -ఫిత్ర నమాజ్‌లో పాల్గొన్నారు.

## నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ఎస్ రాయవరం మార్చి 21 ప్రభాత వార్త



మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో దుర్గంబిక ఆలయం సమీపంలో ఆదివారం అచ్యుత్ హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైమ నేత్రాలయం పాయకరావుపేట వారిచే ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని సియ్యాదుల అచ్యుత్ కుమార్ (నాని) తెలిపారు. గ్రామ మరియు పరిసరాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉచితంగా కంటే పరీక్షలు చేసి మందులు అందజేస్తారని ఆయన తెలియజేశారు.

## భవన నిర్మాణ బోర్డు పునః ప్రారంభం

పాయకరావుపేట మార్చి 21 ప్రభాతవార్త



పాయకరావుపేట, తుని,శ్రీ సాయి శ్యామల తాపీ మేస్త్రి సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు ఆధ్వర్యంలో శనివారం ఉదయం భవన నిర్మాణ బోర్డు పునః ప్రారంభ కృతజ్ఞతగా కూటమి నేతలు, తాపీ మేస్త్రీలు, సీఎం చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనిత చిత్రపటాలకు పాయకరావుపేట సూర్య మహల్ జంక్షన్లో పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు .ఈ సందర్భంగా కూటమినేతలైన రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్డి చిట్టిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు చంచలపుప్రదీప్, పట్టణ పార్టీ అధ్యక్షుడు యాళ్ల వరహాలు బాబు, తాపీ మేస్త్రీల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో భవన నిర్మాణ బోర్డు ఎత్తివేయడంతో కార్మికులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. నారా లోకేష్ పాదయాత్రలో భవన నిర్మాణ కార్మికులు భవననిర్మాణ బోర్డు లేకపోవడం వల్ల కార్మికులు పడుతున్న ఇబ్బందులను తెలియజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ విషయంపై నారా లోకేష్ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భవన నిర్మాణ బోర్డు పునః ప్రారంభిస్తామని హామీ ఇచ్చారని ఆ హామీ మేరకు భవన నిర్మాణ బోర్డు పునః ప్రారంభించడం జరిగిందని కూటమి నేతలు తెలియజేయడం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు తిరిగి భవన నిర్మాణ బోర్డు ప్రారంభించడమే కాకుండా ప్రారంభించిన వెంటనే భవన నిర్మాణ బోర్డుకు నిధులు మంజూరు చేసి భవన నిర్మాణ కార్మికుల కళ్ళల్లో ఆనందం నింపారన్నారు ఈ కార్యక్రమంలో పల్లా విలియం కేరి, గుటూరుశ్రీనివాస్, గొల్లపల్లి నాగు, ఆచంట దొర, ఆది, కలిగట్ల శ్రీను, భవన నిర్మాణ సంఘం నాయకులు, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్టమైన బందోబస్తు

### -అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్‌పై సమీక్ష

(నక్కపల్లి/ అడ్డు రోడ్డు, ప్రభాతవార్త )



మండలంలోని చందనాడ రెవెన్యూ పరిధిలోని తమ్మయ్యపేట వద్ద ఈ నెల 23న సోమవారం మధ్యాహ్నం ప్రతిష్టాత్మక జరగనున్న ఆర్సిలర్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ భూమి పూజ కార్యక్రమం జరుగుతుంది ఈ నేపథ్యంలో భద్రత ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జిల్లా యంత్రాంగం పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో పాటు, కేంద్ర మంత్రులు హెచ్. డి. కుమారస్వామి, కింజరపు రామ్మోహన్ నాయుడు, భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, హోం మంత్రి వంగలపూడి అనిత ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఇతర ఉన్నతాధికారులు శనివారం క్షేత్రస్థాయిలో అడ్వాన్స్ సెక్యూరిటీ లైజన్ నిర్వహించి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. ముఖ్యమంత్రి హెలికాప్టర్ దిగే హెలిప్యాడ్ ప్రాంతాన్ని, అక్కడి నుండి సభా ప్రాంగణం వరకు ఉన్న కాన్వాయ్ రూట్‌ను ఎస్పీ తోపాటు జిల్లా అధికారులతో హోం మంత్రి అనిత నిశితంగా పరిశీలించారు. ప్రతి శాఖకు కేటాయించిన విధులను ఎలాంటి లోటుపాట్లు లేకుండా నిర్వర్తించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. ముఖ్యంగా హెలిప్యాడ్ వద్ద సభా ప్రాంగణంలో పటిష్టమైన బందోబస్తు ఉండాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, సామాన్య ప్రజల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ ఆదేశించారు. జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం భద్రతలో ఎలాంటి రాజీ పడకూడదని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని ఎస్పీ కోరారు. ఈ సందర్భంగా హోం మంత్రి శ్రీమతి వంగలపూడి అనిత అధికారులతో మాట్లాడుతూ.. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధిలో ఈ స్టీల్ ప్లాంట్ కీలకమని, ఇంతటి భారీ కార్యక్రమానికి విచ్చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులకు, అతిథులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా భద్రతా ప్రోటోకాల్స్‌ను పక్కాగా అమలు చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షలో జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, అడిషనల్ డైరెక్టర్ ఎస్.ఎస్.ఎస్.వి. కృష్ణారావు, ఎస్.ఎస్.ఓ ఆర్.పి.ఎల్.శాంతి కుమార్, అదనపు ఎస్పీలు ఎం.దేవ ప్రసాద్, ఎల్.మోహన రావు, ఆర్డీవో వీవీ రమణ, ఎస్.బి డీఎస్పీ జీ.ఆర్.ఆర్.మోహన్, నర్సీపట్నం సబ్ డివిజన్ డీఎస్పీ పి.శ్రీనివాసరావు , ఇతర డీఎస్పీలు, జిల్లా స్థాయి అధికారులు సీఐ లు జూరెడ్డి మురళి ,ఎల్ .రామకృష్ణ, అప్పన్న, ఎస్సై సన్నీ బాబు తదితరులు ఉన్నారు.

## జనసేనలో పలువురు చేరిక.!

(నక్కపల్లి, ప్రభాతవార్త



నక్కపల్లి ట్టణానికి చెందిన సీనియర్ నాయకులు కర్రి నానాజి, ముద్దా పెద బాబ్జి, కర్రి మనోహర్, పవన్ కళ్యాణ్ సిద్ధాంతాలకు రాష్ట్ర అభివృద్ధిలో పవన్ కళ్యాణ్ పని తీరుకు ఆకర్షితులై నియోజకవర్గ ఇంచార్జి గెద్దం బుజ్జి ఆధ్వర్యంలో జనసేన సభ్యత్వం తీసుకుని జనసేన లో చేరారు. వీరికి గెద్దం బుజ్జి ఆదేశాలతో మండల అధ్యక్షులు వెలగా సుధాకర్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షులు నల్లల రత్నాజి, మండల కార్యదర్శి కట్టా సతీష్, గర్లంక దివాణం తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్

(నక్కపల్లి, ప్రభాతవార్త



జాతీయ మత్స్యాకార సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా మండలంలోని బంగారమ్మ పేట గ్రామానికి చెందిన కొవ్వూరి వెంకటేష్ నియామితుల య్యారు. వెంకటేష్ మాట్లాడుతూ రాష్ట్ర కమిటీ నాపై నమ్మకం ఉంచి నాకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పదవి ఇచ్చినం దుకు రాష్ట్ర కమిటీ వారికి ధన్య వాధములు తెలిపారు. మత్స్యకారుల సమస్యలపై పని చెస్తానని అన్నారు. మత్స్యకారుల అభివృద్ధి సాధిశిచాలంటే చదువు ద్వారా సాధ్యం అని అన్నారు. ప్రస్తుత ప్రభుత్వశీ మత్స్యాకారు ల కోరకు సశీక్షేమ పథకాలు, విద్యా కై అధిక ప్రాధాన్యత ఇస్తుంధని అన్నారు.రాష్ట్రంలోఏ చోట మత్స్యకారులకు కష్టం వచ్చీనా మత్స్యకారులు అందరు సమిష్టిగా పోరాదుతామని వెంకటేష్ అన్నారు.

## భారత చైతన్య యువజన పార్టీ పాయకరావుపేట నియోజకవర్గం లీగల్ కన్వీనర్‌గా ఎలమంచిలి రవి తేజ

నక్కపల్లి, ప్రభాతవార్త





భారత చైతన్య యువజన పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర యాదవ్ ఆధ్వర్యంలో పాయకరావుపేట నియోజకవర్గం అనుబంధ సంఘాల కార్యవర్గాలను ప్రకటించింది. ఈ మేరకు నక్కపల్లి మండలం వర్కింగ్ అధ్యక్షులుగా నమ్మి అప్పలరాజు, పాయకరావుపేట నియోజకవర్గం లీగల్ సెల్ కన్వీనర్ గా న్యాయవాది ఎలమంచిలి రవితేజ లను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులకు రవితేజ తో పాటు నమ్మి అప్పలరాజు లు రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర యాదవ్, నియోజకవర్గ యూత్ కన్వీనర్ కొర్ని నాగేంద్రబాబు లకు కృతజ్ఞతలు తెలిపారు. భారత చైతన్య యువజన పార్టీ నియోజకవర్గంలో అభివృద్ధి చెందేందుకు కృషి చేస్తామని న్యాయవాది రవితేజ తెలిపారు.

## ఆయన తీరు.. ప్రశంసించక తప్పదు మరో మారు..!

### గిరిజన యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేసిన దుమంతి సత్యనారాయణ

కొయ్యూరు మార్చి 21 ప్రభాతవార్త



నిత్యం ఏదో ఒక సేవా కార్యక్రమంతో ముందుండే మండలంలోని కొయ్యూరు గ్రామానికి చెందిన రెవిన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ మరో మారు తన సేవా తీరుతో పలువురు ప్రశంసలు అందుకుంటున్నారు. గ్రామాల్లో ఉన్న యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, అందరు ఐక్యతతో సన్మార్గంలో నడవాలని, సంతోషంగా ఉంటూ ప్రతీ రోజు సాయంత్రం సమయాన్ని కనీసం ఒక గంట పాటు యువత వాలీ బాల్ తదితర క్రీడలు ఆడాలనీ, దీనివలన ఆరోగ్యంతో పాటు ఐక్యత వచ్చి, మంచి ఆలోచనలతో సమాజంలో గౌరవం పెరుగుతుందని భావించిన ఆయన గిరిజన యువతకు తన వంతు సాయంగా వాలీబాల్ కిట్లు అందించారు. అలాగే త్వరలో వివిధ ఉద్యోగాల భర్తీ కొరకు జారీ చేయు నోటిఫికేషన్‌ల కొరకు నిరుద్యోగ యువత కు డిస్సీ ,గ్రూప్ 1,2 స్టడీ మెటీరియల్ కూడా పంపిణీ చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ఆదివారం మండలంలోని బూద రాళ్ళ గ్రామ పంచాయతీ పరిధిలోగల బాలరేవుల, పిడుగురాయి, నూకరాయితోట, జువ్విరేవుల, లోయల పాలెం గ్రామాలలో ఉన్న యువతకు వాలీ బాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దుమంతి రామక్రిష్ణ, తుచ్చసలీం, అయిదు గ్రామాల యువత పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు..!

కొయ్యూరు మార్చి 21 ప్రభాతవార్త



మండల కేంద్రమైన రాజేంద్రపాలెంతో పాటు పలు గ్రామాలలో శనివారం ముస్లింలు రంజాన్ వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా మండల కేంద్రమైన రాజేంద్రపాలెం బిలాల్ మస్జిద్ లో రాజేంద్రపాలెం తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ముస్లింలు ప్రత్యేక ప్రార్థన నిర్వహించి, శాంతి, సమానత్వం, మానవత్వం, వ్యక్తిగత సామాజిక జీవనోపాధి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలంతా తమ ఇంటిల్లిపాది ప్రత్యేక వంటకాలతో, నూతన వస్త్రాలతో సందడి చేశారు. రాజేంద్రపాలెంలో ఎస్కే బషీర్ ఖాన్, షేక్ హిమాం, షేక్ పీర్ సాహెబ్, అహ్మద్ ఖాన్ తదితర ముస్లిములు ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు.

## ముఠా కళాశీల కూలి రేట్లు పెంపు : సిఐటియు

పాడేరు,మార్చి21,ప్రభాతవార్త:



పాడేరు జిల్లా కేంద్రంలో ఉన్న ముఠా కళాశిల రెట్లు పెంపుపై శనివారం మోదమాంబ సిమెంట్ అండ్ ఐరన్ వర్తకుల సంఘం ప్రతినిధులు దోకుపర్తి అప్పలరాజు తదితరులు , ముఠా కళాశీల కార్మిక సంఘం సిఐటియు ఇరుపక్షాలు మధ్య కూలి రేట్లు పెంపు ఒప్పందం జరిగింది గతం కంటే 20 శాతం కూలి రేట్లు పెంచుకోవడం జరిగిందని యూనియన్ ప్రతినిధులు తెలిపారు. ఇరువురు ప్రతినిధుల మధ్య చర్చలు సంబంధించి చోడవరం అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ టి. సూర్యనారాయణ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి. ఉమామహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఎల్ సుందర్ రావు ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు ఎన్. సూరిబాబు, మోదమాంబ సిమెంట్ అండ్ ఐరన్ షాపులు యూనియన్ అధ్యక్షులు మూర్తి, నాని, అర్జున్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు. కూలి రేట్లు పెంపు పట్ల ముఠా కార్మికులు హర్షం వ్యక్తం చేశారు అగ్రిమెంట్ మూడు సంవత్సరాలు పరిధి ఉంటుందని తెలిపారు.డి. సూరిబాబు,శంకరరావు,కొండలరావు, అప్పుల నాయుడు, ఈశ్వరరావు,వెంకటరావు,రమేష్, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

## విధినిర్వహణ మృతి చెందిన ఆశ కార్యకర్త కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలి: సిఐటియు డిమాండ్

పాడేరు,మార్చి21,ప్రభాతవార్త:



అల్లూరి జిల్లా పాడేరు మండలం మినుములూ రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కె కుమ్మరి పుట్టు గ్రామంలో ఆశ వర్కర్ గా పని చేస్తున్న బట్టి పార్వతమ్మ విధినిర్వహణ లో ఉండగానే మరణించడం చాలా బాధాకరమైన సంఘటనని తక్షణం ఆశ కార్యకర్త కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని ప్రభుత్వాన్ని సి ఐ టి యు మరియు గిరిజన ప్రాంత వైద్యారోగ్య ఉద్యోగుల సంఘం డిమాండ్ చేస్తుంది. ఆమెకు యూనియన్ తరపున సంతాపం తెలియజేస్తున్నామని నాయకులు లింగేరి సుందర్ రావుశెట్టి నాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా ఆశ వర్కర్ గా చేస్తున్న పార్వతమ్మ ఆకస్మికంగా మరణించడం కుమ్మరిపుట్ ప్రజానీకానికే కాకుండా వైద్య ఆరోగ్య శాఖకు, సిఐటియుకు తీరని లోటని ఆవిడ మరణించిన తర్వాత ఆవిడకి రావలసిన రాయితులు ప్రభుత్వం వెంటనే ఇవ్వాలని మట్టి ఖర్చులు నిమిత్తం ఇవ్వవలసిన నగదు కూడా చెల్లించాలని వారు చెప్పారు. ఉద్యోగి మరణం ఇచ్చే మట్టి ఖర్చులకు ఇచ్చే నగదుకు ప్రభుత్వం జీ.వో లు జారీ చేసిన అమలు చేయడం లేదని 30 సంవత్సరాలుగా శాఖకు సేవలు అందించినందుకు ఆమె కుటుంబానికి ఆర్థికంగా ఆసరా లేదని కావున అధికారులు వెంటనే ఆర్థికంగా– ఉద్యోగ పరంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రేణుక, మత్స్య కొండ, మంగమ్మ, చిన్ని, నాగరత్న వైద్యా సిబ్బంది కృష్ణవేణి, కుమారి, జ్ఞానమ్మ, ఆశా వర్కర్లు సిహెచ్ డబ్ల్యు ఇతర ఉన్నతాధికారులందరూ పాల్గొన్నారు.

## నూకాంబిక అమ్మవారి రాష్ట్ర పండుగలో వెల్లివిరిసిన భక్తి పార్వశమైన కళాప్రదర్శనలు

### వైభవంగా ముగిసిన అయిదవ రోజు ఉత్సవం -జనసందోహంతో కిటకిటలాడిన ఎన్టీఆర్ మైదానం

అనకాపల్లి మార్చి21:( ప్రభాత వార్త)



అనకాపల్లి జిల్లాలో ఉత్తరాంధ్ర ఇలవేల్పు నూకాంబిక అమ్మవారి రాష్ట్ర పండుగ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ వేడుకలలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ మైదానంలో ఐదవ రోజు శనివారం సాయంత్రం ఆధ్యాత్మికత, సాంస్కృతిక వైభవం కల గలిపిన కార్యక్రమాలు అట్టహాసంగా నిర్వహించబడ్డాయి. మాజీ మంత్రి, స్థానిక శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో, జనసేన పార్టీ ఇంచార్జ్ రామ్కీ పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమాలు సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉత్సాహంగా సాగాయి. విశాఖపట్నం సంగీత జనకలం (ఇంద్రగంటి కాళీ ప్రసాద్), మృదంగం (చాణిక్య) వారిచే భక్తి గీతాలు ప్రేక్షకులను భక్తి పరవశంలో ముంచెత్తగా, అనకాపల్లి సిరీస్ స్పందన నృత్యాలయం (గిరిజస్పందన) విద్యార్థుల నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిరి శెట్టి, అమరావతి, బత్తుల రమేష్, మజ్జి అర్జున రావు, చొప్ప రమణ, విజయ్, దూడల సీత, పొనగంటి కాంతం, (మనభూమి) సత్యనారాయణ, (విజయ భాను) సురేష్, (సుమన్ టీవీ) నూకేష్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వేడుకలను వీక్షించేందుకు అనకాపల్లి జిల్లా నలుమూలల నుంచి భారీ సంఖ్యలో భక్తులు, ప్రజలు ఎన్టీఆర్ మైదానానికి తరలివచ్చారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వ అధికారులు సమగ్ర ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.భక్తి, సాంస్కృతిక రంగుల కలయికగా నిలిచిన ఈ వేడుకలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటూ జిల్లాలో ఉత్సవ వాతావరణాన్ని నెలకొల్పుతున్నాయి.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పీలా నాగ శీను, ఈవో శ్రీధర్, ధర్మకర్తల మండల సభ్యులు, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ లు తిమ్మ పాత్రుని చక్రవర్తి, సకల గోవింద్, మరియు గండేపల్లి మురళి, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణ పాల్గొన్నారు.

## ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు కొణతాల ఘనసత్కారం

అనకాపల్లి, మార్చి21, ప్రభాత వార్త



మాజీ మంత్రివర్యులు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ అనకాపల్లి నియోజవర్గం చెందిన ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులని అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో శవివారం సత్కరించి గౌరవించి అభినందనలు తెలియజేశారు. ఈ విద్యార్థులు నవోదయ ఫలితాలలో విద్యార్థులు డిస్టిక్ ఫస్ట్ ర్యాంకు ఫోర్త్ ర్యాంకు 9 ర్యాంకు మొదలైన ర్యాంకులతో సీట్లు కైవసం చేసుకున్నారు. తుంపాల గ్రామానికి చెందిన మల్ల ధనుంజయ్ అనే విద్యార్థి వంద మార్కులు గాను 98.75 మార్కులతో ఉమ్మడి విశాఖపట్నం డిస్టిక్ ఫస్ట్ ర్యాంకర్ గా నిలిచాడు. ఎల్లపు కుసాల్ అనే విద్యార్థి ఆల్ ఇండియా సైనిక్ పరీక్షల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు స్టేట్ ఫస్ట్ ర్యాంకు మరియు జాతీయ 116 వ ర్యాంకు సాధించిన విషయం మనకు ఆల్రెడీ తెలిసిందే. ఇంతటి ఘనవిజయం సాధించిన సైనిక్,నవోదయ,ఆర్ ఎం ఎస్ విద్యార్థులను హెవిఎన్ అకాడమీ నుంచి ఎంపికకావడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు.

## సెరినస్ ఆసుపత్రిని ప్రారంభించిన కూటమి నాయకులు

(అచ్చుతాపురం మార్చ్ 21 ప్రభాతవార్త)



అచ్చుతాపురం మండల కేంద్రంలో ఆధునిక వైద్య సేవలను అందించేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన సెరినస్ ఆసుపత్రిని ఎలమంచిలి నియోజకవర్గ ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్, రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ చైర్మన్ ప్రగద నాగేశ్వరరావు ప్రారంభించారు. స్థానిక ప్రజలకు అత్యవసర, నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటామని ఆసుపత్రి యాజమాన్యం తెలిపారు, ఈ కార్యక్రమానికి కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.




## ద్విచక్ర వాహనంలో చెలరేగిన మంటలు

డుంబ్రిగుడ, మార్చి 21, ప్రభాతవార్త



గమ్యం చేరుకోవాలనే ఆకాంక్షతో బైకుతో స్వగ్రామానికి బయలు దేరిన ద్విచక్ర వాహన చోదకుడికి బైకు నుంచి చెలరేగిన మంటలతో బిత్తర పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికి సంబంధించి వివరాలు ఈలా ఉన్నాయి. కంద్రుం పంచాయతీ స్వర్ణయిగుడలోని పతలంగి గ్రామానికి చెందిన తాంగుల విష్ణు అనే గిరిజనుడి ద్విచక్ర వాహనంలోని వెనుక టైరు కాలం చెల్లింది. ద్విచక్ర వాహనదారుడు తన తమ్ముడు ద్వారా అరకులోయ మెకానిక్ దుకాణంలో టైరు మార్చి తీసుకురావాలని పంపించారు. టైరును మార్చిన తన తుమ్ముడు మరోకరుతో స్వగ్రామానికి బయలు దేరారు. మండల కేంద్రం డుంబ్రిగుడలోని గుంటసీమ కూడలికి చేరుకునే క్రమంలో బైకు నుంచి ఆకస్మాత్తుగా మంటలు చేలరేగాయి. దుకాణదారుల ఎదురుగా బైకు ఇంజిన్లో మంటలు చెలరేగి పూర్తిగా ద్విచక్ర వాహనం దగ్ధమయ్యింది. స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపులోకి తీసుకొచ్చినా అప్పటికే పూర్తిగా కాలిపోయింది స్థానిక పోలీసులు దగ్ధమయిన బైకును పక్కకు తప్పించి ట్రాఫిక్ అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

## ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు

డుంబ్రిగుడ: మార్చి 21, ప్రభాతవార్త



మండలంలో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. అరమ పంచాయతీ పరడిలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని స్థానిక మసీదు లో ముస్లిం సోదరులతో అరకు పార్లమెంట్ కోశాధికారి నాగేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బారావు పాల్గొని రంజాన్ పర్వదిన వేడుకల్లో భాగస్వాములుగా నిలిచి ప్రత్యేక ప్రార్థనలో పాలుపంచుకున్నారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు.

## ఉపాధి పనులు వెంటనే కల్పించాలని..ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

డుంబ్రిగుడ, మార్చి 21, ప్రభాతవార్త



ఉపాధి పనులు వెంటనే కల్పించాలని, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు డిమాండ్ చేశారు. మండలంలోని కంద్రుం పంచాయతీ జాం కరవలస గ్రామంలోనీ శనివారం ఆయన సందర్శించారు. గ్రామ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2026 మూడో నెల దాటుతున్న నేటి వరకు ఉపాధి పనులు లేక సుదూర ప్రాంతలైన్న కాకినాడ రాజమండ్రి. విజయవాడ మైదాన్న ప్రాంతంలో గిరిజనులు వలస వెళుతున్నారని ఆయన చెప్పారు. జాతీయ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మండల వ్యాప్తంగా నూతనంగా ఉపాధి పనులు కల్పించాలి.పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు ఒక్కరోజు కనీస వేతనం 600 ఇవ్వాలని, 200 రోజుల పన్ని దినాలు కల్పించాలని ఆయన ప్రభుత్వానికి డిమాండ్. చేశారు. లేని పక్షంలో మండల కేంద్రం ఎంపిడిఓ కార్యాలయంలో ఆందోళన నిర్వహి స్తామని ఆయన హెచ్చరించారు. కె.రామచందర్.టి.పరన్న.కె.మొదనో టి.పరశురం లోకోయి గాసి తదితరులు పాల్గొన్నారు.

## 'కట్టెల'మయం... బండలు మటుమాయం..!

### వంట గ్యాస్ కొరతతో గృహ వినియోగదారుల ఇక్కట్లు

కొయ్యూరు మార్చి 21 ప్రభాతవార్త



ఇరాన్, ఇజ్రాయిల్ దేశాల మధ్య నెలకొన్న అనూహ్య యుద్ధ ప్రభావంతో గత కొన్ని రోజులుగా వంటగ్యాస్ కొరత ఏర్పడడంతో గృహ వినియోగ దారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో వేల సంఖ్యలో హెచ్పి, ఇండెన్, భారత్ రకాల గ్యాస్ వినియోగ దారులు ఉన్నారు. వీరిలో చింతపల్లి జిపిసిఎం సొసైటీ నుండి హెచ్.పీ గ్యాస్ వినియోగ దారులకు, ఇండియన్ వినియోగదారులకు కొమ్మిక నుండి, భారత్ వినియోగదారులకు నర్సీపట్నం నుండి ప్రతినెల క్రమం తప్పకుండా వంట గ్యాస్ సరఫరా అయ్యేది. అయితే ప్రస్తుతం యుద్ధ ప్రభావంతో గత కొన్ని రోజులుగా వంట గ్యాస్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. దీనితో ఇప్పటికే మండల కేంద్రంతో పాటు పలు గ్రామాలలోని హోటళ్లు మూతపడ్డాయి. ఇక గృహ వినియోగదారులు వంట గ్యాస్ కొరతతో ప్రత్యా మ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నారు. ఇందులో ముఖ్యంగా ఏజెన్సీ కావడంతో ప్రతి ఒక్కరూ కట్టెల పొయ్యి పైనే ఆధారపడ్డారు. దీనితో వంట గ్యాస్ బండలు ఇంటి బయటకి వెళ్లడంతో, కట్టెల పొయ్యిలు ప్రత్యక్షమ య్యాయి. దీనితో యాధృచ్చికంగానే మరలా కట్టెలకు డిమాండ్ ఏర్పడింది. అయితే ఈ పరిస్థితి ఇలా ఎన్నాళ్లుకొనసాగు తుందోనని? వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా చింతపల్లి ప్రధాన జిసిసి కార్యాలయానికి సరఫరా అయ్యే అరకొర వంట గ్యాస్ ను నిబంధనల ప్రకారం మండలానికి సరఫరా చేయకుండా చింతపల్లిలోనే విక్రయించడం పట్ల మండల గృహ వినియోగదారులు విచారం వ్యక్తం చేస్తున్నారు.

## పాడేరు జిల్లా కేంద్రంలో ఘనంగా రంజాన్ పర్వదిన వేడుకలు

### మసీదుల వద్ద ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు

పాడేరు,మార్చి21,ప్రభాతవార్త:



అల్లూరి జిల్లాలో రంజాన్ పండుగ పర్వదిన వేడుకలు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో రంజాన్ ను ఘనంగా నిర్వహించుకున్నారు. రంజాన్ వేడుకల్లో భాగంగా జిల్లా కేంద్రమైన పాడేరు పట్టణంలో ఉన్న మసీదులకు ముస్లిం సోదరులు నూతన వస్త్రాలు ధరించి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రార్థన అనంతరం చిన్నారులు.. పెద్దలు రంజాన్ శుభాకాంక్షలు ఈద్ ముబారక్ ఒకరికొకరు చెప్పుకుంటూ అలెంజనం చేసుకొని రంజాన్ పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించు కున్నారు. పాడేరు మెయిన్ రోడ్ ఉన్న జిక్రీ ఇలాహి జామియా మసీద్‌లో పాడేరు కమిటీ సభ్యులు షేక్ అబ్దుల్లా, మహమ్మద్ ఇక్బాల్.. మహమ్మద్ సులేమాన్. షేక్ అన్సారి.. ఇమామ్ ఎండి అలీ, గురువు అన్సారి.. షేక్ మొహమ్మద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు.రంజాన్ సందర్భంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఉన్న మషీదులన్నీ రంజాన్ వేడుకలతో కళకళలాడాయి.

## మహిళల భద్రత, సాధికారతపై పోలీసులు ర్యాలీ

### అవగాహన పరిచిన పాడేరు డిఎస్‌పి అభిషేక్

అరకలోయ, మార్చి 21, ప్రభాతవార్త



అరకులోయలో శనివారం పాడేరు డిఎస్ పి నేతృత్వంలో, అరకులోయ సబ్ ఇన్స్పెక్టర్ గోపాల రావు ఆధ్వర్యంలో మహిళల భద్రత, సాధి కారతపై అవగాహన ర్యాలీ జరిగింది. అరక లోయ ప్రధాన రహదారి మీదగా ర్యాలీ కొనసాగింది. ర్యాలీలో కుటుంబం కోసం త్యాగం చేసే మహిళలు వెనకబడినట్లు కాదు, మనం ముందు ఉండడం కోసం వారు వెనక నడుస్తున్నారు, మహిళలను పూజించాల్సిన అవసరం లేదు కానీ గౌరవిస్తే చాలు, మగువ సృష్టికి మూలం జీవం పోసే దైవం అనే ప్లే కార్డులను ప్రదర్శించారు. అంతకు ముందు మహిళల భద్రత, హక్కులు చట్టాలు గురించి వివరించారు. నేటి సమాజంలో మహిళల పాత్ర పై మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరులతో పాడేరు డిఎస్పి అభిషేక్ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవంను పురస్కరించుకొని డిఐజి ఆదేశాల మేరకు, అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ నేతృత్వంలో మహిళల భద్రత పై అవగాహన కార్యక్రమాలు గత 15 రోజులుగా జరుగుతున్నాయని చెప్పారు. మహిళలకు ఇబ్బందులు ఎదురైతే పోలీసులను ఆశ్రయించాలని, వెంటనే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో కీలక పాత్ర పోషిస్తున్నారని, భవిష్యత్తులో ఉన్నత స్థానాల్లో మహిళలు నిలవాలని డి.ఎస్.పి ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది విద్యార్థినీ లు పాల్గొన్నారు.

22-3Pg7exHMNWJQE.qxdO/P:22-3Pg7exHMNWJQE.qxd 1/1/02 8:26 AM Page 1



## హనుమంతరాయ చౌదరి ప్రజాసేవ చిరస్మరణీయం

### పార్టీలకు అతీతంగా చౌదరికి నివాళులు



**కళ్యాణదుర్గం, మార్చి 21 ప్రభాతవార్త:** కళ్యాణదుర్గం మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉన్నం హనుమంతరాయ చౌదరి మృతితో ఎర్రంపల్లి గ్రామం శోకసంద్రంగా మారింది. గ్రామమంతా విషాద ఛాయలు కమ్ముకున్నాయి. చౌదరి భౌతిక కాయంపై టిడిపి జెండా కప్పి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నివాళులు అర్పించారు. రాజకీయ భేదాలు పక్కన పెట్టి అన్ని పార్టీల నేతలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రద్ధాంజలి ఘటించారు. కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, ప్రభుత్వ విప్ కాలువ శ్రీనివాసులు, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి, పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూర రెడ్డి, సీనియర్ నాయకులు సూర్యనారాయణ, నాగన్న, గడ్డం సుబ్రహ్మణ్యం, కంబదూరు కారణం రామ్మోహన్ చౌదరి తదితరులు సంతాపం ప్రకటించారు. మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత, సిడబ్ల్యుసి సభ్యులు ఎన్. రఘువీరారెడ్డి, వైసిపి నేత అనంత వెంకటరామిరెడ్డి, కళ్యాణదుర్గం సమన్వయకర్త మాజీ ఎంపీ తలారి రంగయ్య నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో నిజాయితీకి నిలువెత్తు నిదర్శనంగా, అజాత శత్రువుగా హనుమంతరాయ చౌదరి ప్రజాసేవలో నిలిచారని పేర్కొన్నారు. ఆయన మృతి రాజకీయాలకు తీరని లోటని తెలిపారు. చౌదరి మృతి వార్త తెలుసుకున్న నియోజక వర్గంలోని టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి భావోద్వేగానికి లోనయ్యారు. ప్రజల కోసం జీవితాంతం కృషి చేసిన మహానేతను కోల్పోయాం అంటూ నివాళులు అర్పించారు.

## ఆడపడుచుల హక్కులను హరిస్తున్న జగన్

### అత్యంత హేయమైన చర్య: పీతల సుజాత



**విజయవాడ మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** నాడు స్వర్గీయ నందమూరి తారక రామారావు ఆడబిడ్డలకు ఆస్తిలో సమాన హక్కు కల్పిస్తూ చట్టం తెస్తే ఈ రోజు అది దేశవ్యాప్తంగా మహిళలు ఆత్మవిశ్వాసానికి కొండంత అండగా నిలిచిందని మాజీ మంత్రి, ఏపీ డబ్ల్యూసీఎఫ్‌సీ ఛైర్‌పర్సన్ పీతల సుజాత అన్నారు. కానీ అదే మహిళా లోకాన్ని, ఆస్తి హక్కును అవమానపరిచేలా మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి వ్యవహరించడం అత్యంత హేయమైన చర్య అని విమర్శించారు. నేడు టీడీపీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏ మతంలోనైనా తండ్రి తర్వాత ఇంటి పెద్ద దిక్కుగా ఉండి తోబుట్టువులను చూసుకోవడం మన సంప్రదాయం. కాని జగన్ మాత్రం ఆస్తి కోసం రక్తం పంచుకు పుట్టిన చెల్లిన, కన్న తల్లిని కోర్టుకు ఈడ్చిన నీచ చరిత్రను లిఖించుకున్నారు. సొంత చెల్లి పిల్లల ఆస్తులను కూడా వదలకుండా దోచుకుంటున్న మీరు మేనమామ కాదు. సాక్షాత్తు కంస మామగా తయారయ్యారు. జగన్ తన పేటీఎం బ్యాచ్‌తో ఇది కుటుంబ సమస్య అని ప్రచారం చేయిస్తున్నారు. ఇది కేవలం మీ ఇంటోలని గొడవ కాదు జగన్. ఇది ఈ దేశంలోని మహిళలకు రాజ్యాంగం కల్పించిన ఆస్థి హక్కుపై మీరు చేస్తున్న దాడి ఆస్తులను ప్రేమించడం తల్లిని చెల్లిని వేధించడం మీకు ఒక సాలపీలా మారిపోయింది. సొంత తల్లికి, చెల్లికి న్యాయం చేయలేని వ్యక్తి ఈ రాష్ట్ర ప్రజలకు, మహిళలకు ఏం న్యాయం చేస్తారు? పదవిలో ఉన్నప్పుడు ప్రజాసేవ చేయాల్సింది పోయి, మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఆస్తుల కోసం రోడ్డు ఎక్కిన ఘనత మీకే దక్కుతుంది. ఉదయం లేస్తే క్రెడిట్ చోరీ అని మాట్లాడే మీరు తండ్రి ఆస్తిలో చెల్లికి రావలసిన వాటాను చోరీ చేసింది నిజం కాదా? అని ప్రశ్నించారు. దేవుడితో పరాచకాలు ఆడుతున్నారు జగన్. మీరు చేస్తున్న ఈ పాపాలకు ఎన్ని జన్మలెత్తినా పరిహారం లభించదు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని మహిళల ఆస్తి హక్కులను గౌరవించండి. మీ అదికార కాంక్ష ఎంతకు తెగించిందంటే కన్నతల్లి ని, తోడబుట్టువుని కూడా చూడకుండా సోషల్ మీడియాలో మీ పేటీఎంబ్యాచ్‌తో వాళ్ళ క్యారెక్టర్ అస్సాసినేషన్ చేయిస్తారా? రాజకీయాల కోసం ఇంత నీచానికి ఒడిగడతారా? మీరు చేయిస్తున్న ఈ కుట్రలు, కుతంత్రాలు రేపు మీ రాజకీయ జీవితానికే ప్రమాదకరమని గుర్తించు కోండి. ఇవి ఏనాటికీ పరిహారం లేని పాపాలుగా మిగిలిపోతాయని విమర్శించారు. తండ్రి సంపా దనలో దాదాపు 43 వేల కోట్లు కలిగిన మీరు, చట్టప్రకారం తల్లికి, చెల్లికి ఇవ్వాల్సిన సమాన వాటాను ఎందుకు ఇవ్వడం లేదు? ఆ అవినీతి సొమ్మంతా నాదే అన్నట్టుగా ప్రవర్సి ఉన్నారు. మీకు పట్టిన ఈ డబ్బు పిచ్చి ని వదిలించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజల మీద ఉంది. సొంత కుటుంబానికే భద్రత ఇవ్వలేని రాష్ట్ర ప్రజల మీద ఉంది. సొంత కుటుంబానికే భద్రత ఇవ్వలే ని మీరు, రేపు రాష్ట్ర ప్రజల ఆస్తులకు రక్షణ ఇస్తారని ఎలా నమ్మాలి? సొంత చెల్లిం కంటే, బాబయిని చంపిన నిందితుడు అవినాష్ మీకు ఎందుకు ఎక్కువయ్యాడు? రక్తపు మడుగు ను క్లీన్ చేయించి, సాక్ష్యాలను ధ్వంసం చేసిన వ్యక్తిని ఎందుకు వెనకేసుకొస్తున్నారు? సాక్ష్యాలు, తారుమారు చేయడం హత్యానేరంతో సమానమ ని మీకు తెలియదా? అవినాష్ రెడ్డిని రక్షిస్తేనే తాడేపల్లి ప్యాలెస్ గుట్టు బయటపడదని మీరుభ యపడుతున్నారా? జగన్. మీకు మీ ఫ్యామిలీకి ఏమైనా భయమా? ప్రతిదానికి టిడిపిని బూచిగా చూపిస్తూ ప్రజల్ని ఎల్లకాలం మోసం చేయలేరు. మీరు న్యాయస్తులైతే మీ మీద మీ చెల్లికి నమ్మకం ఉంటే. ఆమె న్యాయం కోసం పరాయి గడప ఎందుకు తొక్కుతుంది? సొంత అన్న దగ్గర న్యాయం జరగదనే కదా ఆమె బయటకు వచ్చింది.

## తిరుమల సమాచారం

### శ్రీవారి పవిత్రతను కాపాడడమే ప్రథమ లక్ష్యం

#### సాంకేతిక పరిజ్ఞానంతో ఎక్కువ మందికి దర్శనాలు: సిఎం



**తిరుమల, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రపంచం వ్యాప్తంగా ఉన్న భక్తులకు నమ్మకంగా శ్రీవారి పవిత్రతను కాపాడడమే ప్రథమ లక్ష్యం కావాలని ముఖ్య మంత్రి చంద్రబాబు టిటిడి అధికారులకు నిర్దేశం చేశారు. భక్తుల మనోభావాలను గుర్తెరిగి వ్యవహరించాలని, సాంకేతిక పరిజ్ఞానం వినియోగించి తక్కువ సమయంలో ఎక్కువ మందికి దర్శనాలు కల్పించాలని సూచించారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత విషయంలో రాజీ పడద్దని, పేదల సేవ, భగవంతు ని సేవతోపాటు ప్రాణదానం కార్యక్రమాన్ని విస్తత పరచాలని ఆదేశించారు. టిటిడి ద్వారా ఐదు వేల దేవాలయాల నిర్మాణం జరగాలని టిటిడి ఉన్నతాధి కారుల సమీక్షలో సీఎం చంద్రబాబు నిర్దేశించారు. టీటీడీ ద్వారా పేదలకు అందిస్తున్న సేవలకు చెందిన వివిధ కార్యక్రమాలపై సీఎం ప్రత్యేకంగా సమీక్షించారు. తిరుమల కొండపై శ్రీవారి సేవకుల సేవలను పూర్తి స్థాయిలో వినియోగించుకోవాలన్నారు. ఇక టిటిడి చేపట్టే ధర్మ ప్రచారంలో భాగంగా పెద్ద ఎత్తున ఆలయాల నిర్మాణలపై దృష్టి సారించాలని చంద్రబాబు ఆదేశించారు.



### భక్తుల నమ్మకాన్ని కాపాడాలి, మరింత నాణ్యతతో స్వామివారి ప్రసాదాలు

#### తిరుమలలో అత్యాధునిక ఆహార పదార్థాల తనిఖీ ల్యాబ్ ప్రారంభించిన: చంద్రబాబు

**తిరుమల, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** ఏడుకొండల వెంకటేశ్వరస్వామికి నివేదించే ప్రసాదాలు, అన్నప్రసాదాలు తయారీలో మరింత నాణ్యత పాటించేందుకు తిరుమలలో అత్యాధునిక ఆహార పదార్థాల పరిశోధనశాలను సిఎం చంద్రబాబు ప్రారంభించారు. శనివారం ఉదయం మనవడు దేవాన్ష్ పుట్టినరోజున శ్రీవారి దర్శనంచేసుకున్న అనంతరం 25 కోట్ల విలువైన ఈ ల్యాబ్‌ను సిఎం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇక్కడ శ్రీవారి ప్రసాదం,అన్నప్రసాదం తయారీలో ఉపయోగించే ముడిపదార్థాలను పరీక్షించడం జరుగుతోంది. ప్రతినెల 1,5 వందల నమూనాలపై పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం ల్యాబ్‌లో ఏర్పాటు చేసిన 50కి పైగా పరికరాలను సీఎం పరిశీలించారు. న్యూఢిల్లీ నుండి వచ్చిన ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పాండా, సిఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ గిరిధర్ ల్యాబ్‌లోని ప్రతి పరికరం పనితీరును సీఎంకు వివరించారు. తిరుమలలో టిటిడి నీరు,ఆహారపదార్థాల పరిశోధనశాల వల్ల భక్తులకు సురక్షితమైన నీరు, ఆహారాన్ని అందించేందుకు వివిధ వనరుల నుంచి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహిస్తోంది.-ఈ ల్యాబ్ దేశానికే ఆదర్శం.. బ్యాక్టీరియా గుర్తింపు కోసం ప్రత్యేకంగా క్లీన్ రూమ్, ఎయిర్ హ్యాండ్లింగ్ సిస్టమ్ వంటి భద్రతా ప్రమాణాలను చూసి ముఖ్యమంత్రి అభినందించారు. శ్రీవారి ప్రసాదాల పట్ల భక్తులకు ఉన్న అపారమైన నమ్మకాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. కేవలం ల్యాబ్ పరీక్షలకే పరిమితం కాకుండా, అన్నప్రసాద కేంద్రాల్లోని వంటశాలల శుభ్రతపై నిరంతర తనిఖీలు నిర్వహించి పరిశుభ్రతను నిర్ధారించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్, టిటిడి ఛైర్మన్ బీ.ఆర్.నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ సి.హెచ్.వెంకయ్య చౌదరి, పలువురు బోర్డు సభ్యులు, జెఇఒలు వీరబ్రహ్మం, డాక్టర్ శరత్, సివిఎస్ఒ మురళీకృష్ణ, హెల్త్ డిప్యూటీ ఇఒసోమన్నారాయణ,సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు.



### ప్రాణదాన ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళం

**తిరుమల, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఎస్వీప్రాణదాన ట్రస్టుకు శనివారం దాత విరాళమిచ్చారు. జెఎంసీ ట్రస్టు ఛైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే శ్రీనివాసులు శనివారం ఉదయం 10 లక్షల రూపాయల విరాళాల డిడిని నారా చంద్రబాబు ఆలయంలో అందజేశారు. సిఎం దాతను అభినందించారు.



### మోహినీ అలంకారంలో కోదండరాముడు

**తిరుపతి, మార్చి 21 ప్రభాతవార్త ప్రతినిధి:** టిటిడి ఆధ్వర్యంలో తిరుపతి కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో శనివారం ఉదయం మోహినీ అవతారంలో శ్రీరామచంద్రుడు పల్లకీలో ఊరేగుతూ భక్తులకు కనువిందు చేశారు. ఉదయం 8 గంటలకు ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఈ ఉత్సవం జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. మోహిని అలంకారంలో స్వామివారు తనకు భక్తులు కానివారు ఆ మాయాధీసులు కాక తప్పదనీ, తనకు ప్రసన్నులైనవారు మాయను సులభంగా దాటగలరనీ ఈ మోహినీ రూపంలో ప్రకటిస్తున్నారు. తరువాత ఉదయం 9.30 గంటలకు గరుడ పాదుకల ఊరేగింపు ఆలయ నాలుగు మాడ వీధులలో ఘనంగా జరిగింది. రాత్రి 7 గంటలకు గరుడసేవ అత్యంత వేడుకగా నిర్వహించారు.

## భక్తి శ్రద్ధలతో ఈదుల్ ఫితర్ నమాజులు

### కిట కిట లాడిన ఈద్‌గాహ్‌లు



**శ్రీకాళహస్తి, మార్చి 21 ప్రభాతవార్త:** శ్రీకాళహస్తిలో శనివారం ముస్లింలు భక్తి శ్రద్ధలతో ఈదుల్ ఫితర్ నమాజును ఆచరించారు. ఈదుల గుంట ఈద్ గాహ్‌లో ముఫ్తి నయిం సాహెబ్ రంజాన్ ప్రాధాన్యతను వివరిస్తూ, అల్లాహ్ మనకు ఇచ్చిన మహోన్నత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవటం లేదని ఆవేదన వ్యక్తం చేసారు.మనం నెల రోజుల పాటు ఆచరించిన ఉపవాస దీక్షలకు, చదివిన తరావీహ్ నమాజులకు సంబంధించి రంజాన్ పర్వదినాన అల్లాహ్ ప్రతిఫలం ఇచ్చేరోజు అయితే మనం జనం మెప్పుకోసం, జనం చూడటం కోసం ప్రార్థిస్తున్నాము తప్ప అల్లాహ్ నుంచి వరాలు పొందటానికి ప్రయత్నించటం లేదన్నారు. మనం ఇక్కడి లాభాలనే పరిగణలోకి తీసుకుంటున్నాము తప్ప పరలోక ఫలితాల గురించి పట్టించుకోవటం లేదన్నారు. ఈ సందర్భంగా ఫజాయిల్ ఆమాల్‌కు సంబంధించి వివరిస్తూ నేడు మనం కన్నీరు మున్నీరుగా అల్లాహ్ వద్ద తప్పులను క్షమించమని కోరితే దయా ళువు క్షమించే పవిత్రరోజు రంజాన్ అన్నారు.

**మూడు చోట్ల ఈదుల్ ఫితర్ ప్రార్థనలు**

రాజీవ్‌నగర్‌లో మౌలానా మహబూబ్‌బాషా సాహెబ్, ఈదుల గుంటలో ముఫ్తినయిం సాహెబ్, అయ్యల నాడుచెరువులో హాఫీజే ఖుర్అన్ ప్రార్థనలు జరిపారు. ప్రజల్ని దిశ దెశ నిర్దేశం చేసారు. ఈదుల గుంట ఈద్‌గాహ్‌లో తెలుగు దేశం పార్టీ తరఫునపట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ నాయుడు హాజరై మైనారిటి ముస్లింలకు బొజ్జల సుదీర్‌రెడ్డి అందిస్తున్న వెసులుబాట్లును ప్రభుత్వం వచ్చిన తరువాత శాసనసభ్యుడు సుధీర్ రెడ్డి ఈద్‌గాహ్ వద్ద చక్కటి ఫ్లోరింగ్, అలాగే పాడుబడినట్లు ఉన్న షాదీ మహల్‌ను సుందరంగా తీర్చిదిద్దారని ఇంకా చేయాల్సిన పనులు ఉన్నాయని వాటిని కూడా పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు. ఎంఎల్ఏ ప్రతినిధిగా హాజరై రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. శనివారం భారీసంఖ్యలో చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా భక్తులు హాజరై ప్రార్థనలు జరిపారు. ఈద్‌గాహ్ నిర్మించినప్పటి నుంచి కూడా హాజరు కానంత జనం హాజరై భక్తి శ్రద్ధలతో నమాజులను ఆచరించారు.

### మతిస్థిమితం లేని బాలికలే లక్ష్యం

#### బెజవాడలో రెచ్చిపోయిన మానసిక మదోన్మాది

**విజయవాడ, మార్చి21 ప్రభాతవార్త ప్రతినిధి:** విజయవాడ పటమట పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన ఓ దారుణం వెలుగు చేసింది. ఒక మానసిక మదోన్మాది మతిస్తిమితం లేని బాలికలే లక్ష్యంగా రెచ్చిపోయాడు. చిన్నారులపై అత్యాచారం చేస్తూ కామవాంఛలు తీర్చుకున్నాడు. ఎట్టకేలకు పాపం పండి పోలీసులకు చిక్కాడు. ఈ ఘటన నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. విజయవాడ పటమట పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ కుటుంబం నివాసం ఉంటోంది. వారికి మతిస్తిమితం లేని కుమార్తె ఉంది. చిన్నారిని ఇంటి వద్దనే ఉంచి పనుల నిమిత్తం తల్లిదండ్రులు అప్పుడప్పుడు బయటకు వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో స్థానికంగా ఉంటున్న త్రినాథ్ అనే కామాంధుడి కళ్లు బాలికపై పడ్డాయి. ఎవరూ లేని సమయం చూసి చిన్నారిని బెదిరించి పలుమార్లు అత్యాచారం చేశాడు. విషయం ఇంట్లో చెబితే చంపేస్తానంటూ బెదిరింపులకు దిగేవాడు. నిస్సహాయ స్థితిలో త్రినాథ్ వేధింపులను భరించింది చిన్నారి. అయితే, అతని ఆగడాలు మితి మీరి పోవడంతో తల్లిదండ్రులకు విషయం చెప్పింది. అనుమానం వచ్చిన బాలిక తల్లిదండ్రులు అదే వీధిలో ఉంటున్న మతిస్తిమితం లేని మరో బాలికను విచారించారు. త్రినాథ్ అనే వ్యక్తి తనపైనా లైంగిక దాడికి పాల్పడ్డాడని బాలిక చెప్పడంతో తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దీంతో ఇరు కుటుంబాల సభ్యులు వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. విచారణ చేపట్టిన పోలీసులు బాలికలిద్దరినీ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అత్యాచారం జరిగినట్లు వైద్య పరీక్షల్లో డాక్టర్లు నిర్ధారించారు. ఘటనపై కేసు నమోదు చేసి నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు త్రినాథ్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



### కోనలో వైభవంగా పెనుశిల లక్ష్మీనృసింహుని కళ్యాణోత్సవం

**రాపూరు, (నెల్లూరు), మార్చి21ప్రభాతవార్త:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన పెంచలకోనలో శనివారం శ్రీ పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున 4.30కి స్వామి వారి మూలమూర్తికి అభిషేకం, గోపూజ,పూలాంగి సేవ నిర్వహించారు.ఉదయం 9.30కి స్వామి వారి ఆస్థాన మండపంలో స్వామి వారికి ఉభయ దేవేరులైన ఆధిలక్ష్మీ, చెంచులక్ష్మీ అమ్మవార్లతో వేదపండితులు,వేద మంత్రోచ్ఛరణలతో స్వామి వారి కళ్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు.సాయంత్రం స్వామి,అమ్మవార్లను తిరుచ్చిపై వుంచి తిరుచ్చి ఉత్సవం నిర్వహించారు. తదుపరి స్వామి అమ్మవార్లకు సహస్ర దీపాలంకరణ మండపంలో ఊంజల్ సేవ నిర్వహించారు. పెద్ద ఎత్తున వచ్చిన భక్తులకు కావలసిన భోజన,వసతి ఏర్పాట్లను ఆలయ ఉప కమీషనర్ పోరెడ్డి శ్రీనివాసుల రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ సూపరిడెంట్ పాలవల్లి లక్ష్మీ నారాయణ, ఎఇ వినోద్,సిబ్బంది పులగల నరసింహా, వెంకటసుబ్బయ్య, పెంచల స్వామి, కోండల రావు,హరీష్, తదితరులు పర్యవేక్షించారు.స్వామి వారి పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా ఆలయ ప్రధానార్చకులు గుండ్లూరు రామయ్య స్వామి, పెంచల పెంచలయ్య స్వామి, ముఖ్య అర్చక స్వామి గుండ్లూరు శశి స్వామి, అర్చక స్వాములు మధు స్వామి, వర్ధన్ స్వామి, వెంకట బాలాజీ స్వామి, వినోద్ స్వామి, నాగరాజు స్వామి, సాయి స్వామి తదితరులు నిర్వహించారు.

## నెల్లూరు నగర రూపురేఖలు మారుస్తాం

- 13వ డివిజన్‌లో అత్యాధునిక పార్క్ ప్రారంభం
- పేదల కోసమే పార్కుల్లో ఏసీ ఫంక్షన్ హాళ్లు: మంత్రి నారాయణ

**నెల్లూరు, మార్చి 21, ప్రభాతవార్త:** నెల్లూరు నగర రూపు రేఖలు మార్చి సింగపూర్ తరహాలో గ్రీన్ నెల్లూరుగా తీర్చిదిద్దుతానని మంత్రి నారాయ పేర్కొన్నారు. అలాగే నెల్లూరులో అడ్వెంచర్ వాటర్ స్పోర్ట్స్ పార్కులు ఏర్పాటు చేసి, దోమలు లేని నగరమే లక్ష్యంగా, 850 కోట్లతో నెల్లూరు అభివృద్ధికి శ్రీకారం చుట్టి, నెల్లూరు సిటీలో పార్కుల పండగ కొనసాగుతోందని మంత్రి నారాయణ అన్నారు. శనివారం బలిజపాలెంలో 40 లక్షల రూపాయల వ్యయంతో అన్ని ఆధునిక హంగులతో సిద్ధమైన పార్కును మంత్రి నారాయణ జాతర వాతావరణంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్కులో ఏర్పాటు చేసిన ఏసీ మినీ ఫంక్షన్ హాల్‌ను ప్రారంభించిన మంత్రి, ఒక చిన్నారి పుట్టినరోజు వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్కులో జిమ్ చేసి అందరినీ ఉల్లాసపరచడమే కాకుండా, చిన్నారులకు చాక్లెట్లు పంపిణీ చేస్తూ వారితో సరదాగా గడిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం బలిజపాలెం పార్కును అభివృద్ధి చేశామని, సిటీలో లక్ష్యంగా పెట్టుకున్న 47 పార్కుల్లో ఇప్పటికే 44 పూర్తి చేశామని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు రూపాయి ఖర్చు లేకుండా పార్కుల్లోనే శుభకార్యాలు జరుపుకోవచ్చని, త్వరలోనే భారీ అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్ పార్కులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. నెల్లూరును చండీగఢ్, సింగపూర్ తరహాలో గ్రీన్ సిటీగా మార్చడమే తన లక్ష్యమని, ఇందు కోసం 850 కోట్ల నిధులు కేటాయించామన్నారు. యూజీడీ పనులు పూర్తి చేసి నగరాన్ని దోమల రహితంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. బలిజపాలెంలో 50 లక్షలతో కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, మేయర్ సుజాత అశోక్, మాజీ మున్సిపల్ ఛైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, కార్పొరేటర్ కర్తం ప్రతాప రెడ్డి, డివిజన్ క్లస్టర్ ఊటుకూరు చంద్ర, ప్రెసిడెంట్ కాయల తిరుపతి, అశ్విన్, టీడీపీ మహిళా నాయకురాళ్లు కపిర రేవతి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### కోట్లాది పేద, అణగారిన తరగతుల విద్యార్థుల గౌరవాన్ని

## అవమానించేలా గరికపాటి వ్యాఖ్యలు!

**విజయవాడ, మార్చి21 ప్రభాతవార్త ప్రతినిధి:** ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి నరసింహారావు చేసిన అవమానకర వ్యాఖ్యలను ఖండించాలని కెవిపిఎస్ కోరింది. మధ్యాహ్న భోజన పథకంపై గరికపాటి నరసింహారావు చేసిన అవమానకర, బాధ్యతారాహిత్యపు వివక్షాపూరిత వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఓ నల్లప్ప, అంద్ర మాల్యాద్రి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కోట్లాది పేద, అణగారిన తరగతుల విద్యార్థుల గౌరవాన్ని అవమానించేలా ఉన్నాయని తెలిపారు. ఈ వ్యాఖ్యలు సమాజంలోని పేదరికాన్ని, అసమానతలను అర్థం చేసుకోలేని దృక్పథాన్ని ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ పథకం కేవలం ఆహారం అందించే పథకం కాదని, ఇది పిల్లల ఆకలి సమస్యను తగ్గిస్తుందని తెలిపారు. పాఠశాల హాజరు, కొనసాగింపును పెంచుతుందని పేర్కొన్నారు. ఈ పథకాన్ని హేళన చేయడమంటే పేద పిల్లల గౌరవాన్ని దెబ్బతీయడమేనని తెలిపారు. సంక్షేమ విధానాలను బలహీనపరచడం, సామాజిక వివక్షను ప్రోత్సహించడమేనని పేర్కొన్నారు. సమాజంలో ప్రభావం కలిగిన వ్యక్తులు బాధ్యతారాహిత్యంగా మాట్లాడటం బాధాకరమన్నారు. సమాజంలో సమానత్వం, న్యాయం, మానవ విలువలను బలోపేతం చేయాలని, అవి దెబ్బతీసేలా మాట్లాడకూడదని సూచించారు. చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే గరికపాటిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనకు ప్రదానం చేసిన జాతీయ, రాష్ట్ర పురస్కారాలను వెంటనే రద్దు చేసి పేద పిల్లల మధ్యాహ్న భోజన పథకంపై ప్రభుత్వాలు తమ నిబద్ధతను పునరుద్ఘాటించాలని కోరారు.

## రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం: ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి



**విడవలూరు, (నెల్లూరు), మార్చి21 ప్రభాతవార్త:** మండలంలోని వావిళ్ళ రోడ్డులో కొనసాగుతున్న ధాన్యం సేకరణ కేంద్రాన్ని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడి పరిస్థితులను సమగ్రంగా పరిశీలించిన ఆమె, రైతులు రైస్ మిల్లర్లతో నేరుగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా లారీలు, ధాన్యం కొలతలకు అవసరమైన గోని సంచులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. రైతుల సమస్యల పరిష్కారంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని ఆమె ఆదేశించారు.రైస్ మిల్లర్లు, రైతుల మధ్య సమన్వయం పెంపొందించేందుకు సొసైటీలు, అధికారులు వారధిగా వ్యవహరించాలని, నాయకులు కూడా సమర్థంగా సమన్వయం చేయాలని పేర్కొన్నారు.ఈ తనిఖీల సందర్భంగా రైతులు వెల్లడించిన సమస్యలపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే జాయింట్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని వివరించారు. రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలు తక్షణమే కల్పించాలని జేసీని కోరారు.అలాగే గోని సంచుల కొరత లేకుండా చూడాలని, రైస్ మిల్లర్లు ఎలాంటి అవకతవకలకు పాల్పడినా వెంటనే తనకు సమాచారం అందించాలని రైతులు, సొసైటీలు, అధికారులను ఎమ్మెల్యే కోరారు. ఆమెతోపాటు కోవూరు ఏఎంసి మాజీ చైర్మన్ పూండ్ల అచ్యుత్ రెడ్డి, డీసీ చైర్మన్ పాశం శ్రీహరి రెడ్డి, సత్య వోలు సత్యం రెడ్డి, విడవలూరు సొసైటీ చైర్మన్ పొన్నలూరు పురంధర్ రెడ్డి, సీఈవో దద్దోలు రవి, గోవర్ధన్ రెడ్డి,అయ్యప్ప, శేషయ్య, దిలీప్ కుమార్, రైతులు పాల్గొన్నారు.

### విజయనగరం జిల్లాలో తప్పిన పెను ప్రమాదం

**రామభద్రపురం (విజయనగరం జిల్లా), మార్చి 21 ప్రభాతవార్త :** విజయనగరం జిల్లా రామభద్రపురం మండలంలో పెను ప్రమాదం తప్పింది. ఒడిశాకు చెందిన బస్సు వెనుక టైర్ పేలడంతో మంటలు చెలరేగాయి. భువనేశ్వర్ నుంచి మల్కన్ గిరికి వెళ్తుండగా ఈ ఘటన జరిగింది. అయితే టైర్ పేలగానే అప్రమత్తమైన డ్రైవర్ ప్రయాణికులను దించేశారు. కానీ మంటల ధాటికి బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాద సమయంలో బస్సులో 37 మంది ప్రయాణికులు ఉన్నారు. పెను ప్రమాదం తప్పడంతో ప్రయాణీకులు ఊపిరి పీల్చుకున్నారు.



## ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి




వీరఘట్టం, మార్చి 21 ప్రభాతవార్త: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ జంక్షన్ వద్ద కేజీబీవీ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కోరెడ్ల విజయ గౌరీ ఆధ్వర్యంలో జీపు జాతర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠాలు అర్థమయ్యే రీతిలో సాంకేతిక విజ్ఞానంతో కూడిన బోధన, చిన్న తరహా నుండే పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా సాధన, ఉచిత విద్యతో పాటు యూనిఫారం, నోట్స్ పుస్తకాలు బూట్లు, మధ్యాహ్నం భోజనం, అందమైన తరగతి గదులు, ఆట స్థలం, పరిశుభ్రమైన వాతావరణంలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దడం ముఖ్య ఉద్దేశమని అన్నారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పిద్దాం... ప్రభుత్వ పాఠశాలలనుకాపాడుకుందామని నినాదంతో ఈ జీపుజాత ప్రారంభించినట్లు ఆమె తెలిపారు. ఈమెతో పాటు మండల యుటిఎఫ్ నాయకులు రాజకుమారి, మురళి, వెంకట నాయుడు, మజ్జి పైడిరాజు, కొండపల్లి గౌరు నాయుడు, కురుమాన గోవిందరావు, బోణంగి దుర్గాప్రసాద్, ఎస్.విశాలాక్షి, వాసుదేవరావు, డి.శంకర్ జయదేవ్, ముకుందరావు, శ్రీధర్, రాజేశ్వరి, రవి, అన్నాజీరావు, గోవిందరావు, నర్సింగరావు, మురళి, తదితరులు పాల్గొన్నారు.

## పండిట్ దీనదయాళ్ ప్రశిక్షణ



ఇచ్ఛాపురం, మార్చి 21 ప్రభాతవార్త : పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా రెండు రోజులు కార్యక్ర మంలో భాగంగా మొదటి రోజు కార్యక్రమం స్థానిక వీకేపీ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమంకి కన్వీనర్‌గా వున్న వల్లంపాటి కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. వక్తలు సవ్వన ఉమామహేశ్వరి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ తాతారావు, జిల్లా ఐటీ సెల్ విభాగం, జిల్లా వైస్ ప్రెసిడెంట్ తాడేళ్ల భపతి, పట్టణ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు హాజరయ్యారు. జిల్లా యువమోర్చ జనరల్ సెక్రటరీ ధనుష్ రంగా సమక్షంలో సోషల్ మీడియా, కార్యాపద్ధతి రెండు కాలంశాలుపైన ప్రసంగించారు. ఈ కార్యక్రమానికి ఇచ్ఛాపురం అర్బన్, రూరల్, కంచిలి, కవిటి, సోంపేట అధ్యక్షులు, కార్యకర్తలు, స్థానికులు, తదితరులు హాజరయ్యారు.

## ఈదుపురానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం



ఇచ్ఛాపురం, మార్చి 21 ప్రభాతవార్త: మండలం ఈదుపురం గ్రామం బస్టాండ్ జంక్షన్ వద్ద నూతనంగా మంజూరు చేసిన ఆర్ టి సి బస్సు, ఇచ్ఛాపురం శాసనసభ్యులు, ఆంధ్ర రాష్ట్ర ప్రభుత్వ విప్ డాక్టర్ బి.అశోక్ చేతుల మీదుగా ప్రారంభించారు. ఆర్‌టిసి బస్ సర్వీస్ ఈ ప్రాంతం నుండి ఇచ్ఛాపురం వెళ్ళుటకు మహిళలు, దివ్యాంగులు, విద్యార్ధిని, విద్యార్థులు అందరు వెళ్ళుటకు మన మంచి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యం అని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ ఛైర్మన్ కొండ శంకర్ రెడ్డి, దాసరి రాజు, లోపింటి పద్మనాభం, దక్కత ఢిల్లీరావు, సాడి సహదేవ్ రెడ్డి, బోర ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, మహిళలు, ఆర్టీసీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రంజాన్ పండుగ



కంచిలి, మార్చి 21 ప్రభాతవార్త : కంచిలి పంచాయతీ పరిధిలో గల మక్కా మసీదు ఈడిగలో రంజాన్ పండుగ ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. మసీదు అధ్యక్షులు తాజుద్దీన్ ఖాన్ మాట్లాడుతూ ముస్లింల పం డగలలో రంజాన్ ముఖ్యమైన పండుగన్నారు. నెలరోజులు పాటు ముస్లిం అందరూ పండగలో ఉపవాస దీక్ష చేపడతారని చెప్పారు. ఆంధ్ర, ఒరిస్సా, పశ్చిమబెంగాల్ చెందిన 300 మంది లారీ డ్రైవర్లు పాల్గొని ప్రార్ధన చేశారు. కార్యక్రమంలో ఇమామ్ ఎండి తాసిర్, సలావుద్దీన్, ఎండిరఫీ, ఎండిరాజా, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి అచ్చెన్నను కలిసిన బీజేపీ నాయకులు



సంతబొమ్మాళి, మార్చి 21, ప్రభాతవార్త: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడుని జిల్లా బీజేపీ అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు శనివారం కలిసి కూటమిలో పలు విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో జిల్లా యువత నాయకుడు బైపల్లి పరమేశ్వరరావుతో పాటు సంతబొమ్మాళి మండల బీజేపీ అధ్యక్షులు దేవల్లి కామయ్య, బీజేపీ నాయకులు దేపల్లి నాగరాజు, దేపల్లి ప్రశాంత్, సూరాడ శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలి




### యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణారావు పిలుపు

సీతంపేట, మార్చి 21 ప్రభాతవార్త : పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్తు కోసం మన ఊరి లోనే బాటలు వేద్దామని మన్యం జిల్లా యుటిఎఫ్ అధ్యక్షులు కె.కృష్ణారావు పిలుపునిచ్చారు. శనివారం సీతంపేటలో ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని కోరుతూ ప్రజలను చైతన్యపరిచే ప్రచార రథాన్ని యూటీఎఫ్ ఏర్పాటు చేసింది. ఈ రథాన్ని పూర్వ రాష్ట్ర సహాధ్యక్షులు కే.విజయ్ గౌరి ప్రారంభించారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ప్రభుత్వ బడు ల్లో పిల్లల్ని చదివిద్దాం నైతిక విలువలు రాజ్యాంగ విలువలను సామాజిక బాధ్యతను అలవర్చుకోవాలంటే ప్రభుత్వ బడులే మంచిదని తల్లిదండ్రులు గుర్తించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించి ఉపాధ్యాయుల సంఖ్య పెంచాలని ప్రభుత్వ బడుల్లో చదివిన పిల్లలు ప్రతి అంశాన్ని వ్యాపార దృక్పథంతో చూడకుండా ఉంటారన్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ. భాస్కరరావు, జిల్లా కార్యదర్శి కె.సిద్దు, రాష్ట్ర కౌన్సిలర్ రాజామణి, జిల్లా సాంస్కృతిక సభ్యులు కె.గౌరన్నాయుడు, జిల్లా కౌన్సిలర్ పి.కృష్ణారావు, బి.వరలక్ష్మి, వి.విలాసవతి, విశాలాక్షి సింహాద్రి, ఏ.ప్రకాశం, పి.శ్రీనివాసరావు, టీ.చంద్రరావు హెచ్‌ఎం డి.వెంకటరమణ, ఏ.దుర్గారావు, కె.బుచ్చిబాబు, ఎస్.జమ్మరాజు, పి.రమేష్ పాల్గొన్నారు.

## స్వర్గీయ మాజీ డీజీపీ హెచ్‌జేదొర మృతి తీరనిది

### సంతాపం తెలిపినన ఆమదాలవలస ఎమ్మెల్యే కూన



ఆముదాలవలస, మార్చి 21, ప్రభాతవార్త : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హనుమంతు జగన్నాథ దొర (హెచ్.జె. దొర) మృతి పట్ల ఆమదలవలస ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ తన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాదులో హెచ్‌జే దొర నివాసంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలో జన్మించి, పోలీస్ శాఖలో అత్యున్నత శిఖరాలను అధిరోహించిన దొర జిల్లా కీర్తి ప్రతిష్టలను జాతీయ స్థాయిలో ఇనుమడింపజేశారని ఎమ్మెల్యే రవికుమార్ కొనియాడారు.

## విద్యుత్ స్తంభం నుంచి జారిపడి వ్యక్తికి గాయాలు



వీరఘట్టం, మార్చి 21, ప్రభాతవార్త : మండలంలోని తూడి గ్రామం వద్ద జరుగుతున్న ఆర్ డి ఎస్ ఎస్ పనుల్లో బాగంగా మనోజ్ సింక్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు స్తంభంపై నుండి జారి పడి తీవ్ర గాయాలు పాలయ్యాడు. స్తంభం నుండి కిందకు దిగుతుండగా కాలుజారి కిందన ఉన్న మిషన్‌పై పడిపోవడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే ఈయనను వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పార్వతీపురంనకు రిఫర్ చేశారు. 108 అంబులెన్స్‌పై పార్వతీపురం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విజయనగరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఆయనకు ప్రాణాపాయం ఏమీ లేదని డాక్టర్లు చెప్పారని సంబంధిత వ్యక్తులు విలేకరులకు తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



ఇచ్ఛాపురం, మార్చి 21 ప్రభాతవార్త: ముస్లింల పవిత్ర పర్వదినం రంజాన్ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. స్థానిక కస్పా వీధి మసీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఇమామ్ ఎండి అస్లాం జోహార్ ఖాన్, అబ్దుల్లా, ఇషాఫ్ ఖాన్, జూలల్‌బాకరి, ఆలీంఖాన్, అమీర్ అలీ, బషీర్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

## జానకిరామయ్య సేవలు మరువలేం



కవిటి, మార్చి 21 ప్రభాతవార్త: మండల పింఛనుదారుల సంఘాధ్యక్షుడు పిరియా బాబ్జీరావు అధ్యక్షతన గొంద్యాల జనకిరామయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్రాంత ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు రోనంకి రామచంద్రరావు హాజరై జనకిరామయ్య సేవలను స్మరించుకున్నారు. ఈ సభలో సోంపేట, ఇచ్ఛాపురం, మందస ప్రాంతాల సంఘాల అధ్యక్షులు, ఇతర పింఛనుదారులు, ఉపాధ్యాయులు పాల్గొని జనకిరామయ్యకు ఘన నివాళులు అర్పించారు. పలువురు వక్తలు ఆయన వ్యక్తిత్వం, సేవా తత్పరత, సమాజం పట్ల ఉన్న నిబద్ధతను కొనియాడారు.

## అభివృద్ధిని ప్రజలకు వివరించాలి : మంత్రి అచ్చెన్న



కోటబొమ్మాళి, మార్చి 21 ప్రభాతవార్త: ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని ప్రజలకు అర్థమయ్యేలా వివరించాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందని రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గత ఐదేళ్లలో గ్రామాల్లో ఒక్క అభివృద్ధి కార్యక్రమాలు జరగలేదని, 20 నెలల్లో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వివరించాలని సూచించారు. అంతేకాకుండా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు వచ్చి తమ వినతులు సమర్పించారు. మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కొత్త పింఛన్లు త్వరలోనే మంజూరు చేయడం జరుగుతుందన్నారు. సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీపీఏసీఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, కొత్తమ్మతల్లి పాలకమండలి అద్యక్షుడు కోరాడ గోవిందరావు, మండల పార్టీ అద్యక్షుడు బోయిన రమేష్, నాయకులు బి. పాండురంగరావు, తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు జరిమాన



కొత్తూరు, మార్చి 21, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని పాలకొండ రోడ్డు వద్ద శనివారం కొత్తూరు ఎస్సై కె.వెంకటేష్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ముమ్మరంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనదారులకు భారీగా జరిమానాలు విధించారు. కేవలం జరిమానాలు విధించడమే కాకుండా, వాహనదారులలో అవగాహన కల్పించేందుకు ఎస్సై ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకటేష్ మాట్లాడుతూ ప్రతి ద్విచక్ర వాహన దారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అది ప్రమాద సమయాల్లో ప్రాణరక్షక కవచంలా పని చేస్తుందని వివరించారు. వాహనదారులు తమ వెంట తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు వాహన పత్రాలను ఉంచుకోవాలని సూచించారు. అతివేగం, అజాగ్రత్తగా వాహనాలు నడపడం వల్ల కలిగే ప్రమా దాల గురించి వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నిబంధనలు అతిక్రమిస్తే భవిష్యత్తులో మరిన్ని కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఇతర సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రహరాజపాలెంలో రంజాన్ వేడుకలు



పాతపట్నం, మార్చి 21, ప్రభాతవార్త: మండలంలోని ప్రహరాజపాలెంలోని మసీద్ క్వామన్‌లో గురువు హాఫీజ్ షాజిహాన్ ఆధ్వర్యంలో రంజాన్ వేడుకలు శనివారం నిర్వహించారు. పాతపట్నంనకు చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు నమాజులో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ రంజాన్ ఇస్లామీయ చంద్ర మాస పంచాంగంలో తొమ్మిదవ నెలని, పవిత్ర దైవ గ్రంథం ఖురాన్ అవతరించినది రంజాన్ మాసంలోనేనని, రంజాన్‌కు మరో పేరు ఈద్‌ఉల్ ఫిత్ర అని ఆయన పేర్కొన్నారు. ఈ నెలలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు, ఫిత్రా జకాత్ దానధర్మాలు చేస్తుంటారని తెలిపారు. ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే రంజాన్ పండగ మానావాళికి హితాన్ని బోధిస్తుందని, క్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసం అని ఆయన అన్నారు. కార్యక్రమంలో చాంద్ భాయ్, అలీ భాష భాయ్, షేక్ ఖాదర్, ఇబ్రహీం, పకీర్ భాయ్, మోదిన్ భాయ్, సలీం భాయ్, బడేశ్, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



జలుమూరు, మార్చి 21, ప్రభాతవార్త: మండలంలోని కరవంజి ఏపీ మోడల్ స్కూల్,ఇంటర్మీడియట్ జూనియర్ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరంనకు ఇంటర్మీడియట్ (ఇంగ్లీష్ మీడియం) ప్రవేశాలకు దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా చేసుకోవాలని ప్రిన్సిపాల్ శివప్రసాద్ పేర్కొన్నారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసి గ్రూపులలో అడ్మిషన్ల కొరకు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు కోరబడుచున్నవి అని తెలిపారు. పదవ తరగతి మెరిట్, రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయించబడును. ఓసి, బిసి, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు 200 రూపాయలు, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 150 రూపాయలు రుసుము చెల్లించి, ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని అన్నారు. దరఖాస్తులకు చివరి తేదీ 30-4-2026, పూర్తి వివరాలకు ప్రిన్సిపాల్, ఏపీ మోడల్ స్కూల్, కరవంజి, జలుమూరు మండలం, మొబైల్ నెంబర్ 9440322964 ను సంప్రదించవచ్చునని తెలిపారు.

## యువతకు జాబ్ క్యాలెండర్ ఇవ్వడం శుభపరిణామం : కొల్ల



సంతకవిటి, మార్చి 21, ప్రభాతవార్త: శనివారం నాడు రాష్ట్ర తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొల్ల అప్పలనాయుడు సంతకవిటి మండలం మామిడిపల్లిలో ఒక ప్రకటన విడుదల చేశారు. యువతకు ఉగాది కానుకగా కూటమి ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను అందించిందని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఇప్పటికే కేవలం 20 నెలల్లోనే 6,28,347 ఉద్యోగాలను యువతకు అందించడం జరిగిందని కొల్ల అప్పలనాయుడు వెల్లడించారు. అదేవిధంగా రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులతో 25 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించేలా పలు కంపెనీలతో కూటమి ప్రభుత్వం ఒప్పందాలు కుదుర్చుకుందని వివరించారు. రాష్ట్రంలోని యువతకు బంగారు భవిష్యత్తు అందించాలనే సంకల్పంతో భారీ ఉద్యోగ కల్పనకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. ఎన్నికలకు ముందు 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని, ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ ఇస్తామని హామీ ఇచ్చిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులను నిలువునా మోసం చేశారని ఆరోపించారు. కొత్త పరిశ్రమలు,పెట్టుబడులు రాష్ట్రానికి రాకుండా చేసి,ఉన్న కంపెనీలను కూడా తరిమేసి 34 లక్షల మంది యువత భవిష్యత్తును నాశనం చేశారని విమర్శించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విద్యార్థులు, యువతకు అన్ని విధాల అండగా నిలుస్తుంటే, జగన్ రెడ్డి మాత్రం తన అవినీతి, అరాచక పాలనతో విద్యార్థి, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేకుండా చేసి వారి భవిష్యత్తును ప్రశ్నార్థకం చేశారని కొల్ల అప్పలనాయుడు తెలిపారు.

## పేకాట శిబిరంపై మెరుపు దాడి



రాజాం, మార్చి 21, ప్రభాతవార్త : రాజాం పట్టణంలో గల వస్త్రపురి కాలనీ వద్దగల జూట్ మిల్లు వెనుకన ఉన్న పొలంలో తాటి పెండు వద్ద గల ఖాళీ స్థలములో 12 మంది వ్యక్తులు ఉమ్మడిగా డబ్బు ను ఫణంగా పెట్టి పేకాట ఆడుచుండగా ఎస్సై పి.ఉమా వెంకటేశ్వరరావు డ్రోన్ సహాయంతో సుమారు ఒక కిలోమీటర్ దూరంలో కనుగొని పేకాట ఆడుతున్నట్టుగా గుర్తించి, వారి సిబ్బందితో కలిసి వారిని చుట్టుముట్టి పట్టుకొని వారి వద్ద నుండి రూ.2680 నగదు, ప్లాస్టిక్ గోనెసంచెను వశపరచుకొని సీజ్ చేసి వారిపై కేసు నమోదు చేసి కోర్టు వారి ఎదుట హాజరపరుచనున్నారు.

## 347 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



కోటబొమ్మాళి, మార్చి 21, ప్రభాతవార్త: నిమ్మాడ, తర్లిపేట, రామేశ్వరం, కొబ్బరిచెట్లుపేట, గంగుపేట, నూకపేట, సింహాద్రిపురం గ్రామలలోనూ 347 పశువులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని నిమ్మాడ పశువైద్యాధికారి డా. ఎల్.కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా పాడి రైతులు ఈ ఉచిత టీకాలు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అలాగే రైతులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు వాడరేవు శ్రీను, జడ్యాడ ధనుంజయ, కొయ్యాన శ్రీనివాసరావు, బొడ్డేపల్లి త్రినాధరావు, నూక వాసుదేవరావు, తిలారు పశువైద్యాధికారి డా. ఎమ్.ప్రజ్ఞ చైతన్య, పశు సంవర్ధక సహాయకులు డి.శ్రీను, శంకర్, సత్యనారాయణ, బి.రాంబాబు ఎస్.రమణమూర్తి, సిహెచ్.రాంబాబు, మొదలగు సిబ్బంది పాల్గొన్నారు.

## నిరుద్యోగ భృతి ఏదీ..? : మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి




పాతపట్నం, మార్చి 21 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరుద్యోగులను మోసం చేస్తూనే ఉందని వైఎస్ఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి మండిపడ్డారు. శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి నిరుద్యోగుల జీవితాలతో చంద్రబాబు సర్కారు చెలగాటమాడుతోందన్నారు. ఉగాది నాడు ప్రభుత్వం విడుదల చేసిన జాబ్ క్యాలెండర్ నిరుద్యోగులను నిలువునా వంచించేలా ఉందని, మంత్రి లోకేశ్ అద్భుతమైన క్యాలెండర్ ఇస్తామని చెప్పి, కేవలం తేదీలు మాత్రమే ఉండి ఉద్యోగాలు లేని క్యాలెండర్‌ను ప్రకటించి యువత ఆశలపై నీళ్ల చల్లారని విమర్శించారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి 2019-24 మధ్య 6,31,310 ఉద్యోగాలను కల్పించారని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే ఒకే నోటిఫికేషన్‌తో 1.34 లక్షల సచివాలయ ఉద్యోగాలను భర్తీ చేసిన ఘనత ఆయనదని కొనియాడారు. ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఉన్న 1.72 లక్షల మంది ఉద్యోగులను (వలంటీర్లు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది) తొలగించి వారి కుటుంబాలను రోడ్డున పడేశారని ఎద్దేవా చేశారు. ఏడాదికి 4 లక్షల ఉద్యోగాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం, ఇప్పటికే రెండేళ్లు గడిచినా కేవలం 10,060 పోస్టులతో సరిపెట్టడం హాస్యాస్పదమన్నారు. ఇది నిరుద్యోగులను మోసం చేయడం కాదా? అని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా నెలకు 3 వేల నిరుద్యోగ భృతి ఇస్తామని బాండ్లు పంచిన చంద్రబాబు, గత 22 నెలలుగా ఆ ఊసే ఎత్తడం లేదని, తక్షణమే పాత బకాయిలతో కలిపి భృతిని చెల్లించాలని ఆమె డిమాండ్ చేశారు. పవన్, లోకేశ్‌లకు మంత్రి పదవులు వచ్చాయి కానీ, నిరుద్యోగులకు మాత్రం నిరాశే మిగిలిందని పేర్కొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు : మజ్జి



కోటబొమ్మాళి, మార్చి 21, ప్రభాతవార్త : రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు కూటమి ప్రభుత్వం ఉగాది పండుగను పురస్కరించుకొని జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఇచ్చిన మాట సీఎం చంద్రబాబు నిలబెట్టుకున్నారని టీడీపీ కోటబొమ్మాళి పట్టణ నేత మజ్జి కృష్ణారావు అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల ఆశలను వమ్ము చేయకుండా పారదర్శకమైన రీతిలో ఉద్యోగుల భర్తీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టడం హర్షనీయమన్నారు. 20 నెలల స్వల్ప కాలంలోనే 6,28,347 మందికి వివిధ రంగాల్లో ఉపాధి కల్పించిందని వివరించారు. ఇందులో ప్రభుత్వ ఉద్యోగాలు 30,607, ఎంఎస్ఎంఈ రంగం ద్వారా 2,48,906 జాబ్ ఫెయిర్స్,స్కిల్ డెవలప్మెంట్ ద్వారా1,46,627, పరిశ్రమల రంగంలో 95,174 మందికి లబ్ధి చేకూరిందన్నారు.

## శాలివాహన సంస్కృతి కార్యక్రమానికి తరలిరండి

వీరఘట్టం, మార్చి 21, ప్రభాతవార్త : బిజెపి ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఈ నెల 22వ తేదీన విజయవాడలో జరిగే శాలివాహన చక్రవర్తి కవయిత్రి మొల్ల సాంస్కృతిక కార్యక్రమానికి తరలి రావాలని కోరుతూ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షులు పొట్నూరు కోటేశ్వరరావు కరపత్రాలను అందజేసి ఆహ్వానాలు పలుకుతున్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షులు పివీఎన్ మాధవ్ ఆదేశాల మేరకు ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు ఆర్.గోపి శ్రీనివాస్ పిలుపు మేరకు సామాజికవర్గ కుల పెద్దల వద్దకు ఆయన స్వయంగా వెళ్లి ఆహ్వానించారు. వీరఘట్టం ఓబీసీ మోర్చా మండల ప్రధాన కార్యదర్శి బండారు అప్పారావు ఉన్నారు.

## బాధితులకు సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



పాతపట్నం, మార్చి 21, ప్రభాతవార్త: నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన పలువురు కుటుంబ సభ్యులు అనారోగ్యంతో బాధపడుతూ స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి తీసుకురాగా వారి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి కొరకు సిఫారసు చేసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఆ కుటుంబాలకు 7,18,636 లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందించారు. పాతపట్నం మండలం గంగువాడ గ్రామానికి చెందిన కొండాల గోపాలరావుకి రూ. 55, 465, ఏ.ఎస్.కవిటి గ్రామానికి చెందిన కోట మిన్న మదన్‌కి రూ.40,022, మెళియాపుట్టి మండల కేంద్రానికి చెందిన చుక్క క్రిష్ణరెడ్డికి రూ.3,21,700, హిరమండలం మండలం కల్లట గ్రామానికి చెందిన బలగ తిరుపతిరావుకి రూ. 96,254, కొత్తూరి ఆదినారాయణకి రూ.42,362, ఎల్ఎన్‌పేట మండలం కరకవలస గ్రామానికి చెందిన పిల్ల రామారావుకి రూ.99,247, కొత్తూరు మండలం కుట్టిభద్ర గ్రామానికి చెందిన జాయ వంశీకి రూ.37,302, మాకువరం గ్రామానికి చెందిన పొత్తరకొండ మృత్యుంజయకి రూ.26,284 చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే అందజేశారు.

## సీనియర్ అసిస్టెంట్ రమణమూర్తిపై కేసు

కవిటి, మార్చి 21, ప్రభాతవార్త: కవిటి మండలం తహసిల్దార్ కార్యాలయంలో రీసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న పొన్నాడ నిరంజన్ రావు అనే వ్యక్తిపై అదే ఆఫీసులో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కె.రమణ మూర్తి 20వ తేదీ మధ్యాహ్నం 12.30 గంటలకు వ్యక్తిగత కారణాలతో తహసీల్దార్ ఆఫీస్‌లోనే డీటీ షర్ట్ కాలర్ పట్టుకుని చేతులతో కొట్టగా, అనంతరం డీటీ నిరంజన్ తహసీల్దార్‌కి ఫిర్యాదు చేసి, కవిటి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేయడమైనది. ఆ ఫిర్యాదుపై కవిటి పోలీసు స్టేషన్లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేయడమైనది. ఎస్సై రవివర్మ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

## హెల్మెట్లు, లైసెన్సులు... మీ రక్షణ కవచాలు




కోటబొమ్మాళి, మార్చి21, ప్రభాతవార్త: వాహనం నడిపేటప్పుడు హెల్మెట్లు, లైసెన్సులు మీ రక్షణ కవచాలుగా నిలబడతాయని టెక్కలి సబ్ డివిజన్ శక్తి టీం సభ్యులు తెలిపారు. కోటబొమ్మాళి మండలం, మంచాల పేట వద్దగల శౌర్య డిఫెన్స్ అకాడమీలో శనివారం విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. టెక్కలి హెడ్ కానిస్టేబుల్ ఎం. గిరిధర్, కోటబొమ్మాళి హెడ్ కానిస్టేబుల్, కే.గణేష్, సారవకోట డబ్ల్యూ పి.సి రమణమ్మ, కోచింగ్ సెంటర్ డైరెక్టర్లు కె.చాణుక్య, కె.గణేష్ పాల్గొన్నారు.

## పాగోడులో మెగా పశువైద్యశిబిరం



జలుమూరు, మార్చి 21, ప్రభాతవార్త: జలుమూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో పాగోడు గ్రామంలో నిర్వహించిన మెగా పశు వైద్య శిబిరంనకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి హాజరై శనివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పాడి పరిశ్రమను అభివృద్ధి చేసే దిశగా పాడి రైతులతో పాటు అధికారులు కూడా కృషి చేయాలని పేర్కొన్నారు. రైతుల ఆర్థిక అభివృద్ధిలో పశుసంవర్ధక రంగం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో పశువులు రైతులకు ఆదాయ వనరుగా నిలుస్తున్నాయని, వాటి ఆరోగ్యం పట్ల రైతులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం అవసరమని అన్నారు. ఈ విధంగా ఉచిత పశు వైద్య శిబిరాల నిర్వహించడం ద్వారా రైతులకు మంచి ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వెలమల రాజేందర్ నాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, చల్లవానిపేట, అల్లాడ పిఏసిఎస్ అధ్యక్షులు దుంగ స్వామిబాబు, వెలమల చంద్రభూషణ, జడ్పిటిసి ప్రతినిధి మెండ రాంబాబు, వంశధార డిస్ట్రిబ్యూటరీ చైర్మన్ కింజరాపు సత్యనారాయణ, నీటి సంఘం అధ్యక్షులు మొయ్యి శ్రీనివాసరావు, జుత్తు అప్పలనాయుడు, సర్పంచులు మొయ్యి గోవిందరావు, వాన రవీంద్ర, యూనిట్ ఇంచార్జ్ బోడాల బాలకృష్ణ, కింజరాపు ప్రకాష్ రావు, దుబ్బ రామారావు , సనపల రమణమూర్తి, వ్యవసాయ శాఖ ఏడి లోకనాథము, సెక్రటరీ శారద, కంప్యూటర్ ఆపరేటరు గోవిందరావు, కూటమి నాయకులు,కార్యకర్తలు, అభిమానులు,పాడి రైతులు పాల్గొన్నారు.

## విత్తన గుళికల తయారీ విధానం



కంచిలి, మార్చి 21 ప్రభాతవార్త: అంపురం యూనిట్‌లో గల బల్యాపుట్టుగ, అంపురంలో ఎల్‌నినో ప్రభావాన్ని సూచించుచున్నది వాతావరణ పరిస్థితిని బట్టి ముందస్తుగా రైతులకు ముందుగా విత్తన గుళికలు తయారు చేసుకోవాలని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు భవాని శంకర్ గారి రైతులకు తెలియజేశారు. వారి ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందిచే విత్తన గుళికలు తయారు చేయడం జరిగినది. దీనివలన ఉపయోగాలు రైతులకు మాస్టర్ ట్రైనర్ శివానందం వివరించడం జరిగినది. వీటి తయారీ గూర్చి కావలసిన పదార్థాలు. ముందుగా విత్తనాలు కందులు, గోరుచిక్కుడు, సజ్జలు, అనుములు, ఆముదము, ఘనజీవామృతం పొడి, బంకమట్టి పోడి, పోయి బూడిది, బీజామృతము. మంచినీరు, ఒక గోనె సంచి, తయారీ విధానం. ముందుగా గోనెసంచి తీసుకొని దానిపైన విత్తనాలు వేసి బీజామృతంతో విత్తన శుద్ధి చేసి మొదట లేరుగా బంక మట్టిని బాగా పట్టించి, రెండో లేరుగా ఘనజీవామృతం పట్టించాలి లాస్ట్ లేరుగా పోయి బూడిదని పట్టించాలి. ఈ విధముగా చేయడం వలన ఎటువంటి పరిస్థితుల్లోనూ చీమలు గాని పక్షులు గాని విత్తనాలను చెడిపోకుండా ఉంటాయి. ఈ రకం విత్తనాల్ని విత్తన గుళికలు చేసి భూమిలో వేయడం వలన ముందుగా విత్తనాలు మొలక శాతం కోసం సాధారణంగా వర్షపాతం 12 నుంచి 15 పడిన మొలక శాతం అనేది వస్తుంది. అతి తక్కువ వర్షపాతంతో కూడా మొలకలు రాడానికి బాగా పనిచేస్తున్నాయి ఈ విధంగా తయారు చేయడం. ఈ సమస్తము పైన తెలిపిన విధముగా వాతావరణ పరిస్థితులు బట్టి ఎక్కువగా విత్తన గుళికలు చేసి పొలాల్లో వేసుకుంటే తక్కువ వర్షపాతమైన మొలక శాతం మనేది వస్తుంది భూమి కప్పి ఉంచడము మరియు రైతుకు ఆదాయము వస్తుంది. వేసవిని తట్టుకునే రకాలు గోరుచిక్కుడు తక్కువ వర్షపాతంతో పంట వస్తుంది. అదేవిధంగా కంది కూడా తక్కువ వర్షపాతంతో పంట అనేది వస్తుంది భూమి లోపలికి వెళ్లే శాతం వెళ్లడం వలన వర్షపు నీరుని భూమి లోపలికి ఇంకింపు చేస్తుంది అనుములనేవి వాతావరణం లోని తేమ శాతాన్ని తీసుకొని మొక్క పెరగడానికి ఆస్కారం గా ఉంటుంది భూమిని కప్పి ఉంచుతుంది ఈ విధంగా కప్పి ఉంచడం వలన భూమిలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి సజ్జలు ఇవి వేసవికి తట్టుకుంటాయి భూమిని బాగా గుల్ల చేస్తాయి అని రైతులకు వివరించడం జరిగినది. ఈ విధముగా భూమికి మరియు రైతులకు మేలు జరుగుతుందని రైతులకు చెప్పడం జరిగింది.

## గరివిడిలో ఘనంగా రంజాన్ వేడుకలు



గరివిడి మార్చి,21 ప్రభాత వా గరివిడిలో రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. స్థానిక జమియా మస్జిద్ మస్జిద్ ఈ అహెలే హదీస్‌లో ముస్లిం మత పెద్దలు, స్థానిక నాయకులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వారు కోరారు. రంజాన్ సందర్భంగా మస్జీద్ లో ముస్లిం మత పెద్దలు తోపాటు స్థానిక నాయకులు కూడా పాల్గొని ప్రార్ధనలు చేశారు.ముస్లిం లకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ముస్లిం మైనారిటీలకు ఈ పండుగ సంతోషాన్ని,శాంతి ని, ఆనందాన్ని అందివ్వాలని వైకాపా నాయకులు కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ఆనందోత్సా హాలతో వేడుకగా జరిగే రంజాన్ ఉత్స వాల్లో గరివిడి మండల వైకాపా కార్యదర్శి బొంపల్లి వెంకట రావు, కొండ పాలెంసీనియర్ వై ఎస్ ఆర్ సి పి నాయకులు పి.కుమార్,కొండ పాలెం(గరివిడి) మేజర్ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ సాగి భాస్కర రాజు, గరివిడి మండల కోఆప్షన్ సభ్యులు ఇక్బాల్ షరీఫ్, ఘని గౌస్,అన్వర్ షరీఫ్, గౌస్ , తూట రమేష్, బుజ్జి, వెంపడాపు, తదితరులు పాల్గొన్నారు.

## ఏఎంసీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్యశిబిరం



బొబ్బిలి, మార్చి 21, ప్రభాతవార్త బొబ్బిలి ఏఎంసీ పరిధిలో ఉన్న వెలగవలస గ్రామంలో ఉచిత పశు వైద్య శిబిరం ప్రారంభించిన ఎమ్మెల్యే ఆర్ వి ఎస్ కే రంగారావు. అనంతరం గ్రామంలో ఆయన మాట్లాడుతూ చిత్రకోట గొడ్డవలస జలాశయం నీటి వచ్చేందుకు నిధులు తెప్పించేందుకు ప్రయత్నిం చేస్తానన్నారు ఎలాగా వలస పద్దవలస కొండపై నుంచి పోయే రోడ్డుకు తీవ్రస్థాయిలో ప్రయత్నం చేస్తున్నామని ఇటీవలే ఒకటిన్నర ఎకరాల కొండదేగుపల్లి వద్ద అటవీశాఖ అందజేస్తామని తెలియజేశామ న్నారు. దీనికి వారు సానుకూలంగా స్పందించారని దీన్ని నిర్మాణం పూర్తిచేసే బాధ్యత నాది అన్నారు. అనంతరం గ్రామస్తులకు కావలసిన సిసి రోడ్లు ఇస్తామని హామీ ఇచ్చారు తెర్లాం బొబ్బిలి మధ్య రెండో విడత రోడ్డు పనులను పరిశీలించారు. ఏఎంసీ చైర్మన్ వెంకట్ నాయుడు రాష్ట్ర నాయకులు అల్లాడ భాస్కరరావు, మండల పార్టీ నాయకులు ఈ సత్యానారాయణ, యుగంధర్, ఏఎంసీ కార్యదర్శి ఎం కాలేశ్వరరావు కే ఈశ్వరరావు ఎం శ్రీను డాక్టర్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై హర్షం



బొబ్బిలి, మార్చి 21, ప్రభాతవార్త: ఉత్తరాంధ్రలో అభివృద్ధి కూటమి ప్రభుత్వం తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయం పై తెలుగు యువత హర్షం వ్యక్తం చేశారు. స్థానిక దర్బార్ మహల్ లో తెలుగు యువతతో ఎమ్మెల్యే ఆర్‌విఎస్‌కే రంగారావు ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ యువతకు కళ్ళల్లో ఆనందోత్స వాలు వెల్లివిరుస్తున్నాయని అన్నారు. ఈనెల 23న ముఖ్యమంత్రి చేతుల మీదుగా నక్కపల్లి లో స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన నిర్వహిస్తున్నారని అన్నారు ఉగాది సందర్భంగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన మంత్రి నారా లోకేష్ బొబ్బిలి నియోజకవర్గం తెలుగు యువత కృతజ్ఞతలు తెలియజేశారు గత ప్రభుత్వం హయాంలో ప్రతి జనవరి ఒకటో తేదీన జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని యువతను మోసం చేసింది అన్నారు కోపం ఇచ్చిన విధంగా జాబ్ కాలనీ క్యాలెండర్ విడుదల చేసేందుకు అన్నారు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మీ మాట ఇచ్చిన విధంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు జాబ్ కార్డు విడుదల చేశారు స్టీల్ ప్లాంట్ స్థాపనతో ఉత్తరాంధ్ర అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కార్యదర్శిలు పాల్గొన్నారు.

## బొత్స యోగ క్షేమాలు తెలుసుకున్న వైసీపీ నేతలు



దత్తిరాజేరు, మార్చి 21, ప్రభాతవార్త : వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకుడు శాసన మండల ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోగ్య పరిస్థితులను దత్తిరాజేరు మండల వైసీపీ నాయకులు శనివారం ఆయన నివాసం వద్దకు వెళ్లి మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆరోగ్య పరిస్థితులు మరియు యోగ క్షేమాలు గురించి అడిగి తెలుసుకున్నారుమీరు ఎప్పుడు ఆయురా రోగ్యాలతో ఉండాలని మనసారా దేవుని కోరుకుంటుమన్నారు ఆయున్ని కలిసిన వారిలో జెడ్పీటీసీ సభ్యురాలు రౌతు రాజేశ్వరి జిల్లా రైతు విభాగ అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు నియోజకవర్గ బూత్ కన్వీనర్ మహదేవ్ ఫణీంద్ర మండల యువజన విభాగం అధ్యక్షులు దత్తి చిరంజీవి రైతు విభాగం కార్యదర్శి చుక్క మురళి మాజీ ఏఎంసి వైస్ చైర్మన్ మండల శ్రీనివాసరావు ఉన్నారు.

## బురద వెంకటరాయపురంలో రైతన్న మీకోసం కార్యక్రమం



గరుగుబిల్లి, మార్చి 21, ప్రభాతవార్త: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పలు కార్యక్రమాలపై విస్తృత ప్రచారం నిర్వహించడం జరుగుతుందని మండల వ్యవసాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్స్న వెల్లడించారు. మండల పరిధిలోని బురదవెంకటాపురం గ్రామంలో వ్యవసాయ రంగమును బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రస్తుతం గ్రామ పంచాయతీలో నిర్వహిస్తున్న రైతన్న మీకోసం కార్యక్రమంకు సంబంధించిన వాల్ పోస్టర్లను శనివారం మండల వ్యవ సాయ శాఖ అధికారి తుమ్మనపల్లి జ్యోత్స్నతో పాటు మండల తెలుగు యువత అధ్యక్షులు బొత్స జగదీష్, ఎంపీటీసీ ప్రతినిధి చింతల మల్లినా యుడు, మాజీ సర్పంచ్ బొత్స జోగి నాయుడు తదితరులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మండల వ్యవ సాయ శాఖ అధికారి తుమ్మ నపల్లి జ్యోత్స్న మాట్లాడుతూ రైతన్న మీకోసం కార్యక్రమంలో భాగంగా ప్రతి రైతును భాగస్వామ్యం చేయ డమే లక్ష్యంగా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న పథకాల గురించి తెలియజేయడం జరుగుతుందన్నారు. మండల తెలుగు యువత అధ్యక్షులు బొత్స జగదీష్ మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునా యుడు అహర్నిశలు కృషి చేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సా హకాలతో రైతుల నూతన సాగు విధానాలను అవలంబించి వ్యవసాయమును లాభసాటిగా మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి చింతల మల్లినాయుడు, మాజీ సర్పంచ్ బొత్స జోగినాయుడు పాల్గొన్నారు.

## అకాల వర్షాలతో అన్నదాతకు తీవ్ర నష్టం

కొమరాడ, మార్చి 21, ప్రభాతవార్త : అకాల వర్షాలు కారణంగా మండలంలో అన్నదాతలకు తీవ్ర నష్టాన్ని కలిగించింది.కల్లికోట గ్రామంలో రైతులు వేసిన మొక్కజొన్న, అరటి పంటలు గురు,శుక్ర వారాల్లో వీచిన ఈదురుగాలులు, వడగండ్ల వర్షానికి నేలమట్టమయ్యాయి. దీంతో వేలాది రూపాయలు మదుపులుగా పెట్టి పంట మరికొద్దినే రోజులలో చేతికి అంది వస్తుందన్న తరుణంలో అకాల వర్షం కారణంగా నేలమట్టం రావడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పంటలు పోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం పార్టీ నాయకులు సాంబమూర్తి డిమాండ్ చేశారు.

## అనుమానాస్పదంగా వృద్ధురాలు మృతి



మక్కువ, మార్చి 21, ప్రభాతవార్త: మండలంలోని కాశీపట్నం పంచాయతీ మేలాపువలస గ్రామంలో మేలాపు సింహాచలంఅమ్మ (70) అనుమానాస్పదంగా మృతి చెందింది. వృద్ధురాలు ఒంటరిగా నివాసం ఉండడంతో పొద్దున్న పాలు పోసే ఆమె చూసేసరికి విగతజీవిగా పడి ఉండడంతో స్థానికులు కు తెలిపింది. మృతురాలు మెడలో బంగారు గొలుసు లేకపోవడంతో అనుమానించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని స్థానిక ఏఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

## పిడుగుపడి పాడి ఆవు మృతి



కొమరాడ, మార్చి 21, ప్రభాతవార్త: మండలంలో పరుశురాంపురం గ్రామంలో పిడుగు పడి పాడి ఆవు మృతి చెందినట్లు రైతు ముత్యాలు తెలిపారు. శుక్రవారం రాత్రి ఉరుములు, పిడుగులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈ సమయంలో ఆవుపై పిడుగు పడడంతో అక్కడి కక్కడే ఆవు మరణించిందన్నారు. పాడే జీవనాధారంగా బతుకుతున్న.. తనకు తీవ్ర నష్టం వాటిలిందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

## ఎల్.కోటలో ఘనంగా రంజాన్ వేడుకలు



లక్కవరపుకోట, మార్చి 21, ప్రభాతవార్త : మండలంలో శనివారం రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం లు రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఎల్ కోట మండల కేంద్రం లో గల మక్కా మసీదు లో దర్గా మాదీన అలాగే మాదీన ల ఆధ్వర్యంలో అన్ని గ్రామాలలో గల ముస్లిం సోదరులు ఇమామ్ ఎస్ కె ఇర్ఫాన్ ఆధ్వర్యంలో తమ ఇష్ట దైవం అయినా అల్లాకి ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా ఇమామ్ అల్లా యొక్క మహిమలు మహమ్మద్ ప్రవక్త ముస్లిం లు సమాజం లో పరోపకారం చేస్తూ ఏ విదంగా జీవిచాలని తెలిపారో వివరించారు. త్యాగం సహనం స్నేహ భావం సోదర భావం తో జీవించాలని ఖురాన్ నియమాలు పాటిస్తే అల్లా ను చేరుకునే మార్గం సులభం గా దొరుకుతుంది అని అన్ని వేళలా అల్లా పై భారం ఉంచితే అంతా ఆయనే చూసుకుంటారు అని ఇమామ్ అన్నారు. ఈ కార్యక్రమం లో ఫిరోజ్ కాసీం, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రిని కాదు.. మీ సేవకురాల్ని : మంత్రి సంధ్యారాణి



పాచిపెంట, మార్చి 21, ప్రభాతవార్త: మీ అందరి ఆదర అభిమానాలతో నన్ను సాలూరు నియోజకవర్గం ఎమ్మెల్యేగా గెలిపించి సీఎం చంద్రబాబు నాయుడు ఆశీస్సులతో మంత్రిని అయ్యానని, నేను మంత్రిని కాదనీ మీ సేవకురాలుని నన్ను ఆశీర్వదించండి అని మీరు ఏ సమస్యలపై మీరువచ్చినా తక్షణమే మీ సమస్యలను పరిష్కరిస్తారని మంత్రి సంధ్యారాణి గిరి పుత్రులకు భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వంలో మాటల చెప్పే ప్రభుత్వం కాదని చేతలు చేసే ప్రభుత్వం అని ఆమె గుర్తు చేశారు. నన్ను మీ గిరిజన బిడ్డగా ఆదరించి మీ ఆశీస్సులు నాకు ఎప్పుడూ కావాలని మీకు అందుబాటులో ఉంటానని ఆమె అన్నారు. మండలంలో సతాబి ఏజెన్సీ గిరిజన గ్రామాన్ని శనివారం సందర్శించారు. సతాబి తదితర గిరిజన పంచాయితీలు ప్రజలు మంత్రి సంధ్యారాణికి ఘన స్వాగతం పలికి పూలమాలతో సత్కరించి బ్రహ్మరథం పట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు సంక్షేమం అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి అభివృద్ధి చేస్తూ ఏజెన్సీ గిరిజన ప్రాంతాల అభివృద్ధిని చూసి గిరి పుత్రులువైసీపీ పార్టీ నుండి దేశం పార్టీలోకి గిరి పుత్రులు ఆసక్తి కరపరిచి పార్టీలో చేరారన్నారు. ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో ..500 గిరిజన కుటుంబాలు టిడిపి తీర్థం. మండలంలో గిరి శిఖర పంచాయితీలు అయిన శతాభి, గొట్టూరు, తంగళాం, బొర్రమామిడి, మూటకూడు, గరిసిగుడ్డి గిరిజన పంచాయతీ పరిధిలోని 500 గిరిజన కుటుంబాలు తెలుగుదేశం పార్టీ (టిడిపి)లో వచ్చిన కార్యకర్తలకు మంత్రి సతాబి సర్పంచ్ ఎస్ రామయ్య కు దేశం పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే పలువురు కు కండువ వేసి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షుడు జి యుగంధర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ యుగంధర్,సాలూరుమక్కు వమండలాల టిడిపి అధ్యక్షులు ఏ. పరమేశ్వర రావు, జి వేణుగోపాల్ నాయుడు, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి మతల బలరాం టిడిపి ఉపాధ్యక్షులు కోరిపల్లి సురేష్,ఏఎంసి డైరెక్టర్లు పి నర్సింగరావు డి .ఆనంద్, మండల జనసేన పార్టీ అధ్యక్షులు జి జగదీశ్వరరావు పాచిపెంట ఎంపిటిసి సభ్యులు పి.ఉమా, టిడిపి కార్యదర్శి కే పోలీనాయుడు, టిడిపి నాయకులు కే చిరంజీవి, ఆకుల శ్రీనివాసరావు,సాయి, తదితరులు పాల్గొన్నారు.

## దేవాన్ష్ పుట్టినరోజు వేడుకలు



శృంగవరపుకోట, మార్చి21, ప్రభాతవార్త : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తనయుడు నారా దేవాన్ష్ పుట్టినరోజును పురస్కరించుకుని శనివారం మండల కేంద్రంలో బీసెట్టి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈసం దర్భంగా ట్రస్ట్ అధ్యక్షులు టీడీపీ సీనియర్ నాయకులు బీసెట్టి అరుణ కేక్ కట్ చేసి దేవాన్ష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ప్రస్తుతం పెరుగుతున్న ఎండల తీవ్ర తను దృష్టిలో ఉంచుకుని బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఆమె ప్రత్యేకంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎస్.కోట పీఏసీఎస్ చైర్మన్ జీవస్ నాయుడు,ఏఎంసీ వైస్ చైర్మన్ తూ ర్పాటి ఆదిబాబు,రాష్ట్ర దాసరి కార్పొరేషన్ డైరెక్టర్ ఎన్.రమనాజీ,క్లస్టర్ ఇంచార్జ్ పి.రాజు,ఏఎంసీ డైరెక్టర్ ఎ.చెల్లయ్య,ఐటీడీపీ రాష్ట్ర సెక్రటరీ సీహెచ్ కిరణ్ కుమార్,పార్లమెంట్ సెక్రటరీ కె.వాసు,మండల పార్టీ నాయకులు పొట్నూరు సాయి రామ్,సత్తిబాబు, బోనంగి జ్యోతి,సూరి అప్పారావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఏజెన్సీ గిరిజన రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తా : మంత్రి



పాచిపెంట, మార్చి 21, ప్రభాతవార్త: తరతరాలుగా తాత ముత్తాతల నుండి సాగు చేస్తున్న భూముల(రెవెన్యూ సమస్యలు) పరిష్కరిస్తామని రాష్ట్ర గిరిజన సంక్షేమ మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరి పుత్రులకు భరోసా ఇచ్చారు. శనివారం ఏజెన్సీ గిరిజన పంచాయతీలు ఐదు పంచాయతీలు గిరి పుత్రులు తెలుగుదేశం పార్టీ తీర్థం పుచ్చుకొనే కార్యక్రమంలో భాగంగా ఏజెన్సీ పంచాయతీ అయినా సతాబి గిరిజం గ్రామం శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా సతాబి తంగలం తదితర పంచాయతీలు ప్రజలు రహదారి త్రాగునీటి రెవెన్యూ సమస్యలు మంత్రి సంధ్యారాణి దృష్టికి తీసుకువచ్చారు. ఆ మేరకు మంత్రి స్పందించి ఏజెన్సీ గిరిజన గ్రామాల్లో గిరి పుత్రులు సాగు చేస్తున్న భూముల సమస్య ఉన్నత రెవెన్యూ అధికారుల దృష్టిలో తీసుకెళ్లి తమ సమస్య పరిష్కరిస్తామని గిరి పుత్రులకు హామీ ఇచ్చారు.

## బొబ్బిలిలో పలు హొటల్లో విజిలెన్స్ తనిఖీలు



బొబ్బిలి, మార్చి 21, ప్రభాతవార్త : రెవెన్యూ విజిలెన్స్ అధికారులు ముందస్తు సమాచారం మేరకు పట్టణములో హోటల్స్ టిఫిన్ సెంటర్ మెస్సులలో గృహ అవసరాలకు తీసుకొని హోటల్స్ వాణిజ్యానికి వాడుతున్నారన్న దీంతో నేడు రెవెన్యూ విజిలెన్స్ సిఐ బి సింహాచలం డివివి సతీష్ కుమార్ సీఐ సీఐ బి రామారావు సిఐబి రామారావు ఎస్సైలు సి ఎస్ డి టి ఆర్ సాయికృష్ణ తదితరులతో వివిధ హోటల్స్ లో తనిఖీలు నిర్వహించారు. విజయలక్ష్మి మెస్ మూడు సిలిండర్లు గణేష్ రెస్టారెంట్ రెండు సిలిండర్లు 2. సాయిరాం డాబా 2. లక్ష్మి రెస్టారెంట్ మూడు రాజు స్వీట్స్ అండ్ బేకరీ మొత్తం 13 హెచ్పీ గ్యాస్ సిలిండర్లను సీట్ చేయడమైనదని వారు తెలియజేశారు అనంతరం శ్రీ వెంకటేశ్వర ఏజెన్సీ తనిఖీ చేయడమైనది నిల్వ ఉన్న నిల్వలను స్టాక్ లిస్టులను పరిశీలన చేయడమైనది తనిఖీలు విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

## అటవీ శాఖాధికారి, జీసీసీ సేల్స్‌మెన్‌పై మంత్రికి ఫిర్యాదు



పాచిపెంట, మార్చి 21, ప్రభాతవార్త : ఏజెన్సీ గిరిజను గ్రామాలలో తరతరాలుగా అనుభవిస్తున్న సాగు భూములు లెవెల్ చేస్తున్నందుకు పర్మిషన్ లేకుండా భూములు లెవెలు ఎలా చేస్తున్నారని గిరి పుత్రులను అటవీశాఖ అధికారులు అడ్డుకొని లంచాలు గుంజుకుంటున్నారని, శనివారం మంత్రి సంధ్యారాణికి సతాభి సమావేశంలో గుట్టూరు పంచాయతీ రీట్లపాడు, నివాసి ,సే బి ఆదియ్యా, కోటపర్తి కృష్ణ నేరేడువలస మూట కూడు పంచాయతీ నివాసి ఫిర్యాదు చేశారు. అలాగే గిరిజన కార్పొరేషన్ దుకాణంలో పనిచేస్తున్న సేల్స్ మాన్ నిత్యవసర సరుకులు వచ్చిన గిరి పుత్రులకుస్లిప్పులిచ్చి రేషన్ సక్రముగా ఇవ్వడం లేదని ఈ నెలలో స్లిప్ ఇచ్చి రాబోయే నెలలో రేషన్ ఇస్తున్నారని ఇలా ఇవ్వడం వలన ఒక నెల బియ్యం సేల్స్ మేన్ వద్ద ఉండిపోతున్నాయని మంత్రి కి పలువురు గిరిజనులు ఫిర్యాదు చేశారు. ఆ మేరకు మంత్రి సంబంధిత అధికారులతో చర్చించి జిసిసి సేల్స్ మెన్, మరియు గిరి పుత్రులు నుండి లంచాలు తీసుకున్న అటవీ శాఖ అధికారులపై చర్యలు తీసుకుంటామని గిరి పుత్రులకు హామీ ఇచ్చారు.

## స్నేహభావంతో అందరం కలిసి ఉండాలి



చీపురుపల్లి , మార్చి 21, ప్రభాతవార్త : హిందూ ముస్లిం బేధాలు లేకుండా స్నేహభా వంతో అందరం కలిసి ఉండాలని చీపురుప ల్లిలోని పలువురు ముస్లిం మత పెద్దలు అన్నా రు. శనివారం నాడు రంజాన్ సందర్భంగా చీపురుపల్లి పట్టణంలోని మసీదు వద్ద రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ మతాలకు అతీతంగా భారతీయులుగా ప్రతిఒక్కరు స్నేహభావంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో మత పెద్దలు ఎండి. ముజక్కిర్ , యూనిస్ రాహి,షేక్ రహేమన్,ఇస్మాయిల్ ,జాని, జీలని ,బాబ్జీ, ఎండి రఫీ, తదితరులు పాల్గొన్నారు.

## బొత్సను పరామర్శించిన మాజీ డీసీఎం



సాలూరు, మార్చి 21, ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్ శాసనమండలి విపక్షనేత,మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ ఈమధ్య బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై హైదరాబాదులో ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందిన అనంతరం విజయనగరంలో ఉన్న తన నివాసానికి రావడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర శనివారం తన అనుచరులతో బొత్స గృహానికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని పరామర్శించారు.అలాగే మాజీమంత్రి బొత్సకు ఎల్లపుడు ఆయురారోగ్యలు ఆ భగవంతుడు చేకూర్చాలని మాజీ డిప్యూటీ రాజన్నదొర ఆకాంక్షించారు.

# విజయనగరం
### పార్వతీపురం మన్యం
# వార్త

## పశు వైద్యశిబిరాలను వినియోగించుకోవాలి : మంత్రి కొండపల్లి



బొండపల్లి, మార్చి 21, ప్రభాతవార్త : రాష్ట్రంలో పాడి ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఆయన గజపతినగరం నియో జకవర్గంలోని బొండపల్లి మండలం దేవుపల్లిలో ఉచిత పశువైద్య శిబిరం ప్రారం భించారు. రైతులు అందరూ ఈ పశువైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సూచించారు. ఈ క్రమంలోనే లేగ దూడలను ఆయన స్వయంగా పరిశీలించారు. ఏఎంసీ ఛైర్మన్ గోపాలరాజు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ కోరాడ కృష్ణ, బొండపల్లి మండల టీడీపీ అధ్యక్షులు రాపాక అచ్చెన్నాయుడు, గంట్యాడ మండల పార్టీ అధ్యక్షులు భాస్కర్‌నాయుడు, పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఊరి బడిలోనే బంగారు భవిష్యత్



కురుపాం, మార్చి21, ప్రభాతవార్త : ప్రభుత్వ పాఠశాలలు పిల్లల భవిష్యత్తుకు పునాది వేస్తాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను సమీపంలోని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించాలని విద్యావేత్తలు పిలుపుని చ్చారు. మండల కేంద్రం గల రావాడ జంక్షన్ వద్ద శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఈ మేరకు ప్రసంగించారు.యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎన్. శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాలల గౌరవ అధ్యక్షురాలు కె .విజయ గౌరీ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ బడులు కేవలం విద్య బోధించే స్థలాలు మాత్రమే కాకుండా, పిల్లల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత, సమానత్వ భావనలను పెంపొందించే కేంద్రాలని పేర్కొన్నారు.గాంధీ, నెహ్రూ, అంబేద్కర్, అబ్దుల్ కలాం వంటి మహానుభావులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ బడుల్లో సాంకేతిక పరిజ్ఞానంతో బోధన, ఉచిత పుస్తకాలు, యూనిఫాంలు, బూట్లు, మధ్యాహ్న భోజనం వంటి సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. చిన్ననాటి నుంచే పోటీ పరీక్షలకు సిద్ధం చేసే విధంగా విద్య అందిస్తున్నారని, పరిశుభ్రమైన తరగతి గదులు, ఆటస్థలాలు వంటి సౌకర్యాలు కూడా మెరుగుపడ్డాయని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో చదివే పిల్లలు వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదుగుతారని అన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని ప్రభుత్వ పాఠశాలల ప్రాధాన్యాన్ని వివరించారు.

## మత్తుపదార్థాలపై అవగాహన సదస్సు



కురుపాం, మార్చి21, ప్రభాతవార్త : మత్తు పదార్థాలు వినియోగిస్తే వచ్చే అనర్థాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని కురుపాం సబ్ ఇన్స్పెక్టర్ పి. నారాయణ రావు అన్నారు. శుక్రవారం మహాత్మ జ్యోతి బాపూలే సంక్షేమ బాలు ర వసతి గృహంలో పలు చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా మత్తు పానీయాలకు పదార్థాలకు దూరంగా ఉండాలని, అలాగే ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనాలు నడిపేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తల పై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకలకు పక్కా ఏర్పాట్లు చేయాలి : ఎమ్మెల్యే



నెల్లిమర్ల, మార్చి 21, ప్రభాతవార్త : ప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలో ఈనెల 27వ తేదీన జరగనున్న శ్రీరామనవమి వేడుకలకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఎంఎల్ఏ లోకం నాగమాధవి సూచించారు. వేడుకల నిర్వహణకు సంబంధించి రామతీర్థంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సమావేశంలో ఆమె మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలు నిర్వహణలో ఎలాంటి అపసృతులకు ఆస్కారం లేకుండా, భక్తుల మనోభావాలు దెబ్బ తినకుండా ఉండేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని అన్నారు. భక్తుల దర్శనాల విషయంలో గాని, కళ్యాణ వేదిక వద్ద గాని, ముత్యాల తలంబ్రాలు పంపిణీ సమయంలో గాని ఎలాంటి తోపులాటలకు అవకాశం లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని, గత ఏడాది నిర్వహించిన వేడుకలను ప్రామాణికంగా తీసుకో వాలని ఎమ్మెల్యే నాగమాధవి సూచించారు. వేడుకల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతోపాటు, భక్తులకు తాగునీరు, మజ్జిగ, తాత్కాలిక మరుగుదొడ్లు తదితర సదుపాయాలు కల్పించాలని ఆమె సూచించారు. టిడిపి సీనియర్ నాయకుడు, విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిశీలకుడు సువ్వాడ రవిశేఖర్ మాట్లాడుతూ కళ్యాణం తొలగించేందుకు వచ్చే ఆలయ ధర్మకర్త పూసపాటి అశోక గజపతిరాజు కుటుంబ సభ్యులకు భారీ కేట్లతో కూడిన ప్రత్యేక వేదిక ఏర్పాటు చేయాలని సూచించారు. కళ్యాణ వేదిక మీద ఉన్నత స్థాయి ప్రజాప్రతినిధులను మాత్రమే అనుమతించాలని ఆయన సూచించారు. ఇంచార్జ్ ఆర్డిఓ, మండల ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలను విజయవం తం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎమ్మెల్యే నాగ మాధవి భర్త, జనసేన పార్టీ నాయకులు లోకం ప్రసాద్ మాట్లాడుతూ శ్రీరామనవమి వేడుకలకు హాజరయ్యేందుకు భోగాపురం, పూసపాటిరేగ మండలాల నుంచి భక్తులు వచ్చేందుకు వీలుగా ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులు నడపాలని సూచించారు. దేవస్థానం ఈవో వైస్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్డిఓ వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు లోకం ప్రసాద్, సువ్వాడ రవి శేఖర్, చనమల్లు వెంకటరమణ, గేదెల రాజారావు, లంక అప్పలనాయుడు, కరుమజ్జి గోవిందరావు, ఎం ఎం నాయుడు, తాడి సత్యనారాయణ, కోటపాటి తిరుపతిరావు, అంబళ్ల అప్పలనాయుడు, పతివాడ గోవిందరావు, పోతల రాజప్పన్న, ఎల్లంకి హరి, నవుగట్ల పైడిరాజు, తాసిల్దార్ కే శ్రీకాంత్, భోగాపురం రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జి రామకృష్ణ, ఎస్సై బి గణేష్, డిప్యూటీ ఎంపీడీవో శంకర్ జగన్నాథ్, దేవస్థానం అర్చకులు ఖండవిల్లి సాయి రామాచార్యులు, కిరణ్ కుమార్, గొడవర్తి నరసింహచార్యులు, రేజేటి మల్లికార్జున శర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జొన్నకు గిట్టుబాటు ధర కల్పించాల్సిందే

### - జడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు




మెరకముడిదాం, మార్చి 21, ప్రభాతవార్త : రైతులకు పక్షపాతి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వం జొన్నలకు గిట్టుబాటు ధర కల్పించాల్సిందే అని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. శనివారం మెరకనుడిదాం మండల సమావేశ భవనంలో మండల అధ్యక్షురాలు తాడ్డి కృష్ణవేణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులు గిట్టుబాటు ధర లేక నానా అవస్థలు పడుతున్నారని, అందరూ జొన్నలు పండిస్తే, ఆ జొన్నలకు మద్దతు ధర ప్రకటించకుండా తాత్సరం చేస్తుందని, తక్షణమే మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ శాఖ పనితీరును వ్యవసాయ అధికారిని ఎం అనురాధ వివరిస్తుండగా సభ్యులు ఈ గిట్టుబాటు ధర విషయమై ప్రశ్నలు లేవనెత్తారు. అనంతరం హౌసింగ్ శాఖ ఏఈ గృహ నిర్మాణ విషయమై వివరిస్తుండగా, సభ్యులు నూతన గృహ నిర్మాణానికి బిల్లులు ఆలస్యంపై లేవనెత్తారు. మండలంలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించి విధులు తూచా తప్పకుండా పాటించాలని చైర్మన్ వైద్య సిబ్బందికి హితవు పలికారు. కార్యక్రమంలో మండల అభివృద్ధి అధికారి జి భాస్కరరావు, మండల రెవెన్యూ తహసీల్దార్ ఆకుల సులోచన రాణి, మండల ఉపాధ్యక్షులు తలచుట్ల హరిబాబు, కందుల పార్వతి, సర్పంచులు ఎంపీటీసీలు అధికారులు పాల్గొన్నారు.

22-03pg10exHMNWJQE.qxd:22-03pg10exHMNWJQE.qxd 1/1/02 7:10 AM Page 1






# ఇది టాలెంట్ కాదు.. టోర్నడో!

*ఐపీఎల్ 2026 ఆరంభానికి ముందే అందరి ఫోకస్ ఆ ఒక్కడి మీదే. అతనేమీ హిట్ మ్యాన్ రోహిత్ శర్మ, ఛేజింగ్ కింగ్ విరాట్ కోహ్లీ కాదు.పోనీ టీ20 ప్రపంచ ఛాంపియన్ టీమ్ ప్లేయర్ కూడా కాదు. అయినా అందరి కళ్లు అతనిపైనే. ఆఖరుకు అన్ని జట్ల బౌలర్ల ఫోకస్ కూడా ఆ ఆటగాడిని కట్టడిచేయడం పైనే. అతనే 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ. ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి ముందే ఈ వండర్‌కిడ్ క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాడు.*

ఐపిఎల్ సెంటరాఫ్ అట్రాక్షన్ వైభవ్ సూర్యవంశీ

**(వార్త క్రీడా విభాగం) :** అతి చిన్న వయసులోనే కళ్లు చెదిరే బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షించిన వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీకి ఇది రెండో ఐపీఎల్ మాత్రమే.గత ఏడాదే ఐపీఎల్ అరంగేట్రం చేసిన వైభవ్ ఆ సీజన్‌లో ఆడింది ఏడు మ్యాచ్‌లైనా.. మహా మహా బౌలర్లను చితకొట్టాడు. 14 ఏళ్ల 23 రోజుల వయసులో ఐపీఎల్ ఎంట్రీ ఇచ్చి ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచి అందర్నీ సర్‌ప్రైజ్ చేశాడు. అంతేగాక లక్నో సూపర్ జయింట్స్‌పై 20 బంతుల్లోనే 34 రన్స్ చేసి రాత్రికి రాత్రే స్టార్‌గా మారాడు. ఇక 28 ఏప్రిల్‌న గుజరాత్ టైటాన్స్‌పై విధ్వంసమే సృష్టించాడు. 35 బంతుల్లోనే శతకం బాదాడు. క్రిస్ గేల్ తర్వాతి స్థానంలో నిలిచాడు. ఇక ఆ మ్యాచ్‌లో ఏకంగా 11 సిక్స్‌లు బాదాడంటే అతని జోరు ఏ విధంగా సాగిందో తెలుస్తుంది. మొత్తానికి గత ఐపీఎల్‌లో ఆడిన 7 మ్యాచ్‌ల్లో ఓ సెంచరీ, ఓ హాఫ్ సెంచరీతో సహా 252 రన్స్ చేశాడు. వైభవ్ స్ట్రయిక్ రేట్ 200 పైనే. ఆ ఐపీఎల్‌లో వైభవ్ ఏకంగా 24 సిక్స్‌లు బాదాడు.

**అండర్19 వరల్డ్ కప్‌లో విధ్వంసం :** ఇటీవల జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో వైభవ్ అద్భుత ప్రదర్శన చేశాడు. ఫైనల్లో ఇంగ్లాండ్‌పై కేవలం 80బంతుల్లో 175పరుగులతో అజేయంగా నిలిచి కప్ అందించాడు. ఈ ఇన్నింగ్స్‌తో సెలక్టర్ల దృష్టిని ఆకర్షిస్తూ, భవిష్యత్తు సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందాడు.అఫ్ఘనిస్తాన్‌పై 68, పాక్‌పై 30,జింబాబ్వేపై 52, న్యూజిలాండ్‌పై 40, బంగ్లాదేశ్‌పై 72,స్కాట్లాండ్‌పై96,సౌతాఫ్రికాపై 127రన్స్...ఇలా వైభవ్ జోరుకు ఎదురులేకుండా పోయింది.

## వయసు చిన్నది.. గేమ్ పెద్దది

**సీనియర్ల హెచ్చరిక.. రెండో సీజన్ సవాల్:** మొదటి సీజన్‌లో గుర్తుపట్టని ప్రత్యర్థులు, రెండో సీజన్ నాటికి వైభవవ్ బలహీనతలపై రీసెర్చ్ చేసి వస్తారని మాజీ క్రికెటర్ బాలాజీ తెలిపారు. ఇలాంటి సమయంలో సంగక్కర వంటి దిగ్గజాల మార్గదర్శకత్వం వైభవ్‌కు ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. సాంకేతికతతో పాటు మానసిక దృఢత్వం కూడా ఈ సీజన్‌లో వైభవ్‌కు పరీక్షగా మారనుంది.

**క్రిస్ గేల్ రికార్డుపై కన్నేసిన వైభవ్ :**రాయల్స్ ఈసారి వైభవ్‌ను యశస్వి జైస్వాల్‌తో కలిసి ఓపెనర్‌గా పంపాలని యోచిస్తోంది. జైస్వాల్ పక్కన ఉంటే వైభవ్‌పై ఒత్తిడి తగ్గుతుందన్నది టీమ్ ప్లాన్. వైభవ్ కూడా తన లక్ష్యాలను చాలా స్పష్టంగా పెట్టుకున్నాడు. ఐపీఎల్‌లో క్రిస్ గేల్ నెలకొల్పిన 175 పరుగుల అత్యధిక స్కోరు రికార్డును బ్రేక్ చేయడమే లక్ష్యమని అతను ఇప్పటికే ధీమా వ్యక్తం చేశాడు.ఈ వండర్ కిడ్ విషయంలో రాయల్స్ యాజమాన్యం జాగ్రత్తలు తీసుకుంది. మీడియా వెలుగులకు, సోషల్ మీడియా హడావుడికి దూరంగా ఉంచింది. 14 ఏళ్లకే వచ్చిన నేమ్, ఫేమ్‌తో వచ్చే ఒత్తిళ్లకు వైభవ్ గురికావద్దనే ఈ నిర్ణయం తీసుకుంది. అందుకే వైభవ్‌ను అధికారిక ప్రెస్ మీట్లు, ఇంటర్వ్యూ లకు దూరంగా ఉంచుతోంది. వైభవ్ ఐపీఎల్‌లో కేవలం ఒక ప్లేయర్ కాదు ఒక ఫినామినన్. అతని ఆటలో దూకుడు, ధైర్యం, ప్రతిభ ఇవన్నీ కలిసి అతన్ని ప్రత్యేకంగా నిలబెడుతున్నాయి.




# వచ్చేసిన ఫ్లయింగ్ మ్యాన్

**ఆహ్మదాబాద్:** ఐపీఎల్ 19వ సీజన్ కోసం విదేశీ ఆటగాళ్లు ఒక్కొక్కరుగా భారత్ వస్తున్నారు. ఈమధ్యే పొట్టి ప్రపంచకప్‌లో ఇరగదీసిన గ్లెన్ ఫిలిఫ్స్... గుజరాత్ టైటాన్స్ తరఫున ఆడేందుకు ఆహ్మదాబాద్‌లో అడుగుపెట్టాడు. మైదానంలో పక్షి ని తలపిస్తూ.. బౌండరీ లైన్ వద్ద డైవింగ్ క్యాచ్‌లతో అలరించే గ్లెన్ ఫిలిప్స్ రాకకు సంకేతంగా గుజరాత్ టైటాన్స్ ప్రత్యేక వీడియో పంచుకుంది. సర్వర్ చేతుల్లోంచి జారి పోతున్న టీ కప్పు.. గోడ మీద నుంచి కింద పడుతున్న గాజు గ్లాసు... ఓ వ్యక్తి చేతుల్లోంచి జారిపోతున్న ఫోన్‌తో వీడియో మొదలవుతుంది. టీ కప్పు, గాజు గ్లాస్, ఫోన్ కిందపడకుండా.. ఫిలిఫ్స్ ఒడుపుగా అందుకుంటాడు. ఈ స్పెషల్ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరలవుతోంది.

గతంలో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ఆడిన ఫిలిఫ్స్... 19వ సీజన్‌లో గుజరాత్ టైటాన్స్‌కు ప్రాతినిధ్యం వహించనున్నాడు.శుభ్‌మన్‌గిల్ సారథ్యంలోని గుజరాత్ టైటిల్ తొలి పోరులో మార్చి 31న పంజాబ్ కింగ్స్‌తో తలపడనుంది. టీ20 ప్రపంచకప్‌లో పరుగుల వరద పారించిన గ్లేన్ ఫిలిప్స్‌పై టైటాన్స్ భారీ ఆశలు పెట్టుకుంది.

2021లో ఐపీఎల్‌లోకి ఎంట్రీ ఇచ్చిన గ్లేన్ ఫిలిప్స్ మూడు మ్యాచ్‌ల్లో 26 రన్స్, 2023 ఐపీఎల్‌లో 5 మ్యాచ్‌ల్లో 39 రన్స్‌తో నిరాశ పరిచాడు. 2025 వేలంలో రెండు కోట్లకు చేజిక్కించుకున్న గుజరాత్ టైటాన్స్ ఈ సారి కూడా గ్లేన్ పిలిప్స్‌ను రిటేన్ చేసుకుంది.

# వస్తారు... కోట్లు పట్టుకెళ్తారు!

**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్ మరో వారం రోజుల్లో మొదలుకానుంది. కానీ ఐపీఎల్‌లో ఈసారి ఆటగాళ్ల గాయాల సమస్యలు పెరిగిపోయాయి. ముఖ్యంగా వేలంలో కోట్ల ధర పలికిన విదేశీ ఆటగాళ్లు గాయాలు, వ్యక్తిగత కారణాలతో లీగ్ ఆరంభ మ్యాచ్‌లకు దూరం కానుండడం ఆయా ఫ్రాంచైజీలపై ప్రభావం చూపనుంది. ఇప్పటికే సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ పాట్ కమిన్స్ వెన్ను గాయం నుంచి కోలుకోకపోవడంతో సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు అందుబాటులో ఉండడం లేదు. దీంతో అతడి స్థానంలో ఇషాన్ కిషన్‌కు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తూ ఎస్ఆర్‌హెచ్ నిర్ణయం తీసుకుంది.మరో వైపు డిఫెండింగ్ చాంపియన్ ఆర్సీబీ స్టార్ బౌలర్ జోష్ హాజిల్‌వుడ్ కూడా గాయంతో దూరమయ్యాడు. తాజాగా ఢిల్లీ క్యాపిటల్స్‌కు గాయాల బెడద తగిలింది.ఆ జట్టు స్టార్ మిచెల్ స్టార్క్ గాయంతో సీజన్ ఆరంభ మ్యాచ్‌లకు దూరమయ్యాడు. ప్రస్తుతం సౌతాఫ్రికాతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ఆడుతున్న ఫెర్గూసన్.. కుటుంబంతో గడిపే కారణంతో మొదటి ఏడు మ్యాచ్‌లు ఆడడం లేదు.

విదేశీ ఆటగాళ్లు ముఖ్యంగా ఆస్ట్రేలియా ప్లేయర్లపై మాజీ క్రికెటర్ ఆకాశ్ చోప్రా తీవ్ర విమర్శలు చేశాడు. ఏవో సాకులు చెప్పి స్టార్క్‌ను ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడకుండా ఆసీస్ చూస్తోందని మండిపడ్డాడు. టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికిన స్టార్క్... యాషెస్ తర్వాత రెండు నెలలుగా మ్యాచ్‌లు ఆడలేదని, ఇపుడు గాయం సాకు చూపెట్టడం అన్యాయమన్నాడు. పెర్గ్యూసన్ ఐపీఎల్‌లో ఆడుతూ 7 మ్యాచ్‌ల తర్వాత వచ్చి కోటి తీసుకొని వెళ్లిపోతాడు. దీనివల్ల ఎవరికీ ప్రయోజనమని నిలదీశాడు.








# సెమీస్‌లో బోల్తా పడ్డ తన్వి, ఇషారాణి

**ఫ్రాన్స్:** ఓర్లియన్స్ మాస్టర్స్ సూపర్ 300 టోర్నమెంట్‌లో భారత్ షట్లర్ల సవాల్ ముగిసింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్ చేరిన ఇద్దరు భారత యువ షట్లర్లు తన్వి శర్మ, ఇషా రాణిలకు నిరాశే ఎదురైంది. ఫైనల్ చేరడంలో విఫలమయ్యారు. భారత యువ స్టార్ షట్లర్ తన్వి శర్మ అద్భుత ప్రదర్శన సెమీఫైనల్లోనే ముగిసింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ నొజోమి ఒకుహారా చేతిలో 9-21, 16-21తో వరుస సెట్లలో ఓటమి పొందింది. తన్వి తప్పిదాలు, ఆటపై నియంత్రణ కోల్పోవడంతో ఒకుహారా అడ్వాంటేజ్‌గా తీసుకుని ఆధిపత్యం చెలాయించింది. ఒకుహారా అనుభవం, వ్యూహాత్మక ఆట ముందు తన్వీ శర్మ నిలువలేకపోయింది. తొలి సెట్‌ను సులువుగా కోల్పోయింది.రెండో గేమ్‌లో కాస్త పుంజుకున్నప్పటికీ ఒకుహారాపై నిలకడను కొనసాగించలేకపోయింది. ప్రపంచ జూనియర్ ఛాంపియన్‌షిప్స్ రజత పతక విజేత అయిన 17 ఏళ్ల ఈ భారత క్రీడాకారిణి... మ్యాచ్ పొడవునా తన స్మాష్‌లను నియంత్రించుకోలేక ఇబ్బంది పడింది. 2016 ఒలింపిక్ కాంస్య పతక విజేత, 2017 ప్రపంచ ఛాంపియన్ అయిన 31 ఏళ్ల ఒకుహారా... మ్యాచ్‌ను 35 నిమిషాల్లో ముగించి ఫైనల్ చేరింది.

మరో మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ఇషారాణి పోరాడి ఓడింది. 55 నిమిషాల పాటు జరిగిన రెండో సెమీస్‌లో ఇషారాణిపై థాయిలాండ్‌కు చెందిన పిట్చామన్ 21-12, 23-21తో గెలుపొంది ఫైనల్ చేరింది. తొలి సెట్‌ను సులువుగా కోల్పోయిన ఇషారాణి.. రెండో సెట్‌లో పుంజుకుంది.ఆరంభం నుంచే ఆధిక్యం చాటింది. ఓ దశలో 12-8తో లీడ్ పొందింది. ఆ తర్వాత నుంచి ఇరువురూ ప్రతిపాయింట్ కోసం హోరాహోరీగా తలపడ్డారు. 15-15, 18-18 ఇలా టైబ్రేకర్‌వరకు సాగింది. 21-20తో ఆధిక్యం సాధించిన ఇషారాణి కీలకసమయంలో ఒత్తిడికి లోనై పాయింట్లు చేజార్చుకుంది. ప్రత్యర్థికి సెట్‌ను 21-23తో ఇషారాణి సమర్పించుకుంది.




# బిఎస్ఎన్ఎల్, వొడాఫోన్ టైఅప్

**న్యూఢిల్లీ,మార్చి 21:**భారతీయ టెలికాం రంగంలో పెను మార్పులకు నాంది పలుకుతూ ప్రభుత్వ రంగ సంస్థ బీఎస్ఎన్ఎల్, ప్రైవేట్ రంగంలోని వొడాఫోన్,ఐడియా జతకడుతున్నాయి.ఈ ఒప్పందంలో భాగంగా రెండు సంస్థలు తమ వద్ద ఉన్న టవర్లు, ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్ , స్పెక్ట్రమ్‌ను పంచుకోనున్నాయి. దీనివల్ల కొత్తగా మౌలిక సదుపాయాల కల్పన కోసం చేసే ఖర్చు భారీగా తగ్గుతుంది. ప్రస్తుతం ఉన్న ఆర్థిక పరిస్థితుల్లో ఈ కాస్ట్ సేవింగ్ పద్ధతి రెండు కంపెనీలకు ఊపిరి పోయనుంది. ముఖ్యంగా నెట్‌వర్క్ విస్తరణకు అవసరమైన మూలధన వ్యయం తగ్గడం వల్ల, ఆ నిధులను సేవల నాణ్యత పెంచడానికి కేటాయించే అవకాశం ఉంటుంది. బీఎస్ఎన్ఎల్‌కు కుగ్రామాల్లో ఉన్న పటిష్టమైన నెట్‌వర్క్, వొడాఫోన్ ఐడియా వినియోగదారులకు అందుబాటులోకి వస్తుంది.

పట్టణాల్లో వొడాఫోన్ టెక్నా లజీ బీఎస్ఎన్ఎల్‌కు తోడ్పడుతుంది. రిలయన్స్ జియో, ఎయిర్‌టెల్ ఇప్పటికే 5జీ సేవల్లో దూసుకుపోతుండగా వొడాఫోన్, బీఎస్ఎన్ఎల్‌లు ఈ భాగస్వామ్యంతో 5జీ నెట్‌వర్క్‌ను వేగంగా నిర్మించే అవకాశం ఉంది.పోటీ పెరగడం వల్ల కాల్‌రేట్లు, డేటా ప్యాక్‌ల ధరలు అదుపులో ఉండే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వొడాఫోన్ ఐడియాలో 49 శాతం వాటాను కలిగి ఉంది. అంటే ఒక రకంగా జు కూడా ఇప్పుడు ప్రభుత్వ పర్యవేక్షణలోనే నడుస్తోంది. అటు పూర్తి ప్రభుత్వ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ కు, ఇటు ప్రభుత్వం వాటా ఉన్న విఐ కి మధ్య సమన్వయం కుదరడం వల్ల టెలికాం రంగంలో ప్రభుత్వ ప్రాబల్యం పెరగనుంది. ప్రస్తుతం రెండు సంస్థలు 4జీ సైట్ల అప్‌గ్రేడేషన్ కోసం భారీగా ఇన్వెస్ట్ చేస్తున్నాయి.ఈ కీలక సమయంలో ఇరు సంస్థలు ఏకమవ్వడం వల్ల టెక్నికల్ లోపాలు తగ్గి, కాల్ డ్రాప్స్ సమస్యకు పరిష్కారం లభించే అవకాశం ఉంది.

# ఏప్రిల్1 నుంచే ఆదాయపు పన్ను కొత్తనిబంధనలు

**న్యూఢిల్లీ, మార్చి 21:** దేశంలో ఆదాయపు పన్నువిధానంలో చారిత్రాత్మక మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది.దాదాపు 65 ఏళ్లుగా అమల్లో ఉన్న 1961 నాటి ఆదాయపు పన్ను చట్టం స్థానంలో కొత్త ఆదాయపు పన్ను చట్టం 2025 తీసుకువచ్చింది.ఆదాయపు పన్ను నిబంధనలు 2026"ను కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు ఈనెల20న నోటిఫై చేసింది. ఈ కొత్త చట్టం, నిబంధనలు ఏప్రిల్ 1,2026 నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి రానున్నాయి.

ఈ కొత్త నిబంధనల ప్రకారం, పన్ను చెల్లింపుదారులు ఇప్పటికీ పాత, కొత్త పన్ను విధానాల మధ్య ఎంచుకునే స్వేచ్ఛను కలిగి ఉంటారు. అయితే పాతపన్ను విధానాన్ని ఎంచుకునే వేతన జీవులకు ఈ మార్పులు పెద్ద ఊరటను అందిస్తున్నాయి. ఇప్పటివరకు ముంబై, ఢిల్లీ, కోల్‌కతా, చెన్నై నగరాల్లో మాత్రమే ఉన్న 50 ఇంటి అద్దె అలవెన్స్ మినహాయింపు పరిధిని ఇప్పుడు హైదరాబాద్, బెంగళూరు, పుణె,అహ్మదాబాద్ నగరాలకు కూడా విస్తరించారు. 8 నగరాల్లోని ఉద్యోగులు తమ జీతంలో 50 వరకు హెచ్‌ఆర్ఏ కింద పన్ను మినహాయింపు పొందవచ్చు. ఇతర ప్రాంతాల్లో ఇది 40 గా కొనసాగుతుంది. పిల్లల చదువుల కోసం ఇచ్చే ఎడ్యుకేషన్ అలవెన్స్‌ను నెలకు రూ.100నుంచి 3,000కు పెంచారు. హాస్టల్ ఖర్చుల అలవెన్స్‌ను నెలకు రూ.300 నుంచి ఏకంగా 9వేలకు పెంచడం గమనార్హం. పన్ను విధానాన్ని సులభతరం చేయడమే లక్ష్యంగా కొత్త చట్టాన్ని రూపొందించారు.ఇందులో భాగంగా సెక్షన్ల సంఖ్యను 819 నుంచి 536కు, చాప్టర్లను 47 నుంచి 23కు తగ్గించారు. పన్ను చెల్లింపుదారులకు గందరగోళం కలిగించే "ప్రీవియస్ ఇయర్", "అసెస్మెంట్ ఇయర్" అనే పదాలను తొలగించి, వాటి స్థానంలో ఒకే "టాక్స్ ఇయర్" అనే భావనను ప్రవేశపెట్టారు.ప్రయోజనాలతో పాటు నిబంధనలను కూడా కఠినతరం చేశారు. డిజిటల్ ఆర్థిక వ్యవస్థపై దృష్టి సారించి, రూ.2 కోట్లకు మించి లావాదేవీలు జరిపే లేదా 3 లక్షల మందికి పైగా వినియోగదారులతో సంబంధాలున్న విదేశీ సంస్థలను పన్ను పరిధి లోకి తెచ్చేందుకు సిగ్నిఫికెంట్ ఎకనామిక్ ప్రెజెన్స్ నిబంధనలను స్పష్టం చేశారు. కొత్త చట్టం కింద 150కి పైగా కొత్త ఫారాలను కూడా నోటిఫై చేశారు. ఉద్యోగులకు ఇచ్చే ఫారం 16 స్థానంలో ఇకపై ఫారం 130 రానుంది.




# ఈ వారం మార్కెట్లకు ఆరు కొత్త ఫండ్స్

**ముంబయి, మార్చి 21:** స్టాక్ మార్కెట్లలో ఐపీఓల మాదిరిగా ఎన్‌ఎఫ్ఓలు అంటేన్యూ ఫండ్ ఆఫర్లు విడుదలవుతుంటాయి. ఐపిఒల్లో మాదిరిగానే ఎస్ఎంఇలు కూడా ఉంటాయి.అలాగే రిటైల్ ఇన్వెస్టర్లను కూడా ఇపుడు ఫండ్స్ పెట్టుబడుల్లో ప్రోత్సహిస్తున్నారు. ఈ వారం ఆరు పథకాలు మార్కెట్లలో అందుబాటులోకి వస్తున్నాయి.ఇప్పుడు 6 స్కీమ్స్ సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉన్నాయి. వీటిలో ఎస్బీఐ మ్యూచువల్ ఫండ్ నుంచి కూడాఒక స్కీమ్ ఉంది.




ఎస్బీఐ ఎంఎఫ్ నుంచి ఎస్బీఐ నిఫ్టీ మిడ్‌క్యాప్ 150 ఈటీఎఫ్ సబ్‌స్క్రిప్షన్ నడుస్తుండగా లాస్ట్ డేట్ మార్చి 24 వరకు ఉంది. కనీసం రూ. 5 వేల నుంచి పెట్టుబడి పెట్టొచ్చు. ఎడెల్‌వీస్ నిఫ్టీ లార్జ్ మిడ్‌క్యాప్ 250 ప్లస్ 8-13 జిసెక్ 70:30 ఇండెక్స్ ఫండ్ కూడా సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉండగా ఏప్రిల్ 1 న ముగియనుంది. కనీసం రూ. 100 పెట్టుబడితో ఇందులో చేరేందుకు అవకాశం ఉంది. హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ నుంచి హెచ్‌డీఎఫ్‌సీ క్రిసిల్ ఐబీఎక్స్ ఫైనాన్షియల్ సర్వీసెస్ 912 మంత్స్ డెట్ ఇండెక్స్ ఫండ్ మార్చి 23న ముగియనుంది. ఇందులో కనీస పెట్టుబడి రూ. 100గా ఉంది. హెచ్ఎస్‌బీసీ గోల్డ్ ఈటీఎఫ్ ఎఫ్ఓఎఫ్ సబ్‌స్క్రిప్షన్ ప్రారంభం కాగా ఈనెల 25 ఆఖరి తేదీ. కనీస పెట్టుబడి రూ. 5 వేలుగా ఉంది. ఛాయిస్ మ్యూచువల్ ఫండ్ నుంచి 2 స్కీమ్స్ ఉన్నాయి. అవి ఛాయిస్ నిఫ్టీ 50 ఇండెక్స్ ఫండ్, ఛాయిస్ నిఫ్టీ నెక్ట్స్ 50 ఇండెక్స్ ఫండ్ కూడా సబ్‌స్క్రిప్షన్ కోసం అందుబాటులో ఉండగా వీటిల్లో చివరితేదీ ఏప్రిల్ 2 గా ఉంది. కనీస పెట్టుబడి రూ. 1000 మాత్రమే.



# బులియన్ మార్కెట్‌పై వార్ ఒత్తిళ్లు
## పడిపోతున్న బంగారం, వెండి ధరలు

**ముంబయి, మార్చి 21:** ముడి చమురు ధరల పెరుగుదల, పశ్చిమ ఆసియాలో యుద్ధం చుట్టూ నెలకొన్న అనిశ్చితి కారణంగా ప్రపంచ మార్కెట్లో బంగారం, వెండి ప్రస్తుతం తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. వారాంతంలో బంగారం ధరలు మళ్లీ పడిపోయాయి. దేశీయ బులియన్ మార్కెట్, అంతర్జాతీయ మార్కెట్ రెండింటిలోనూ విలువైన లోహాల ధరలు భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో గోల్డ్ ఫ్యూచర్స్ 0.7 శాతం పడిపోయి ఔన్సుకు 4,574.90 వద్దకు చేరింది. బంగారం, సుమారు 9.6 శాతం పడిపోయింది. ఇది సెప్టెంబర్ 2011 తర్వాత నమోదైన అతిపెద్ద క్షీణత. ఈ వారపు క్షీణత దాదాపు 15 సంవత్సరాలలో అతిపెద్ద వారపు క్షీణతను సూచిస్తుంది.

భారతదేశంలో పెళ్లిళ్ల సీజన్ సమీపిస్తుండటంతో ఇది కొనుగోలు చేయడానికి సరైన సమయమా కాదా అనే దానిపై ప్రజలు గందరగోళంలో ఉన్నారు. పెట్టుబడిదారులు కూడా ఈ క్షీణత పట్ల ఆందోళన చెందుతున్నారు. అమెరికాఇరాన్ యుద్ధం, పెరుగుతున్న ఆర్థిక అనిశ్చితి పెట్టుబడిదారులను అప్రమత్తం చేశాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో బంగారం ఫ్యూచర్స్ 0.7 శాతం పడిపోయి ఔన్సుకు 4,574.90కి చేరాయి. వెండి ఫ్యూచర్స్ 2 శాతానికి పైగా పడిపోయి ఔన్సుకు 69.66కి చేరాయి. వెండి వరుసగా మూడవ వారం కూడా క్షీణించింది. ఈ కాలంలో ఇది 14 శాతానికి పైగా నష్టపోయింది. ఎంసీఎక్స్‌లో 10గ్రాముల బంగారంధరలు రూ.144,825 వద్ద ముగిశాయి.బంగారం ధరలు సుమారు 8.57 మేర పడిపోయి, తీవ్రంగా క్షీణించాయి. మార్చి 2000 సంవత్సరం తర్వాత నమోదైన అతి పెద్ద వారపు క్షీణతలలో ఇది ఒకటిగా పరిగణిస్తున్నారు. ప్రపంచ మార్కెట్లలో విస్తృతంగా జరుగుతున్న అమ్మకాలే ఈ పతనానికి ప్రధాన కారణమని కేడియా అడ్వైజరీ డైరెక్టర్ అజయ్ సురేష్ కేడియా అన్నారు. పెరుగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా పెట్టుబడిదారులు బంగారంతో పాటు ఈక్విటీలు, క్రిప్టో, రియల్ ఎస్టేట్ వంటి ఇతర ఆస్తి తరగతులలో తమ స్థానాలను తగ్గించుకున్నారు. యూఎస్ బంగారం వంటి వడ్డీ లేని పెట్టుబడుల ఆకర్షణను తగ్గించాయి.

బలమైన యూఎస్ డాలర్, పెరుగుతున్న బాండ్ దిగుబడులు కూడా ధరలపై ఒత్తిడి తెచ్చాయి. లాంగ్ పొజిషన్ల అమ్మకాలు, మార్జిన్ కాల్స్ వల్ల ఈ పతనం మరింత తీవ్రమైంది. దీనివల్ల ఇది సాంకేతికంగా ప్రేరేపించినట్లుగా కనిపిస్తోంది. బంగారం ధరలు మరింత పడిపోవచ్చని ఇతర నిపుణులు కూడా భావిస్తున్నారు. ఈ ధోరణి కొనసాగితే, భారతదేశంలో బంగారం ధరలు 10 గ్రాములకు రూ.127,000కు, అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సుకు 4,250కు పడిపోవచ్చు. వెండి ధరలు కూడా రెండు శాతం పతనం అయ్యాయి. రూ.4860 తగ్గి రూ.2,23,305గా కొనసాగింది.

# డిఎల్ఎఫ్‌లో వాటాల కొనుగోలు

**ముంబయి, మార్చి 21:** రియాల్టీ నిర్మాణరంగ దిగ్గజం డిఎల్ఎఫ్‌లో అంతర్జాతీయ సంస్థ గోల్డ్‌మాన్ శాక్స్, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ మూచువల్ ఫండ్స్ 43.40 లక్షల వాటాలను కొనుగోలు చేసారు. ఈ వాటాల కొనుగోళ్ల విలువ రూ.231 కోట్లుగా ఉంది.ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ ద్వారానే ఈలావాదేవీలు జరిపారు. గోల్డ్‌మ్యాన్‌శాక్స్ తన అనుబంధ ంస్థ గోల్డ్‌మాన్ శాక్స్ ఇన్వెస్ట్‌మెంట్స్ మారిషస్ ద్వారాను, ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ మూచువల్‌ఫండ్స్ రెండూ చెరొక 21,70,473 షేర్లుచొప్పున కొనుగోలుచేసారు. గురుగామ్ కేంద్రంగా ఉన్న డిఎల్ఎఫ్ సంస్థ మొత్తం వాటాల్లో 0.17శాతం వాటాలను ఈరెండు సంస్థలు కొనుగోలు చేసారు.ఒక్కొక్క షేరు ధర రూ.531.7గా నిర్ణయించారు. బ్రిటిష్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ బైల్లీ గిఫోర్డ్ అండ్‌కో తనఅనుబంధ సంస్థలు బెస్ట్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ ద్వారా అంతే మొత్తం షేర్లను విక్రయించింది. చైనా సావరిన్ వెల్త్‌ఫండ్,చైనా ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ల అధీనంలో బెస్ట్ పని చేస్తోంది. ఈడీల్‌తో డిఎల్ఎఫ్ షేర్లు 0.32శాతం క్షీణించాయి. బిఎస్ఇలో రూ.540.70కి చేరాయి.



# ఎఫ్‌పిఐలు రూ.88,110 కోట్ల ఈక్విటీల విక్రయం




**ముంబయి, మార్చి 21:** విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు మార్చినెలలో ఇప్పటివరకూ 88,180 కోట్ల ఈక్విటీలను విక్రయించారు. ఎన్ఎస్‌డిఎల్ డేటా ప్రకారంచూస్తే మార్కెట్‌కు మరో ఏడు రోజులున్నప్పటికీ ఈనెలలో భారీగా ఈక్విటీ షేర్లను విక్రయించి సొమ్ముచేసుకన్నారు. 2024 అక్టోబరు తర్వాత ఇదే భారీ స్థాయిలో అమ్మకాలని తెలుస్తోంది.వారాంతంలో కూడా ఎఫ్‌పిఐలు అమ్మకాలుజరిపారు. నిఫ్టీసెన్సెక్స్‌లు లాభాల్లో ముగిసినా ఎఫ్‌పిఐలు రూ.5518 కోట్లు విలువైన షేర్లు విక్రయించారు.దేశీయ సంస్థాగత ఇన్వెస్టర్లు మాత్రం 18వ రోజు కూడా రూ.5706 కోట్ల విలువైన షేర్లను కొనుగోలుచేసారు.

ఈ వారంలోనే ఎఫ్‌పిఐలు రూ.29,897 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. అదే డిఐఐలు రూ.30,641కోట్ల విలువైన షేర్లు కొనుగోళ్లుచేసారు. గత వారంలోకూడా మార్కెట్లలో ఎఫ్‌పిఐలు రూ.35,053 కోట్లు విలువైన షేర్లను విక్రయిస్తే దేశీ ఇన్వెస్టర్లు రూ.37,740 కోట్ల విలువైన షేర్లను కొనుగోళ్లు చేసారు. 2026 ఇప్పటివరకూ విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు రూ.1.01 లక్షలకోట్ల విలువైన షేర్లను విక్రయించినట్లు తేలింది.

డాలరుతో రూపాయి మారకం విలువలు క్షీణించడంకూడా ఇన్వెస్టర్ల లాభాలకు కొంత కారణం అయింది. అందువల్లనే విదేశీ పోర్టుఫోలియో ఇన్వెస్టర్లు ఎక్కువ అమ్మకాలకు ఆసక్తి చూపించారు. డాలరుతో రూపాయి మారకం విలువలు వారాంతంలోఒక్కరోజే 93.70 రూపాయలకు చేరుకుంది. అందువల్లనే ఎఫ్‌పిఐలు అమ్మకాలకు ప్రాధాన్యం ఇచ్చారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.